THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY
OU_204163
UNIVERSAL LIBRARY

OUP—831—5-8-74—15,000

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. [illegible] Accession No. [illegible]

Author [illegible]

Title [illegible]

This book should be returned on or before the date last marked below

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః.

శ్రీమద్రామాయణము

వచనము

యుద్ధకాండము

తృతీయభాగము.

దేవరాజసుధీప్రణీతము.

మద్రాసు.

ఆనందముద్రాయంత్రాలయమునందు

ముద్రితము.

ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనివారిచేఁ బ్రకటితము.

1913.

[*All Rights Reserved.*]

All Rights Reserved.

Copyright 1913—by **R Venkateshwar & Co., Madras.** This book is fully protected by an Indian and Foreign Copyright. No one will be permitted to reproduce this book in whole or in part or translate it into any other language and offer it for sale. A substantial copy of the words, ideas or illustrations contained herein constitutes an infringement of a copyright, and notice is hereby given that suit will be filed in every case of infringement.

కాపీరైట్ 1913 వ సం॥ ఆర్. వేంకటేశ్వర్ అండ్ కంపెనీవారు కాపీరైట్ దార్లు. ఈపుస్తకము ఇండియా కాపీరైటుచేతను పరదేశీయపు కాపీరైటుచేతను సురక్షితమైనది. ఎవరుగాని యీపుస్తకమును సంపూర్ణముగాఁగాని లేక యందొక భాగమునుగాని తాము వేఱుగా ప్రకటించుటకును, మఱియొక భాషయందు తర్జుమా చేసి క్రయమునకు నిచ్చుటకును, హక్కు ఇయ్యఁబడదు. ఇందుఁగల పదములనుగాని భావములనుగాని పటములనుగాని ఏమాత్రమైనను కాపీచేసినయెడల అది కాపీరైటును ఉల్లంఘించుటయే యగును. కనుక కాపీరైటును ఏవిధమున నుల్లంఘించినవారును దావాకు లోనగుదురని దీనిచే తెలియనగును.

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః.

శ్రీమద్రామాయణసంప్రదాయార్థసంగ్రహము.

శ్లో. శ్రీశైలపూర్ణాద్యతిశేఖరేణ, శ్రుతాన్పురాఽష్టాదశధా ప్రభిన్నాన్ ।
రామాయణార్థాన్ క్రమశః కరోమి, వ్యక్తాన్ శఠారాతిగురూపదిష్టాన్.

అన్నట్లు యతిరాజులు శ్రీశైలపూర్ణులవలన వినినట్టిరామాయణార్థములు పదునెనిమిది. అవి యేవనఁగా:—

(1) ఈరామాయణప్రబంధము.'ప్రాయేణ పూర్వభాగార్థో ధర్మశాస్త్రేణ కథ్యతే।ఇతిహాసపురాణాభ్యాం వేదాన్తార్థః ప్రకాశ్యతే'అనువచనముంబట్టి యితిహాసమగుటచే వేదోపబృంహణరూపమగుటవలన వేదాంతార్థమును విస్తరించి తెలుపుచున్నది. అందు 'యతో వా ఇమాని భూతాని జాయన్తే యేనజాతాని జీవన్తి యత్ప్రయన్త్యభిసంవిశన్తి - తద్విజిజ్ఞాసస్వ- తద్బ్రహ్మ' అని శ్రుతి జిజ్ఞాస్యమగు బ్రహ్మమును జగజ్జన్మాదికారణముగాఁ బ్రతిపాదించుచున్నది.జగజ్జన్మాదికారణ మగునాబ్రహ్మము విష్ణువా? లేక రుద్రాదులందొకరా? అని తెలియఁగోరఁగా రాముఁడై యవతరించినవిష్ణువే వేదాంతవేద్యం బయినయాపరబ్రహ్మమని యిందు చెప్పఁబడుచున్నది. 'ఉపక్రమోపసంహారావభ్యాసోఽపూర్వతాఫలమ్ । అర్థవాదోపపత్తీచ లిఙ్గం తాత్పర్యనిర్ణయే' 'ఉపక్రమము, ఉపసంహారము, అభ్యాసము, అపూర్వత, ఫలము. అర్థవాదము, ఉపపత్తి. అని తాత్పర్యమున కాఱువిధము లయినలింగములు గలవు. ఆయాఱువిధములు నిందుఁగలిగియున్నవి. ఎట్లన, ఉపక్రమమందు 'కోన్వస్మిన్ సాంప్రతం లోకే' ఇత్యాదులచే 'వేదాంతోదితసకలగుణసంపన్నుఁడగువాఁడు విష్ణువా? లేక బ్రహ్మాదులందొకఁడా'? అని వాల్మీకి యడుగఁగా నారదుఁడు 'ఇక్ష్వాకువంశప్రభవో రామః' ఇత్యాదులచే రాముఁడయి యవతరించినవిష్ణువే వేదాంతోక్తసకలగుణసంపన్నుఁడని చెప్పెను. ఉపసంహారమందును జతుర్ముఖుఁడగుబ్రహ్మ 'తవాహంపూర్వకేభావే పుత్త్రః పరపురఞ్జయ । సంక్షిప్యచ పురాలోకాన్మాయయాస్వయమేవహి। మహార్ణవేశయానోఽప్సుమాం త్వం పూర్వమజీజనః । పద్మేదివ్యేఽర్కసంకాశే నాభ్యాముత్పాద్యమామపి । ప్రాజాపత్యం త్వయా కర్మసర్వంమయినివేశితమ్' అనెను. దీనిచే సర్వజగత్కారణుఁడగు ప్రజాపతికిని జనకుఁడగుటచే సకలజగత్కారణ మగుబ్రహ్మము విష్ణువే యని చెప్పఁబడినదయ్యె. అభ్యాసముగూడ నావిష్ణువునకే చూపట్టుచున్నది. బాలకాండమందు 'ఏతస్మిన్నన్తరే విష్ణురుపయాతో మహాద్యుతిః। శఙ్ఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః' అని జగత్కారణత్వము చెప్పఁబడెను.

అటమీఁద దేవతలు 'త్వం గతిః పరమా దేవ సర్వేషాం నః పరన్తప' అని తనుకెల్ల పరమగతిగాఁ జెప్పిరి. దీనిచే పరత్వమునకుమాత్రమే కల సర్వాశరణ్యత్వము చెప్పఁబడెను. అవ్వల, 'తతో దేవర్షిగన్ధర్వాః ససురా స్సాప్సరోగణాః । స్తుతిభిర్దివ్యరూపాభి స్తుష్టువుర్మధుసూదనమ్' అని దేవర్షిగంధర్వాదులు స్తుతిచేయుటను జెప్పుటచే సర్వస్తుత్యత్వము చెప్పఁబడినదయ్యె. అంత విశ్వామిత్రుఁడు 'వేదాహమేతం పురుషం మహాన్తమ్ । తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషన్తి । యజ్ఞేన దానేన తపసానాశకేన' ఇత్యాదిశ్రుతియందుఁ జెప్పఁబడినరీతినే 'అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్ । వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః' అని యతఁడు మహాపురుషుండనియు తపోబలము లేక నతనిని దెలియుట కష్టమనియుఁ జెప్పెను. సీతావివాహమున వసిష్ఠుఁడును 'అవ్యక్తప్రభవో బ్రహ్మా శాశ్వతో నిత్య అవ్యయః । తస్మాన్మరీచి స్సంజజ్ఞే మరీచేః కాశ్యప స్సుతః' అని బ్రహ్మాదులందఱికి నన్నింటికిని మూలకారణముగాఁ బ్రకటించినాఁడు. పరశురాముఁడును 'అధికం మేనిరే విష్ణుం దేవాస్సర్షిగణా స్తదా' అని దేవతలందఱును విష్ణునధికునిఁగాఁ దలంచిరనుటచే నతనిసర్వాధికత్వమును నిదర్శించినాఁడు. అయోధ్యాకాండమున 'సహి దేవైరుదీర్ణస్య రావణస్యవధార్థిభిః । అర్థితో మానుషే లోకే జజ్ఞే విష్ణుస్సనాతనః' అని యతనిసనాతనత్వము చెప్పఁబడెను. అటమీఁద 'ఆకాశప్రభవో బ్రహ్మా శాశ్వతో నిత్య అవ్యయః' అనుచో బ్రహ్మదేవుని నాకాశమువలనఁ బుట్టినవాఁడని విష్ణువు నాకాశశబ్దముచే నిర్దేశించుటవలన నతని స్వయంప్రకాశత్వమును వ్యాపకత్వమును జెప్పఁబడినవి. ఆరణ్యకాండమున మారీచుఁడు 'అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా' యని యతనితేజము నప్రమేయమైనదిగాఁ జెప్పుటచే నతఁడు పరిచ్ఛేదాతీతమహిమ గలవాఁడగుట చెప్పఁబడెను. కిష్కింధాకాండమున తార 'నివాసవృక్షస్సాధూనామాపన్నానాం పరాగతిః । ఆర్తానాం సంశ్రయశ్చైవ యశసశ్చైకభాజనమ్ । జ్ఞానవిజ్ఞానసంపన్నో నిదేశే నిరతః పితుః । ధాతూనామివ శైలేన్ద్రో గుణానామాకరో మహాన్ । త్వమప్రమేయశ్చ దురాసదశ్చ జితేన్ద్రియశ్చోత్తమధార్మికశ్చ । అక్షయ్యకీర్తిశ్చ విచక్షణశ్చ క్షితిక్షమావాన్ క్షతజోపమాక్షః' అని చెప్పినది. దీనిచే జ్ఞానందాది సమస్తకల్యాణగుణాకరత్వము చెప్పఁబడినది. సుందరకాండమున 'బ్రహ్మా స్వయంభూశ్చతురాననో వా రుద్రస్త్రినేత్రస్త్రిపురాన్తకో వా । ఇన్ద్రో మహేన్ద్ర స్సురనాయకో వా త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్' అని సర్వసంహారకత్వము చూపఁబడెను. 'కిం వైష్ణవం వా కపిరూపమేత్య రక్షోవినాశాయ పరం సుతేజః । అనన్తమవ్యక్తమచిన్త్యమేకం స్వమాయయా సాంప్రతమాగతం వా' అని చెప్పఁబడినది. ఇట రెండవ 'వా'కారము అవధారణార్థకము. ఈశ్లోకముచే అనన్తరూపత్వము చెప్పఁబడెను. యుద్ధకాండమున విష్ణువే జగత్కారణమగుట యెట్లు? ఇతరులకుఁగూడ 'హిరణ్యగర్భ స్సమవర్తతాగ్రే । యదా తమస్తన్న దివా న రాత్రి । ర్న

సన్న చాసచ్ఛివ ఏవ కేవలః। ఇన్ద్రో మాయాభిః పురురూప ఈయతే' ఇత్యాదులచే
జగత్కారణత్వ మున్నదని శ్రుతి చెప్పుచున్నదే యని యాశంకించి వారందఱికంటె
విష్ణువే శ్రేష్ఠుఁడని ప్రతిపాదించుటంబట్టి హిరణ్యగర్భ, శివ, ఇంద్రాదిశబ్దములు,
సత్, బ్రహ్మ, ఆత్మ, శబ్దములవలె విష్ణుపరములే యగు ననెడియభిప్రాయముతో
'వ్యక్తమేష మహాయోగీ పరమాత్మా సనాతనః। అనాదిమధ్యనిధనో మహతః పర
మో మహాన్। తమసః పరమో ధాతా శఙ్ఖచక్రగదాధరః। శ్రీవత్సవక్షా నిత్యశ్రీ
రజయ్య శ్శాశ్వతో ధ్రువః' అని చెప్పఁబడెను. దీనిచేతను నతఁడు పరమాత్ముఁడ
గుట శ్రీపతియగుట మొదలగునవి చెప్పఁబడెను. అటమీఁద 'భవా న్నారా
యణో దేవ శ్శ్రీమాన్ చక్రాయుధో విభుః। ఏకశృఙ్గో వరాహ స్త్వం భూతభవ్యసప
త్నజిత్' ఇత్యాదులు చెప్పఁబడెను దీనిచే నతఁడు నారాయణశబ్దవాచ్యుఁ డగుట
చెప్పఁబడెను. అపూర్వమనఁగా ప్రమాణాంతరముచే ప్రాప్తింప కుండుట. పరత్వ
మునకు విష్ణుత్వము(అనఁగా పరుఁడు విష్ణుఁ డగుట) శ్రుతి తప్పఁ దక్కిన ప్రమాణముల
చేఁ దెలియుట శక్యముగాదుగదా. ఫలము భగవంతునితోడి సాలోక్యాదులని కడపట
నువ్యక్తమయ్యెడిని. అర్థవాదమును ఉపపత్తియు బాలకాండమునఁ జూపఁబడినవి.
ఎట్లన 'ఇమే ద్వే ధనుషీ శ్రేష్ఠే' 'ఈ రెండువిండ్లు శ్రేష్ఠములయినవి' అని యర్థవాద
మును జెప్పి, 'జృమ్భితం తద్ధను ర్దృష్ట్వా శైవం విష్ణుపరాక్రమైః। అధికం మేనిరే విష్ణుం
దేవాస్సర్షిగణా స్తదా' ఇత్యాదులచే బ్రహ్మ మొదలుగాఁగల దేవతలును ఋషిగణ
ములును నెక్కువతక్కువల విచారించి విష్ణురుద్రులలోపల విష్ణువే యధికుఁడని నిర్ణ
యించిరని చెప్పుటచే ఉపపత్తి చెప్పఁబడినదయ్యె. 'మేనిరే' 'తలంచిరి' అని చెప్పు
టంబట్టి 'మహాశూరుఁడని వారు వరమిచ్చుటచేఁ గలిగిన యాధిక్య' మని చెప్ప
రాదు. అట్లైనయెడ రుద్రునకుఁ గోపము కలుగుట కుపపత్తి లేదు. 'ధనూరుద్ర
స్తు సంక్రుద్ధః' అని రుద్రునకుఁ గోపము కలిగినట్లుగదా చెప్పఁబడియున్నది. బ్రహ్మాదు
లవరముచే విష్ణువున కాధిక్యము కలిగెనేని రుద్రునకీకోపము కలుగవలసినది లేదు.
మఱియు నగస్త్యాశ్రమమున 'స తత్ర బ్రహ్మణః స్థానం విష్ణోః స్థానం తథైవ చ। అగ్నేః
స్థానం మహేన్ద్రస్య స్థానం చైవ వివస్వతః। సోమస్థానం భగస్థానం స్థానం కౌబేరమే
వ చ' ఇత్యాదులచే బ్రహ్మాదు లగస్త్యుని కుపాస్యు లగుటను జెప్పి రుద్రుఁడు నట్లె యు
పాస్యుఁడగుటను జెప్పమింబట్టి యపూజ్యుఁడగుటఁ చెప్పఁబడుచున్నది. ఇవి యగస్త్యునిఁ
బూజించువారయిన బ్రహ్మాదులస్థానములే కాని అగస్త్యునిచేఁ బూజింపఁబడువారి
స్థానములు కావు అని చెప్పఁదగదు. ఏలన బ్రహ్మాదు లగస్త్యునిఁ బూజించుట సంభ
వింపదు. 'అత్ర దేవా స్సగన్ధర్వాస్సిద్ధాశ్చ పరమర్షయః। అగస్త్యం నియతాహారం
సతతం పర్యుపాసతే' అనుట బ్రహ్మాదులు తప్పఁ దక్కిన కేవలదేవతలే యగస్త్యునిఁ
బూజించునట్లు చెప్పఁబడినది. మఱియు నొకగృహస్థునిగృహమందు దేవాలయ
ముండినయెడ గృహస్థుఁడే దాసిపూజకుఁడని స్పష్టముగా తెలియనగుచున్నది. అట్లె

యిందును గ్రాహ్యము. కాన మఱియొకవిధముగాఁ జెప్పుటకు (అనఁగా నగస్త్యుఁడు బ్రహ్మాదిపూజకుఁడుగా నుండఁగా బ్రహ్మాదు లగస్త్యపూజకులుగా నున్నారని చెప్పుటకు) నయితిలేదు. ఇంతేకాక దక్షయజ్ఞవధమున 'యస్మాద్భాగార్థినో భాగః కల్పితో నైవమే సురాః । నరాజ్ఞాణి మహార్హాణి ధనుషా శాతయామివః' అని రుద్రునకు యజ్ఞభాగమును గల్పింపనందున నపూజ్యుఁడగుటంబట్టి యిందు నతనికి స్థానము నిర్దేశింపఁబడదయ్యె. విష్ణువు పరదేవతయగునేని యపు డతఁడు రాముఁడుగా జన్మించుట యెట్లు? జన్మమెత్తుట వికారశూన్యుఁడగు పరదైవమునకుఁ జెల్ల దేయన్నచో 'అజాయమానో బహుధా విజాయతే' అన్నరీతిని లోకమునను గ్రహించుకొఱకు జన్మరహితుఁడయ్యు స్వేచ్ఛచేనట్లు జన్మించుచున్నాఁడని గ్రహించినచో ప్రశ్నమున కవకాశముండదు. అట్టిపరదైవమునకే చెల్లునట్టి మోక్షప్రదత్వమును 'యాగతిర్యజ్ఞశీలానామాహితాగ్నేశ్చ యాగతిః। అపరావర్తినాం యా చ యా చ భూమిప్రదాయినామ్। మయా త్వం సమనుజ్ఞాతో గచ్ఛ లోకాననుత్తమాన్' అనియిట నుత్తమలోకముల నాయనుజ్ఞచేఁ బొందుమనుటచేఁ జెప్పబడినదయ్యె. ఇట అపరావర్తిత్వ మనఁగా పునరావృత్తిశూన్యత్వము అనఁగాముక్తి 'నచపునరావర్తతే' అనిశ్రుతి. అపరావర్తియనుటచే యుద్ధమునుండి పాఱిపోకుండుట చెప్పంబడినదని చెప్పఁలనుగాదు. జటాయువు యుద్ధమునుండి పాఱిపోకుండుట యతనివలననే సిద్ధించినది కాని రామునివలనఁగాదు. కాన దానికి ఫల మతఁడే సంపాదించుకొనియుండుటచే రాముఁడు తానై యనుగ్రహించి యియ్యవలసినది లేదు. కాన యాయర్థము చెప్పఁబొసఁగదు. కాఁబట్టి యజ్ఞాదిఫలములకు నెల్ల యగుముక్తిని బొందుమనియర్థము. కావుననే నృసింహపురాణమందు 'మత్కృతే నిధనం యస్మాత్త్వయా ప్రాప్తం ద్విజోత్తమ। తస్మాత్త్వం మత్ప్రసాదేన విష్ణులోకమవాప్స్యసి' అని విష్ణులోకమును(అనఁగాముక్తిని)బొందునట్లు చెప్పఁబడియున్నది. ఇట్లు ఉపక్రమము మొదలయిన యాఱువిధములగు తాత్పర్యలింగములచే వేదాంతవేద్యమగు పరతత్త్వము విష్ణువేయని శ్రీరామాయణముచే విస్తరించి ప్రతిపాదింపఁబడుచున్నది. ఇట్లే కిడపట బ్రహ్మయు 'అస్యాః పరిషదో మధ్యే యద్బ్రవీమి నిబోధతత్ । ఏతదేవహి కావ్యం తే కావ్యానాముత్తమం శ్రుతమ్ । సర్వం విస్తరతో రాజన్ వ్యాఖ్యాస్యతి నసంశయః । ఆదికావ్యమిదం రామత్వయి సర్వం ప్రతిష్ఠితమ్ । నహ్యన్యోఽర్హతి కావ్యానాం యశోభాగ్రాఘవాదృతే' అని యీ రామాయణకావ్యమే కావ్యములం దుత్తమమయినదనియు నాదికావ్యమనియు నదియంతయు రామునియందే నెలకొనియున్నదనియు కావ్యములవలనియశస్సును బొందువట్టి రాఘవుఁడు తప్ప మఱొక్కఁడు దీనిని బొంద నర్హుఁడుగాడనియుఁ జెప్పెను. ఇట్లుండఁగా నెవఁడేని యీరామాయణము వ్యంజనావృత్తిచే శివపరమయినదని చెప్పనేనియది యపహాస్యమేయగును. 'నహ్యన్యోర్హతి' అని నిషేధింపఁబడిన రుద్రుఁడు రామాయణమునకుఁ బ్రతిపాద్యమగు వస్తుకోటిలో నంతర్భవించినాఁడని చెప్పుట కేవలము బాలిశునివదరు

మాటయే యగును. రాముఁడు సూర్యోపస్థాపనాదికము చేయుటయంతయు విశ్వామిత్రాదుల నుపాసించుటంబోలె మనుష్యభావన ననుసరించి చేసినట్లు తెలియునది. నిగమ మేమనఁగా 'శ్రీవిష్ణోః ప్రథమే కాణ్డే జగజ్జననహేతుతా। ద్వితీయే స్థితిహేతుత్వం తృతీయే మోక్షదాయితా। చతుర్థే గుణసంపత్తిః పఞ్చమే సర్వహన్తృతా। షష్ఠే వేదాన్తవేద్యత్వం సప్తమే స్రష్టృహేతుతా॥ ఏవం విష్ణుః పరంతత్త్వం రామాత్మేతి సునిశ్చితమ్,' శ్రీవిష్ణునకు ప్రథమకాండమందు జగజ్జననమునకు హేతువగుటయు, ద్వితీయమున దానిస్థితికి హేతువగుటయు, తృతీయమున మోక్షప్రదుండగుటయు, చతుర్థమున గుణసంపత్తియు, పంచమమున సర్వసంహారకుఁడగుటయు షష్ఠమున వేదాన్తవేద్యుండగుటయు సప్తమమున స్రష్టకు హేతువగుటయుఁ జెప్పఁబడినది. ఇట్లు పరతత్త్వ మగు విష్ణువే రాముఁ డయ్యెనని చక్కఁగా నిశ్చయింపఁబడినది. ఇది యొకయర్థము.

(2) వాల్మీకి ఇఁటువంటి పరతత్త్వము ఏయుపాయముచే ప్రాప్య మగును? అని తెలియఁగోరఁగా తత్ప్రాప్తికి నుపాయమయిన శరణాగతిని 'యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై। తం హ దేవ మాత్మబుద్ధిప్రసాదం ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే' అనెడి శరణాగతిశ్రుతి నుపబృంహణము సేయుచు, ఈరామాయణమం దుపక్రమము మొద లుపసంహారమువఱకు ననేకాధికారులకుఁ గలిగిన యాయాఫలవిశేషములను మొదలగువానిని బ్రదర్శించుమూలమున నఖిలఫలసాధన మయినదిగా దానిని బ్రతిపాదించుచున్నాఁడు. ఎట్లన, ఉపక్రమమందు 'ఏతస్మిన్నన్తరే విష్ణురుపయాతో మహాద్యుతిః। శఙ్ఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః' అని సర్వశేషి యగు సర్వేశ్వరుఁడు 'రక్షింపుమా' యని తన్నితరు లపేక్షింతురా యని యెదురుచూచుచు నట్టి రక్షణసమయము లభించిన దని సంతోషమున మఱింత యౌజ్జ్వల్యము పొడసూప రక్షణోపకరణము లగు చక్రాదులతోడ సన్నద్ధుఁడై వచ్చి దేవతలకడ నిలిచెను. అపుఁడు దేవగంధర్వయక్షులును 'తతస్త్వాం శరణాగతాః' అని రావణవధ మనెడి లాభమునుగోరి దేవజాతీయులందఱును శరణాగతిఁ గావించి రని చెప్పఁబడియున్నది. పిదప త్రిశంకు శునశ్శేఫాది వృత్తాంతములందు విశ్వామిత్రాదులవ్యాపారవిశేషములను జెప్పి శరణాగతరక్షణము పరమధర్మమనియు సమర్థుఁడును కారుణికుఁడు నగువానిని శరణుఁజొచ్చుటకుఁ దప్పక ఫలము కలిగియే తీఱు ననియుఁ బ్రదర్శింపఁబడెను. పిదప 'స భ్రాతుశ్చరణౌ గాఢం నిపీడ్య రఘునన్దనః। సీతామువాచాతియశా రాఘవం చ మహావ్రతమ్' అని లక్ష్మణుఁడు రాముని పాదముల గట్టిగాఁ బట్టుకొని సీతాదేవిని జూచి చెప్పెననుటచే పురుషకారపురస్కారమును మున్నిడుకొని శరణాగతి చేయవలయునని చెప్పఁబడెను. పిదప భరతుఁడు 'శిష్యే పురస్తాచ్ఛాలాయాం యావన్మే న ప్రసీదతి' అని రామాభిషేక మనెడి ఫలముకొఱకు శరణవరణమును జేసినాఁడు. ఇట రావణవధమునకై దేవతలు చేసిన ప్రపత్తికి (అనఁగా శరణాగతికి) ఫలమొసంగుటకై నగరమునుండి బయలు వెడలినవాఁడగుటంబట్టి యిపుడు రాముఁడు తనకుఁ బ్రతి

నిధియగు పాదుకల నొసంగి భరతుని శరణాగతిని సఫలము చేసి పిదప దేవగణముల మనోరథమును రావణాదివధముచేఁ బూరించిన యనంతరము, తనకు నభిషేకము చేసికొన్నాఁడు. కాఁబట్టి శరణాగతికి వైఫల్యము కలదని యాక్షేపింపరాదు. పిమ్మట దండకారణ్యమున వసించు మును లందఱి విరోధులను నిరసించుటకై 'తేవయం భవతా రక్ష్యా భవద్విషయవాసినః। నగరస్థో వనస్థో వా త్వం నో రాజా జనేశ్వరః' అని శరణాగతి ననుష్ఠించిరి. ఇట కోసలజనపదవాసులకుం బోలె మునులకును భగవద్దేశవాసమే శరణాగతి. తదనంతరము 'సపిత్రా చ పరిత్యక్తస్సురైశ్చ సమహర్షిభిః। త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః। స తం నిపతితం భూమౌ శరణ్యశ్శరణాగతమ్ । వధార్హమపి కాకుత్స్థః కృపయా పర్యపాలయత్' అని రాముని ముంగల నేలంబడిన కాకాసుర వృత్తాంతమున మ్రోలఁ బడుటయే శరణాగతి యని ప్రదర్శింపఁబడెను. పిదప సుగ్రీవవృత్తాంతమున 'కృతాపరాధస్య హి తే నాన్యత్పశ్యామ్యహం క్షమమ్ । అన్తరేణాఞ్జలిం బద్ధ్వా లక్ష్మణస్య ప్రసాదనాత్' అని యంజలిబంధమును జెప్పుటచే శరణాగతి యంజలిరూపముగఁ జెప్పఁబడెను. పిదప సీత రావణునిఁగూర్చి చెప్పిన వాక్యమున 'మిత్రమౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా । వధం చానిచ్ఛతా ఘోరం త్వయాऽసౌ పురుషర్షభః ॥ విదితస్సహి ధర్మజ్ఞః శరణాగతవత్సలః । తేన మైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి' అని రామునితోడి మైత్రి గలిగియుండుటను జెప్పుటచే ఆనుకూల్యమే శరణాగతి యని బోధింపఁబడినదయ్యె. అటమీఁద విభీషణుఁడు 'సోऽహం పరుషితస్తేన దాసవచ్చావమానితః । త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః' అని చేసిన శరణాగతి విరోధులను బరిత్యజించి చేయంబడినదిగాఁ జెప్పఁబడినది. 'తతస్సాగరవేలాయాం దర్భానాస్తీర్య రాఘవః । అఞ్జలిం ప్రాఙ్ముఖః కృత్వా ప్రతిశిశ్యే మహోదధేః' అను రామశరణాగతిచే యోగ్యుని కయోగ్యత వెదకరాదనియు నయోగ్యునికి యోగ్యత లేదనియుఁ జెప్పఁబడెను. అశుచిభూతమగు లంకనుండి బయలువెడలునంతమాత్రమే కద విభీషణుఁడు శరణము వరించినది. రామశరణాగతి, సమర్థుఁడగు కారుణికుని గుఱించి చేయంబడమిచే, దానికి ఫలము లేదయ్యెనందురు. మీఁద 'అభియాచామ వైదేహీమేతద్ధి మమ రోచతే। రాఘవాద్ధి భయం ఘోరం రాక్షసానాముపస్థితమ్' అని సీతకుఁ గాపున్న రాక్షసస్త్రీలకుఁ ద్రిజట చెప్పిన మాటకు వారు అనుమతించినంతమాత్రమున నా రాక్షసస్త్రీల నందఱను హనుమంతుని వలని భయమునుండి రక్షించున దగుసని చెప్పుటచే వేఱొకని విషయమందు వేఱొకరు చేయు శరణాగతి కూడ ఫలవంతమగునని నిదర్శింపఁబడెను. విభీషణుని శరణాగతిచేతనే యతని మంత్రులకుఁ గూడ గత్యంతము గలుగుటం బట్టి శరణాగతుని సంబంధించినవారు కూడ భగవత్కృపకుఁ బాత్రులగుదురని నిర్ణయింపఁబడెను. ఇట్లే యితరత్రను దెలియునది. ఇట్లుపక్రమము మొదలుగా నుపసంహా

రమువఱకుఁ బ్రతిపాదింపఁబడినశరణాగతియే సర్వఫలప్రద మయినది. అదియే ముక్తికిఁగూడ హేతువని చెప్పఁబడెను.

(3) ఈ యుపాయమునకుఁ బ్రాప్యము భగవత్ప్రాప్తిపూర్వక మయిన కైంకర్యమే యని రామాయణముచేఁ బ్రతిపాదింపఁ బడుచున్నది. ఎట్లన, ఉపక్రమమందు దేవజాతీయులశరణాగతికి రామకైంకర్యము ప్రధానఫలముగా చెప్పఁబడుచున్నది. ఏలన, వారు నప్సరసలు మొదలగు వారియందవతరించి రాము ననువర్తించుమన ట్లుపదేశము చేయఁబడినది. దీనింబట్టి వారియవతారములకు రామ (అనఁగా భగవత్) కైంకర్యమే ప్రధానముగుఫలము; రావణవధము ఆనుషంగికఫలము. లక్ష్మణుఁడును, ప్రపత్తిచేసి 'అహం సర్వం కరిష్యామి జాగ్రతస్స్వపతశ్చతే । భవాంస్తుసహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే' అని చెప్పినాఁడు. దీనిచే సర్వదేశ సర్వకాల సర్వావస్థోచితమగు సర్వవిధకైంకర్యము ఫలమని వ్యంజిత మయినది. భరతుఁడును రామకైంకర్యమునకై యతనియభిషేకమును ప్రార్థించి మొదటఁ బాదుకాకైంకర్యము తొడంగి యాక్రమమునఁ దాను గోరినరామకైంకర్యమును లభించినవాఁ డయ్యె. దండకారణ్యవాసు లగుమునుల శరణాగతికిని వాచికాదిరూపమయినకైంకర్యమే ఫలమని తెలియుచున్నది. 'తే తం సోమ మివోద్యన్తం దృష్ట్వావై ధర్మచారిణః। మఙ్గళాని ప్రయుఞ్జానాః ప్రత్యగృహ్ణన్ దృఢవ్రతాః' అనుటవలన మంగళములను ప్రయోగించుటయె వాచికకైంకర్యమని తెలియునది. సుగ్రీవవిభీషణాదులప్రపత్తికిని ముఖ్యమగుఫలము కైంకర్యమే. తక్కినవి యానుషంగికమని స్పష్టము. 'అథహరివరనాథః ప్రాప్యసంగ్రామకీర్తిం నిశిచరపతిమాజౌ యోజయిత్వాశ్రమేణ । గగన మతివిశాలం లఙ్ఘయిత్వార్కసూను । ర్హరివరగణమధ్యే రామపార్శ్వం జగామ॥' అని సుగ్రీవునిఁగూర్చి చెప్పుటంబట్టియు 'పరిత్యక్తా మయాలఙ్కా మిత్రాణిచ ధనానిచ । భవద్గతం మేరాజ్యం జీవితంచ సుఖానిచ' అన్న విభీషణ వాక్యములంబట్టియు వారికిఁ గైంకర్యమె ఫలమని తెలియుచున్నది. ప్రాణార్థి యగు కాకికిఁ బ్రాణము నొసంగుటచే దాని ప్రపత్తి సఫలము. అసత్స్వభావముగల యది మరలనట్లే దుర్మార్గమందుఁ బ్రవర్తింపకుండుఁ గాక యని శిక్షించు రూపమున ననుగ్రహము చూపుకొఱకు నొకకన్ను హరించుటతో నస్త్రమును నివర్తింపఁజేసెను. ఇది, పరశురాముని గుఱించి వైచినయస్త్రము నతఁడు ప్రతికూలుఁడై యుండుటను మానినంత, నతఁడుకోరిన విరోధులగు సుకృతములందుఁ బ్రయోగించినట్లును, సముద్రముపయి వేయఁగయికొన్న యస్త్రమును నతఁడనుతాపము నొంది శరణుఁజొరఁగానే 'ద్వేషించువారియం దాశ్రితులపాపకృత్యమును జొనుపు' ననెడి న్యాయమున నతనికి విరోధు లయినయసురులయందుఁ బ్రయోగించినట్లును, దెలియునది. రాముఁడు సముద్రునిగుఱించి చేసినశరణాగతి ఆకిం

చవ్యము అనన్యగతిత్వమున నెడి యధికారములు లేకయే చేయఁబడుటంబట్టి అల్పజ్ఞుఁడు నల్పశక్తియు నగువానిగుఱించి చేయంబడుటంబట్టియు విఫలమయినదని చింతించునది. 'సముద్రం రాఘవో రాజా శరణం గన్తుమర్హతి' అని విభీషణుఁడు రామునితో సముద్రుని శరణుఁజొరుమని చెప్పెనుగదా. తనశరణాగతికి ఫలము కలుగుటను జూచి యట్లు చెప్పినాఁడని తెలియునది. కాఁబట్టి యీ ప్రకారముచేత, శరణాగతికి దేశ, కాల, అధికారి, ఫల, నియమము లేకపోయినను విషయనియమ మున్నదని చెప్పఁబడినదయ్యె. ఈప్రపత్తి యీ ప్రబంధమునఁ బ్రధానమయినదిగాఁ బ్రతిపాదింపఁబడుచున్నది. కాఁబట్టియే శ్రీరామాయణము దీర్ఘశరణాగతియని లోకవార్త. శరణాగతికుపయుక్తముగా నితరము లగునర్థములిందు ప్రతిపాదింపఁబడుచున్నవని తెలియునది. ఎట్లన, సమర్థుఁడును గారుణికుఁడును సుశీలుఁడు నయినవానినిగుఱించినశరణాగతి, ఫలము నిచ్చునది. అందు రుద్రధనుర్భంగము పరశురామజయము, సాలభేదనము సముద్రబంధనము మొదలయినవి పూర్వోక్తమయినపరత్వమును బ్రతిపాదించుచున్నవి గావున వానిచే సామర్థ్యమును సర్వజ్ఞత్వాదికమును జెప్పఁబడినవి. సీతావియోగకాలమందు జరిగినవృత్తాంతవిశేషములచే పరమకారుణికత్వమును; గుహునితోను శబరితోను సుగ్రీవాదులతోను దట్టమయిన సంశ్లేషముచే సౌశీల్యమును; విశ్వామిత్రయజ్ఞమును గాచుట, దండకారణ్యవాసు లగుమునిజనులను రక్షించుట, రావణబాధితు లయినయింద్రాదిసకలదేవగణములను బరిపాలించుట యనువీనిచే తను తన జనపదములందలిజనులకు తనసౌందర్యశీలాదులచేతఁ బ్రీతి గలిగించి తనసాక్షాదవతారమునకుఁ బ్రయోజన మైనదియు తనపదమును ప్రాపించురూపమయినదియు నగుమోక్షము నొసఁగుటచేతను సర్వరక్షకత్వమును; జెప్పఁబడినవయ్యె. కాఁబట్టి సమర్థుఁడును పరమకారుణికుండును సుశీలుఁడునగు భగవంతుని గుఱించిన ప్రపత్తి సకలఫలసాధన మగునదయ్యె, అధికారివిశేషముచే ననుష్ఠింపఁబడిన యర్థానికి భగవత్ప్రాప్తిపూర్వక మగుతత్కైంకర్య మనెడిమోక్షమే ముఖ్య మయినఫలము; ఫలాంతరము లానుషంగికము లనుట స్పష్టము. ఇట్లె యంతటను దెలియునది.

(4) ఈప్రపత్తి పురుషకారము లేక ఫలము కలిగింపదనెడియీయర్థ మీగ్రంథమునఁ బ్రధానమైనదిగాఁ బ్రతిపాదింపఁబడుచున్నది. 'సీతాయాశ్చరితం మహత్' అని పురుషకారభూత యగుసీతాదేవి మహాచరిత్రముగాఁగదా యిది చెప్పఁబడినది. ఆదేవియొక్క మూఁడువిశ్లేషములచే వరుసగాఁ గృపయు పారతంత్ర్యమును అనన్యార్హత్వము ననెడిపురుషకారధర్మములు ప్రతిపాదింపఁబడినవి ఆమెసన్నిధానముచే కాకమునకుఁ దల దక్కెను. అది లేనందున రావణునకుఁ దలలు దక్కవయ్యెను. విభీషణుఁడును 'నివేదయత మాం క్షిప్రం విభీషణ ముపస్థితమ్' అని తన్ను రామునకుఁ దెలుపునట్లు వానరులను వేఁడుటచే ఘటకమూలముననే రామశరణమును వరిం

చెను. రాముఁడును, 'ఆనయైనం హరిశ్రేష్ఠ' అని ఘటకమూలముననే విభీషణుని విషయీకరించెను. ఇట్లు సుగ్రీవుఁడును రామభక్తుఁ డగుహనుమంతునిమూలముననే రాముని శరణుఁబొందె ననియే తెలియునది.

(5) ఇటువంటియుపాయమున కధికారి యగువాని స్వరూపమును శేషత్వమును పారతంత్ర్యమును.

అందు శేషత్వము 'అహమస్యావరో భ్రాతా గుణైర్దాస్యముపాగతః । కురుష్వ మా మనుచరం వైధర్మ్యం నేహ విద్యతే॥ కృతార్థోఽహం భవిష్యామి తవ చార్థః ప్రకల్పతే।' ఇత్యాదులందలి దాస్యత్వము అనుచరత్వము మొదలగు లక్ష్మణుని యాచారముచేతఁ బ్రకాశింపఁజేయఁబడినది.

(6) భరతునిమూలమున భగవత్పారతంత్ర్యము ప్రకటింపఁబడినది 'విలలాప సభామధ్యే జగర్హే చ పురోహితమ్ । రాజ్యం చాహం చ రామస్య ధర్మం వక్తుమిహార్హసి' అను నివి మొదలు 'సర్వాత్మనా పర్యనునీయమానో యదా న సౌమిత్రిరుపైతి యోగమ్। నియుజ్యమానో భువి యౌవరాజ్యే తతోఽభ్యషిఞ్చద్భరతం మహాత్మా' అనువఱకును భరతుని పారతంత్ర్యము ప్రకటింపఁబడినది.

(7) శత్రుఘ్నునివ్యాపారముచే భాగవతపారతంత్ర్యము ప్రకాశితమైనది. 'గచ్ఛతా మాతులకులం భరతేన తదానఘః । శత్రుఘ్నో నిత్యశత్రుఘ్నః నీతః ప్రీతిపురస్కృతః' ఇత్యాదులచే నిది చెప్పఁబడినది.

(8) ఈయధికారికి జ్ఞాతవ్యమయిన అర్థపంచక మిందుఁ జెప్పఁబడినది. 'ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః॥ ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తేస్తథా ప్రాప్తివిరోధి చ॥ వదన్తి సకలా వేదాః సేతిహాసపురాణకాః॥ మునయశ్చ మహాత్మానో వేదవేదాఙ్గపారగాః' అని ప్రాప్యంబగు బ్రహ్మముస్వరూపమును బ్రహ్మమును బ్రాపించు ప్రత్యగాత్మస్వరూపమును బ్రహ్మప్రాప్తికి నుపాయమును ప్రాప్తికి ఫలమును ప్రాప్తికి విరోధియునను వీనిని సకలవేదములును నితిహాసపురాణములును మహాత్ములును వేదవేదాంగపారంగతు లయినమునులును జెప్పుచున్నారు. అని యర్థపంచకము చెప్పఁబడియున్నది. అందు రాముని ప్రస్తావముచే పరస్వరూపమును, లక్ష్మణాదివృత్తాంతముచే ప్రత్యగాత్మస్వరూపమును, శరణాగతిని వర్ణించుటచే నుపాయస్వరూపమును, విభీషణాదికథచే భగవత్కైంకర్యరూపఫలస్వరూపమును, రావణాదివృత్తాంతముచే విరోధిస్వరూపమును జెప్పంబడినవని తెలియునది.

(9) ఈ యధికారికి ఆకించన్యమును అనన్యగతికత్వమును అపేక్షితము లని చెప్పుటకు బ్రహ్మరుద్రాదులు వరములొసఁగియున్న రావణునివధముచేత బ్రహ్మరుద్రాది దేవతాంతరములయు దశరథచరిత్రముచేత తండ్రియొక్కయు, కాకాదివృత్తాంత

ముచేత తల్లి మొదలగువారలయు, విభీషణ మేఘనాదాదివృత్తాంతములచే భ్రాతృ పుత్రులయు అరక్షకత్వము చెప్పఁబడినది.

(10) ఈ యధికారికి భగవజ్జ్ఞానలాభము ఆచార్యునిమూలమునఁ గలుగుచున్నది అని హనుమంతునిచరిత్రముచేఁ జూపఁబడెను.

(11) ఈయధికారి 'కృతకృత్యాః ప్రతీక్షన్తే మృత్యుం ప్రియమివాతిథిమ్'. 'కృతకృత్యులయినవారు మృత్యువును ప్రియాతిథివలె నెదురుచూచుచుందురు' అన్నరీతి శరీరపాతము కలుగునంతకాలము నెదురుచూడవలయునని, సీతాధ్యవసాయము చేఁ జెప్పఁబడుచున్నది 'శరైస్తు సంకులాం కృత్వా లఙ్కాం పరబలార్దనః । మాం నయేద్యది కాకుత్స్థస్తత్తస్య సదృశం భవేత్' అని రాముఁడే బాణములచే లంకను గప్పి శత్రులనుఱుమాడి తన్నుఁగొనిపోవుటయుక్తమని కదా సీత చెప్పినది. ఇట లంక యనఁగా శరీరము. రావణకుంభకర్ణులహంకారములు. ఇంద్రజిత్తు మొదలగువారు కామక్రోధాదులు. విభీషణుఁడు వివేకము. లంకయందుఁ జెఱపెట్టఁబడినసీత చేతన. ఆచేతనునకు భగవజ్జ్ఞానము హనుమంతుఁడనెడి యాచార్యుని చేత. ఇట్టిశరీరమును ధ్వంసము ముందుగాఁగావించి దానిలోపలఁ జెఱఁబడియున్న చేతనుని ఉద్ధరణము భగవంతుఁడే చేయునని తెలియునది.

(12) 'ఈయధికారి శరీరమున్నంతవఱకు దాను జేయవలసినదాని విషయమందు రామునివలె వర్తించునది రావణాదులవలెఁ గాదు' అని యుపదేశము యథాయోగముగాఁ జేయఁబడుచున్నది.

(13) 'ఈయధికారి వాసము సేయుటకు యోగ్యమయినదేశము భగవత్సన్నిధి గలదేశమే' అని కోసలజనపదమందుఁ గలజనులవృత్తాంతము చేత చెప్పఁబడినది.

(14) ఈయధికారికి రామాయణము ద్వయవివరణము గలదగుటచే కాలక్షేప మీరామాయణము చేతనే. కావుననే రామాయణము దీర్ఘశరణాగతియని యభియుక్తులచేఁ జెప్పఁబడినది. ద్వయము అర్థానుసంధానముతోఁ గూడ సదా చెప్పుచున్నదని భాష్యకారులును. అందు బాలకాండము చే శ్రీమచ్ఛబ్దార్థము చెప్పంబడినది. అయోధ్యాకాండముచే కల్యాణగుణములను వర్ణించుటంబట్టి నారాయణశబ్దార్థమును, ఆరణ్యకాండముచేత 'తేజం సోమమివోద్యన్తమ్' ఇత్యాదులచే దివ్యమంగళవిగ్రహమును వర్ణించుటంబట్టి చరణశబ్దార్థమును, కిష్కింధాకాండ సుందరకాండములచే శరణశబ్దార్థమును, యుద్ధకాండముచే ప్రపద్యే అనుదానియర్థమును, ఉత్తరకాండముచే ముక్తిఫలమును కీర్తించుటంబట్టి ఉత్తరఖండార్థమును జెప్పఁబడినవి.

(15) ఈయధికారికి సదా జపింపఁదగినది రామాయణమే యని తెలుపుటకై గాయత్ర్యర్థమిందు ప్రతిపాదింపఁబడుచున్నది. ఎట్లన బాలకాండమందు వేదప్రసిద్ధ

మఱి జగత్ప్రసూతికి హేతుభూతమయిన భగవత్స్వరూపమును వర్ణించుటవలన సవితృశబ్దార్థమును, అయోధ్యాకాండ కిష్కింధాకాండములయందు గుణగణములను వర్ణించుటంబట్టి వరేణ్యశబ్దార్థమును, అరణ్యకాండమందు తేజోమయమైనశరీరమును వర్ణించుటంబట్టి భర్గశబ్దార్థమును, సుందరకాండమున దివ్యమంగళవిగ్రహాలంకరణములను వర్ణించుటంబట్టి దేవశబ్దార్థమును, యుద్ధకాండమున శరణాగతినిజెప్పుటచే ధీమహిశబ్దార్థమును, ఉత్తరకాండమున ముక్తిఫలమును నిర్ధరించుటవలన తృతీయపాదార్థమును బ్రతిపాదింపఁబడినవి.

(16) 'ఈయధికారి చార్వాకబౌద్ధాది[illegible]ములు మొదలుగాఁగల యసచ్ఛాస్త్రములను ముట్టనుగూడ ముట్టరాదు' అని జాబాలి [illegible] రాముఁడు గావించినఖండనములు మొదలగువానిచే నిర్ణయింపఁబడుచున్నది.

(17) మహాత్ములకును వ్యసనము గలుగుచున్నది. కాఁబట్టి సంసారమును వదలవలయుననెడియాస గలిగి యుండవలయునని వైరాగ్యమును బొందుటకై నాగపాశ, బ్రహ్మాస్త్రబంధ, సీతాపహరణ, రాజ్యభ్రంశాదులచే వ్యక్తముగాఁజెప్పఁబడినది.

(18) లోకవ్యవహారమునకొఱకు చతుష్షష్టికళలయర్థముఁ గూడ సంగ్రహముగా నిందుఁ బ్రతిపాదింపఁబడుచున్నది. 'యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్' 'ఇందుఁగలది తక్కినచోటనుండును; ఇందు లేనిది మఱెందును లేదు' అను న్యాయమున చతుష్షష్టికళలు నిందు ప్రతిపాదింపఁబడుచున్నవి. ఎట్లన, ప్రతిపాదితమయినదిశను వేదార్థము తెలుపఁబడెను. హనుమంతునివచనములను శ్లాఘించునపుడు 'అనయాచిత్రయావాచా త్రిస్థానవ్యంజనస్థయా' ఇత్యాదులచే శిక్షార్థమును అశ్వమేధాదిప్రకరణమున కల్పసూత్రార్థమును 'నూనం వ్యాకరణం కృత్స్నమనేన బహుధా శ్రుతమ్' ఇత్యాదులచే వ్యాకరణార్థమును ఇట్లు తక్కినవన్నియు నిందు సూక్ష్మబుద్ధిని గ్రహించునది.

ఇట్లు పదునెనిమిదర్థములు ఆచార్యులచే నుపదేశింపఁబడినవి.

శ్రీరామాయణసంప్రదాయార్థసంగ్రహము.

సమాప్తము.

శ్రీరామచన్ద్రపరబ్రహ్మణే నమః.

విషయసూచిక

లక్ష్మణునిచే నింద్రజిత్తు హతుండగుట. 1636

లక్ష్మణుఁడు రామునకు నింద్రజిద్వధమును దెలుపుట; సుషేణుఁడు లక్ష్మణాదులను విశల్యులం జేయుట. 1642

రావణుఁ డింద్రజిత్తుమరణమునకు విలపించుట ; సీతను జంపఁబూనిన రావణుని సుపార్శ్వుఁడు వారించుట. 1644

రాముఁడు మూలబలనిర్మూలము గావించుట. 1649

రాక్షసస్త్రీలప్రలాపము. 1653

రావణుఁడు మువ్వురుమంత్రులతోఁ గూడి లంకయుత్తరద్వారమున యుద్ధమునకు వెడలి వానరసేనతో యుద్ధము సేయుట. 1656

సుగ్రీవుఁడు విరూపాక్షుని వధించుట. 1659

సుగ్రీవుఁడు రావణునిమంత్రి యగుమహోదరునిం బరిమార్చుట. 1661

రావణునిమంత్రియగు మహాపార్శ్వుఁ డంగదునిచే హతుఁ డగుట. 1664

రామరావణయుద్ధారంభము. 1665

రావణుఁడు మయనిర్మితమైనశక్తిచే లక్ష్మణుని మూర్ఛితుం జేయుట; రాముఁడు రావణుని బాణవర్షముల నొప్పించుట. 1669

హనుమంతుఁడు ఓషధిపర్వతమును దెచ్చుట; లక్ష్మణుఁ డాయోషధులచే విశల్యుఁడై లేచుట. 1673

ఇంద్రుండు పంపినరథము నెక్కి రాముఁడు రావణునిని మార్కొనుట. ... 1676

రావణుశూలమును రాముఁడు హతము సేసి వానియశ్వాదుల నొప్పించుట. ... 1678

రాముఁడు రావణుని నిందించుచుఁ బెక్కుబాణముల నొప్పించుట; విహ్వలుం డయినరావణునిం జూచి యతనిసారథి తేరు దొలంగంగొనిపోవుట. 1680

రావణుఁడు తెప్పిఱి సూతుని రథము తొలఁగఁదెచ్చినందులకై దూఱుట; సూతుఁడు దగినసమాధానముచెప్పి రథమును మరల యుద్ధభూమికిం దోలుట. 1682

అగస్త్యుఁడు రామునకు నాదిత్యహృదయము నుపదేశించుట; ఆస్తోత్రముచే సూర్యుఁడు రామున నుగ్రహించుట. 1684

రావణునకు మరణసూచకము లగుదుర్నిమిత్తములు తోఁచుట. 1694

రాముఁడు రావణునిరథధ్వజమును ఛేదించుట. 1697

ఖండింప ఖండింప మరలమరల మొలచుచున్న రావణునిశిరస్సులను రాముఁడు నూటయొక్కమాఱు ఖండించుట. 1699

రాముఁడు బ్రహ్మాస్త్రమున రావణుని వధించుట. 1701

భ్రాతృమరణమునకు దుఃఖించుచున్న విభీషణుని రాముఁ డాశ్వాసించుట. ... 1704

రావణుభార్యలు మృతుండయినపతిని జూచి రోదనము సేయుట 1707

మండోదరీవిలాపము; విభీషణుఁడు రామనియోగంబున రావణునకు సంస్కారము సేయుట. 1709

లంకయందు విభీషణునిపట్టాభిషేకము; విభీషణుఁడు మరల రామునిసన్నిధికి వచ్చుట; రాముఁడు సీతకుఁ దనవిజయము దెలుపుటకై హనుమంతునిఁ బంపుట. 1719

హనుమంతుఁడు సీతకు రామునివిజయమును దెలిపి యాబిడసందేశమును గొనివచ్చుట. ... 1721

విభీషణుఁడు సీతకు శిరస్స్నానదివ్యాలంకారాదులు గావించి రామునియొద్దకుఁ దెచ్చుట. సీత శ్రీరామవదనమును సందర్శించుట. 1726

రాముండు సీతను బరుషములాడుట. 1729

సీత రామునకు బదులుసెప్పి నమ్మిక గలుగుటకై యగ్నిప్రవేశము సేయుట. ... 1731

బ్రహ్మాదిదేవతలు వచ్చి రామునిం బ్రస్తుతించుట. బ్రహ్మ విశేషించి శ్రీరాముని స్తోత్రము సేయుట. 1734

అగ్నిపురుషుఁడు సీత నంకమున నెత్తికొని రామున కర్పించుట. రాముఁడును సీతను స్వీకరించుట. 1741

శివుఁడు రామునకు దివ్యవిమానమున వచ్చియున్న దశరథునిం జూపుట. దశరథుఁడు నమస్కరించిన రామాదులను వేలువేల యభినందించి స్వర్గమున కరుగుట. ... 1743

దేవేంద్రునిప్రసాదమువలన యుద్ధమృతులయిన వానరులెల్ల లేచుట. దేవతలు స్వస్థానమునకుఁ బోవుట. 1746

రాముఁడు, మంగళస్నానము సేయుమని విభీషణుఁడు ప్రార్థింపఁగా భరతునిఁజూడఁగోరి యందులకొల్లక పుష్పకవిమానమును దేరఁబంచుట. 1748

విభీషణుఁడు సమస్తవానరులను సమ్మానించుట. శ్రీరాముఁడు సీతాలక్ష్మణసుగ్రీవవిభీషణాదిసహితుఁడై పుష్పకమారోహించి యయోధ్యకుఁ బయనమగుట. 1750

రాముఁడు సీతకు మార్గమునందలి విశేషములను జెప్పుట. రాముఁడు సీతాప్రార్థనమున కిష్కింధయందు సుగ్రీవాదివానరపత్నులను బుష్పక మెక్కించి యందఱతోఁ గూడ భరద్వాజాశ్రమమును జేరుట. 1752

రాముఁడు భరద్వాజమునివలన మాతృభరతాదులక్షేమమును వినుట; భరద్వాజాశ్రమమునం దొక దినము నిలుచుట. 1757

రామునిపంపున హనుమంతుఁడు గుహునకును భరతునకును రామునిరాక దెలుపుట. ... 1760

భరతుఁడు హనుమంతునివలన రామవృత్తాంతమంతయు విని యతఁడు రేపు వచ్చుటకు నానందపారవశ్యము నొందుట. 1765

భరతుఁడు పురాలంకారమున కానతిచ్చుట. భరతుఁడు పౌరులతోఁగూడి రాముని నెదుర్కొనుట; రామునిఁ గలియుట. రాముఁడు భరతాశ్రమమును జేరుట 1769

భరతునిప్రార్థనమున రాముండు రాజ్యము నంగీకరించుట. లక్ష్మణాదిసహితముగా జటలువిడిచి మంగళస్నానముచేసి యయోధ్యను బ్రవేశించుట. అందు మాణిక్యమంటపమున దివ్యసింహాసనమున దివ్యతీర్థములచే వసిష్ఠాదులు శ్రీరామున కభిషేకము గావించుట. రాముఁడు విభీషణసుగ్రీవాదు లందఱకును సమ్మానము సేయుట. సుగ్రీవాదులు తమతమనగరములకుఁ బోవుట. భరతుని యౌవరాజ్యమునకుఁ బట్టముగట్టుట. రామరాజ్యపాలనవైభవము. శ్రీరామాయణపఠనశ్రవణాది ఫలశ్రుతి. 1774

శ్రీరామునిపట్టాభిషేకమహోత్సవము. 1779

పటములపట్టిక.

లక్ష్మణుఁడు ఇంద్రజిత్తును వధించుట. ... 1640

రావణుఁడు బ్రహ్మాస్త్రముచే హతుఁడై క్రిందఁబడుట. రావణాంతఃపురస్త్రీలతనినిజూచి విలపించుట. రాముఁ డతనికి సంస్కారముఁ జేయ విభీషణుని నియోగించుట. 1709

రామనియోగమున లక్ష్మణుఁడు విభీషణునకులంకలో పట్టాభిషేకము చేయుట. 1720

హనుమంతుఁడు రాక్షసస్త్రీలను చంపెదనని చెప్పుట; సీత వలదనివారించుట. 1724

విభీషణుఁడు సీతను అలంకృతను గావించి రాముకడకుఁ గొనిపోవుట. 1727

రాముఁడు సీతను జూచి చిరకాలము రావణగృహమున నుండినందులకుఁ బరుషములాడుట; సీత యగ్నిప్రవేశముఁ జేయుట. ... 1733

అగ్నిదేవుఁడు సీతను అగ్నినుండి వెలిపుచ్చి రామునికి పవిత్రురాలని చెప్పి సమర్పించుట; బ్రహ్మరుద్రేంద్రాదులు రామునిస్వరూపమును వెలిపుచ్చి స్తోత్రము చేయుట. 1742

శ్రీభరతుఁడు రామపాదుకలను శిరసాధరించుకొని రాముని నెదుర్కొనిపోవుట. 1771

రాముఁడు పుష్పకవిమానమునుండి దిగుట; భరతుఁడు పాదుకలనుసమర్పించి ధరించుకొనుటకై ప్రార్థించుట. 1772

శ్రీరామచంద్రునికి పట్టాభిషేకపూర్వమంగళస్నానములు. ... 1779

శ్రీరామచంద్రునిపట్టాభిషేక మహోత్సవము. ... 1780

అంత రాక్షసవరుఁడగు విభీషణుఁ డన్యోన్యకాలముల కదియదని యుక్తమని యెఱింగిన వాఁడుగాన రాక్షసులతోఁ బోరాడ ప్రియపడుచున్న వానరులను మఱియుఁ బ్రోత్సాహపెట్టువాఁడై యప్పటికిఁదగినట్లు వారితో 'వానరశ్రేష్ఠులారా! రాక్షసేంద్రుఁడగు రావణునకు వీఁడొక్కఁడే పరమగతియైయున్నాఁడు. రావణుని సైన్యమంతయుఁబోయి వీఁడొక్కండె శూరుఁడు మిగిలియున్నాఁడు. మీరలేల మిన్నకనిలుచున్నారు? పాపాత్ముండగు నీరాక్షసుఁడు రణముఖంబున హతుఁడుకాఁగా, పిదప రావణుఁ డొకఁడుతక్కఁ దక్కిన యతనిబలమంతయు హతమయిన దగుచున్నది. వీరుఁడగు ప్రహస్తుఁడును మహాబలుఁడగు నికుంభుఁడును కుంభకర్ణుఁడును కుంభుఁడును ధూమ్రాక్షుఁ డనురాక్షసుఁడును జంబుమాలియు మహామాలియు తీక్ష్ణవేగుఁడును అశనిప్రభుఁడును, సుప్తఘ్నుఁడును, యజ్ఞకోపుఁడును, వజ్రదంష్ట్రుఁడును, రాక్షసుఁడును, సంహ్రాదియు, వికటుఁడును, నిఘ్నుఁడును, తపనుఁడును, దముఁడును, ప్రఘాసుఁడును, ప్రఘసుఁడును, ప్రజంఘుఁడును, జంఘుఁడును, దుర్ధర్షుండగు నగ్నికేతుఁడును, వీర్యవంతుఁడగు రశ్మికేతుఁడును, విద్యుజ్జిహ్వుఁడును, ద్విజిహ్వుఁడును, సూర్యశత్రుండను రాక్షసుఁడును, అకంపనుఁడును, సుపార్శ్వుఁడును, చక్రమాలి యను రాక్షసుఁడును, కంపనుఁడును, బలవంతులయిన దేవాంతక నరాంతకులును హతులయిరి. మీరు మహాబలవంతులయిన యీరాక్షసోత్తములఁ బెక్కండ్ర వధించి సముద్రమును చేతులతో నీఁది దాఁటినవారయితిరి. ఇఁక నింద్రజితుని వధించుట మీ కావుపాదమంతటిస్వల్పమును దాఁటుటయే యగును. ఆస్వల్పమునుగూడ దాఁటివైవుఁడు. వానరులారా! బలగర్వితులగు రాక్షసులందఱు వచ్చి తలపడి మీచే హతులయిరి. ఈయింద్రజిత్తు ఒకఁడుమాత్రమే మిగత. ఇంతమాత్రమే మీ కిందు జయింపవలసియున్నది. నేను రాముని కార్యమునకుఁగాను దయను దొలఁగఁబెట్టి తోఁబుట్టువుకొడుకునయినను జంపివుత్తును; కాని పినతండ్రినై నాకు కొడుకగువానిని నేనేచంపుట యుక్తముగాదు. నే నింద్రజిత్తును వధింపఁగోరఁగానే కన్నీరు నాకన్నును గ్రమ్మియడ్డపడుచున్నది. కావున వానిని మహాబాహుఁ డీలక్ష్మణుఁడే యడంచును. వానరులారా! మీరందఱు నొక్కటిగాఁగూడి, యీయింద్రజిత్తునకుఁ దోడ్పడుటకై వీనిచెంతల పొంతల నున్న రాక్షసభటులను వధింపుఁడు' అనెను. ఇట్లు మహాయశస్కుఁడగు నావిభీషణుఁడు ప్రోత్సాహపెట్టఁగా, వానరోత్తము లుబ్బునొంది వాలము లల్లార్చిరి. అంత నావానరసింహములు, ఆప్రోత్సాహమున, మాటిమాటికి సింహనాదములు సేయుచు, మేఘములంజూచి నెమిళ్లు కేకలు వేయునట్లు, ఉబ్బు పట్టంజాలక నానావిధములయిన ధ్వనులు గావించిరి. జాంబవంతుఁడును సమస్తములయిన స్వసైన్యములచేఁ బరివృతుఁడై శిలలచేత రాక్షసులంగొట్టి నఖములచేతను దంతములచేతను వారల నొప్పించెను. మహాబలవంతులయిన యారాక్షసులు, అట్లు ప్రహరించుచున్న భల్లూకపతియగు జాంబవంతుని, భయము మాలి యనేకవిధాయుధములం గొని

చుట్టుముట్టిరి. ఆరాక్షసులు, అప్పుడు యుద్ధమున రాక్షససైన్యమును వధించుచున్న జాంబవంతుని, బాణములను కఱకులయిన పరశువులను పట్టిసములను యష్టులను తోమరములనుం గొని నొప్పించిరి. వానరరాక్షసులకుఁ గలిగిన యాదొమ్మి యుద్ధము క్రుద్ధులైన దేవాసురులయుద్ధమువలె మహాధ్వనిగలిగి భయంకరమై చెలంగినది. * వీర్యశాలియగు హనుమంతుఁడును మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై సాలమొకటిఁ బెకలించి వేవురకొలఁది రాక్షసులం దలపడి భయంకరముగా యుద్ధముసేసెను. ఇంద్రజిత్తు పినతండ్రికి మిక్కుటమైన యుద్ధమునొసంగి మరల శత్రువీరుల రూపు మాపెడిలక్ష్మణునిమీఁదికే యడరెను. అపుడయ్యుద్ధమున వీరులై చక్కఁగా యుద్ధముసేయు సుప్రసిద్ధులగు నయ్యిరువురును, బాణవర్షములుగురియుచు నొకరినొకరు నొప్పించిరి. మహాబలవంతులును వేగవంతులునగు నయ్యిరువురు, వర్షర్తువునందు చంద్రసూర్యులు మబ్బులచే మఱుఁగుపడునట్లు, బాణసమూహములచే పలుమాఱు మఱుఁగుపడుచుండిరి. అచట నయ్యిరువురు పోరునపుడు, వారిహస్తలాఘవముంబట్టి యమ్ములపొదినుండి బాణములను దీయుటగాని,వింట బాణమును సంధించుటగాని, వింటిని కుడియెడమ ప్రక్కలమార్చి పట్టుకొనుటగాని, బాణములను బ్రయోగించుటగాని, ఆకర్ణాంతముగా నారి లాగుటగాని, ఆలీఢాదిమానముల దిట్టముగా నిలుచుండుటలుగాని, వింటిని నారిని బిడికిటపట్టుటగాని, గుఱిదప్పక వేయుటఁగాని,యెంతమాత్రము గనఁబడదయ్యె. వింటినుండి యురవడిగా వెడలుచున్న బాణసమూహము లాకాశమంతటిని గప్పుటవలన బాణములుతప్ప మఱియేవస్తువును గానఁబడదయ్యె. అప్పుడు లక్ష్మణుఁ డింద్రజిత్తును దారసించియు నింద్రజిత్తు లక్ష్మణునిఁ దలపడియుఁ బోరునపుడు ఇతఁ డతనిని గొట్టుననిగాని యతఁ డితనిం గ్రిందుపఱచుననికాని నిశ్చయము నేర్పఱచుట యశక్యముగానుండెను. వారిరువురు, వేగమున నొండొరులపయి నైచినవాఁడిబాణములు ఆకాశమునం దెంతమాత్రమును తెఱపిలేనట్లు నిండఁగా నది చీఁకటి క్రమ్మినట్లుండెను. అట్లు వారిరువుర వాఁడిబాణములు పెక్కువందలకొలఁదిని బరఁగుచుండుటంజేసి దిక్కులును విదిక్కులును బాణములు నెరసిపెరసినవయ్యె. సమస్తమును, సూర్యుఁ డస్తమించునపుడు చీఁకటిచేఁ గప్పఁబడునట్లు, చీఁకటిచేఁ గప్పఁబడి, యెంతయు భయంకరముగానుండెను. అప్పుడు నెత్తురువెల్లువలు గొప్పనదులుగా వేలకొలఁదిని బ్రవహించినవి. బెడిదములయి మాంసాహారులగు క్రూరజంతువులు భయంకరముగాఁ గూఁతలిడినవి. అప్పుడు భయమున వాయువు వీవకుండెను. అగ్ని మండదయ్యె. మహర్షులును దిగులొంది 'లోకంబులకు మంగళమగుఁగాక ' యని పలికిరి. మున్ను యుద్ధముఁజూడ నచ్చటికివచ్చియున్న గంధర్వులును చారణులును అతిఘోరమైన యాయుద్ధమును జూడ వెఱచి వేఱుచోటికిఁ

* ఇచట హనుమంతుఁడు యుద్ధముచేసెననుటవలన హనుమంతునివీఁపుపయినున్న లక్ష్మణుఁడు అతనియొలసట దీఱుటకై కొంతసేపు దిగియుండెనని తెలియుచున్నది.

బోయిరి. అంత లక్ష్మణుఁడు, రాక్షససింహుఁడగు నింద్రజితుని నల్లనిగుఱ్ఱములను బంగారుభూషణములు గలవానిని నాలుగింటిని, నాలుగుబాణములఁ గాఁడనేసెను. పిమ్మట శ్రీమంతుఁ డగులక్ష్మణుఁడు, వాఁడియై మంచి గఱులుగలిగి, మేలయినకాంతిని వెలుంగుచున్న వేఁటాళ తెల్లనికత్తివాతి వాఁడియమ్మును దీసి యాకర్ణాంతముగా లాగి,యింద్రునివజ్రముంబోలినదై యత్తైముచప్పుడుచే శబ్దించుచుఁ బిడుగువలెనున్న యాబాణముచే లాఘవంబుమెఱయ, రథమును జిత్రగతులం ద్రిప్పుచున్న యింద్రజిత్తు సారథితల మేనినుండి డొల్లనేసెను. సారథి హతుఁడుకాఁగా మహాతేజుఁడగు నామందోదరీతనూజుఁడు ఇంద్రజితుఁడు, తానే తేరును దోలుకొనుచును వింటినింబట్టి యుద్ధమును జేయుచు నుండెను. ఆయుద్ధమునం దట్లు ఇంద్రజిత్తు తా నొకఁడే తేరు దోలికొనుచును వింటిఁగొని యుద్ధము సేయుచును నుండుసామర్థ్యమునకుఁ జూచువా రాశ్చర్యపడిరి. లక్ష్మణుఁడు, ఇంద్రజితునిచేతులు గుఱ్ఱములం దోలువ్యాపారమునఁ దగిలియుండునపుడు అతనిని వాఁడియమ్ములఁ గాఁడనేసెను. వింటను నతని చేతులు దగిలియుండునపు డతని గుఱ్ఱములపయి బాణములేసెను. లక్ష్మణుఁడు,పగవానియందు తెఱపింజూచి బాణములేయుటయం దతిశీఘ్రలాఘవముగలవాఁడుగాన యట్లారంధ్రములం గనిపెట్టి, రథస్థుఁడై తిరుగుచున్న యింద్రజిత్తును, నిర్భయుఁడై బాణసమూహములచే పీడించెను. ఇంద్రజిత్తు, యుద్ధమునఁ దనసారథి హతుఁడగుటయు, దాను గుఱ్ఱములందోలు తెఱపిని గనిపెట్టి లక్ష్మణుఁడు తన్ను నొప్పించుటయుం జూచి యుద్ధగర్వము వదలి విషణ్ణుం డయ్యెను. వానరయూథపులు ఇంద్రజిత్తుమొగము విన్ననై యుండుటంజూచి మిక్కిలియు సంతుష్టులై లక్ష్మణునిం గొనియాడిరి. అంత, ప్రమాథి, శరభుఁడు,రభసుఁడు, గంధమాదనుఁడు నను వానరోత్తములు నలువురు,ఇంద్రజితుని యాటోపము సహింపక యురవడిఁ జూపసాఁగిరి. మహాపేర్యవంతులును భయంకరపరాక్రములు నయిన యావానరవీరులు నలువురును, ఇంద్రజితుని తేరికిఁ బూన్చిన మేటిగుఱ్ఱముల నాలుగింటిపై నతివేగంబున దూఁకిపడిరి. పర్వతాకారులగు నవ్వానరవీరులు పయిఁబడఁగానే యాయశ్వములు ఆఁగఁజాలక, ముఖములనుండి యెఱ్ఱనినెత్తురు గ్రక్కినవి. ఆగుఱ్ఱములు అట్లు నలఁగి యవయవములు విఱిగి ప్రాణములువీడి నేలం గూలినవి. అవ్వానరవీరులు, ఇంద్రజితునిగుఱ్ఱములను హతముసేసి, యతనిమహారథమును నుగ్గుగావించి మరల వేగంబున నెగిరివచ్చి లక్ష్మణునిపార్శ్వమున నిలిచిరి. ఆయింద్రజిత్తు గుఱ్ఱములుచచ్చి సారథియుఁ గూలినయావట్టిరథమునుండి నేలకుదూఁకి, బాణవర్షము గురియుచు లక్ష్మణునిపయి కడరెను. అంత నప్పుడు మహేంద్రునికి సాటియగు లక్ష్మణుఁడు, తనపయి వాఁడియైన బలుతూఁపులను బరఁగించుచు, కాలినడకను దారసించి వచ్చుచున్న యాయింద్రజిత్తును,యుద్ధమున వాఁడియైన మేటిబాణములను మఱియు నితరబాణసమూహములను మిక్కిలియుఁ బ్రయోగించి యొంతయు వారించినవాఁడయ్యె. ఇది తొంబదియవసర్గము.

{ఇంద్రజిత్తు వేఱురథమెక్కి రాఁగా లక్ష్మణుఁడు వానిసారథిం జంపుట; విభీషణుఁ డింద్రజిత్తుగుఱ్ఱంబుల రూపుమాపుట; లక్ష్మణునిచే నింద్రజిత్తు హతుఁడగుట.}

అట్లు గుఱ్ఱములు గూలఁగా రథము డిగి నేలపయి మహాతేజుఁడింద్రజిత్తునిలుచుండి, మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై తేజంబున మిక్కిలియు జ్వలించుచుండెను. ధనుర్ధరులయిన యాయిరువురును బాణములచే నొండొరువుల నెంతయు వధింపఁగోరుచు,యడవియందు గజంబులుం బోలె విజయముకొఱకై యొకరినొకరు నెదుర్కొనిరి. రాక్షసులును వానరులును యుద్ధమున నలుప్రక్కల సంచరించుచు,ఒకరినొకరువధించుచు,తమతమయధిపతిని నెంతయువిడువక పోరుచుండిరి.అంత నింద్రజిత్తు, ఆరాక్షసులకందఱకు సంతోషముగలిగించుచు, వారలంబొగడుచు తానును సంతసిలుచు,‘రాక్షసోత్తములారా! ఈసమస్తదిక్కులను జీఁకటిదట్టముగా వ్యాపించియున్నది.కానయిపుడుయుద్ధమునఁ దనవాఁడనికాని పరుఁడనికాని భేదము తెలియకున్నది.మీరలీవానరులను నేనిచటనుండి వెడలిపోవుసంగతి తెలియకుండున ట్లేమఱించుటకై యుద్ధవిడిగానిలిచి యుద్ధముసేయుచుండుఁడు. నేనింతలో రథము నారోహించి యుద్ధమునకు వచ్చెదను. నేను బట్టణములోనికిపోవఁగా దురాత్ములయినవానరులు నన్ను యుద్ధముసేసిపోవునపు డాఁగకుండునట్లు మీరు గావింపవలయును’ అనెను.పగవారిఁమోసపుచ్చి మడంచు నింద్రజితుఁడు తనసైనికుల కట్లుచెప్పి వానరులనువంచించి రథముఁదెచ్చుటకై లంకకుంబోయెను. యుద్ధంబులగెలుపునొందుచుండు మహాతేజం డయ్యింద్రజిత్తు సొగసైబంగారుచే రంగారుచు వందలకొలఁదిప్రాసములచేతను ఖడ్గములచేతను బూర్ణమై యుత్తమాశ్వములుపూన్చినరథమును నశ్వలక్షణములఁదెలిసి తనకు హితముపదేశించునట్టిసారధి తోలఁగా తనతేజంబున దాని నలంకరించుచు నారోహించినవాఁడయ్యె. మందోదరీపుత్రుఁడగు నింద్రజితుఁడు మృత్యువశంబునఁ బ్రేరితుఁడై మేటిరాక్షససమూహములంగూడి లంకానగరమునుండి వేగ వెడలివచ్చెను. శత్రువీరుల నుఱుమాడునయ్యింద్రజిత్తు వేగవంతములగు గుఱ్ఱములు పూన్చినరథముచే పట్టణమునుండి వెలువడి లక్ష్మణునిపయికిని విభీషణునిమీఁదికిని బోయెను. అంత లక్ష్మణుఁడును మహావీర్యశాలురగువానరులును విభీషణుఁడును యుద్ధభూమి నున్నట్టియుండి,తమ్ము మోసపుచ్చిపోయి రథగతుఁడయివచ్చినయాయింద్రజిత్తుంజూచి,యాబుద్ధిమంతునిలాఘవమునకు మిక్కిలి యాశ్చర్యమునొందిరి. ఇంద్రజితుఁడును మిక్కిలి క్రుద్ధుఁడై యుద్ధముల బాణసమూహములు పరఁగించి వానరులను వందలకొలఁదిని వేలకొలఁదిని బడఁగూల్చెను.యుద్ధములందు జయశీలుఁడగు నింద్రజితుఁడు క్రుద్ధుఁడై తద్దయు లాఘవంబునూని విల్లు మండలాకారమైయొప్ప వానరుల వధింపసాగెను.భయంకరపరాక్రములగు నవ్వానరులు,అట్లింద్రజిత్తు బాణములచేఁ దమ్మువధించుచుండఁగాఁ దాళలేక ప్రజలు ప్రజాపతియగుబ్రహ్మదేవుని శరణుఁజొచ్చునట్లు తమనాథుండగులక్ష్మణుని శరణుఁజొచ్చిరి. అంత లక్ష్మణుఁడు యుద్ధం

బునఁ గోపాతిశయముచే మండిపడి తనహస్తలాఘవమునుజూపుచు,నింద్రజితుని చేతి ధనువును ఖండించెను. ఇంద్రజిత్తు వేగిరమున నొండువిల్లుగొని, నారియెక్కువెట్టఁగా దానినిగూడ లక్ష్మణుఁడు మూఁడుబాణముల ఛేదించెను. అంత లక్ష్మణుఁడట్లు ధనువుద్రుంచి, మఱియు నయ్యింద్రజితునివక్షమున సర్పవిషమువలెఁ బ్రాణాంతకరములయిన యైదుబాణముల నొప్పించెను. ఆబాణములు లక్ష్మణునిపెనుపింటెనుండి వెడలినవై యింద్రజితుని దేహముదూఱి నెత్తుటంగడిసి యెఱ్ఱనిమహాసర్పములపగిది నేలంబడినవి. ఆయింద్రజిత్తు, లక్ష్మణునిబాణములచే కవచము భిన్నముకాఁగా,నోట నెత్తురుగ్రక్కుచు, దృఢమయిన యల్లెత్రాడుగలిగి మిక్కిలియు సారవంతమైన మఱియొక మేటివింటిని గైకొనెను. ఆ యింద్రజిత్తు మిక్కిలియు లాఘవము నూని, దేవేంద్రుఁడు వర్షములు గురియునట్లు లక్ష్మణునిపయిని బాణవర్షములు గురియించెను. అరిందముఁడైన యా లక్ష్మణుఁడు, ఎట్టివారికిని దారసింపరాని యయ్యింద్రజితుని బాణవర్షమును, తొట్రుపాటించుకయులేక బాణములచే వారించెను. అప్పుడు మహాతేజుఁడగు రఘుకులనందనుఁడు లక్ష్మణుఁడు తొట్రుపడక యింద్రజితునకుఁ దనపరాక్రమమును జూపెను. అది యెంతయు నద్భుతమై చూపట్టెను. అంత లక్ష్మణుఁడు యుద్ధంబునఁ బరమక్రుద్ధుఁడై తనయస్త్రప్రయోగమందలి యురవడింజూపుచు, ఆరాక్షసులనందఱ నొక్కొక్కని మూఁడేసిబాణములఁ బ్రహరించి యింద్రజితునింగూడఁ బెక్కుబాణములనొప్పించెను. ఆరాక్షసుండు,అట్లు బలవంతుఁడును శత్రుహంతయునగు లక్ష్మణునిచే మిక్కిలియు బాణములు గ్రుచ్చంబడినవాఁడై కోపించి లక్ష్మణునిమీఁద తెఱపిలేనట్లు పెక్కుబాణములను బ్రయోగించెను. లక్ష్మణుఁడాబాణములు తన్నుం దగులకమునుపే నడుమనె, వానిని వాఁడిబాణముల ఖండించెను. అంతేకాక, ధర్మాత్ముఁడును రథికోత్తముఁడునగు లక్ష్మణుఁడు యుద్ధమునందు నున్నఁగాఁ బదనుచేయఁబడిన గణుపులుగలక త్రివాఁడిబాణమున నాయింద్రజితునిసారథిశిరము డొల్లనేసెను. ఆయుద్ధమున సారథి హతుఁడయ్యెను, ఇంద్రజితునిరథమునకుఁ బూన్చియున్న గుఱ్ఱములు శిక్షాపాటవమువలన నెంతమాత్రము కలఁతనొందక, మండలాకారముల రథమునువహించి త్రిప్పినవి. అది చూచుట కెంతయు నాశ్చర్యముగా నుండెను. దృఢపరాక్రముఁడగులక్ష్మణుఁడు, యుద్ధమున క్రోధము బారింబడ, సైనికులు బెదర, ఆ యింద్రజితునిగుఱ్ఱములను బాణములచే నొప్పించెను. బలవంతుఁడగు నింద్రజితుఁడు, లక్ష్మణుఁడుగావించిన యాకార్యమునకు సైఁపక క్రుద్ధుఁడగు లక్ష్మణునిఁ బదిబాణములఁ గాఁడనేసెను. వజ్రసమానములును సర్పవిషముంబోలినవియునగు నింద్రజితుని బాణములు, బంగారువన్నె దులకించునదగు లక్ష్మణునికవచమును దాఁకి భగ్నములయ్యెను. రావణపుత్త్రుఁడింద్రజితుఁడు, లక్ష్మణుఁడభేద్యంబగు కవచము దొడిగియున్నాఁడని యెఱింగి, మిక్కిలియుక్రుద్ధుఁడై తనబాణప్రయోగపునురవడిం జూపుచు, మంచిపింజలు గలమూఁడుబాణముల లక్ష్మణునిలలాటముఁ గాఁడనేసెను. యుద్ధప్రి

యుండగు లక్ష్మణుఁడు లలాటమున మూఁడుబాణములు గ్రుచ్చుకొని యుండుటవలన యుద్ధాగ్రమున మూఁడు శిఖరములుగల పర్వతమువలెఁ జూడనొప్పెను. అట్లు మహాయుద్ధంబున నింద్రజిత్తు, బాణములచే పీడింపఁగా, లక్ష్మణుఁడు వేగ వింటి నాకర్షించి సుందరములయిన కుండలములతోఁ దులకించుచున్న యింద్రజిత్తునిముఖమున నయ్యుద్ధమున నయిదుబాణములు నాటనేసెను. శూరులును మహాబలవంతులును భయంకరపరాక్రములునగు లక్ష్మణుఁడును నింద్రజిత్తుఁడును మంచిసారముగల విండ్లను ధరించి, కరవీరపత్రాద్యాకారముల పలువిధముల మొనలు గల బాణములచే నొండొరుల నొప్పించిరి. యుద్ధమున శూరులగు లక్ష్మణుఁడు నింద్రజిత్తు నిరువురును, సమస్తావయవములు నెత్తుటం దొప్పఁదోఁగ చక్కఁగా పుష్పించిన మోదుగుచెట్లవలెఁ బ్రకాశించిరి. అయ్యిరువురు విండ్లుదాల్చి, జయమునందు మనస్సిడి, యొండొరుల మార్కొని యవయవములం దెల్లను బెడిదములయిన బాణములను గాఁడనేసిరి. అంత నింద్రజిత్తు, యుద్ధమునఁ గోపం బినుమడింప, విభీషణుని శుభవదనంబున మూఁడుబాణములేసెను. మఱియు నతఁడు రాక్షసేంద్రుఁడగు విభీషణుని మూఁడుబాణముల నొప్పించి యావానరవీరులనందఱను, నొక్కొక్కని నొక్కొకబాణముచే నొప్పించెను. మహాతేజుండగు విభీషణుఁడు ఆయింద్రజిత్తునియెడల మీఁదు మిక్కిలి క్రుద్ధుఁడై, యతిదురాత్ముఁడగు వానిగుఱ్ఱములను గదచే చంపెను. మహాతేజుండగు నయ్యింద్రజిత్తు, గుఱ్ఱములు చచ్చి సారథియుఁ గూలినయారథమునుండి నేలకుదూఁకి, రథమున నున్నశక్తింగొని పినతండ్రిపయి నేసెను. సుమిత్రకానందమును బెంచుచుండు లక్ష్మణుఁడు ఆశక్తి విభీషణునిమీఁదికి వచ్చుచుంటంజూచి, నడుమనే వాఁడిబాణముల ఛేదింప నది పదితునియలై నేలంబడెను. విభీషణుఁడు దృఢంబగు ధనువుందాల్చి క్రుద్ధుఁడై విరథుఁడగు నాయింద్రజిత్తుని వక్షమున వజ్రమువలె కఠినస్పర్శములగు బాణము లయిదింటిని వైచెను. బంగారు పింజలుగలిగి గుఱిని దప్పక తాఁకునట్టి యాబాణములు నతని దేహమును భేదించి నెత్తుటందడిసి యెఱ్ఱనై యెఱ్ఱని పెనుసర్పములవలె నొప్పెను. మహాబలుఁ డాయింద్రజిత్తు మిగులఁ గ్రుద్ధుఁడై యముఁడొసంగిన యుత్తమబాణంబును రాక్షసులనడుమఁ దీసికొనెను. మహాతేజుండును భయంకరపరాక్రముండునగు లక్ష్మణుఁడు, అట్లింద్రజిత్తు ఆ పెనుబాణమును సంధింపఁగాఁ జూచి తానును మఱియొకబాణమును దీసికొనెను. ఈబాణమును గుబేరుఁడు రాఁగలవృత్తాంతమును బుద్ధినూహించి యతనిస్వప్నమునఁ దానే యొసంగియుండెను. కాన యది యెట్టివారికి జయింపరానిది; సురాసురులతోఁ గూడి యింద్రుఁడు వచ్చినను దానితాఁకు నోర్వఁ దరముగాదు. ఆయిరువురును గుదియలవంటి తమ బాహువులచే నామేటివిండ్లను బలముకొలఁది నాకర్ణాంతము లాగుచున్నపుడు, అవి క్రౌంచపిట్టలు కూ పెట్టినట్లు మ్రోసెను. ఆవీరులిరువురును మేలయిన వింటియందా యుత్తమబాణములను సంధించి తివుచుచుండఁగా నవి రెండును కాం

తి పెంపున మిక్కిలియు జ్వలించెను. ఆబాణములు రెండును విండ్లనుండి విడువంబడఁగానే యాకాశమును వెలిఁగించుచుం బఱచి యొండొంటి మొగముతో మొగము గొట్టుకొన బిట్టుగా రాపుపొందినవి. భయంకరాకారములయిన యాబాణము లట్టుబిట్టుగా నొరపిడినొందఁగా దానివలనఁ బుట్టినయగ్గి, పొగలును మిడుంగుఱులును జెలంగ మిగుల బెట్టిదముగా నయ్యెను. ఆబాణములు రెండును నాకాశమున మహాగ్రహములంబోలె నొండొంటిందాఁకి వెనుఁగి నూఱుపఱియలై నేలంబడినవి. మిగుల రోషమునొందియున్న యాలక్ష్మణుఁడు నింద్రజిత్తును నపుడును తమబాణములు యుద్ధాగ్రమునఁ గొట్టువడుటనుజూచి యిరువురును లజ్జితులయిరి. లక్ష్మణుఁడు మిక్కిలియు సంరంభించి వారుణాస్త్రమును దీసికొనెను. యుద్ధంబున వెనుదీయని యింద్రజిత్తును యుద్ధంబున రౌద్రాస్త్రమును బ్రయోగింపఁగా దానిచేత మిక్కిలి యద్భుతమైన యవ్వారుణాస్త్రము హతమయ్యెను. అంత యుద్ధంబుల గెలుపుగొనుచుండు నమ్మహాతేజుఁ డింద్రజితుఁడు క్రుద్ధుఁడై లోకమును సంహరించువాఁడుంబోలె మెఱయుచున్న యాగ్నేయాస్త్రమును బ్రయోగించినవాఁడయ్యె. దానిని వీరుండయిన లక్ష్మణుఁడు సౌరాస్త్రముచేత వారించెను. ఇంద్రజిత్తు తనయస్త్రము వారింపఁబడుటను జూచి క్రోధమున నొడలు దెలియక తనశత్రువును నాశముసేయుటకై ఘోరమయిన యాసురాస్త్రమును దొడిగి ప్రయోగించెను. ఆయాసురాస్త్రమును బ్రయోగించుటవలన నింద్రజిత్తు వింటినుండి ధగధగ మెఱయుచున్న కూటముద్గరములును, శూలములును, ముసుంఠులనెడి ముసలములును, గదలును, ఖడ్గములును, గండ్రగొడ్డండ్రును బయలువెడలినవి. తేజోవంతుండగు లక్ష్మణుఁడు యుద్ధంబున భయంకరమును సమస్తప్రాణులకును వారింప నశక్యమైనదియు, సకలశత్రువులను రూపుమాపునదియు నయిన యాయాసురాస్త్రమును జూచి దానిని మాహేశ్వరాస్త్రముచేత వారించెను. అంత నయ్యిరువురియుద్ధము మిక్కిలియు నధికమై యాశ్చర్యమువలె నొప్పెను. అప్పు డాకాశమున నున్నభూతములన్నియు లక్ష్మణునిం బరివేష్టించినవయ్యె. అప్పుడు వానరులును రాక్షసులును బెట్టిదంపుచప్పుళ్లతో భయంకరముగాఁ బోరుచుండఁగా, భూతములనేకములు ఆకాశమునఁ గ్రమ్మి విస్మయపడి చూచుచుండఁగా నదియెంతయు నొప్పుచుండెను. అప్పుడు మహర్షులును బితరులును దేవతలును గంధర్వులును గరుడులును నురగులును దేవేంద్రపురస్సరులై యాయుద్ధమున లక్ష్మణునికి కీడుగలుగకుండునట్లు జయజయేత్యాదులైన యాశీర్వాదముల రక్షించుచుండిరి. అంత రామునితమ్ముండగు లక్ష్మణుఁడు అగ్గింబోని వేండ్రపుఁ దాఁకు గలిగి యింద్రజితుని రూపుమాపునట్టి దగునొక బలుమేటిబాణమును వింటసంధించినవాఁడయ్యె. ఆయస్త్రము నుంచిగఱులుగలిగి, గుండ్రనై, చక్కనిగణుపులును సంస్థానమునుగలిగి బంగారుచేఁ జిత్రితమై యెట్టిశరీరము నేని ఛేదించి ప్రాణములుదీయునట్టిదిగానుండెను. అది వారింపనుగాని సహింపనుగాని కడిందియై రాక్షసులకు భయ

మొసంగుచు, క్రూరసర్పవిషముంబోలి దేనసమూహాముచే మిక్కిలియుఁ బూజితమై వెలయుచుండునది. మఱియు మున్ను దేవాసురయుద్ధమున మహాతేజుండును సమర్థుఁడును, వీర్యవంతుఁడును పచ్చనిగుఱ్ఱములుగలవాఁడునగు దేవేంద్రుఁడు దానవుల నయ్యస్త్రముచేత జయించెను. ఇట్లు యుద్ధంబులఁ బరాజయము నొందనియమ్మేటిబాణమును ఐంద్రాస్త్రమంత్రముచే నభిమంత్రించి, వీరుఁడును పురుషశ్రేష్ఠుఁడునగులక్ష్మణుఁడు తన గొప్పవింట సంధించినవాఁడయ్యె. లక్ష్మణుఁ డట్లు శత్రువిదారణంబగు దివ్యబాణమును సంధించి, ప్రలయకాలమునందు లోకనాశమునకై యముండుంబోలె, నారినిమోపెట్టి చెనకరానిబలువింటిని వంచి యాకర్షించెను. లక్ష్మీయుక్తుండగు లక్ష్మణుఁడు, బాణమును మేటిధనువున సంధించి యాకర్ణాంతములాగుచుఁ దనకుఁ గార్యసాధకంబగు వాక్యమున 'బాణమా! దశరథరాజకుమారుఁడు రాముఁడు, ధర్మాత్ముఁడును సత్యసంధుఁడును, పౌరుషంబున నెదురులేనివాఁడును నగునేని, నీ వీయింద్రజితుని వధింపుము' అనెను. యుద్ధమున వీరుఁడును, శత్రువీరసంహారుఁడును, లక్ష్మీసంపన్నుఁడునగు లక్ష్మణుఁ డిట్లా బాణమునుగూర్చి చెప్పి, సూటిదప్పక నాటెడియాబాణమును ఆకర్ణాంతములాగి, యైంద్రాస్త్రమంత్రముతో నభిమంత్రించి యింద్రజితునిమీఁదం బ్రయోగించెను. అమ్మహాబాణము, బొమిడికముందొడిగి, సిరిదళుకొత్తుచు కుండలములు తలతలమెఱయుచున్న యింద్రజితునిశిరంబును ఖండించి, యతనిదేహమునుండి నేలంబడద్రోసినదయ్యె. బంగారుచాయం బొలుపారుచున్న యింద్రజితుని పెనుశిరస్సు మొండెమువీడి నెత్తుటం దోఁగుచు భూమిపయిం గానంబడెను. రావణకుమారుం డింద్రజిత్తు, కవచముతోడను శిరస్త్రాణముతోడను ధనుస్సుతోడను విధ్వంసమునొంది హతుఁడై వేగ నేలం ద్రెళ్లెను. అప్పుడు, విభీషణుఁడును, వానరులందఱును ఆయింద్రజితుఁడు హతుఁడుకాఁగానే వృత్రాసురుఁడు హతుఁడయినపుడు దేవతలుంబోలె, నుబ్బున నందఱును నార్పులుచెలంగించిరి. అంత నాకాశమున దేవతలును మహాత్ములగుఋషులును గంధర్వులును అప్సరసలును సంతోషమున నలుగడల ధ్వనిగావించిరి. ఆయింద్రజిత్తు కూలుటం దెలిసి జయశీలురగువానరులు పట్టి నుఱుమాడఁగా, రాక్షసుల యమ్మహాసేన యోఁగంజాలక దిక్కులకుం బాఱిపోయెను. వానరులు పట్టి తఱుముచు వధించుచుండఁగా, నారాక్షసులు సహింపలేక సంజ్ఞదప్పి యాయుధములువదలి లంకాభిముఖముగా పరుగెత్తిపోయిరి. రాక్షసులందఱును భయమునొంది, పట్టిసములను ఖడ్గములు పరశ్వధములు మున్నగునాయుధములు దిగవిడిచి, పలుదెఱఁగుల విచ్చి, వందలువందలుగా దిక్కులకుఁ బాఱిపోయిరి. అట్లు వానరులచే పీడితులై దిగులుగొని కొందఱు రాక్షసులు లంకనుజొచ్చిరి. కొందఱు సముద్రమునం బడిరి. మఱికొందఱు కొండల దాఁగిరి. ఇంద్రజితుఁడు హతుఁడై యుద్ధభూమిని బడియుండుటను జూడఁగానే వేలకొలఁది నుండినరాక్షసులలో నొక్కఁడయినను కనుపట్టఁడయ్యె. అందఱును బాఱిపోయిరి. సూర్యుఁ డస్తమించినవెనుక కిరణములునిలువక పోవుదెంచునట్లు, అయ్యిం

ద్రజిత్తు హతుఁడుకాఁగానే రాక్షసులందఱును నలుదిక్కులకుం బాఱిపోయిరి. మహాతేజుఁడగు నయ్యింద్రజిత్తు కొంతసేపు అవయవములు విదుల్చుచుండి యంత ప్రాణము వెడలినవాఁడై, కిరణములులేని సూర్యునివలెను చల్లాఱినయగ్నివలెను తేజము దూలినవాఁడయ్యెను. రాక్షసరాజకుమారుఁ డింద్రజితుఁడు కూలినంతనే లోకమునందు వెక్కులుపీడలన్నియు నడఁగె. అరిష్టములన్నియు నశించె. *సూర్యుఁడు చక్కఁగా నెండగాయుచుండెను. పాపకర్ముఁడగునాయింద్రజితుఁడు హతుఁడుకాఁగానే భగవంతుఁడగు దేవేంద్రుఁడును సమస్తదేవతోత్తములును హర్షమునొందిరి. ఆకాశమునందు దేవదుందుభులధ్వనియు వినంబడెను. మఱి యప్సరసలనర్తనములును మహాత్ములగు గంధర్వులగానముల ధ్వనియుఁ జెలంగెను. క్రూరకర్ముఁడగు రాక్షసుఁ డయ్యింద్రజితుఁడు హతుఁడుకాఁగానే దేవతలు పుష్పవర్షములుగురిసి లక్ష్మణునిఁ బ్రశంసించిరి. అది యపు డద్భుతమైయుండెను. అప్పుడు జలములును తేటవడియె. దిక్కులును దెలివినొందెను. దైత్యులును దానవులును గగురునొందిరి. సమస్తలోకములకును భయము గలిగించుచుండినయీయింద్రజిత్తు హతుఁడుకాఁగానే దేవతలు గంధర్వులు దానవులునువచ్చి యందఱును జేరి, 'ఇఁక బ్రాహ్మణులు తుందుడుకుమాలి కలంక లడఁగి, సుఖముగా విహరింతురుగాక' యనిరి. అంత వానరయూథపతులు అసమానబలుఁడగు నారాక్షసపుంగవుఁడు యుద్ధమున హతుఁడగుటంజూచి మిక్కిలి హర్షమునొంది లక్ష్మణునిం గొనియాడిరి. విభీషణుఁడును, హనుమంతుఁడును, భల్లూకయూథపతియగు జాంబవంతుఁడును, జయము గలిగినందులకు మిక్కిలి సంతసిల్లుచు లక్ష్మణుని స్తుతులుచేసిరి. వానరులు తమకోర్కి యీడేఱుటం జేసి, సంతోషమున సింహనాదములు సేయుచు పలువిధముల నార్పులు సెలఁగించుచు గర్జించుచు, లక్ష్మణునిఁ బరివేష్టించి కొలిచియుండిరి. అప్పుడు వానరు లుబ్బుపట్టఁజాలక తోఁకలం గొట్టుచు భుజములప్పళించుచు 'లక్ష్మణుఁడు సర్వోత్కర్షమునను న్నాఁడు' అని యందఱు వినం జాటిరి. వానరులు మనమునసంతసముప్పొంగ నొండొరువుల కవుంగిలించుకొని లక్ష్మణునిగుఱించి పలువిధములుగా ముచ్చటలాడుకొనుచుండిరి. దేవతలు ఇంద్రజిత్తు హతుఁడయ్యెనని చారణాదులమూలమున మొదట విని, మిక్కిలియు మనంబున హర్షమునొందుచు పిదప నింద్రజిద్వధ మశక్యముగాన యది యబద్ధముగా నుండునో యని తలంచి ఆయుద్ధభూమికిఁ జక్కఁబోయి సర్వప్రియసుహృదుండగు లక్ష్మణుఁడు మిక్కిలియు దుష్కరమును సర్వలోకములకును బ్రాణప్రతిష్ఠాకరమునగు నింద్రజిద్వధమును గావించెనని ప్రత్యక్షముగా నెఱిఁగి విస్మయమునొందినవారయిరి.
ఇది తొంబదియొకండవ సర్గము.

---

* పూర్వము భయముచేత సూర్యుఁడు చక్కఁగా నెండగాయఁడయ్యెనని తెలియునది.

లక్ష్మణుఁడు విభీషణాదులతో రామునియొద్దకుఁబోయి, యతని కింద్రజిద్వధమును దెలుపుట; రాముఁడు లక్ష్మణుం గౌఁగిలించి తక్కినవారిని శ్లాఘించుట; సుషేణుఁడు రామనియోగమున లక్ష్మణాదులను విశల్యులం జేయుట.

శుభలక్షణలక్షితుఁడై యవయవములెల్ల నెత్తుటం బడిసియున్న లక్ష్మణుఁడు, యుద్ధమున నింద్రునిజయించినట్టి యింద్రజితుని వధించి హర్షమునొందినవాఁడయ్యె. అంత వీర్యవంతుఁడును మహాతేజుండునగు లక్ష్మణుఁడు, జాంబవంతునిని హనుమంతుని మఱియు నయ్యెవానరులనందఱను గుంపుగాఁ బిలుచుకొని యుద్ధపారవశ్యమున విభీషణహనుమంతుల నూనుకొని యుద్ధభూమినుండి రామసుగ్రీవు లున్నయెడకు శీఘ్రముగాఁ బోయెను. అంత లక్ష్మణుఁడు రామునకుఁ బ్రదక్షిణముచేసి నమస్కరించి యింద్రునియొద్ద బృహస్పతియుండునట్లు, పారతంత్ర్యము నెఱపుచు నన్నసమీపమున నిలుచుండెను. అప్పుడు వీరుండగు లక్ష్మణుఁడు రామునియొద్దకువచ్చి భక్తిసంకోచాదుల వలన నవ్యక్తాక్షరము లగుపలుకుల నమ్మహాత్మునకు ఘోరంబగు నింద్రజిద్వధమును జెప్పెను. అప్పుడు విభీషణుఁడు సంతుష్టుఁడై రామునితో '*ఇంద్రజిత్తు వధింపఁబడెను గాని వానిశిరస్సుమాత్రము మహాత్ముఁడగు లక్ష్మణుఁడు ఛేదించెను'అని విన్నవించెను. మహావీర్యుండగు రాముఁడు లక్ష్మణుఁ డింద్రజితుని వధించెనన్న యీమాటను విన్నంతనే యెనలేని సంతోషమునొంది లక్ష్మణునితో 'లక్ష్మణా! బాగుబాగు. నీవుచేసిన యుద్ధకృత్యమునకు సంతుష్టుఁడనయితిని. గొప్పకర్జమును జేసి తీర్చితివి. ఏలనఁగా నింద్రజితుఁడు నశించుటచే మనమింక రావణునింగూడఁ జంపి జయమును బొందితిమైనట్లే యని నిశ్చయింపుము' అనెను. వీర్యవంతుఁడగు రాముఁడు లక్ష్మీవర్ధనుండగు లక్ష్మణుని శిరంబుమూర్కొని యతఁడు సిగ్గుపడుచు నొదుఁగుటంజూచి నెయ్యమున బలవంతముగాఁ దొడపయిఁ గూర్చుండఁబెట్టుకొనుటకు లాగి, యొడిపయిఁ గూర్చుండఁబెట్టుకొని బిగ్గఁగౌఁగిలించుకొని తమ్ముని నెయ్యము పొంగారుచూడ్కుల మాటిమాటికిఁ జూచెను. అప్పుడు పురుషలలాముఁడగు రాముఁడు, అట్లు లక్ష్మణుఁడు శల్యపీడితుఁడై దేహమంతయు గండ్లుపడి,నిట్టూర్పులు నిగిడించుచుండుటనుజూచి, దుఃఖంబునఁ బొక్కుచు తానును మిక్కిలియు నిట్టూర్పులువిడుచుచు, తమ్ముని శిరసు మూర్కొని యాగాయముల బాధను బోఁగొట్టుటకై వేగిరపడుచు నతనిమేనెల్లఁ జక్కఁగాఁదడవి యాశ్వాసించి యతనితో 'ఇతరులకు దుష్కరములయిన కార్యములనుగూడఁ జేయువాఁడవు. కావున నీ విట్టి యశక్యమైన వీరకృత్యముచేసి నాకు మిక్కిలియు మంగళము గావించితివి. పుత్త్రుఁడు హతుఁడయ్యెఁగాన యిపుడు రావణుఁడును యుద్ధమున హతుఁడయి

* లక్ష్మణుఁడు రామసన్నిధియందు సంకోచముచే తానే యింద్రజిత్తును వధించుటను జెప్పక మొత్తమున కింద్రజిత్తు హతుఁడయ్యెనని చెప్పెననియు విభీషణుఁ డది తెలిసి స్పష్టముగా లక్ష్మణుఁడే యింద్రజిత్తును వధించుటను జెప్పెననియుఁ దెలియునది.

నల్లె తలఁచెదను. ఇంతవఱ కెందఱమహావీరులను జంపినను గెలుపుగలిగినట్లు తోఁప లేదు. దురాత్ముఁడగు మనశత్రు వాయిందజిత్తు హతుఁడయ్యెఁగాన యిపుడే నేను గెలుపుగొన్నవాఁడను. వీరా ! నీవు యుద్ధంబున నింద్రజితునిఁ జంపుటచే, క్రూరుఁడగు రావణుని కుడిబుజమును నాభాగ్యమున ఛేదించినట్లేయగును. ఏలనఁగా వాఁడే యీరావణునకు మంచియూఁతచుమీ. విభీషణుఁడును హనుమంతుఁడును యుద్ధమున గొప్పపరాక్రమకృత్యములు గావించినారు. ఇట్లు మూఁడహోరాత్రములకు మహాప్రయాసమున వీరుఁడగు నింద్రజిత్తు కూల్పఁబడినవాఁడయ్యె. ఇప్పుడు నాకు శత్రువులందఱు తీఱినట్లు గావించితివి. రావణుఁడొక్కఁడున్నాఁడుగాని వాఁడును కొడుకు పడుటనువిని గొప్పసైన్యమును బన్నికొని యుద్ధమునకు వెడలిరానే రాఁగలఁడు చుమీ. పుత్రుఁడు హతుఁడగుటకుఁ బరితపించుచు దుర్జయుఁడగు నారాక్షసరాజు రావణుఁడు యుద్ధమునకు వెడలిరాఁగానే, పెనుసైన్యముతో వానిం బొదివి వధించి పుచ్చెదను. లక్ష్మణా ! నాథుఁడవగు (యాచమానుఁడవగు) నీవు యుద్ధమున నింద్రజిత్తును వధించుటవలన నిఁక నాకు సీతను భూమినిని బొందుట యెంతమాత్రము కష్టముగాదు' అనెను. రఘువంశ్యుఁ డారాముఁడు తమ్ముని నట్లాశ్వాసించి యాలింగనము చేసికొని సంతుష్టుఁడై సుషేణుంబిలిచి 'నీవు చికిత్సయందు మిక్కిలియు ప్రాజ్ఞుండవు. మిత్రులయందు మిక్కిలి వాత్సల్యము గలయీలక్ష్మణుఁడు దేహమంతయు నలుఁగులు గ్రుచ్చుకొని బాధపడుచున్నాఁడు. ఈతఁడీబాధ యుడిగి సుఖముగా నుండునట్లు నీవు చికిత్సగావింపుము. శీఘ్రముగా లక్ష్మణునకును విభీషణునకును మేనియందలి శల్యములు విడఁ దీయుము. శూరులై వృక్షములుగొని పోరాడు భల్లూకవానరసైనికులలోపల మఱియు నెవరెవరు యుద్ధంబున నమ్ములు గ్రుచ్చుకొని గండ్లుపడియున్నారో వారికందఱకును శీఘ్రంబున నీవిపుడు ప్రయత్నపడి సుఖముం గూర్పుము' అనెను. రాముఁడిట్లు చెప్పఁగానే మహాత్ముఁడగు వానరయూథపతి సుషేణుఁడు లక్ష్మణునకు ముక్కున నొకగొప్పయోషధినిడి వాసన చూపెను. ఆలక్ష్మణుఁడు ఆమూలికను వాసనచూచినంత నతని మేనం గ్రుచ్చుకొన్న యలుఁగులు వీడి వేదనయు మాని గాయములు పూడియుం బోయినవయ్యె. అంత సుషేణుఁడు రామునాజ్ఞ చొప్పున విభీషణుఁడు మొదలైన సుహృదులకును సమస్తవానరముఖ్యులకును నపుడు చికిత్సగావించెను. అంతనపుడు లక్ష్మణుఁడు క్షణములోపల శల్యములు విడఁదీయఁబడి, బాధయుడిగి, తుందుడుకును మాని, యెప్పటియట్ల సంతోషముతో నుండెను. అప్పుడు రాముఁడును వానరరాజగు సుగ్రీవుఁడును విభీషణుఁడును, భల్లూకపతియగు జాంబవంతుఁడును, దక్కినసైనికులందఱును లక్ష్మణుఁడు తెవులుమాని సంతోషముతో లేచుటం జూచి చాలసేపు సంతోషమున నోలలాడుచుండిరి. మహాత్ముఁడగు రాముఁడు, లక్ష్మణుఁడు దుష్కరమయిన యింద్రజిద్వధమును గావించినందులకు నెంతయు

నతనిం బూజించెను. వానరయూథపతులును యుద్ధమున నింద్రజిత్తు కూల్పఁబడుటను విని సంతోషము నొందినవారయిరి. ఇది తొంబది రెండవ సర్గము.

రావణుఁ డింద్రజిత్తు హతుండగుట విని విలపించుట;
సీతను బీడింపఁ బూనిన రావణుని సుపార్శ్వుఁ
డనుమంత్రి వారించుట.

అంత రావణునిగృహంబుననుండి యాతనికి దోడుగానుండిన రావణుని సచివులు, ఇంద్రజిత్తు హతుఁడయ్యెనని తామె చక్కఁదెలిసికొని దుఃఖితులగుచుఁ బోయి రావణునకుం జెప్పువారై 'మహారాజా! మహాతేజుండగు నీతనూజుని నింద్రజిత్తును యుద్ధమున మేమందఱమును జూచుచుండఁగా, లక్ష్మణుఁడు విభీషణునితోడ్పాటున వధించినాఁడు. యుద్ధంబున నపజయమె యెఱుంగనిశూరుఁ డింద్రజిత్తుగూడ నట్టిశూరుఁడగు లక్ష్మణునితోఁ దలపడి హతుఁడయ్యెను. దేవేంద్రునింగూడ జయించినట్టి శూరుఁడగు నీపుత్త్రుఁడు బాణములచే లక్ష్మణునిఁ దపింపఁజేసి యుద్ధంబున హతులగు వీరులు పొందునట్టి యుత్తమలోకములను బొందినవాఁడయ్యె' ననిరి. ఆరావణుఁడు యుద్ధంబునఁ దనపుత్త్రుఁ డింద్రజితుఁడు హతుఁడయ్యెనని యత్యంతభయంకరమై మిక్కిలియు జాలిఁబుట్టించుచు వేంద్రమయి యున్నవార్తను విన్నంతనే యెంతయు పెనుమూర్ఛ పైకొన్నవాఁడయ్యె. రాక్షసపుంగవుఁడును రాక్షసరాజు నగునారావణుఁడు చాలసేపటికిఁ దెలివొంది, పుత్త్రశోకమునఁ బీడితుఁడై దీనుఁడై యింద్రియములు కళవళింప 'హా! రాక్షససేనాముఖ్యా! నాచిన్నారికొడుకా! మహారథా! నీవు దేవేంద్రునిఁగూడ జయించి తుదకు మనుష్యుఁడగులక్ష్మణునిబారి కెట్లు చిక్కితివి! నాయనా! నీవు క్రుద్ధుఁడవయినచో, * కాలునిని, అంతకునిని, మందరపర్వతపు శిఖరములనేనియును భేదింతువే! ఇఁక యుద్ధంబున లక్ష్మణుని భేదించుట చెప్పవలయునా? మహాబాహూ! నీ విపుడు మరణమునొంది యమునితోఁ జేరితివిగావున ఆయముఁడు నాకిప్పుడు మిక్కిలియుఁ గావలసినవాఁడయ్యెను. ఇట్లు యుద్ధమున మృతినొందుట గొప్పశూరులకును నవలంబించుపద్ధతి. మనుష్యులకేకాదు; సమస్తదేవతా సమూహములకును నిదియే మార్గము. కాన యుద్ధమున హతినొందుట శూరులందఱును గోరునదియు యశస్కరమైనదియుం గాన నీవిట్లు హతుఁడవయితివని నాకుశోకము లేదు. ఇంతేకాదు. ఎవఁడు తనయొడయనికార్యమునకై హతుఁడగునో వాఁడు స్వర్గము నొందఁగలఁడు. కాన స్వామికార్యార్థమై హతుఁడవై స్వర్గము గొంటివి గావునను నిన్నుగుఱించి శోకింప నక్కఱ లేదు. ఇఁక నిపుడు సమస్తదేవతలును దిక్పాలురును ఋషులును ఇంద్రజిత్తు హతుఁడయ్యెనని విని నిర్భయులై సుఖముగా నిదుర వోవఁగలరు. ఇప్పుడు మూఁడులోకములును అరణ్యసహితమైన

* కాలుఁడు అంతకుఁడనుట యముని మూర్తిభేదములని తెలియునది.

సమస్తభూమండలమును, ఒకయింద్రజిత్తు లేనందున నాకు శూన్యములుగాఁ దోఁచుచున్నవి. ఇఁక, నింద్రజిద్వధమునకు దుఃఖితులై యంతఃపురమున రోదనము సేయు రాక్షసకన్యల యార్తధ్వనులు, పర్వతగుహాలందు యూథపతివధమునకు దుఃఖించు నాఁడుగజముల యార్తధ్వనియుంబోలె వినఁగలను. పరంతపా! నీవు యౌవరాజ్యమును లంకను రాక్షసులను తల్లిని నన్నును భార్యను నిట్లు మమ్మందఱను దిగవిడిచి యెచటికిఁ బోయితివి? వీరా! నేను యమపురికిఁ బోయిన నీవుగదా నాకుఁ బ్రేతకార్యములు సేయవలసినవాఁడవు. అట్లుగాక విపరీతముగా నీకు నేను జేయునట్లు చేసితివే! ఇదివఱకు నామనస్సు కంటకములన్నియుఁ బుచ్చుచుండినట్టినీవు, ఇప్పుడు, సుగ్రీవుఁడును రాముఁడును లక్ష్మణుఁడును నాకు మనశ్శల్యములై బ్రతికియుండఁగా ఆశల్యమును దీయకయే మమ్మెల్ల దిగనాడి యెచటికిఁ బోయితివి!' యనివిలపించెను. రాక్షసరాజు రావణుఁ డీవిధమున విలపించుచు నార్తుఁడై పుత్త్రమరణ వ్యసనమునం జేసి మిక్కిలియు కోపావేశము నొందినవాఁడయ్యెను. స్వభావముననే వాఁడికిరణములు గలసూర్యుని, వేసవికాలమున, కిరణములు మఱింత వేండ్రమైనవానింగాఁ జేయునట్లు, స్వభావముచేతనే కోపనుం డగురావణుని పుత్త్రవిషయమైన శోకములు మఱియుఁ గుపితునిగాఁ జేసినవి. అప్పుడు రావణుని పదిమొగములందును బన్నినబొమముళ్లు ప్రలయకాలమునందు సముద్రమున నక్రములతోఁ గూడిన గొప్పకరుళ్లవలెఁ బ్రకాశించినవి. రావణుఁడు కోపమున నావులింపఁగా, అతనినోటనుండి, పూర్వము వృత్రాసురుని ముఖమునుండి వెడలినట్లు, ప్రకాశముతో జ్వాలించుచు పొగతోఁగూడిన యగ్ని వెలువడెను. పుత్త్రవధముచేఁ బురపురంబొక్కుచున్న శూరుం డా రావణుఁడు, క్రోధము బొరిం జిక్కి బుద్ధిచే కర్తవ్యకార్యమేది యని యాలోచించి సీతను వధింప నిశ్చయించినవాఁడయ్యె. స్వభావముచేతనే యెఱ్ఱనగు రావణునికన్నులు, అప్పుడు క్రోధాగ్నిచే మఱియు నెఱ్ఱనై మిక్కిలియు భయంకరములుగా జ్వలించిన వయ్యెను. స్వభావముచేతనే భయంకరమగు నతనియాకారము, అప్పుడు కోపాగ్నిపర్వుటం జేసి మఱియు భయంకరమై, క్రుద్ధుఁడగు రుద్రుని రూపమువలెఁ దారసింపరానిదై, యుండెను. క్రుద్ధుఁడైన యతనికన్నులనుండి, మండుచున్న దీపములనుండి మంటతో నూనెబొట్లుపడునట్లు, నిప్పుకలతోఁగూడఁ గన్నీటిబొట్లు పడినవి. అతఁడు పండ్లుకొఱుకునపుడు, ఆ పెటపెటధ్వని, బలవంతులగు రాక్షసులు పెద్దగానుగుయంత్రముఁ ద్రిప్పుచుండఁగాఁ బుట్టుచప్పుడువలె బెట్టిదముగా వినంబడుచుండెను. మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై ప్రలయకాలాగ్నివలెఁ జూపట్టుచు నతం డేయేదిక్కు చూచునో, ఆయాదిక్కునఁ గలరాక్షసులు బెదరుగిదిరి యతని యెదుటఁబడక స్తంభాదులమాటున మఱఁగియుండిరి. అట్లు కుపితుఁడై ప్రలయకాలమందు చరాచరముల సంహరింపఁగోరుచున్న యంతకునిభంగి భయంకరాకారుఁడై యన్నివైపులం జూడ్కులు నిగుడ్చుచున్న యారావణునిపొంతకు రాక్ష

సులు భయమునఁ బోవరయిరి. అంత రాక్షసాధిపతియగు రావణుఁడు మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై, యుద్ధభీతులయిన రాక్షసులను యుద్ధమునకు దృఢముగాఁ బురికొలుపుటకై వారలనడుమ 'నేను వేలకొలఁది సంవత్సరములు దుష్కరమయిన తపముగావించి యెడనెడ తపస్సమాప్తికాలములందుఁ బెక్కుమార్లు బ్రహ్మదేవుని సంతోషపఱచితిని. ఆతపస్సువెంపునలనను మఱియు బ్రహ్మదేవుని యనుగ్రహము వలనను నాకెప్పుడుగాని దేవతలవలనను అసురులవలనను భయ మెంతమాత్రము లేదు. ఏలనఁగా, నాకు బ్రహ్మవలన దత్తమై సూర్యునివలె ధగధగ మెఱయుచుండు కవచము దేవాసురులతో యుద్ధము సేయునపుడును వజ్రాయుధము శక్తులన్నియు నెఱపినను, భిన్నముగాదయ్యె. ఇప్పుడు నే నాకవచమునుదాల్చి రథము నెక్కి యుద్ధమునకుఁ బోఁగా నిట యుద్ధమున నన్నెవఁ డెదుర్పఁగలఁడు? సాక్షాద్దేవేంద్రుఁడు గూడ యుద్ధమున న న్నెదుర్పఁజాలఁడు. నున్ను దేవాసురులతో యుద్ధము సేయునపుడు, బ్రహ్మదేవుఁడు ప్రసన్నుఁడై నాకు బాణసహితమగు గొప్పధనువు నొసంగెనే! *ఇప్పుడు రామలక్ష్మణులనుమహాయుద్ధమున వధించుకొఱకు బెడిదమైన యాధనువును, వందలకొలఁది వాద్యములధ్వనులు బోరుకొనుచుండ నెత్తితెండు' అనెను. శూరుఁడారావణుఁడు పుత్త్రవధమున మిక్కిలియుఁ దప్తుఁడై క్రోధము బారింజిక్కి, బుద్ధినాలోచించి †సీతను జంపవలయునని యుద్యుక్తుఁడయ్యెను. కోపమున కన్నులెఱ్ఱఁబాఱ, మిక్కిలియు ఘోరమగు ప్రకృతియు నతిభయంకరాకారమును గలయారావణుఁడు దీనుఁడై తనయెదుట దీనస్వరులై యున్న రాక్షసులనెల్లంజూచి 'నాచిన్నికొడు కింద్రజిత్తు వానరులను వంచించుకొఱకు మాయచేత దేనినో యొకదానిని సీతగా రచించి చంపి యాపొల్లుదానినే 'ఇదియే సీత' యని వానరులకుఁ జూపినాఁడు. ‡వాఁడు పొల్లుగాఁజేసినది నేను నిజముగానే చేసెదను. ఇట్లు సేయుటయే నామది కిష్టము. ఆచెడిపోయిన రాచవానినే యనుసరించి తగిలియున్న సీతను నిపుడే చంపి పుచ్చెదను'

---

* ఇట 'రామలక్ష్మణయోరేవ వధాయ పరమాహవే' అని మూలము. వాస్తవార్థమున (రామలక్ష్మణయోః పరమాహవే) రామలక్ష్మణులయొక్క యుద్ధమందు, (వధాయ) వానరులను వధించుకొఱకు, అవింటిని నెత్తితెండని యర్థము. 'వందలకొలఁది వాద్యధ్వనులతో నెత్తితెండు' అనుటచే నింతకు ముందు దానిని నెత్తి తేలేదనియు నిదియె క్రొత్తగాఁ దెచ్చుటయనియు తోఁచుచున్నది

† 'సీతాం హన్తుం వ్యవస్యత' అనిమూలము. (సీతాం) సీతను, (హన్తుం) పొందుటకు, ఆమెను సందర్శించుట కనుట, నిశ్చయించెనని వాస్తవార్థము.

‡ ఇందులకు 'తదిదం తథ్య మేవాహం కరిష్యే ప్రియమాత్మనః। వైదేహీం నాశయిష్యామి క్షత్రబంధుమనువ్రతామ్' అనిమూలము. వాస్తవార్థము.-(అహం) నేను, (క్షత్రబంధుం) క్షత్రియులకు పరమాప్తుఁడైనరాముని, (అనువ్రతాం) అనుసరించినదగు, (వైదేహీం) సీతను, (తథ్యం) నిజముగా, (నాశయిష్యామి యది) నాశము సేయుదు నేని, (తదిదం) ఆసీతావధము, (ఆత్మన అప్రియ ఏవస్యాత్) నాకు అప్రియమెయగును. కాన (కరిష్యే) (ఇతరరాక్షసుల సంతోషము సకుఁగాను ఁబిడకు కొంచెము

అనెను. రావణుఁ డిట్లు సచివులకుఁ జెప్పి శీఘ్రమున ఖడ్గము సంకించెను. ఆరావణుఁడు పుత్రశోకమున మనస్సు మిక్కిలి తత్తఱిల్లఁగా నెంతయుఁ గ్రుద్ధుఁడై పుష్పమాలికా యుక్తమై, నిర్మలమైన యాకాశమువలె వెలయుచున్న ఖడ్గము నెత్తికొని, భార్యలును సచివులును బలసి తోడరాఁగా వేగమున సీతయున్నయెడకుఁ దోడనేపోయెను. రాక్షసులు, రావణుఁడు పోవుచుండుటం జూచి సింహనాదములు గావించి యతఁడు మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై యుండుటనుగాంచి యింకఁ దమకు గెలుపుగలుగునని సంబరమున నొండొరువులం గవుంగిలించుకొని యొకరితోనొకరు 'ఇప్పుడు ఆయన్నదమ్ములు రామలక్ష్మణు లిరువురును, రావణుని యిట్టి భయంకరాకారమును జూచి దిగులుపడఁగలరు మున్నితఁడు క్రుద్ధుఁడై లోకపాలురను నలువురను జయించినాఁడుగాఁడా! మఱియు ననేకయుద్ధముల నితరశత్రువులంగూడఁ బెక్కండ్రను గూల్చినవాఁడుగదా! రామలక్ష్మణు లితని కెంతమాత్రము. మఱియు రావణుఁడు ముల్లోకములందును శ్రేష్ఠములగు వస్తువులం గొనితెచ్చి యనుభవించుచున్నాఁడు. పరాక్రమమునం గాని బలమునంగాని యీతనికి సాటియైనవాఁడు భూలోకంబుననే లేఁడు' అని గుజగుజలు వోయిరి. ఆ రాక్షసు లట్లొండొరులతో గుజగుజ లాడుచుండఁగానే రావణుఁడు కోపావేశమున మైమఱచి యశోకవనము నున్న సీతంగూర్చి వేగంబోయెను. అట్లు మిక్కిలియుఁ గ్రుద్ధుఁడగు రావణుఁడు తనహితము గోరునట్టి సుహృదులు వలదని యెంతవారించినను నిలువక, ఆకాశమున నంగారకుఁడు క్రుద్ధుఁడై రోహిణిమీఁదికిఁ బోవునట్లు, సీతంగూర్చిపోయెను. రాక్షసస్త్రీలు కావలి కాఁచుచుండఁగా నేకందును లేకున్న మిథిలరాజనందన సీతయు క్రుద్ధుఁడై మేటిఖడ్గమునుగొని రావణుఁడు వచ్చుచుండుటను జూచెను. జనకరాజసుత సీత, అట్లు ఖడ్గధరుఁడై స్నేహితులువలదని పలువిధముల వారించుచున్నను, నిలువక తనమీఁదికి వచ్చుచున్న రావణునిం జూచి దిగులుపడి దుఃఖావేశంబున విలపించుచు 'దుర్బుద్ధియగు నీరావణుఁడు క్రుద్ధుఁడై నామీఁదికిఁ బరుగెత్తివచ్చుచున్నాఁడు. కావున వీఁడు సనాథనగు నన్ను అనాథనుంబోలె వధింపనున్నాడు. వీఁడు పెనిమిటినే యనువర్తించు నన్ను 'నాకు భార్యవుగమ్ము; నాతో రమింపుము' అని యనేకవిధములఁ బ్రేరించినాఁడు. కాని నే నొల్లనని పరిష్కారముగా వీనిని నిరాకరించివైచితిని. నే నంగీకరింపనందున వీఁడు నిరాశనొంది, కోపమును మోహమును మిక్కిలియుం బయికొనఁగా నన్ను వధించుటకు నుద్యుక్తుఁడయి వచ్చినాఁడు. ఇది స్పష్టము. లేక వీఁ డీకత్తితో వచ్చుటను జూడఁగా పురుషసింహులయిన యాయన్నదమ్ములను రామలక్ష్మణులను నానిమిత్తమై యీయపూజ్యుఁ డిపుడు యుద్ధమున నీకత్తిచేఁగూల్చి యిటువచ్చినాఁడేమో! అయ్యో! నానిమిత్తమె యారాజకుమా

దుఃఖమును) చేసెదనని యర్థము. నేను క్షత్రియులకుఁ బరమాప్తుండగు రామునిననుసరించియుండు సీతను యథార్థముగా నే వధింతు నేని అది నాకు మిక్కిలి యప్రియమే. అయినను రాక్షసులసంతోషమునకై యామెకు కొంతదుఃఖము కలిగించెదనని భావము.

రులకు నిట్లు నాశముగలిగెనే! ఇట్టి పాపాత్మురాలనా! ఇస్సీ! పాడై పోదునుగాక. లేక యతిక్రూరుఁడై పాపములు సేయుటయందు వెనుదీయకుండు రావణుఁడు పుత్రశోకమునం జిక్కియుండుటచే రామలక్ష్మణులను వధింపఁజాలక వారికి బదులుగా నన్ను వధింపనున్నాఁడో! ఆలోచనమాలినదాననుగాన నేను హనుమంతుఁడపుడు చెప్పిన మాటనయినను వినకపోయితిని. ఏనిందయును బొందని నేను, అప్పుడు హనుమంతుని వీఁపుపయిని గూర్చుండి పోయియుండునేని ప్రియునియొడిఁ జేరియుందును గాన యిప్పుడిట్లు దుఃఖపడకుందునే! రామలక్ష్మణులు నిజముగా వీనిచే వధింపఁబడినవారేని, కానక కానక యొక్కకొడుకుంగన్న కౌసల్య, ఆయొక్కకొడుకును యుద్ధమున హతుఁడయ్యెనని వినఁగానే యామెగుండియ తప్పక వ్రీలునని తలఁచెదను. ఆకౌసల్య, మహాత్ముఁడగు రాముని పుట్టినముద్దును, పసితనమునఁ బెరిఁగినగోమును, యౌవనమున మెలఁగిన చెలువమును, ధర్మకార్యముల కనురూపమైనస్వభావమును రూపును తలఁచితలఁచి యేడువంగలదు. ఆయమ, పుత్రుఁడు నిహతుఁడగుటఁ దెలిసి మూర్ఛిలి యంత నతనికి శ్రాద్ధముసేసి ప్రపంచమునం దాశవదలి అగ్నియందైన నుఱుకును; లేక నీళ్లనైనం జొచ్చును. ఇది నిజము. ఇస్సీ! ఆకుబ్జ మంథర పాడై పోవుఁగాక. పాపములకు వెనుదీయక యొడిగట్టుకొనియెయుండు నాదుష్టురాలివలననే కౌసల్య కిట్టి దుఃఖము సంభవించినది. అది పాడై పోవుఁగాక' యని విలపించెను. ఇవ్విధమున విలపించుచు, చంద్రునింబాసి యంగారకగ్రహముబారిం జిక్కియున్నరోహిణియుంబోలె మిక్కిలియు జాలిగొలుపుచున్న సీతనుజూచి, యింతలో రావణునిమంత్రియు బుద్ధిమంతుఁడును బరిశుద్ధుఁడును మేధావియునగు సుపార్శ్వుఁడను రాక్షసుఁడు సచివులువలదని వారించుచుండఁగా నిలువకపోవుచున్న రాక్షసేశ్వరుని రావణునింజూచి' రావణా! నీవు సాక్షాత్కుబేరుని తమ్ముఁడవు. మహాకులప్రసూతుఁడవు. ఇట్టి నీవు ధర్మమును దిగఁద్రోచి కేవలక్రోధమునకు లోనై సీత నెట్లు వధింపఁగోరెదవు? వీరా! రాక్షసేశ్వరా! వేదముల నధ్యయనముచేసి విద్యలనెల్లఁ జదివి, వ్రతస్నాతుఁడవైనవాఁడవు. ఎప్పుడును విహితకర్మములఁ దప్పక యాచరించువాఁడవు. అట్టి నీకు స్త్రీని వధింపఁ దలంపుగాని యెట్లు గలిగినది? రాజా! సీతయో మిక్కిలి రూపవతి. ఇట్టి చెలువను జంపక యే దక్కించుకొనువిధముం జూడుము. ఈకోపమును నీవును మమ్ముం గూడిపోయి రామునం దేచూపుము. * నీవు నేఁడు కృష్ణపక్షచతుర్దశియందే యుద్ధమునకుఁ బ్రయాణసన్నాహము సేసి, రేఁపమావాస్యయందు సమస్తబలపరివృతుఁడవై

---

* ఇట 'అభ్యుత్థానంత్వమద్యైవ కృష్ణపక్షచతుర్దశీం। కృత్వా నిర్యాహ్యమావాస్యాం విజయాయబలైర్వృతః' అనిమూలము. చతుర్దశియందు ప్రయాణసన్నాహమును జేయుమనుటచే త్రయోదశీ యుద్ధదినములు గడచినవని తేలుచున్నది. ఎట్లనఁగా- సువేలాద్రి నెక్కినరాత్రి 'తతోఽస్తమగమత్తత్ర సూర్య స్సన్ధ్యయాప్రతిరఞ్జితః। పూర్ణచన్ద్రప్రదీపాచ క్షపాసమభివర్తత' అనుటంబట్టి పున్నమనాఁడు సువేలాప్రవేశము. పిమ్మట కృష్ణపక్షపాడ్యమిని యుద్ధారంభము. నాఁటిరాత్రియె నాగపా

జయమునొందుటకు బయలువెడలుము. నీవు శూరుఁడవు, బుద్ధిమంతుఁడవు, మహారథుఁడవు, నానాఖడ్గాద్యాయుధములంగొని యుద్ధమునకు రథమునెక్కి † దశరథకుమారుని రాముని వధించి సీతాదేవిని బొందఁగలవు ఇట్లుగాక యూరక సీతను జపినఁ బ్రయోజనమేమి' అనెను. దురాత్ముఁడును వీర్యవంతుఁడు నగు నా రావణుఁడు, సుహృదుఁడగు సుపార్శ్వుఁడు మిక్కిలి ధర్మయుక్తముగాఁ జెప్పినమాట నంగీకరించి, గృహమునకుఁ బోయెను. అంత నతఁడు సుహృదులు పరివేష్టించిరా, మరల సభామండపమునకుం బోయెను. ఇది తొంబదిమూఁడవసర్గము.

—•—

మూలబలయుద్ధము; రాముఁడు దానిని నిర్మూలము గావించుట.

రాక్షసరాజగు రావణుఁడు సభామండపమును బ్రవేశించి దీనుఁడై మిక్కిలియు దుఃఖించుచు క్రుద్ధం బయిన సింహమువలె నిట్టూర్పులువిడుచుచు మేటిసింహాసనమునం గూర్చుండెను. మహాబలవంతుఁడగు నా రావణుఁడు పుత్రవ్యసనమున బ్రుంగుడువడుటం జేసి తన సేనాధ్యక్షుల ననునయించుటకై వారి నందఱను జూచి చేమోడ్పు గీలించి 'మీరలందఱును సమస్తములయిన యేనుంగులు గుఱ్ఱములు రథసమూహములు పదాతులు మొదలగు సైన్యములతోఁ గూడి యుద్ధమునకు వెడలుఁడు. మీరలు రాము నొక్కనిని యుద్ధంబునఁ జుట్టుముట్టి వర్షాకాలమున మేఘములు వర్షముగురియునట్లు, బాణవర్షములు గురియించి ‡ యతనిని వధింపవలయును. లేక మీచేత రాముఁడు హతుఁడగుట శక్యముగానియెడల, నేఁడు మహాయుద్ధము గావించి మీరు వాఁడిబాణములచే నతనిగాత్రమును భేదించితిరేని యట్లు హీనబలుఁడై యున్న యా రాముని రేపు లోకులెల్లఁ జూచుచుండఁగా నేను వధించివచ్చెద' ననెను. ఆరాక్షసులు రాక్షసేశ్వరుఁడగు రావణుఁడు చెప్పిన యామాటను గయికొని

శబంధమును తద్బంధవిముక్తియు. విదియయందు ధూమ్రాక్షవధము. తృతీయయందు వజ్రదంష్ట్రవధము. చతుర్థియందు అకంపనవధము. పంచమియందు ప్రహస్తవధము. షష్ఠిని రావణమకుటభంగము. సప్తమియందు కుంభకర్ణవధము. అష్టమియందు పతికాయాదులవధము. నవమిని మరల నింద్రజిత్తుయుద్ధము. ఆరాత్రియే కుంభనికుంభాదులవధము. దశమిని మకరాక్షవధము. ఏకాదశీ ద్వాదశీ త్రయోదశులందు నింద్రజిద్వధమని తెలియునది. ఇది యొకపక్షము. వాస్తవమునకు నవమియందు యుద్ధారంభము గనుక నవమీదశములు రెండుదినములలో రావణుఁ డింద్రజిత్తును మూలబలమును దప్పఁ దక్కినరాక్షసులందఱు వధింపఁబడిరి. ఏకాదశీ ద్వాదశీ త్రయోదశులచే నింద్రజిద్వధము. కావున, చతుర్దశియందు యుద్ధప్రయాణసన్నాహము చేయుమనుట యొప్పుచున్నదని తెలియునది.

† ఇందులకు 'హత్వా దాశరథిం రామం భవాన్ప్రాప్స్యతి మైథిలీమ్' అని మూలము. (భవాన్) నీవు, (దాశరథిం ప్రతిహత్వా) రామునిఁబొంది, (దాశరథిం మైథిలీం ప్రాప్స్యతి) రామునిచే యుద్ధమున హతుఁడవై వారిరువురకు పార్షదుఁడవగుటం బొందుదువని వాస్తవార్థము.

‡ ఇచటను మీఁదనెల్లను వాస్తవార్థము రామభక్తిపరముగా నూహించుకొనునది.

వేగముగలరథముల నారోహించి నానావిధసైన్యము లెంతయుబలసినవున బయలు వెడలిరి. ఆరాక్షసులందఱును, శరీరములను రూపుమాపునట్టి పరిఘములను పట్టిసములను బాణములను ఖడ్గములను పరశ్వధములను వానరులమీఁదం బ్రయోగించిరి. వానరులును రాక్షసులమీఁద వృక్షములను పర్వతములనుం బ్రయోగించిరి. అట్లు రాక్షసులకును వానరులకును సూర్యోదయము మొదలుగా, అమ్మహాయుద్ధము భయంకరమై తుములముగాఁ బ్రవర్తించినదయ్యె. అప్పుడవ్వానరులును రాక్షసులును యుద్ధమునం దొండొరులపై విచిత్రములగు గదలను ప్రాసములను ఖడ్గములను గండ్రగొడ్డండ్లను శిలలను వృక్షములనుం బ్రయోగించి యొకరినొకరు ప్రహరించిరి. ఇవ్విధమున రాక్షసులకును వానరులకును మహాయుద్ధము ప్రవర్తిల్లఁగా నందు మిక్కిలియు నధికముగా రేఁగినదుమ్ము రక్తప్రవాహములచే నడఁగినదయ్యె. అప్పుడు నెత్తురు నదులు ప్రవహించినవి. అందు నిటునటు గజములును రథములును తీరములుగాను, గుఱ్ఱములు మత్స్యములుగాను, ధ్వజములు వెల్లువం గొట్టుకొనివచ్చు వృక్షములుగాను, కళేబరములు తెప్పలుగాను గానంబడినవి. అంత నా వానరులందఱు నెత్తురు వెల్లువలం దొప్పదోఁగుచు, యుద్ధమున రాక్షసుల ధ్వజములను కవచములను రథములను నశ్వములను నానావిధములయిన యాయుధములను నెగిరి యెగిరి విఱిచివైచిరి. వానరులు రాక్షసులతలవెండ్రుకలను చెవులను నొసళ్లను ముక్కులను తీక్ష్ణములయిన దంతములం గొఱికియు గోళ్లచే గీఱియుఁ ద్రుంచివైచిరి. ఫలవంతమగు వృక్షమును పెక్కుపక్షులు వచ్చి ముసరునట్లు యుద్ధమున నొక్కొక్క రాక్షసుని నూర్గురేసి మేటివానరులు మాఱ్కొని పోరాడిరి. పర్వతాకారులగు రాక్షసులను, అట్లు భయంకరులయిన వానరులను పెనుగదలచే మోదియు నీఁటెలచేఁ బొడిచియుఁ గత్తులచే నఱకియు, గండ్రగొడ్డండ్రచేఁ జెక్కియు నొప్పించిరి. రాక్షసు లట్లు వధించుచుండఁగా వానరమహాసేన యోర్వఁజాలక సమస్తలోకశరణ్యుఁ డగుదశరథకుమారుని రాముని శరణుఁ జొచ్చినది. అంత మహాతేజుండును వీర్యవంతుఁడునగు రాముఁడు విలుగొని రాక్షససేనం జొచ్చి బాణములు గురియించెను. అప్పుడు రాముఁడు రాక్షససైన్యమును జొరఁగానే మహాభయంకరుఁడై బాణాగ్నిచే నిర్దహింపఁగా, గ్రీష్మర్తువునం దాకాశమున మేఘములు సూర్యునింబోలె, ఆరాక్షసులు రామునిఁ దారసింపఁ జాలరయిరి. యుద్ధమున రాముఁడు మహాభయంకరములును నితరుల కశక్యములు నగుకార్యములను జేయఁగా నతనిహస్తలాఘవాతిశయమువలన రాక్షసు లక్కార్యములను జేసియైనపిదపఁ జూచిరిగాని చేయుచున్నప్పుడు చూడఁజాలరయిరి. అతనికార్యములను జూడక పోవుటయే కాదు. వనమునఁ బెనుగాలి గొట్టునపుడు, కొమ్మలాడుట చెట్లు విఱుగుట మొదలగు దానికార్యము లగపడునేకాని యావాయువేమో యగపడనట్లు, రాముఁడు రాక్షససేనం జొచ్చి బాణవర్షము గురియఁగా రాక్షసులకు నతని సంచారలాఘవమునం జేసి పెనుపై

న్యము చేసి పాఱుట మహౌఘములు నుగ్గగుట మొదలగు నతనికార్యము లగపడి నవే కాని కర్తయైన యతఁడేమో యెంతమాత్రమును గనఁబడినవాఁడు గాఁడయ్యె. ఆరాక్షసులు, రామునిచే కొందఱు బాణముల ఖండింపఁబడియు కొందఱుచీల్పఁబడియు కొందఱుగాలియుఁ గొందఱవయవములు తుత్తుమురు గావింపఁబడియు కొందఱు ఱొమ్మున శల్యము గాఁడియు నున్న సేనం జూచి రేకాని, శీఘ్రకారి యగురాముని నెంతమాత్రమును జూడఁజాలరయిరి. ప్రజలు పంచభూతాత్మకమగు తమశరీర మందలి జీవాత్మను,అతఁ డింద్రియార్థముల ననుభవించుచుండుటంబట్టి యున్నాఁడని యనుమానముచేఁ దెలిసికొనుటయే కాని ప్రత్యక్షముగాఁ జూడలేనట్లు, ఆరాక్షసులు రాముఁడు తమశరీరములను బ్రహరించుచుండఁగా నాప్రహారములంబట్టి రాముని ననుమానించి రేకాని యతనిని ముందటఁ గన్నారఁ జూచినవారు కారైరి. రాముఁ డతివేగమున నిటునటు రాక్షససేనల సంచరించుచు వధించుచుండఁగా నతఁడు మెఱుపువలె నెచట నగపడునో యచట నున్న రాక్షసుని రామునిఁగా భ్రమించి 'వీఁడుగో రాముఁడు ఏనుంగులను జంపుచున్నాఁడు. వీఁడుగో మహారథముల నుఱుము సేయుచున్నాఁడు. వీఁడుగో వాఁడిబాణములఁ బదాతులను గుఱ్ఱములను వధించుచున్నాఁడు' అని యఱచుచు ఆరాక్షసులు రాముఁ డున్నచోటనుండిన సాదృశ్యమునం జేసి యొకరినొకరు రామునిఁగా భ్రమించి కుపితులై యొండొరులనే వధించుకొనిరి. * ఆరాక్షసులు మహాస్వభావము గలమేటిగాంధర్వాస్త్రముచే

---

* రాముఁడు గాంధర్వాస్త్రమునఁ శత్రువులకు మోహనముకలిగించి వధించినాఁడని తలఁపరాదు. అట్లేని యతనికిని నింద్రజిత్తునకును భేద మేమి? గాంధర్వాస్త్రముచే మోహనముకలిగించినాఁడనఁగా ఆ యస్త్రమును బ్రయోగించునపుడు రాక్షసులు దానివేగాతిశయమున దానిని వేసినవాఁడు తమవాఁడో పరుఁడో యని భేదము గ్రహింపలేక మోహముపొందిరని భావము. కనుక మోహమనఁగా వేగమువలన గ్రహింపలేకపోవుటయని తెలియునది. రాముఁ డతివేగమున సంచరించులాఘవమునుంబట్టి, యతఁ డక్కడ నగపడెనో యచ్చట నే యాక్షణమందె యగపడక వేఱొండుచోట మెలఁగుచుండుటచే ఆక్షణమందే రాక్షసులతనినుద్దేశించి వేసినబాణములు అచ్చటఁగల తమవారి నే చంపినవయ్యెను. ఇట్లు అస్త్రప్రయోగముయొక్క వేగాతిశయమువలనను రాముని సంచారలాఘవాతిశయమువలనను రాక్షసులు వీఁడు వాఁడనియు ఇందునందనియు తెలియనేరక మోహితులై యొండొరులను జంపుకొనిరే కాని యస్త్రముచే తమలో నొక్కొక్కఁడు రాముఁడుగా తోఁచుటచే మోహితులై కాదు. [illegible] వేగాతిశయమునుంబట్టియే యతనిం గనుఁగొనుటకు రాక్షసులు నానాదిక్కులకు న్నులగిఱపఁగా అందందు నతఁడు గనుపట్టుటచే ఒక్కఁడే పెక్కండ్రుగా రాక్షసులకుఁ దోఁచినాఁడని తెలియునది. కాఁబట్టియే రాముఁడు శీఘ్రకారి యనఁబడెను. వింటకొప్పును కొంటవిపక్రముగా వ్రేల్చుటయు రాము చక్రముగా రూపించుటయు ప్రయోగము యొక్క త్వరంబట్టియే చెప్పనొప్పును. కావున నే సుగ్రీవాదులు తదస్త్రప్రయోగలాఘవమును మాయాబలముగా శంకింతురోయని రాముఁడు 'ఇది యస్త్రమును బ్రయోగించు సామర్థ్యమువలననైనదే కాని యస్త్రమువలననైనది గాదనియుఁ జెప్పినాఁడు. కనుక నటయస్త్రముచేత మోహితులైరనఁగా

మోహితులై తమసైన్యమును దహించుచున్న రామునిం జూడఁజాలరైరి. ఆరాక్షసులకు భయాతిశయమువలన యుద్ధమున రాముఁడు వేలకొలఁది రాములై యగపడును; మరల మహాయుద్ధంబున నప్పుడె యొక్కఁడుగానే కానఁబడును. మహాత్ముఁడగు రాముఁడు మండలాకారగతివిశేషములం దిరుగునపుడు, అతనివింటి బంగారుకొప్పుగూడ గిఱ్ఱునఁ దిరుగుచుండుటచే గిఱ్ఱునఁ ద్రిప్పఁబడుచున్న కొఱవికట్టియవలె తెఱపిలేని యొకటే రేకగా రాక్షసులకుఁ గనుపట్టుచుండెనే కాని రాముఁడేమో కనఁబడినవాఁడు గాఁడయ్యె. అప్పుడు తనచుట్టు మండలాకారముగా గుడుసుపడియున్న వింటితోఁగూడి యుద్ధంబున రాక్షసులం జక్కాడుచు సుదర్శనచక్రముం బోలియున్న రాముఁడు ప్రజలకు జ్యోతిశ్చక్రముంబోలెఁ జూపట్టినవాఁడయ్యె. వింటిగుడుసుతోఁడి రాముఁడనెడి యాసుదర్శనచక్రమునకు రాముని శరీరమె నడిమి మిట్టగానుండు తూముపట్టు; పరులను సంతాపింపఁజేయు నతనిబలమే జ్వాలామాలి యనుదాని జ్వాల. అతఁడొక్కపెట్ట వేయేసిగా వేయు బాణములె సహస్రారంబగు నాచక్రమునకు ఆకులు. గుడుసుపడియున్న ధనువే దాని చుట్టుకట్టు. జ్యాతలఘోషమే నిరంతరఘోషంబగు నాచక్రముధ్వని. పరాక్రమమె దానియక్షము. రామశరీరకాంతియె దాని ప్రభ. దివ్యాస్త్రములమహత్త్వమె దానిచుట్టువాదర. వాయువేగములగు రథములు ఏడుకోట్లయిరువదితొమ్మిది లక్షలును, బలయుక్తములగు గజములు పదుమూడుకోట్ల పండ్రెండులక్షలయిరువదివేలును, రౌతులతోఁ గూడినయశ్వములు * పదకోట్ల యిరువదిలక్షల యఱువదివేలును పదాతులు నూటనలు

దానివేగమువలన వేసినవానిని గ్రహింపలేరయిరని భావము. అస్త్రముయొక్క కార్యము దహించుటమాత్రమే. దానిని బ్రయోగించినలాఘవమే మోహనమునకు కారణము.

* అనీకమనఁగా ‘ఏకేభైకరథాత్ర్యశ్వా పత్తిః పంచపదాతికా । పత్త్యంగై స్త్రిగుణైస్సర్వైః క్రమాదాఖ్యాయథోత్తరమ్। సేనాముఖం గుల్మగణౌ వాహినీపృతనాచమూః’ ఒక యేనుఁగును ఒకరథమును మూఁడుగుఱ్ఱములను అయిదుపదాతులును గలది పత్తియనఁబడును. మొత్తమునకు పదియురువులుగలదండు పత్తియనుట. మూఁడుపత్తులు సేనాముఖము. మూఁడుసేనాముఖములు గుల్మము. మూఁడుగుల్మములు గణము. మూఁడుగణములు వాహిని. మూఁడువాహినులు పృతన. మూఁడుపృతనలు చమువు అనంబడును. ఇట్టిచమువే యనీకమనఁబడినది. దీనింబట్టి (౭,౨౯౦) ఏడువేలయిన్నూటతొంబదియురువులు గలసేన యనీకమగు. అట్టియనీకములు పదివేలు అనఁగా ఏడుకోట్ల యిరువదితొమ్మిదిలక్షల యురువులనుట. ఇట్లె ‘అనీకం దశసాహస్రం రథానాంవాతరంహసాం। అష్టాదశసహస్రాణి కుంజరాణాం తరస్వినాం। చతుర్దశసహస్రాణి సారోహాణాంచ వాజినాం। పూర్ణేశతసహస్రేద్వే రాక్షసానాం పదాతినామ్’ అను గణనమున దశసహస్రములయిన (పదివేల) యనీకముల రథములనఁగా ఏడుకోట్లయిరువదితొమ్మిదిలక్షలు. అష్టాదశసహస్రములయిన (పదునెనిమిదవేల) అనీకముల గజములనఁగా పదుమూఁడుకోట్ల పండ్రెండులక్షల యిరువదివేలు. చతుర్దశసహస్రములయిన (పదునాల్గువేల) అనీకముల గుఱ్ఱములనఁగా పదకోట్ల యిరువదిలక్షల యఱువదివేలు. ద్వేశతసహస్రములయిన (రెండులక్షల) అనీకముల పదాతులనఁగా నూటనలుబదియైదుకోట్ల యెనుబదిలక్షలని తెలియును.

పదియేనుకోట్ల యెనుబదిలక్షలును గా కామరూపులయిన రాక్షసుల యీచతురంగబలమును రాముఁ డగ్నిజ్వాలలవంటి బాణములను మూఁడుముహూర్తిక గడియ లోపలఁ దానొక్కఁడే హతము గావించినవాఁడయ్యె. అంత హతశేషులగు రాక్షసులు, అశ్వములు చచ్చి రథములు నుఱుకై, యుత్సాహము మాలి ధ్వజములు దుత్తుమురై లంకాపురమునకుఁ బోయిరి. మిక్కిలియు మహాత్ముఁడగు నారాముని యుద్ధరంగము హతములగు గజములును తురగములును పదాతులును గలిగి, * క్రుద్ధుండగు రుద్రుని క్రీడాస్థానంబగు శ్మశానవాటివలె భయంకరమై యుండెను. అంత దేవతలును, గంధర్వులును సిద్ధులును మహర్షులును రాముఁడు గావించిన యీమహాకార్యమును 'బాగుబాగు' అని కొనియాడిరి. అప్పుడు ధర్మాత్ముఁడగురాముఁడు తన చెంతనున్న సుగ్రీవుని విభీషణుని హనుమంతుని జాంబవంతుని వానరోత్తముండగు మైందుని ద్వివిదునిం జూచి, † 'ఇట్లు మూలబలమునంత క్షణములోపల మాపుట మాయం జేసికాదు. ఇది యస్త్రమును బ్రయోగించు శక్తిచేనైనది. ఇట్టిదివ్యశక్తి నాకును సంహారకాలమందు శివునకును మాత్రమేకలదుగాని మఱెవ్వరికిని గలుగదు' అనెను. అప్పుడు దేవేంద్రసమానుఁడై దివ్యాస్త్రంబులను శస్త్రములను నెంతయుఁ గడిదేఱియున్న మహాత్ముఁడు రాముఁడు ఆరాక్షససైన్యమును హతముసేయుటయు, దేవతలందఱును మిక్కిలియు సంతుష్టులై గుంపులుగొని యతని నెంతయు స్తోత్రములు చేయువారైరి. ఇది తొంబదినాలుగవసర్గము.

రాక్షసస్త్రీలప్రలాపము.

రావణుఁడు పంపినసైన్యమునంతయును, పెక్కువేలరౌతులతోఁగూడినగుఱ్ఱములను ఏనుంగులను వేనవేలు ధ్వజాలంకృతములై యగ్నివలె ధగధగ మెఱయుచున్నబంగారురథములను శూరులై గదలతోను పరిఘములతోనుం బోరువారై రథంబులపయిని బంగారుటెక్కెముల కాంతులచే వింతవన్నెలుదోఁచు నల్లనిమేనులుగలిగి కామరూపులయియున్న పెక్కువేలరాక్షసులను, రాముఁ డనాయాసమున

* 'హతైర్గజపదాత్యశ్వైస్తద్బభూవరణాజిరమ్ । ఆక్రీడమివరుద్రస్య క్రుద్ధస్యసుమహాత్మనః' అనిమూలము- ఇట క్రుద్ధుఁడగురుద్రుఁడనఁ జెప్పుటచే ప్రలయకాలమునందు గ్రుద్ధుఁడగు మహాత్ముఁడయినరుద్రుని క్రీడాస్థానమువలె రథగజతురగములు హతములైయున్నరాముని యుద్ధరంగము చూపట్టెనని యర్థాంతరమును గ్రాహ్యము.

† ఇందులకు 'ఏతదస్త్రబలందివ్యం మమవాత్ర్యంబకస్యవా' అనిమూలము. ఇట్లు క్షణములో లెక్కలేని బలురాక్షసులను జంపుట మాయవలనఁగాదు. అస్త్రమును బ్రయోగించుశక్తి లాఘవమువలననని యర్థము. అస్త్రమునకుమాత్రమే యాశక్తిగలదు. అట్లే 'గాంధర్వేణ గాంధర్వమ్' అని రావణాదులకుఁ గూడ గాంధర్వాస్త్రములుండుటచే నాశక్తి యుండవలయునుగదా. అదియును గాదు. కేవల మస్త్రశక్తి కాక అస్త్రప్రయోగశక్తియేయని తెలియునది.

బంగారుచే రంగారువాఁడిబాణముల వధించిపుచ్చెను. హతశేషులగు నరాక్షసులు యుద్ధమునుండి వెనుకకుఁ దొట్రిలఁబడి పాఱివచ్చినవారును లంకనున్నవారలును, అట్లు రామునిచేత మూలబలము వధింపఁబడుటను గనియు వినియు, రాక్షసస్త్రీలతోఁ జేరి దీనులై చింతలమునింగినవారయిరి. యుద్ధమున రామునిచే పెనిమిటిచచ్చియు పుత్రులుచచ్చియు బాంధవులు హతులయ్యు నున్న రాక్షసస్త్రీ లొండొరులం గవుంగిలించుకొని దుఃఖార్తలయి యిట్లు పలవించిరి. 'శూర్పణఖ ముసలిది, వికృతాకారముగలది, దానికడుపు వ్రేలుకాడుచుండును. ఇది, వనంబున రూపొందిన మన్మథునివలె నత్యంతసుందరుఁడై సుకుమారుఁడును మహాబలుఁడును సర్వభూతహితరతుఁడు నయినరామునొద్ద కెట్లుపోయినది? సమస్తలోకములచేతను నిందనీయ యగుకురూపిణి యాశూర్పణఖ యట్టిరామునింజూచి మోహించినదఁట! శూర్పణఖకు మంచిగుణ మొక్కటియు లేదు. రాముఁడో సమస్తసుగుణసంపన్నుఁడు. ఇది వికారముఖముగలిగి వన్నె మాలినది. రాముఁడో సుందరమైన ముఖముగలిగి మిక్కిలి తేజము దొలఁకుచుండువాఁడు. ఇది రాక్షసి, అతఁడు మనుష్యలలాముఁడు. ఇట్టిది యట్టిరాము నెట్లు కామించెను! ముసలితనము నుదరి ముడుతలుపడి వెండ్రుక లెల్ల నరసి రాముని కెంతమాత్రము ననురూపగాని యీశూర్పణఖ, మాయిందఱము దుర్భాగ్యుల మగుటవలన ఖరదూషణులును మఱియు సమస్తరాక్షసులును వినాశము నొందుటకై మిక్కిలి పరిహాసాస్పదమును సమస్తలోకనిందితమును నగు చేయరానికార్యమును * రాముని మోహించుటను గావించినది. ఆబడ నిమిత్తమై రావణుఁడు రామునితో నీమహావైరము పెట్టుకొనెను. రావణుఁడు తనవధమునకై యాసీతను గొనితెచ్చి బలవంతుఁడగు రామునితో తీఱనివిరోధము నుంచుకొన్నాఁడంతేకాని జనకరాజసుతయగు నాసీతయేమో, యీరావణునకు వశురా లగుట లేదు. మున్ను సీత నపహరింప వేఁడిన యారాక్షసుని విరాధుని, రాముఁ డొక్కఁడే వధించుటను జూచియున్న మనకు ఆవిరాధునివధమే రాముఁడు తనవిరోధులనెల్ల నిరసించుటకుఁ జాలినని దర్శనము. రాముఁడు జనస్థానమున భయంకరపరాక్రములగు పదునాల్గువేల రాక్షసులను అగ్నిజ్వాలలంబోని బాణములచే వధించిపుచ్చెను. అదియు నతఁడు పగవారినెల్ల నుఱుమాడుననుటకు చాలియున్నది. రాముఁడు యుద్ధమున సూర్యసమానములయిన బాణములచేత ఖరుని దూషణుని త్రిశిరుని, వధించెను. రాముఁడే గెలుచుననుట కిది యొకదృష్టాంతమే చాలును. మఱియు నెత్తురే యాహారముగాఁగలిగి క్రోధమున బెట్టిదముగా నార్పులిడుచు యోజనము నిడివియైన బాహువులుగల యాకబంధునిఁగూడ రాముఁడు వధించెను. రాముఁడే గెలుచుననుట కిదయొకటియె నిదర్శనము చాలును. మహాబలుఁడును మేరుపర్వతసమానుఁడును దేవేంద్రునికుమా

* శూర్పణఖవచ్చి రావణాదులతో వేఱువిధముగా రామునియందు నేరముమోపి చెప్పినను దానియంగకంపనాదులవలన నది రామునిఁ గామించినదని యందఱికిఁ దెలిసియుండుట నిట దెలియునది.

రుఁడును నగువాలినిఁగూడ రాముఁడు వధించెను. రాముఁడు జయించుటకు నిదర్శనమే చాలును. దీనఁబడి యాశాభంగమునొందె, ఋశ్యమూకపర్వతమున దాఁగియున్న సుగ్రీవునిఁగూడ రాముఁడు వానరరాజ్యమున కధిపతిఁగాఁ జేసెను. రాముఁడు గెలుచుననుట కాదృష్టాంత మొకటియే చాలును. విభీషణుఁడు చెప్పినమాట ధర్మార్థములు రెండును గలిగించునది, సమస్తరాక్షసులకు హితకరమైనది, యుక్తియుక్తమైనది. మోహావేశమునం జేసి రావణున కది యిష్టపడదయ్యె. కుబేరానుజుఁడగు రావణుఁడు, విభీషణుఁడు చెప్పినట్లు గావించియుండు నేని,యీలంకాపుర మంతయు శ్మశానమువలెఁ బీనుంగులతో నిండి యుత్ల్రార్తనాదములతోఁ గూడినదిగాకుండును. రామునిచే మహాబలుఁడగు కుంభకర్ణుఁడు హతుండగుటయు లక్ష్మణునిచే నెట్టివారికి నెదిరింపరాని యతికాయుఁడును నంతటఁబోక హతుఁడగుటయు ప్రియపుత్రుఁడగు నింద్రజితుఁడు హతుఁడగుటయు వినియు నింకను రావణునకు రామునిమహిమ దెలియకున్నదే'యనిరి. 'యుద్ధమున నాకొడుకు హతుఁడయ్యెనే ! నాతోఁబుట్టువు చచ్చెనే ! నా పెనిమిటి గూలెనే' యని లంకాపురమున రాక్షసులయింటింటను రోదనధ్వనులు వినఁబడుచుండెను. మఱియువారు 'శూరుఁడగు రాముఁడు రథములను గుఱ్ఱములను,ఏనుంగులను పదాతులను, లక్షలు లక్షలుగా యుద్ధమున వధించినాఁడు రుద్రుఁడో విష్ణువో దేవేంద్రుఁడో లేక యముఁడో రామునిరూపమునవచ్చి మనవారిని వధించుచున్నాఁడే కాని రాముఁడు మనుష్యమాత్రుఁడుగాఁడు. మహావీరులగు మావారందఱు రామునిచే హతులగుటవలన మేము బ్రతుకుననుకొలి యాశవదలి,యాభయమునకుఁ దుదగానక యనాథలమై విలపించుచున్నారము. శూరుఁడగు రావణుఁడు బ్రహ్మవలని మహావరము పెంపునఁ గన్నుఁగానక తనకిప్పుడు రామునివలనఁగలిగియున్న మహాఘోరభయము నెఱుఁగకున్నాఁడు. దేవతలుగాని, గంధర్వులుగాని, పిశాచములుగాని, రాక్షసులుగాని, యుద్ధమున రామునిచే బారింబడినవానిని, రక్షింపఁజాలరు. రావణునికి ప్రతియుద్ధమునందును నుత్పాతములును గనఁబడుచున్నవి. ఇఁకమీఁదను నుత్పాతములు చూపిసూపి రామునిచే రావణుఁడు హతుఁడగుటను సూచింపఁగలవు బ్రహ్మ,రావణుని తపస్సునకుమెచ్చి యతనికి, దేవతలవలనఁగాని,దానవులవలనఁగాని,రాక్షసులవలనఁగాని భయము లేదనివర మొసఁగెను. అప్పుడు రావణుఁడు మనుష్యులవలన నభయము యాచింపఁడయ్యె. కాఁబట్టి,యిప్పుడు రావణునకును రాక్షసులకును మనుష్యునివలనఁ బ్రాణాంతకరమయిన యాఘోరభయము ప్రాప్తించినది. ఇందులకు సందేహము లేదు. దేవతలు బ్రహ్మవరకారణమున, బలవంతుఁడగు రావణునిచే మఱింత పీడితులై, యోర్వలేక,బ్రహ్మదేవునిగుఱించి యత్యుగ్రమగు తపముగావించిరి మహానుభావుఁడగు బ్రహ్మదేవుఁడు సంతుష్టుఁడై దేవతలకు మేలుగలుగుకొఱకు, వారలనెల్లంజూచి, మహార్థంబగు నీవాక్యమున 'ఇది మొదలు సమస్తరాక్షసులును వారలతోఁ జేరిన దానవులును నెల్లప్పుడును ముల్లోకములందును మీకెవ్వరికిఁ బీడగలిగింపక శాశ్వతముగా నెంతయు భయంబుగలిగి సంచ

రింతురు' అని సమాధానముచెప్పెను. దేవేంద్రుఁడు మున్నగు దేవతలు, బ్రహ్మదేవు నిసమాధానమునకుఁ దృప్తిఁ బొందక యందఱు నొకటిగాఁ జేరి, వృషభధ్వజుఁడును త్రిపురసంహారుఁడునగు శివుని బ్రార్థించి ప్రసన్నునిఁ గావించికొనిరి శివుఁడును ప్రసన్నుఁడై దేవతలం జూచి 'రాక్షసులకెల్ల నాశముఁ గలిగించునట్టి స్త్రీ యొకతె పుట్టఁ గలదు ఆబిడవలన మీకు హితము గలుగునని చెప్పెను. రాక్షసులకు నాశముసేయుటకై దేవతలుపంపిన యీసీత మున్ను, దేవత లమృతపానము చేసినపిదప, ఆఁకలి దానవులను పొడమాపినట్లు,* రావణునితోఁ గూడ మనల నందఱను భక్షించివేయఁ గలదు. దుర్ణయపరుఁడును దుర్బుద్ధియునగు రావణుఁడు చేసినదుష్కార్యముచేత నిట్లు పెనుదుఃఖముతోఁ గూడ నీభయంకరమైన నాశ మందఱికిని బ్రాప్తించియున్నది. ప్రలయకాలమునందు యముని బారింబడిన ప్రజలకుంబోలె రాముని బారింబడిన మనకు శరణొసంగి రక్షించువాఁడు లోకంబున నెవ్వఁడు గానరాఁడు. వనమునందు కారుచిచ్చుజ్వాలలు చుట్టిముట్టియున్న యాఁడుగజములకుంబోలె, ఈమహావిపత్తునందున్న మనకు రక్షకుఁడెవ్వఁడును లేఁడు. పులస్త్యమహర్షి మనుమఁడయిన యమ్మహాత్ముఁడు విభీషణుఁడు, ఎవ్వరివలన భయము గలుగునని తోఁచెనో యట్టిరాముని శరణుఁ జొచ్చినాఁడుగాన యుచితమైనపనియే చేసినాఁడు' అని విలపించిరి. ఇవ్విధమున నప్పుడు †రాక్షసస్త్రీలందఱును ఒండొరులచేతులం గౌఁగిలించుకొని భయాతిశయమునం బీడితలై దీనలై దుఃఖించుచు మిక్కిలియు దారుణముగా బిగ్గఱ నాక్రోశించినవారయిరి. ఇది తొంబదియేనవసర్గము.

రావణుఁడు మహోదర మహాపార్శ్వ విరూపాక్షు లను
మువ్వురు మంత్రులతోఁగూడి లంకయుత్తరద్వారమున
యుద్ధమునకు వెడలుట; రావణునకు మార్గ
మున దుశ్శకునములు; రావణుఁడు వానర
సేనతో యుద్ధముసేయుట

అట్లు లంకాపట్టణమున, ఇంటింటను, రాక్షసస్త్రీలు ఆర్తలై జాలిపుట్టునట్లు సేయు రోదనధ్వనిని రావణుఁడు వినెను. ఆరావణుఁడు దీర్ఘముగా నిట్టూర్పువిడిచి కొంతసే పేమియుఁ దోఁపక చింతామగ్నుఁడై యుండి యంత మిక్కిలియు కోపావేశమున భయంకరాకారుఁడయ్యెను. ఆరాక్షసేశ్వరుఁడు పండ్లచే నౌడుగఱచి, కోప

---

* ఇట దానవులనుగూడఁ జెప్పటచే మందోదరీసంబంధమువలన దానవులును గొందఱు రాక్షసులతోడ నుందురని తెలియుచున్నది.

† ఇట రాక్షసనాశమునకై బ్రహ్మాదులు వరములిచ్చుట మొదలగు వృత్తాంతములు మందోదరి జ్ఞానవృద్ధులవలనను ఆబిడవలననుండి యీరాక్షసస్త్రీలును వినియుందురని తెలియుచున్నది. గోవిందరాజులు.

మున కన్నులు మఱియు నెఱ్ఱఁబాఱి ప్రలయకాలాగ్నివలెఁ జిమ్మిరేఁగి రాక్షసులకునుగూడఁ దేఱిచూడ నలవిగాక చూపట్టుచు, లోపల భయమునం జేసి తడఁబడి తేటపడనట్లు మాటాడుచున్నవారై సమీపంబున నున్న రాక్షసులను * మహోదర మహాపార్శ్వ విరూపాక్షు లనువారలంజూచి చూపులచే చుఱచుఱ దహించువాఁడుం బోలెఁ గనుపట్టుచు వారితో 'సేనలకు శీఘ్రముగా యుద్ధమునకు వెడలవలయునని నాయాజ్ఞగాఁ జెప్పుఁడు' అనెను. ఆరావణుఁడు చెప్పినమాట విని, యారాక్షసులు భయవీడితులై రాజాజ్ఞచొప్పున, మిక్కిలి యెచ్చరికగల రాక్షసులను యుద్ధమునకు రాఁ బ్రేరించిరి. భయంకరాకారులగు నారాక్షసులును వల్లెయని మంగళాశీర్వచనములం జేసికొని యందఱును యుద్ధాభిముఖులయి పోయిరి. ఆరాక్షసులెల్ల వారివారి పరువులచొప్పున రావణునకు నమస్కారాదులు గావించి యేలినవానిజయముం గోరుచు, చేమోడ్పులు గీలించి నిలఁబడిరి. అంత రావణుఁడు మిక్కిలి క్రోధావేశమునొంది పగవారిని సరకుసేయని పెడనవ్వునవ్వి మహోదరుని మహాపార్శ్వుని విరూపాక్షునిని జూచి 'ఇప్పుడు నావింటినుండి ప్రలయకాలసూర్యునింబోలు బెడిదంపు బాణములను బ్రయోగించి రామునిని లక్ష్మణునిని యమపురికిఁ బంపెదను. నేనిప్పుడు యుద్ధమున పగవారినెల్ల వధించి యింతకుమును వారిచే ఖరుఁడు కుంభకర్ణుఁడు ప్రహస్తుఁడు ఇంద్రజిత్తును వధింపఁబడినందులకు ప్రతీకారము గావించెదను. నాబాణజాలము లనెడి మేఘములు గ్రమ్ముకొనఁగా దిక్కులును, నదులును, సముద్రములును, వెలుతురు లేక చీఁకటితోఁగూడి యుండఁగలవు. ఇప్పుడు వింటినుండి గఱులుగట్టంబడిన మేటిబాణములను నవ్వారిగాఁ బ్రయోగించి యవ్వానరసైన్యములను గుంపులుగుంపులుగాను ఱుమాఁపివచ్చెదను. ఇప్పుడు రథమనెడి వాయువేగముచే ధనుస్సనెడిసముద్రమునుండి రేఁపంబడిన బాణములనెడి కరుల్లచే వానరసైన్యములను మథించిపుచ్చెదను. కొంచెము వికసించిన తామరలుగల తటాకములను మదగజములు కలఁచునట్లు, కొంచెమువికసించిన తామరలవంటి ముఖములును తామరయకరువులవంటి వన్నెయుఁగల యవ్వానరులసేనలను గలంచెదను. ఇప్పుడు యుద్ధభూమియంతటను వానరయూథపులు మొగముల బాణములు గ్రుచ్చుకొని తెగిపడియుండఁగా, నది కాఁడలతోఁగూడిన కమలములు వ్యాపించియున్నట్లు మిక్కిలివన్నెగులుకఁగలదు. యుద్ధమునఁ బ్రచండులై వృక్షములంగొని పోరువానరులనిప్పుడు ఒక్కొక్కబాణము నేసి నూర్గురునూర్గురుగా యుద్ధమున వధించెదను. యుద్ధమున నెవ్వతెవ్వతెకు భర్తలు భ్రాతలును పుత్రులును హతులయిరో యట్టి రాక్షసస్త్రీలకందఱికును, ఇప్పుడు శత్రువునువధించి, కన్నీరుదుడిచెదను. ఇప్పుడు యుద్ధమున నాబాణములచే వానరులను ఛేదించి ప్రాణములెడలి చెల్ల

* ఈమహోదరుఁడును మహాపార్శ్వుఁడును రావణునిమంత్రులు, మునుపు యుద్ధమున హతులయిన మహోదర మహాపార్శ్వులు మత్తుఁడు ప్రమత్తుఁడు అనునామాంతరములు గలిగి రావణునకుఁ దమ్ములయినవారు.

చెదరుగాఁ గూలిన వారి కళేబరముల ప్రోవులచే భూమినంతయుఁ గప్పి యది కనఁబడుట కష్టసాధ్యమగునట్లు గావించెదను. ఇప్పుడు, మాంసాహారములగు నక్కలు గద్దలును నితరజంతువులన్నిటికిని నా బాణములచే శత్రువులమాంసములొసఁగి తృప్తిఁ గావించెదను. శీఘ్రముగా నారథము నలంకరింపుఁడు. వేగ నావిలు దెండు. మఱియిప్పటికి మిగిలియుండు రాక్షసు లందఱును నా వెంటవత్తురుగాక' అనెను. మహాపార్శ్వుఁడు రావణుఁడు చెప్పినమాటనువిని యచటనున్న సేనాధ్యక్షులనుజూచి 'సైన్యము వేగ మాయితపఱుపుఁడు' అని యాజ్ఞాపించెను. మహాబలవంతు లగునాబలాధ్యక్షులు లంకాపురియందింటింటింకిఁబోయి రాక్షసులంబిలుచుచు మాటిమాటికిఁ బిలిచినను వారు త్వరితముగా రానందునఁ గుపితులై వీథివీథిని బిలుచుచుం దిరిగిరి. అంత ముహూర్తమునకు, భయంకరముఖములుగలిగి రాక్షసులు, సింహనాదములు సేయుచు ఖడ్గములను పట్టిసములను శూలములను గదలను ముసలములను ద్విఫలపత్రాగ్రములగు హులశములను నాయుధములను వాఁడివాదరలుగల శక్తులను పెద్దకూటముద్గరములను యష్టులను విమలములయిన చక్రములను వాఁడిపరశ్వధములను భిండివాలములను శతఘ్నులను మఱియు నితరములైన మేటియాయుధములను, నిట్లు నానావిధాయుధములను గేలందాల్చి, చూచువారికి భయంకరముగాఁ జూపట్టుచు వేగ వెడలి వచ్చిరి. అంత రావణునాజ్ఞచొప్పున సేనాధ్యక్షుఁడు ఎనిమిదిగుఱ్ఱములు పూన్పంబడి సారథితోఁ గూడియున్న రథమును శీఘ్రముగాఁ దెచ్చెను. భయంకరుఁడగు రావణుఁ డారథమును నిజతేజముచే దేదీప్యమానంబై వెలుంగ నారోహించెను. అంత రావణుఁడు, పెక్కండ్రు రాక్షసులు బలసినడువ, బలాతిశయమునం జేసి భూమిని భేదించురీతిఁ దోఁప, వేగమునం బయనమయ్యెను. అప్పుడు మహాపార్శ్వుఁడును మహోదరుఁడును దుర్ధర్షుఁడగు విరూపాక్షుఁడును, రావణుననుమఱినొంద రథముల నారోహించిరి. వారలు సంతుష్టులై భూమిని బీఁటలువాఱ్చునట్లు లార్పులు చెలంగించుచు భయంకరముగా సింహనాదములు సేయుచు జయకాంక్షులై వెడలిరి. అంత మహాతేజుండగు రావణుఁడు రాక్షససైన్యములం బరివృతుఁడై విలుగొని ప్రలయకాలమున ప్రజలరూపుమాపు యమునివలెఁ జూపట్టుచు యుద్ధమునకు వెడలెను. అంత సమ్మహారథుఁడు వేగవంతములగు గుఱ్ఱములుపూన్చినరథము నారోహించి రామలక్ష్మణు లున్నయుత్తరద్వారమున నిర్గమించెను. అప్పుడు సూర్యుఁడు కాంతిహీనుఁడయ్యె. దిక్కులందుఁ జీఁకట్లు గ్రమ్మినవి. భయంకరములగుపక్షు లఱచినవి. భూమియు నల్లలాడినట్లుండెను. పర్జన్యుఁడు నెత్తురువర్షము గురిసెను. గుఱ్ఱములు మార్గమునం దొట్రిలంబడినవి. ధ్వజాగ్రమున గ్రద్దవ్రాలెను. ఆఁడునక్కలమంగళముగా నఱచినవి. రావణుని కెడమకన్నదరినది; ఎడమచేయియదరెను; ముఖము వెలుకఁబాఱెను; ఎలుఁగు తగ్గువడెను. ఆ యుత్తరద్వారమునుండి రావణుఁడు యుద్ధమునకు వెడలునపుడు, యుద్ధముననతనికి మరణమునూచించునట్టియీదుర్నిమిత్తములు పుట్టినవి. పిడుగుపడినట్లు బిట్టుచప్పుడు

తో నాకాశమునుండి యుల్క పడినది. అమంగళములగు గద్ద లఱవఁగాఁ గూడ కాకులును జేరి యఱచినవి. రావణుఁడు మృత్యుప్రేరితుఁడగుటవలన, నిట్లు సంభవించిన యీదుర్నిమిత్తములను సరకుసేయక, మోహమున వధమునొందుటకై బయలు వెడలెను. మహాబలులగు నారాక్షసులరథధ్వనిని విని వానరసేనయు యుద్ధము సేయ నెదురుమొగమై నిలిచెను. ఆవానరులును రాక్షసులును నొండొరుల జయింపఁగోరి కుపితులై స్పర్ధచే నొకరినొకరు పిలుచుచుఁ దుములముగా యుద్ధము చేసిరి. అంత నపుడు రావణుఁడు క్రుద్ధుఁడై వానరసేనలంజొచ్చి బంగారుచే రంగారుబాణములం బ్రయోగించుచు గొప్పయుద్ధమును గావించెను. రావణుఁ డప్పుడు కొందఱ వానరుల తలలు ఖండించెను. కొందఱ గుండెకాయలు చీల్చెను. కొందఱ చెవులం దెగనేసెను. రావణుని బాణములచేఁ గొంద ఱూర్పులు పుచ్చ లేక హతులయిపడిరి. కొందఱు ప్రక్కలఁ జీల్పఁబడిరి. కొందఱకుఁ దలలు భిన్నములయినవి. కొందఱికి కన్నులుపోయినవి. రావణుఁడు యుద్ధమున రథగతుఁడై క్రోధమునం గన్నులు విరియఁ గిఱ్ఱనగిఱపుచు, నెందెందుపోవునో యయ్యయియెడలనెల్ల, వానరపుంగవు లతనిబాణవేగమునకు సహింపఁ జాలక పాఱిరి. ఇది తొంబదియాఱవసర్గము.

సుగ్రీవుఁడు విరూపాక్షుని వధించుట.

అట్లపుడు రావణుని బాణములచే గాత్రములు భిన్నములై చెల్లచెదరుగాఁ గూలియున్న వానరులకళేబరములచే నచటి యుద్ధభూమియంతయు నిండినదయ్యె. మిడుతలు మండుచున్న యగ్నిని సహింపఁజాలనియట్లు, అవ్వానరులు, సహింపనలవిగాని రావణుని బాణవేగమునకు సైఁపఁజాలరయిరి. అవ్వానరులు వాఁడిబాణములం బీడితులై, సైఁపఁజాలక యగ్నిజ్వాలలం దగులువడి కాలుచున్న యేనుఁగులవలె నాక్రోశించుచు పరుగిడిరి. వాయువు మహామేఘములం బాఱఁదోలునట్లు, ఆయుద్ధమున, నారావణుఁడు, వానరసైన్యములను బాణములఁ జిమ్ముచుంబోయెను. అప్పుడు రాక్షసేశ్వరుఁడగు రావణుఁడు అట్లు వానరుల బలిమికొలఁదిని యుద్ధముగావించి యంతఁ ద్వరితముగా రాముని యుద్ధమున దార్కొన్నవాఁడయ్యె. అట్లు వానరులు యుద్ధమున భంగమునొంది పాఱుచుండుటనుజూచి, సుగ్రీవుఁడు గుల్మమున సుషేణునియమించి యందఱు నాశ్చర్యపడునట్లు యుద్ధము సేయఁ దలంపుగొనెను. వీరుఁ డగునాసుగ్రీవుఁడు బలపరాక్రమంబుల తనకుసాటి యగుసుషేణుని గుల్మమున (సేనారక్షణమున) నుంచి వృక్షము చేతంగొని శత్రువు నెదుర్కొనిపోయెను. వానరరాజు సుగ్రీవుఁ డట్లు బయలుదేఱఁగా, గొప్పగొప్పయూథపతులగు వానరవీరులు తామే, యతనికి యుద్ధోపకరణముల సమకట్టుటకై పెనుపర్వతములను నానావిధములయిన పెనువృక్షములను బెకల్చి యందఱు నతనిపార్శ్వములందును పిఱుందను వెంబడించి నడచిరి. గొప్పవాఁడగు నాసుగ్రీవుఁడు యుద్ధమున మహాధ్వనితో గర్జించుచు, పలు

దెఱంగులగు రాక్షసుల ననేకులంగూల్చి యంత మేటిమగలయిన వేయి రాక్షసులపయి కడరెను. పెనుకాయముగల యావానరేశ్వరుఁడు సుగ్రీవుఁడు ప్రలయకాలమున వాయువు మిక్కిలి పొడవులయిన వృక్షములను జక్కాడునట్లు, గొప్పరాక్షసులను గలంచి నలంచివైచెను. అడవియందు మేఘము పక్షిసమూహములపై ఱాలవానం గురియునట్లు, సుగ్రీవుఁడు రాక్షససేనలపయిని పర్వతవర్షమును గురిసెను. కపిరాజగు సుగ్రీవుఁడు గురిసిన యాపర్వతవర్షములంజేసి రాక్షసులతలలు తుత్తునియలుగాఁబగిలి వజ్రముచేఁ దుత్తుమురైన పర్వతములవలె నేలంగూలిరి. అంతరాక్షసులందఱు నట్లుసుగ్రీవునిచే నలుగడల భంగమునొంది హింసితులై పడుచును నఱచుచు మిక్కిలిక్షీణించుచునుండుటనుజూచి దుర్ధర్షుఁడగు విరూపాక్షుఁడు, విలుగొని తన పేరువాడి రథమునుండి కుప్పించి యొకగజముమూఁపు నారోహించెను. మహారథుఁ డావిరూపాక్షుఁడు, ఆమదపుటేనుఁగు నెక్కి, భయంకరధ్వనిగా సింహనాదము సేయుచు వానరులమీఁది కడరెను. ఆవిరూపాక్షుఁడు వానరసైన్యముఖమున నున్నసుగ్రీవునిపై బెట్టిదములగు బాణములం బ్రయోగించి భయమునఁ బరుగెత్తుచున్న రాక్షసులకు భయముదీర్చి సంతుష్టి గలిగించినవాఁడయ్యె. కపిరాజాసుగ్రీవుఁడు, అట్లు విరూపాక్షునిచే వాఁడిబాణముల నొప్పింపఁబడి, మిక్కిలి క్రుద్ధుఁడై యతనిని వధింప మనంబునఁ దలఁచెను. అంత శూరుఁడగు సుగ్రీవుఁడు చక్కఁగాఁ బ్రహరించువాఁడు గావున నొకవృక్షమును బెకలించి, విరూపాక్షునిపయి నడరి, దానితో నతనిమహాగజముముఖమునఁ గొట్టెను. అమ్మహాగజము సుగ్రీవునిచే వ్రేటువడి వింటికోలఁది దూరము వెనుకకుఁ బాఱి యఱచుచుంగూలెను. అంత వీర్యశాలి యగునావిరూపాక్షుఁడు కూలినయాయేనుఁగునుండి శీఘ్రంబున డిగ్గి, వాలును నెద్దుతోలు పలుకయుంగొని శత్రువున కభిముఖుఁడై కదలక స్థిరముగా నెలకొనియున్న సుగ్రీవునిమీఁదికి, అతనిని బెదరించువాఁడుంబోలె చుఱ్ఱుకుఁబోయెను. ఆసుగ్రీవుఁడు విరూపాక్షునియెడఁ గోపించి, మేఘమువలె విశాలమైయున్న యొకమహాశిలను దీసికొని, యారాక్షసునిపై వ్రేసెను. అప్పుడు మిక్కిలియు పరాక్రమవంతుఁడగు నావిరూపాక్షుఁడు, అమ్మహాశిల పయిఁబడి వచ్చుటనుజూచి తప్పించుటకై ప్రక్కవాటునఁ దొలఁగి ఖడ్గముచే సుగ్రీవునివైచెను. అట్లు బలవంతుఁడగు నారాక్షసునిచే ఖడ్గపువ్రేటుపడి, వీరుఁ డగుసుగ్రీవుఁడు కొంతసేపు మూర్ఛనొందినట్లు విహ్వలించినవాఁడయ్యె. అంత నపు డమ్మహాయుద్ధమున సుగ్రీవుఁడు తోడనేలేచి వేగమునం బిడికిలి నలవరించి విరూపాక్షునిఱొమ్మునం బొడిచెను. విరూపాక్షుఁ డట్లు సేనాముఖమునఁ బిడికిటం బొడువఁబడి మిక్కిలి క్రుద్ధుఁడై యాఖడ్గమున * సుగ్రీవునికవచమును తునియలుగాఁ బడవైచెను. సుగ్రీవుఁ డాదెబ్బకుఁ గాళ్లు చాఁచుకొని నేలంబడెను. అట్లు పడి యాకపి తోడనేలేచి వజ్రముంబోనియఱచేతి దెబ్బతో మిక్కిలియు చప్పు

* దీనిచే సుగ్రీవునకిఁగూడ కవచధారణము గలదని తెలియుచున్నది. గోవిందరాజులు.

డుగలుగ నావిరూపాక్షునిఁ గొట్టఁబోయెను. సుగ్రీవుఁ డట్లలవరించినయఱచేతిచఱపు ను నావిరూపాక్షుఁడు, శిక్షాపాటవమునఁ దప్పించుకొని యాసుగ్రీవుని వక్షమునందుఁ బిడికిటం బొడిచెను. అంత వానరేశ్వరుండగు సుగ్రీవుఁడు, తనచఱపును ఆవిరూపాక్షుఁడు తప్పించుకొని తన్నుఁబడుఁబునకుఁ గొట్టుటంజూచి మఱింత క్రుద్ధుఁడై యావిరూపాక్షుం డేమఱియున్న తెఱపిం గాంచెను. అంత సుగ్రీవుఁడు కోపంబున నావిరూపాక్షుని నొసటియెమ్ముపై తనపెద్దయఱచేతం గొట్టెను. ఇంద్రునివజ్రాయుధమువంటి యాయఱచేతిప్రేటును బడి, ఆవిరూపాక్షుఁడు, సెలయేటినుండి జలము స్రవించునట్లు నవరంధ్రములనుండియు నెత్తురుగ్రక్కుచు నెత్తుటఁ దోఁగి నేలంగూలెను. అట్లు క్రోధమువలన కనుగ్రుడ్లుత్రిప్పుచు, నోట నురుఁగుగాఱ, నెత్తుటందోఁగి, సహజము గానే వికృతములయిన నేత్రము లప్పుడు గ్రుడ్లు వెలికుఱుకుటచే మఱింతవికృతములు గాఁ జూపట్టఁగాఁ గూలినట్టి యావిరూపాక్షుని వానరులును రాక్షసులును జూచిరి. అట్లు తమశత్రు వవ్విరూపాక్షుఁడు వేదనచే మీఁది కెగిరియెగిరి పడుచు, ఇటునటు ప్రక్కలం బొరలాడుచు, నెత్తుటందోఁగి వినువారికి జాలిపుట్టునట్లు కూయిడుచునుండఁగా వానరులుచూచిరి. అట్లు మహాబలవంతములగు నావానరరాక్షససైన్యసముద్రములు రెండును యుద్ధమున నొండొంటి మార్కొని, చెలియలకట్టల నతిక్రమించి వచ్చి మర్కొన్న రెండుమహాసముద్రములుంబోలె మిక్కిలి భయంకరముగా నార్పులు పెడబొబ్బలను జెలంగించిరి. వానరరాజగు సుగ్రీవుఁడు, మహాబలుఁడయిన యవ్విరూపాక్షుని నాశము సేయుటనుజూచి వానరసైన్యములుబ్బనను, రాక్షససేనలు కోపదుఃఖములను, గట్టుపొరలి వచ్చినగంగాప్రవాహమువలె నుప్పొంగి యొండొరుమీఁదంబడి పోరాడిరి. ఇది తొంబదియేడవసర్గము.

సుగ్రీవుఁడు రావణునిమంత్రియగు మహోదరునిం బరిమార్చుట

అమ్మహాయుద్ధమున వానరరాక్షససైన్యములు రెండును నొండొంటిని హతము సేయుచుండఁగా, గొప్పవేసవిని కొలఁకులు వేగ నీరుతగ్గునట్లు, వేగనవి క్షీణింప సాఁగినవి. రాక్షసాధిపతియగు రావణుఁడు, అట్లు తనసైన్యముహతమై విరూపాక్షుఁడు వధింపఁబడుటకు రెండింతలుగా క్రుద్ధుఁడయ్యెను. అతఁడు తనసైన్యము వానరులచే వధింపఁబడుచు మిక్కిలియు క్షీణించుటంజూచి, యట్లు యుద్ధమున తనకు దైవము విపరీతమగుటను గని, మిక్కిలియు వ్యథనొంది, సమీపంబుననున్న శత్రుహంతయగు మహోదరుంజూచి 'వీరా! మహాబాహూ! ఇట్టిసంకటకాలమున నీయొక్కని నమ్మియే నేను జయింతునని యాశగలిగియున్నాను. కాన యిప్పుడు శత్రుసేనను జంపి పరాక్రమము నెఱపుము. నీయేలినవానియుప్పుదిన్నఋణము దీర్చుకొనుట కిదియెకాలము. కాన వెస్సఁబోరాడుము' అనెను. రావణుఁడిట్లుచెప్పఁగా రాక్షసశ్రేష్ఠుఁడగు మహోదరుఁడు వల్లెయని, మిడుత యగ్గినఁఱుకునట్లు, పగవారిసైన్యముంజొచ్చెను.

అంత మహాబలుఁడును మిక్కిలి తేజోవంతుఁడునగు నమ్మహోదరుఁడు, ఏలినవాని వాక్యము శిరసావహించి తనవీర్యముచేతం బ్రేరితుఁడై వానరులతో యుద్ధము గావించెను. మహాబలవంతులగు వానరులును గొప్పగొప్పశిలలు గయికొని, భయంకరమగు రాక్షససేనను జొచ్చి రాక్షసులను వధించిరి. అమ్మహాయుద్ధమున, మహోదరుఁడును మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై, కాంచనాలంకృతములగు బాణములు ప్రయోగించి వానరుల కాలుసేతులను దొడలను ఖండించెను. అంత నవ్వానరులందఱును రాక్షసులచే మిక్కిలియుఁ బీడితులై కొందఱు దశదిశలకుం బాఱిరి. కొందఱు సుగ్రీవు నాశ్రయించిరి. అట్లు వానరమహాసేన మిక్కిలియు భంగమునొంది పాఱుటం జూచి సమీపముననున్న సుగ్రీవుఁడు మహోదరునిమీఁదికిఁ బోయెను. మహాతేజుం డవ్వానరేశ్వరుఁడు సుగ్రీవుఁడు, ఆరాక్షసుని వధించుటకై పర్వతంబంతటి పెద్దదై బెట్టిదముగానున్న యొకశిలనుదీసి వానిపై వైచెను. మహోదరుఁడట్లు తనపైకి వేగవచ్చుచున్నయాశిలను జూచి, యెంతమాత్రము తత్తఱపడక, దారసింప నలవిగానియాశిలను బాణములచే ఛేదించెను. ఆశిల, యారాక్షసుని బాణసమూహములచే వేయిదునియలుగాఁ దుండింపఁబడి, చెల్లచెదరయి, గుమిగూడియున్న గ్రద్దలగుంపు నలుగడల చెల్లచెదరయి నేలకు వ్రాలునట్లు, నేలంబడెను. సుగ్రీవుఁడు తాను బ్రయోగించినశిల యట్లు వ్రక్కలగుటను జూచి కోపావేశము నొంది, యుద్ధాగ్రమున వృక్షమొకటి పెల్లగించి యారాక్షసునిపై వైచెను. పగవారిపట్టణముల జయించునట్టిశూరుఁ డమ్మహోదరుఁడు బాణములచే నావృక్షమును గూడ వ్రక్కలుసేసెను. అట్లు వృక్షముగూడ వ్యర్థముకాఁగా నాసుగ్రీవుఁడు కుపితుఁడై పరిఘమొకటి నేలంబడియుండుటనుగాంచెను. సుగ్రీవుఁడు తలతలమెఱయుచున్న యాపరిఘమునుగొని, తనహస్తలాఘవ మమ్మహోదరునకుఁ జూపుచు, దానిని గిఱగిఱం ద్రిప్పి దానిమొనచే వానిమేటిగుఱ్ఱములను వేగఁగూల్చెను. అంతవీరుం డమ్మహోదరుఁడు, గుఱ్ఱము దెగినయమ్మహారథమునుండి నేలకుఱికి, మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై గద చేతంగొనెను. అవ్వీరులిరువురును, మెఱయుచున్న గదను పరిఘమును గేలం ద్రిప్పుచుండుటం జేసి మెఱుపులతోఁగూడిన మేఘములవలె నొప్పుచు గర్జించుచు యుద్ధంబున నాఁబోతులవలెం జూపట్టుచు నొండొరులం దాఁకిరి. అంత మహోదరుండు క్రుద్ధుఁడై సూర్యకాంతితో జ్వలించుచున్న తనగదను సుగ్రీవునిపై వైచెను. అమ్మహాయుద్ధమున మహాబలవంతుఁడగు వానరేశ్వరుఁడు సుగ్రీవుఁడు, మిక్కిలియు భయంకరమయిన మహోదరునిగద తనపయికి వచ్చుచుండుటను జూచి కోపంబున కన్నెఱ్ఱఁబాఱి, పరిఘము నెత్తికొని దానిచే నాగదనుగొట్టెను. ఆపరిఘమును గదయు నొండొంటిఁదాఁకి భిన్నములై నేలంబడినవి. అంత మహాతేజుండగు సుగ్రీవుండు, బంగారుకట్లచే రంగారుచు బెడిదమైయున్న యొకయినుపరోఁకలి నేలం బడియుండఁగా నెత్తికొనెను. ఆసుగ్రీవుఁ డాముసలము నెత్తికొని మహోదరునిపై వేసెను. మహోద

రుఁడును మఱియొకగదను వైచెను. ఆరెండును ఒండొంటిందాఁకి భిన్నములై నేలం బడినవి. అంత నాయుధములన్నియు భగ్నములుకాఁగా, తేజంబును బలంబును దయివాఱ నాయిద్దఱును మండుచున్నయగ్నిహోత్రములవలెఁ జూపట్టుచు, పిడికిళ్ల నొండొరుల మార్కొనిరి. అప్పుడు యుద్ధమునఁ బరాజయ మెఱుఁగనివారై పరులవీఁచ మడంచుపట్టివీరు లయ్యిరువురును, నొండొరులం గొట్టుచు మాటిమాటికి పెడబొబ్బలు పెట్టుచు, నఱచేతుల నొకరినొకరు చఱచి యిరువురు నేలపయింబడి శీఘ్రమునఁ బయికిలేచి, యొండొరులం గొట్టుచు, నొకరినొకరు బుజములనెత్తి విసరివైచుచు నిట్లు బాహుయుద్ధము చేసిచేసి యలసట నొందినవారయిరి. అంత మహావేగుండగు మహోదరుఁడు, సమీపమున నేలంబడియున్న యొకఖడ్గమును పలుకయును గయికొనెను. మహోదరునికన్న మఱింత వేగవంతుఁడగు వానరోత్తముఁడు సుగ్రీవుఁడు, అట్లు నేలంబడియున్న మఱియొకఖడ్గమును డాలును గయికొనెను. ఆ యుధవిద్యయందుఁ బండితులగు నయ్యిరువురును, ఖడ్గముల నెత్తికొని, యుద్ధమున నుబ్బుగదుర, రోషంబున నంగము లుప్పొంగ, గర్జించుచు, నొండొరులపయి కడరిరి. అయ్యిరువురు నొండొరులయెడఁ గ్రుద్ధులయి యొకరినొకరు గెలుచుటకై తమకము గొని, శీఘ్రగతిని సవ్యాపసవ్యములుగా మండలములు దిరుగుచుఁబోరిరి. శూరుఁడును మహావేగుండు నగునమ్మహోదరుఁడు పరాక్రమగర్వితుఁడేకాని సూక్ష్మబుద్ధి కాఁడు గావున ఖడ్గమును గుఱితప్పి సుగ్రీవునిచేతి పెనుడాలునందుఁ దగుల్కొన వేసెను. అంత మహోదరుఁడు పలుకయందుఁ గ్రుచ్చుకొన్న ఖడ్గమును లాగుచుండఁగా నింతలో కపికుంజరుఁడగు సుగ్రీవుఁడు, బొమిడికముతోఁగూడి కుండలములతో భూషితమైయున్న వానిశిరస్సును దెగవ్రేసెను. అట్లు మహోదరుఁడు తలదెగి నేలం బడుటనుజూచి, రావణునిసేన యచటనిలువక పరుగెత్తెను. మహోదరునివధించి సుగ్రీవుఁడు సంతోషమున వానరులుం దానును సింహనాదము గావించెను. రావణుండందులకు కుపితుండయ్యెను. రాముఁడు మిక్కిలిహర్షమునఁ బ్రకాశించెను. అంత రాక్షసులందఱును మనంబులు విన్ననై, మొగములు వెలువెలఁబోవ, భయమున మనసు కుదురుతప్ప పరుగెత్తిరి. మహాపర్వతమునఁ గొంతభాగమును బడఁజిమ్మినట్లు, అమ్మహోదరుని నేలంబడఁగూల్చి సూర్యకుమారుఁడగు సుగ్రీవుఁ డవ్వానరసైన్యమునందు సూర్యుఁడు నిజతేజంబున దుర్ధర్షుండై వెలుంగునట్లు, తానును ధర్షింపరానివాఁడై జయలక్ష్మిచే నెంతయుఁ బ్రకాశించెను. అంత మహాత్ముఁడగు వానరేంద్రుఁడు సుగ్రీవుఁడు యుద్ధముఖమున విజయమునొంది, యాకాశమున దేవతలును యక్షులును సిద్ధులును భూమియందలి ప్రాణులును గుంపులుగొని మిక్కిలి సంతోషావేశమునఁ బొగడ నెగడుచుండెను. ఇది తొంబదియెనిమిదవ సర్గము.

రావణునిమంత్రియగు మహాపార్శ్వుఁడంగదునిచే హతుఁడగుట.

మహోదరుఁడు సుగ్రీవునిచే హతుఁడగుటంజూచి యంత మహాబలుఁడగు మహాపార్శ్వుఁడు, కోపంబునఁ గన్నెఱ్ఱఁ బాఱ, భయంకరముయిన యంగదుని సైన్యమునుజొచ్చి బాణములచేఁ గలంచిపుచ్చెను. ఆమహాపార్శ్వుఁడు, వాయువు కాఁడల నుండి పండ్లను బడరాల్చునట్లు, మేటివానరవీరుల తలలను కుత్తుకలనుండి బాణములచే డొల్లనేసెను. ఆరాక్షసుఁడు మిక్కిలి కుపితుఁడై కొందఱు వానరుల బాహువులను, కొందఱ మూఁపులను, కొందఱ డొక్కలను, బాణములచే విదారించెను. అట్లు మహాపార్శ్వుని బాణవర్షములచేఁ బీడితులై యవ్వానరులందఱును, నోర్వఁజాలక, విషాదమున యుద్ధవిముఖులై సొమ్మసిలిరి. మహాబాహుఁడగు నంగదుఁడు తన సైన్య మారాక్షసునిచే నలఁగి భయముగొని యుండుటనుజూచి సముద్రముపర్వకాలమునఁ జిమ్మరేఁగునట్టు లురవడి చూపసాఁగెను. వానర శ్రేష్ఠుఁడగు సంగదుఁడు బంగారుకట్లునేసి యుండుటవలన సూర్యకిరణములవలె వెలుంగుచున్న యినుపగుదియను దీసికొని యుద్ధమున మహాపార్శ్వునిపయిఁ బడవేసెను. దుర్బుద్ధియగు నామహాపార్శ్వుఁడు, ఆ దెబ్బకు సారథియుం దానును దెలివిదూలి మూర్ఛితుఁడై, రథమునుండి, నేలంబడెను. మహాబలుఁడై కాటుకరాశియుంబోలె నల్లనైన మేనుగలిగి, మిక్కిలియు వీర్యశాలియు తేజోవంతుఁడునగు గవాక్షుఁడును జాంబవంతుఁడును, మేఘమువలెఁ బఱపై నల్లగాఁ గారుకొనుచున్న తమభల్లూకసేననుండి వేగ వెలువడి, క్రుద్ధులై పర్వతశిఖరసమానమును విశాలమునైన పెనుశిలను జేకొని, వేగమున మహాపార్శ్వుని యశ్వములనుజంపి వానిరథమును నుగ్గు గావించిరి. మహాబలుఁడగు మహాపార్శ్వుఁడు, కొంతవడికిఁ దెలివినొంది, యయ్యంగదునిపైఁ బెక్కుబాణములుబఱపి యతనిని మిక్కిలియు నొప్పించెను. ఆమహాపార్శ్వుఁడు, భల్లూకపతియగు జాంబవంతుని వక్షమునందు మూఁడుబాణములును, గవాక్షునిఁ బెక్కుబాణములను నొప్పించెను. అట్లు జాంబవంతుఁడును గవాక్షుఁడును, బాణపీడితు లగుటంజూచి, యంగదుఁడు కోపావిష్టుఁడై భయంకరమగు పరిఘమును గయికొనెను. వేగవంతుఁడగు వాలికుమారుఁడంగదుఁడు, మిక్కిలియు కుపితుఁడై మహాపార్శ్వుని వధార్థమై, యతఁడు, దూరమున నుండుటవలన సూర్యకిరణములంబోలె బంగారుకట్లచేఁ బ్రకాశించుచున్న యాయినుపగుదియనుబట్టి రెండుచేతులతోను గిరగిరం ద్రిప్పి వానిపయిం బడవైచెను. బలవంతుఁడగు నంగదుఁడట్లు బలము కొలఁదిని జిమ్మివైవఁగా నాపరిఘము మహాపార్శ్వుని బిఁట్టుగాఁ దాఁకి, వానిచేతినుండి బాణసహితమగు ధనుస్సును, వానిశిరస్సునుండి బొమిడికమును బడవైచెను. ప్రతాపవంతుఁడగు నంగదుఁడు వానిని వేగఁగిట్టి, క్రుద్ధుండై, కుండలములు దులకించుచున్న వానికర్ణమూలమున నఱచేతం జఱచెను. మహావేగవంతుఁడును మిక్కిలి కాంతిసంపన్నుఁడునగు నమ్మహాపార్శ్వుఁడు, క్రుద్ధుఁడై, మిక్కిలియుం బెద్దదియైన యొకగండ్రగొడ్డలిని నొకచేతం గొనెను.

ఆగండ్రగొడ్డలి ప్రతిదినమును నూనెచఱుచుచుండుటవలనఁ ద్రుప్పులేక నిర్మలమై, పర్వతసారమువలె నతికఠినమై శిథిలముగాక యుండెను. మహాపార్శ్వుఁడట్లు పరమ క్రుద్ధుఁడై యాపరశ్వథమును నంగదునిపయి నైచెను. అమ్మహాపార్శ్వుఁడట్లు అంగదుని యెడమభుజఫలకముమీఁద నాగండ్రగొడ్డలిని బెట్టిదముగా వ్రేయఁగా, నతఁడు కుపితుఁడై లాఘవమున నావ్రేటు దప్పించుకొనెను. అయ్యంగదుఁడు,తనతండ్రియగు వాలివంటి పరాక్రమశాలియు శూరుఁడునుగాన, మిక్కిలి క్రుద్ధుఁడై వజ్రాయుధము వంటి కఠినంపుఁబిడికిలి నలవరించి త్రిప్పెను. ఆయంగదుఁడు ఆయపట్టుల నెఱింగిన వాఁడు గావున మహాపార్శ్వునివక్షఃస్థలమున గుండెకు సరిగా నింద్రునివజ్రమువంటి పిడికిటం బొడిచెను. అమ్మహాయుద్ధమున నయ్యంగదుని పిడికిటిపోటునకు మహాపార్శ్వుఁడు గుండె తటాలున వ్రీలఁగా, వాఁడు ప్రాణములువీడి నేలంగూలెను. ఆమహాపార్శ్వుఁడు నేలంగూలఁగానే, యారాక్షససేనయంతయు మిక్కిలి కలఁగఁబాఱెను. అప్పుడు యుద్ధమున రావణునకు మిక్కిలియుఁ గ్రోధము కలిగినదయ్యె. అప్పుడు వానరులు మిక్కిలియు నుబ్బుచెంది లంకను దానికోటబురుజులను పురద్వారములను బ్రద్దలుగాఁబగులునో యన్నట్లు, బిట్టుగా సింహనాదములు సేసిరి. అట్లు దేవేంద్రుఁడును దేవతలును, సంతోషమున మహాధ్వని గావించిరి. అంత నింద్రునకు శత్రువయిన రాక్షసేంద్రుఁడు రావణుఁడు, నట్లు దేవతలును వానరులును గావించిన మహాధ్వనినివిని కుపితుఁడై మరల యుద్ధమున కభిముఖుఁడై నిలిచినవాఁడయ్యె. ఇది తొంబదితొమ్మిదవసర్గము.

రామరావణయుద్ధారంభము.

రావణుం డమ్మహాయుద్ధమున మహాబలుఁడును వీరుండునగు నవ్విరూపాక్షుఁడు హతుఁడగుటయు, పిదప మహోదరుఁడును మహాపార్శ్వుఁడును హతులగుటయును, జూచి, మిక్కిలి కోపావేశమునొందెను. ఆరావణుఁడు సారథిని రథము దోలుమని చెప్పి వానితో 'నేనిదిగో * నిపుడు రామలక్ష్మణులనుజంపి, యిదివఱకు హతులయిన మంత్రులకును ముట్టడివేయఁబడిన లంకాపట్టణమునకు దుఃఖము నెల్లఁ బోఁగొట్టెదను. సీతయనెడి పువ్వుగలదై ఫలము లొసంగుచు, సుగ్రీవుఁడు జాంబవంతుఁడు కుముదుఁడు నలుఁడు మైందుఁడు ద్వివిదుఁడు అంగదుఁడు గంధమాదనుఁడు హనుమంతుఁడు సుషేణుఁడు మఱియుఁ దక్కిన వానరయూథపతులందఱును చిన్నఱెమ్మలుగాఁగలిగి యున్న రాముఁ డనువృక్షమునిపుడు యుద్ధమున ఖండించెదను' అనెను. రథికులలోనెల్లగొప్పవాఁడగు నారావణుఁడు,రథఘోషముచే దశదిశలును మ్రోయించుచు శీఘ్రమున రామునిమీఁదికిం బోయెను. ఆమహాధ్వనిచేతం బూరి

* ఇచట వాస్తవార్థమును యథాయోగ్యముగ గ్రహించుకొనునది.

తమై భూమియంతయు నదులతోను పర్వతారణ్యములతోను గజవరాహాదిమృగములతోను జలనమునొందెను. ఆరావణుఁడు మిక్కిలియు భయంకరమై మహాతీక్ష్ణమగు తామసాస్త్రమును బ్రయోగింపఁగా, వానరులందఱును నయ్యస్త్రముచే దగ్ధులై నలుగడలఁ ద్రెళ్ల నారంభించిరి. ఆయస్త్రము బ్రహ్మ స్వయముగా నిర్మించినదిగావున వానరులు దానికి సహించి నిలువఁజాలక భంగమునొంది పరుగెత్తఁగా నందువలన నపుడు బెట్టిదముగా దుమ్మురేఁగెను అట్లు వానరసైన్యములు పెక్కులు రావణుని మేటిబాణములచే వందలకొలఁదిని భంగమునొందుటనుజూచి రాముఁడు యుద్ధమునకు సన్నద్ధుఁడయ్యెను. *రాక్షససింహుఁడు రావణుఁ డట్లు వానరసైన్యములను బాఱఁదఱిమి, యంత పరాజయమెన్నఁడెఱుఁగనిరాముఁడు ఉపేంద్రునితోఁ గూడిన యింద్రునివలెఁ దమ్ముండగు లక్ష్మణునింగూడి, పెనువింటిని నేలనూని యాకాశము నొఱయునట్లు చూపట్టుచు తామర రేకులంబోని వాలుఁగన్నుఁగవయు, నిడుదలయిన బాహువులును నొప్పు గులుక పగవారి పీఁచమడంచువాఁడై నిలుచుండఁగాఁ గాంచినవాఁడయ్యె. అంత మహాతేజుండును బలవంతుఁడునగు రాముఁడు లక్ష్మణుండును దానును, యుద్ధమున వానరులు భంగము నొందుటయు, రావణుఁడు తమపైకి వచ్చుచుండుటయుఁజూచి చిరకాలమున కతనితోఁ బోరుగలిగెనని యుబ్బునొంది వింటిని నడుమం బట్టుకొని †యంత మిక్కిలివేగంబున నా పెనువింటి మహాధ్వనిచే భూమినంతయు భేదించునట్లుంబోలె, నారి సారింపఁ దొడంగినవాఁడయ్యె. అప్పుడు రావణుఁడు ప్రయోగించిన బాణజాలముచేతను రాముఁడు నారిసారించుట చేతనుం బుట్టినధ్వనికే యారాక్షసులును వానరులును పెక్కండ్రు వందలకొలఁదిని బడిరి. ఆరావణుఁడు రాజకుమారులయిన యారామలక్ష్మణుల బాణములబారిం బడునట్లు నిలిచినపుడు, అమావాస్యయందు చంద్రసూర్యుల సమీపముననున్న రాహువువలెఁ బ్రకాశించెను. లక్ష్మణుఁడు మొదటఁ దానా రావణునితో వాఁడిబాణములం బోరఁగోరి, వింటినాకర్షించి యగ్నిజ్వాలలవంటి బాణములను బ్రయోగించెను. లక్ష్మణుఁడు విలుగొని యాబాణములను బ్రయోగించినమాత్రముననే మహాతేజుండగు రావణుఁడు వానిని ఆకాశముననే బాణములేసి వారించెను. రావణుఁడు తనహస్తలాఘవమును జూపుచు, లక్ష్మణుని బాణములం దొక బాణము నొక్క బాణమునను, మూటిని మూటను, పదింటిని పదింటను ఇట్లన్నింటి కన్ని బాణములేసి ఖండించెను. అంత యుద్ధంబుల జయశీలుఁడగు

* ఈవాక్యములచే రాముని యపరాజితత్వమును, నిరవధికసౌందర్యనిధి యగుటచే వైరమువిడిచి యతనిసౌందర్యము నిరంతరమును ననుభవింపఁదగినదై యుండుటయు, రావణునిదుర్బుద్ధియు, ఆవర్తముచేత అమృతప్రవాహమునుంబోలె మేటిధనువుచేత నావర్తితమైన శ్రీరామదేహలావణ్యామృతపూరమునం దవగాహనము సేయకున్న యతనిదౌర్భాగ్యమును చెప్పఁబడినవి.

† ఇట 'వింటిని నడుమంబట్టుకొని నారిసారించుటయు' ననియిట్లు రాముఁడు విలంబము చేయుట రావణుఁ డింతకయినను నమ్రుఁడైవచ్చునో యేమోయని దయాళుత్వము నెఱపుట తెలియునది.

రావణుఁడు లక్ష్మణుని బాణము లొక్కటియుఁ దన్నుఁ దాఁకనందున నతనిని సరకుసేయక యతిక్రమించి పర్వతమువలె స్థిరముగా నిలుచున్న రామునిఁ దారసించెను. రావణుఁ డట్లు రాముని దాఱ్కొని కోపంబున కన్నులెఱ్ఱఁబాఱ, రామునిపయిని బాణవర్షము గురిసెను. అంత, రాముఁడు రావణుని వింటినుండి జలధారలవలె నెడతెగక వేగ బాణములు వచ్చుచుండుటంజూచి, తా నమ్ములపొదినుండి వేగ కత్తివాతి బాణములం దీసెను. * అంత రాముఁడు దేదీప్యమానములై కుపితములయిన సర్పములుంబోని మహాభయంకరము లయినయాబాణసమూహములను వాఁడిభల్లములచేఁ దుండించెను. అప్పుడు రాముఁడు రావణునిని, రావణుఁడు రామునిని, వేగ దలపడి, యొకరిపయినొకరు పలువిధములగు వాఁడిబాణములను వేగ కురియించిరి. అప్రతిహతులగు నయ్యిరువురు, ఒండొరుల బాణవేగములను వారించుచు చాలసేపువఱకు చిత్రముగా సవ్యాపసవ్యమండలములం దిరుగుచుఁ బోరిరి. అట్లయ్యిరువురు, యముఁడును నతనినడంచిన రుద్రుండునుంబోలి, భయంకరులై బాణములు ప్రయోగించుచు నొక్కటం దలపడి పోరాడుచుండుటంజూచి సమస్తభూతములును దిగులొందినవి. వర్షాకాలమున మెఱుపువరుసలతోఁ గూడిన మేఘములు దట్టముగాఁ గ్రమ్మినట్లు, ఆకాశమున నపుడు నానావిధములగుబాణములు దట్టముగా నిండియుండినవి. ఆకాశమున బాణములు నిండి జడివలె ముసరి నడుమనడుమ నవకాశములుండుటం జేసి కిటికీలు నిర్మించినట్లుండెను. సూర్యుఁ డస్తమించినపిదప, మహామేఘము లేచి ధారలుగా వర్షించి మఱియుఁ జీఁకటిగాఁ జేయునట్లు, అయ్యిరువురును, మహావేగములును మిక్కిలియుఁ దీక్ష్ణములును గద్దఱెక్కలు గట్టంబడుటంజేసి మంచిఱెక్కలు గలవియు, మిక్కిలివాఁడిమొనలతోఁ గూడినవియునగు బాణములను దట్టముగాఁ బ్రయోగించి యుద్ధంబంతయు గాఢాంధకారముగలిగి భయంకరమగునట్లు గావించిరి. అప్పుడయ్యిరువురును నొండొరుల వధింప నువ్విళ్లూరుచు వృత్రుఁడును నింద్రుండునుంబోలె భయంకరముగాఁ బోరిరి. అయ్యుద్ధం బెట్టివారికిని దారసింపఁ దరముగాకయు నిట్టిదట్టిదని చింతింప నలవిగాకయు నుండెను. అయ్యోద్ధలును మేటివిలుకాండ్రు. ఇద్దఱును సమస్తాయుధములందు నిపుణులు. ఇద్దఱును నస్త్రవేత్తలలో నుత్తములు. కావున నిద్దఱును యుద్ధమున సమానముగా విహరించిరి. అయ్యిరువురు నేయేమండలగతులందిరుగుదురో యాయాగతులచేత నాయావైపుననుండి సముద్రములనుండి వాయువేగమునఁ దరంగములు లేచునట్లు, బాణపరంపరలు వెడలుచుండినవి. అంత లోకరావణుండగు రావణుండు హస్తమున బాణప్రయోగము సేయుచునే రామునిలలాటమందు బాణపంక్తిని గాఁడ నేసెను. బెడదనుగు రావణుని వింటినుండి విడివడి నల్లకలువరేకులకాంతిఁ దళుకొత్తుచున్న యాబాణపంక్తి రామునిశిరమున నాటియు

* ఇట అమావాస్యయందె రామరావణయుద్ధము జరుగుచున్నదిగాన అమావాస్యయందని యధ్యాహరించుకొనుట యొప్పియున్నది.

న్నను నతఁ డెంతమాత్రమును వ్యథ నొందఁడయ్యెను. అంత మహాతేజుండును వీర్యవంతుఁడునగు రాముఁడు, రౌద్రాస్త్రమంత్రమును జపించుచు నాయస్త్రపువిస్తారములయిన పెక్కుబాణములను దీసి క్రుద్ధుఁడై వింటినాకర్షించి రావణునిపయిఁ బ్రయోగించెను. ఆబాణములు మహామేఘమునుంబోని రావణుని యభేద్యకవచమును దాఁకి యాకవచబలముచే నతని కెంతమాత్రము నపుడు వ్యథ గలిగింపవయ్యె. అంత యుద్ధమున సమస్తాస్త్రనిపుణుండగు రాముఁడు మరల రథగతుం డగురావణుని లలాటమునందు గొప్పయస్త్రమంత్రముచే నభిమంత్రించి బాణములం బ్రయోగించెను. అమ్మహాస్త్రవికారములయిన బాణములు రావణునిబాణములను భేదించి రావణునిచే వారింపఁబడినవై, కుపితములయి యార్పులుపుచ్చుచున్న యైదుతలల సర్పములవలె భూమింజొచ్చినవి. రావణుఁడు రాముఁడు ప్రయోగించిన యయ్యస్త్రమును వారించి క్రుద్ధుఁడై మిక్కిలిభయంకరమయిన యాసురాస్త్రమును బ్రయోగించెను. అయ్యాసురాస్త్రమునుండి సింహముఖములును, వ్యాఘ్రముఖములును, కంకముఖములును, కాకముఖములును, గృధ్రముఖములును, డేఁగముఖమువంటి ముఖములుగలవియు, నక్కముఖముగలవియు, తోఁడేళ్లముఖములు గలవియు, నోరుదెఱచుకొనిభయంకరములైన యయిదుతలల సర్పములంబోని యాకారముగలవియు నగువాఁడిబాణములు మఱియు నితరములైనవియు పెక్కులు వెడలినవి. మహాతేజుండును మాయావియునగునా రావణుఁడు, క్రుద్ధుఁడై సర్పమువలె నూర్పుల నిగిడించుచు నయ్యాసురాస్త్రమహిమంజేసి ఖరముఖములును, వరాహముఖములును, శునకముఖములును, కుక్కుటముఖములును, మకరముఖములును, సాధారణ సర్పముఖములును నగు వేఱుబాణములను మఱియు నితరములయిన వాఁడిబాణములను, రామునిపయిం బ్రయోగించెను. అట్లయ్యాసురాస్త్రము దారసింపఁగా అగ్నితుల్యుండగు రాముఁడు మిక్కిలి యుత్సాహంబుదీపింప, నాగ్నేయాస్త్రమును బ్రయోగించెను. అయ్యాగ్నేయాస్త్రప్రభావమువలన, అగ్ని ధగధగజ్వలించు ముఖములుగలవియు, సూర్యముఖములును, చంద్రముఖములును, అర్ధచంద్రముఖములును, ధూమకేతుముఖములును, గ్రహనక్షత్రముఖములును, మహోల్కాముఖములు వర్తించునవియు మెఱపుజ్వాలలంబోనివియు, నగు బాణములును మఱియు నితరములయిన వాఁడిబాణములును వెడలినవి. రావణుని యాసురాస్త్రమున జనించిన భయంకరబాణములు రాముని యాగ్నేయాస్త్రము దాఁకఁగానే కొట్టువడి యాకాశముననే వేయిదునియలుగా రూపుమాసినవి. ఎట్టి కార్యమునేని చుల్కఁగ గావించు రాముఁ డపుడు, అయ్యాసురాస్త్రమును నివారించుటనుజూచి, యంత కామరూపులగు సుగ్రీవాదులును వానరవీరులందఱును, రామునిఁ బరివేష్టించి యుబ్బున నార్పులు సెలఁగించిరి. అప్పు డమ్మహాయుద్ధమున రాముఁడు రావణహస్తప్రయుక్తమైన యా యాసురాస్త్రమును ప్రతిహతము గావించి ముద

మునొందెను. వానరేశ్వరులును ముదమునొంది బిగ్గఱ నార్పులు గావించినవారయిరి. ఇది నూఱవసర్గము.

రాముఁడు కొంతవిశ్రమించుచుండఁగా లక్ష్మణవిభీషణులు రావణుని హయరథసారథులను నుఱుమాడుట; రావణుఁడు విభీషణునిపైఁ బ్రయోగించినశక్తిని లక్ష్మణుఁడు ఖండింపఁగా రావణుఁడు మయనిర్మితమైన యమోఘశక్తిచే లక్ష్మణుని మూర్ఛితుం జేయుట; రాముఁడు హనుమదాదుల లక్ష్మణుని రక్షింప నియమించి రావణు నమితబాణవర్షముల నొప్పించుట.

రాక్షసరాజగు రావణుఁడు, అయ్యాసురాస్త్రము ప్రతిహతమగుటంజూచి, క్రోధమినుమడింప మఱియొక యస్త్రమును బ్రయోగించువాఁడయ్యె. మహాతేజుండగు రావణుఁడు మయునిచే విహితమై రుద్రదేవతాకమై భయంకరమయిన మఱియొక యస్త్రమును రామునిపయిం బ్రయోగింపసాగెను. అంత నతని ధనువునుండి దేదీప్యమానములై వజ్రాయుధమునకుం గలసారముగలిగినశూలములును గదలును ముసలములును వెడలినవి. ప్రలయకాలమున మహావాయువులు వెడలునట్లు,నానావిధములును దీక్ష్ణములును, నగుగుదియలును కపటములగు పాశములను జ్వలించుచున్న వజ్రములును, భయంకరములై మహావేగమున వెడలినవి. శ్రీమంతుఁడును మహాకాంతిసంపన్నుఁడును దివ్యాస్త్రవిదులలోనెల్ల మేలుబంతియునగు రాముఁడు, గొప్పదియగు గాంధర్వాస్త్రముచేత నారౌద్రాస్త్రమును బడఁగొట్టెను. మహాత్ముఁడగు రాముఁ డారౌద్రాస్త్రమును హతము సేయఁగా, రావణుఁడు కోపంబునఁ గన్నులకెంపు గదుర సౌరాస్త్రమును బ్రయోగించెను. అంత భయంకరవేగుండును బుద్ధిమంతుండునగు రావణుని వింటనుండి, ధగధగ మెఱయుచున్న గొప్పగొప్పచక్రాయుధములు వెడలినవి. దేదీప్యమానములై చంద్రసూర్యగ్రహసమానాకారములైయున్నయాబాణములు నిందునందు వ్యాపించుచుండఁగా, చంద్రసూర్యులును గ్రహములును క్రిందఁ బడుచున్నటువలె ఆకాశమును దిక్కులును బ్రకాశించినవి ఆ రాముఁడు సేనాముఖముననిలిచి రావణుఁడు ప్రయోగించిన యాచక్రములను చిత్రములయిన యితరాయుధములను, బాణసమూహములఁ బరపి ఖండించెను. రాక్షసేశ్వరుఁడగు రావణుఁడు, ఆసౌరాస్త్రముగూడ ప్రతిహతమగుటనుజూచి, రామునిమర్మస్థానములం దన్నిటను,పదిబాణములఁ గ్రుచ్చి నొప్పించెను. రావణుఁడు మహాధనుస్సునుండి ప్రయోగించిన యాపదిబాణములు గ్రుచ్చుకొనఁగా రాముఁడు మహాతేజుండు గావునఁ నెంతమాత్రము చలించినవాఁడు గాఁడయ్యె. అంత యుద్ధంబుల జయంబు గొనుచుండు రాముఁడు, మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై రావణుని యవయవములం దన్ని

టను పెక్కుబాణములఁ జొప్పించి నొప్పించెను. అట్లు రావణునిఁబ్రహరించి రాముఁడు గొంత విశ్రమించియుండునంతలో రామునితమ్ముఁడును శత్రువీరుల నణుమాడువాఁడును బలవంతుఁడునగు లక్ష్మణుఁడు ఏడుబాణములు దీసికొనెను. మహాతేజుఁడగు లక్ష్మణుఁడు మహావేగము లయినయాబాణములచే మనుష్యుని తలవ్రాసియున్న రావణుని ధ్వజమును పెక్కుపఱియలుగా ఖండించెను. కాంతిమంతుఁడును మహాబలసంపన్నుఁడునగు లక్ష్మణుఁ డంత నొక్కబాణమున కుండలాలంకృతమయిన రావణుని సారథిశిరముఁ దెగవ్రేసెను. లక్ష్మణుం డయిదు వాఁడిబాణముల రాక్షసేంద్రుఁడగు రావణుని మహాధనుస్సును, ఏనుఁగుతొండమువంటిదానిని, తునియలుగా వించెను. ఇట్లు విలువిఱిగి రావణుఁడు మిన్నకుండఁగా, విభీషణుఁడు దూఱితలపడి, నీలమేఘసమానములును పర్వతాకారములునగు రావణుని యుత్తమాశ్వములను గదచేఁ గొట్టిచంపెను. మహావేగుఁడగు రావణుఁడు గుఱ్ఱములు హతములుకాఁగా, వేగ తనమహారథమునుండి నేలకు దూఁకి, తమ్ముండగు విభీషణునియెడ మహాకోపంబు పూనినవాఁడయ్యెను. అంత మహాశక్తిమంతుఁడును బ్రతాపవంతుఁడు నగు రావణుఁడు, దేదీప్యమానమై వజ్రమువలె వెలుంగుచున్నశక్తిని విభీషణునిపైఁ బడవైచెను. లక్ష్మణుఁడు, ఆశక్తి విభీషణునిమీఁద రాకమునుపే దానిని మూఁడుబాణముల ఛేదించెను. అంత నపుడు యుద్ధమున వానరులు బిట్టుగ నార్పులు చెలఁగించిరి. కాంచనమాలికచే నలంకృతమైన యాశక్తి మూఁడుతునియలుగాఁ దునిసి, మిణుంగుఱులు సెదర, జ్వలించుచు నాకాశమునుండి పెద్దయుల్కపడినట్లు, నేలంబడెను. అంత, నారావణుఁడు, చందనాదులచే మఱింత యర్చితమై యమునికిఁగూడఁ దారసింప నలవిగానిదై నిజతేజమున వెలుంగుచున్న మహాశక్తిని గ్రహించెను. ఎట్టివారికిని దారసింప నలవిగానిదై దేవేంద్రుని వజ్రాయుధమువలెఁ గాంతిఁ దేజరిల్లుచున్న యామహాశక్తి, బలవంతుఁడగు రావణుఁడు తనబలముకొలఁదిని నురవడిం ద్రిప్పఁగా, నది జ్వలించుచు మిక్కిలియు భయంకరమై చూపట్టెను. ఇంతలో వీరుండగు లక్ష్మణుఁడు, విభీషణుఁ డట్లు ప్రాణసందేహము నొందుటనుగని, శీఘ్రమునంబోయి యతని కడ్డమునిలిచెను. వీరుఁడు లక్ష్మణుండు, ఆవిభీషణునిఁ దప్పించుటకై, వింటి నాకర్షించి, శక్తిని కేలందాల్చి యున్నరావణునిపయి బాణవర్షములు గురిసెను. మహాత్ముఁడగు లక్ష్మణుఁడు, రావణునిపై బాణసమూహములను బరఁగించుచుండఁగా, నతఁడు విభీషణునియెడఁ బరాక్రమము చూపుట కయితిలేక పోవుటచే నావిభీషణునిఁ బ్రహరించు తలంపు మానినవాఁడయ్యె. ఆరావణుఁడు, తనతమ్ముని లక్ష్మణుఁడు తప్పించుటను జూచి, లక్ష్మణు నెదుర్కొని నిలిచి యతనితో 'లక్ష్మణా! నీవు బలంబున విఱ్ఱవీఁగి, మిన్నకుండక యిట్లు విభీషణునిఁ దప్పించితివి గావున నిఁక నారాక్షసుని విడిచి యాశక్తిని నీమీఁదఁ బడవైచెదను. ఇదిపఱ కెందఱినో చంపి నెత్తురు చిన్నెలతోఁ గూడియున్న యీశక్తి యనుపగుదియవంటి నాబాహువునుండి ప్రయుక్తమై నీప్రా

దయము నుచ్చికొని నెత్తుటందోఁగి నీప్రాణములు గొనిపోవంగలదు' అనెను. ఇటు రావణుఁడు చెప్పి, మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై లక్ష్మణునిమీఁద నెనిమిదిగంటలతోఁ గూడి మహాధ్వని గలుగునట్లు మ్రోయుచున్నయాశక్తిని బ్రయోగించి యార్చెను. ఆశక్తి మయుఁడు మాయచే నిర్మించినట్టిది అదియెట్టిశత్రువుమీఁదఁ బ్రయోగించినను వ్యర్థముగాక శత్రువుల రూపుమాపుచు నిజతేజంబున జ్వలించుచున్నట్లు చూపట్టుచుండెను. అట్లు రావణుఁడు బెట్టిదమైన యురవడితో దానిని బ్రయోగింపఁగా నది యింద్రునివజ్రముంబోలె బిట్టు మ్రోఁగుచు యుద్ధాగ్రంబున లక్ష్మణుని మీఁది కడరెను. రాముఁడు దానినిజూచి 'లక్ష్మణునికి శుభంబగుఁగాక' యని తమ్మునికి మంగళాశాసనముగావించి యాశక్తినుద్దేశించి 'నీవు చంపఁబూనిన పూన్కి విఫలమయి వ్యర్థమగుదువుగాక' యని వెంటనే చెప్పెను. రావణుఁడు యుద్ధంబునఁ గ్రుద్ధుఁడై సర్పముంబోని యాశక్తిని విడువఁగా నది క్షణమున నెట్టివారినేని భస్మము సేయఁజాలినదయ్యును, రాముఁడు వ్యర్థముగావించుటచే, శూరుఁడై యెంతమాత్రమును భయపడక నిలుచున్న లక్ష్మణునివక్షమును గాఁడినదిమాత్రమయ్యె. మిక్కిలివేగముగలిగి మహాకాంతిని వెలుంగుచున్న యాశక్తి సర్పరాజయిన యాదిశేషుని నాలుకవలె భయంకరమై తేజరిల్లుచు లక్ష్మణుని వెనువక్షముం దాఁకెను. అంత లక్ష్మణుఁడు రావణునిచేతి యురవడిచేత నాశక్తి చాల లోఁతుగా నాఁటి వక్షమును భేదింపఁగా నేలంబడెను. అప్పుడు మహాతేజుఁడగు రాముఁడు దాపుననుండెను గాన లక్ష్మణుఁ డట్టియవస్థను బొందుటనుజూచి తమ్మునియందలి నెయ్యముచే మనమున విషణ్ణుఁడయ్యెను. అతఁడు కన్నులనీళ్లుగ్రమ్మ కొంతసేపు సేయవలసినదేమియని యాలోచించి యంతఁ బ్రలయకాలాగ్నివలె మిక్కిలియు నురవడింపసాగెను. రాముఁడు 'ఇది దుఃఖమునకు సమయముకా'దని చింతించి సీత నపహరించుటంబట్టియే కాక లక్ష్మణుని నట్లుండఁగా జూచుటంబట్టియు అన్నివిధములను మిక్కిలియు ప్రయత్నపడి రావణుని వధించుటయందే కనుగలిగి నతనితో బెట్టిదముగా యుద్ధము సేసెను. ఏలన రాముఁ డంత మహాయుద్ధంబున శక్తిచే భిన్నుఁడై నెత్తుటందోఁగుచు, సర్పముతోఁగూడిన పర్వతమువలె లక్ష్మణుఁ డుండఁగాఁ జూచెను. కావుననే రావణుం జంప నిశ్చితుఁడయ్యెను. అవ్వానరశ్రేష్ఠులు బలవంతుఁడగు రావణుఁడు వైచిన యాశక్తిని, దాని దార్ఢ్యమువలన తా మెంత ప్రయత్నము చేసియు విఱువఁజాలకపోవుటయే కాక, రావణుఁడు హస్తలాఘవముగలిగి యతివేగముగా బాణజాలములు పరఁగించి నొప్పించుటవలనంగూడ, ఆశక్తిని, నెంతమాత్రము విఱువఁజాలరయిరి. మఱియు నమ్మహాశక్తి లక్ష్మణుని భేదించి భూమిం జొచ్చినది; కావునను వారికి విఱువఁ దరముగాదయ్యె. బలవంతుఁడగు రాముఁడు యుద్ధంబునం గ్రుద్ధుఁడై, భయంకరమగు నమ్మహాశక్తిని రెండుచేతులంబట్టికొని లాగి విఱిచివైచెను. రాముఁ డాశక్తినిబట్టి లాగుచుండఁగా మహాబలుండగు రావణుఁడు, అతని సమస్తావయవములందును, మర్మములభేదించు

నట్టి వాఁడిబాణములం బ్రయోగించెను. రాముఁ డాబాణములను సరకుసేయక లక్ష్మణునిఁ గౌఁగిలించుకొని హనుమంతునిని సుగ్రీవునిని నితరవానరవీరులనుం గాంచి, 'వానరోత్తములారా! ఇచటమీరు లక్ష్మణునిఁ బరివేష్టించి కాచుచుండుఁడు. చాలఁగాలముగా నువ్విళ్లూరుచున్న చాతకపక్షికి వర్షాకాలము రాఁగా మేఘముగపడినట్లు, బహుకాలముగాఁ గోరుచుండిన నాకిపుడు పరాక్రమమునకు నిదెకాలము లభించినది. కాన పాపాత్ముఁడును పాపనిశ్చయుండు నగు రావణునిప్పుడు తప్పక వధింపవలయును. వానరులారా! మీయెదుట సత్యముగాఁ బ్రతిజ్ఞసేయుచున్నాను. ఈ ముహూర్తములోనే, అంతసేపా! అతిత్వరలోనే, మీరు జగంబున రావణుఁడుగాని రాముఁడుగాని లేకపోవుటఁ జూడఁగలరు. రాజ్యముపోవుట, వనమునవసించుట, దండకారణ్యమున గ్రుమ్మరుట, సీత పగులచే స్పృశింపఁబడుట, రాక్షసులచేతం జిక్కుట, పంపోపవనాదులందు మహాదుఃఖము కలుగుట, నరకమునకుంబోలె మిక్కిలియు ఘోరమైన యీలక్ష్మణునిపాటునం గలిగిన క్లేశమును, సమస్తము నిపుడు యుద్ధమున రావణునిం జంపి దిగవిడిచెదను. ఎవనికిఁగా నేను యుద్ధమున వాలినివధించి సుగ్రీవుని వానరరాజుగావించి యీవానరసేన నిచటికిం దెచ్చితినో, మఱియు నెవనికిఁగా సముద్రమున సేతువుగట్టి దానిని దాఁటి యిచటికి వచ్చితినో, అట్టిపాపాత్ముఁడు రావణుఁడిపుడు నాకంటిబారింబడినాఁడు. *దృష్టియందు విషముగల సర్పములకంటం బడినవాఁడు జీవింపనట్లు, నాకంటిబారింబడి వీఁడు బ్రతుకఁజాలడు. దుర్ధర్షులగు వానరపుంగవులారా! మీరు పర్వతాగ్రములం గూర్చుండి, స్వస్థముగా, నాకును రావణునకును నిదె జరుగఁగల యుద్ధమును జూచుచుండుఁడు. దేవతలును ఋషులును గంధర్వులును చారణులును మఱియు మూఁడులోకములందున్నవారును, ఇప్పుడు యుద్ధమున రాముని † రామత్వమును జగదేకవీరత్వమును జూతురుగాక. లోకములందెల్లఁగల సమస్త చరాచరములును దేవతలును గుంపులుగాఁ జేరి, యిప్పుడు యుద్ధము జరిగినవిధమును భూమి యుండునంతవఱకును, నిత్యమును లోకమునఁ జెప్పుకొనుచుండునట్లు చేయునట్టి పరాక్రమకృత్యమును నిదెకావించెదను' అనెను. ఇట్లు పలికి రాముఁడు యుద్ధమున నెచ్చరికమీఱి, మేలిబంగారుచే రంగారు వాఁడిబాణముల రావణునొప్పించెను. అంత మేఘము జలధారలు గురియునట్లు రావణుఁడు రామునిపై, ధగధగ మెఱయుచున్న బాణములు ముసలములు మొదలగువానిని జడిగా గురిసెను. రాముఁడును రావణుఁడును నొకరిపయి నొకరు ప్రయోగించుబాణములొండొంటిం గొట్టుకొనఁగాఁ బుట్టినధ్వని తుములమై చెలంగెను. బంగారు పింజకొనలు ధగధగ మెఱయుచున్న యీరామరావణబాణములు ఒకటిచే నొకటి భిన్నములై చెల్లచెదరై యాకాశమునుండి నేలంబడినవి. రామరావణు లిరువురబ్యాత

* కొన్ని సర్పములు తమచూపువలననే మనుష్యులను జంపునని ప్రసిద్ధి.

† రామత్వమనఁగా రామావతార ప్రయోజనమని యాచార్యులు చెప్పెదరు.

లధ్వని, మిక్కుటమై సమస్తభూతములకును దిగులుగొలుపుచు నాశ్చర్యమనందగి చెలంగినది. తళతళమెఱయుచున్న వెనువిలుదాల్చి మహాత్ముఁడా రాముఁడు బాణ జాలములను జడిగొన రావణునిపయి విచ్చలవిడిఁ బరఁగింపఁగా, రావణుఁడతని నట్లు దాఁకి మిక్కిలియుఁ బీడితుఁడై వాయువుచేఁ గొట్టువడిన మేఘమువలె భయమునఁ బరుగెత్తినవాఁడయ్యె. ఇది నూటనొకండవసర్గము.

రాముఁడు లక్ష్మణుంగూర్చి విలపించుట; హనుమంతుఁడు సుషేణునిపంపున నోషధిపర్వతమును దెచ్చుట; సుషేణుఁడు దివ్యౌషధిరసమును లక్ష్మణునిముక్కునఁ బిండఁగా నతండు విశల్యుఁడై లేచుట.

బలవంతుఁడగు రావణుఁడు యుద్ధమున శక్తిచేఁ గొట్టఁగా నెత్తురు వెల్లిం దొప్పఁదోఁగి శూరుండగు లక్ష్మణుఁ డుండుటనుజూచి, రాముఁడు దురాత్ముఁడగు రావణునితో భెట్టిదముగా యుద్ధము సేసి బాణములు * విడుచుచునే సుషేణునిఁ జూచి 'వీరుండయిన యీలక్ష్మణుఁడు రావణునిబలిమిచేఁ గొట్టువడి నేలం ద్రెళ్లి సర్పమువలెఁ బొరలాడుచున్నాఁడు. నాకు మిక్కిలి శోకముగలుగుచున్నది. వీఁడు నాకుఁ బ్రాణములకంటె ప్రియుఁడయినవాఁడు. ఇట్టివాఁడు, నెత్తుటంబడిసియుండుట చూడఁగానే నామనస్సు కళవళించుచున్నదే! ఇఁక యుద్ధము సేయ శక్తియెట్లు గలుగును? యుద్ధంబుల విఱ్ఱవీఁగుచు శుభలక్షణుఁ డయిన నాతమ్ముఁ డితఁడు మరణమునొందునేని యిఁక నాకుఁ బ్రాణము లేల? సుఖముగాని యేల? దురాత్ముఁడయిన రావణునిచే నాతమ్ముఁడు హతుఁడగుటను జూడఁగా నాయెదుటనే నాతమ్ముఁ డిట్లగుటచే నాపరాక్రమము సిగ్గుపడినట్లు వెనుదీయుచున్నది. విల్లు చేతనుండక జాఱుచున్నట్లున్నది. బాణములు బీఱువోవుచున్నవి కన్నుల నీళ్లుగ్రమ్మి యేమియుఁ గానఁబడకున్నది. స్వప్నములందు నడచునపుడు మనుష్యులకు కాళ్లువెక్కడు నీడ్చునట్లు, నా కవయవములు విరవిరవోయి యేపనియు చేయఁగూడకున్నది. చింత వేండ్రముగా పెచ్చుపెరుఁగుచున్నది. ప్రాణములపై నాశయుఁ దూలినది' అనెను. రాముఁడు తనవెలుపలఁ దిరుగుప్రాణమైన గారాబుతమ్ముఁడు లక్ష్మణుఁడు మర్మమునందు బిట్టుగాఁ గొట్టువడి యావేదన కార్తుఁడై నిట్టూర్పులు పుచ్చుచుండుటనుజూచి మిక్కిలియు దుఃఖముపయిఁకొన శోకమున మునిఁగి యేమియుఁ దోఁపకుండెను. ఆరాముఁ డట్లు మిక్కిలియు విషాదమునొంది యింద్రియములు కలఁగి విలపించుచు 'నాతమ్ముఁడు లక్ష్మణుఁ డిట్లు హతుఁడై దుమ్ములబ్రుంగుచుండుటను జూచుచున్నానే! ఇఁక నాకుయుద్ధము చేతఁగాని ప్రాణముల

* 'విడుచుచునే' యనువ ర్తమాననిర్దేశముచేతి రావణుఁడు పలాయితుఁడైనపిదప లక్ష్మణునియోగక్షేమమును జూచుటయందు రాముఁడు విలంబము సేయకుండుట సూచితము.

చేతఁగాని సీతచేతంగాని ప్రయోజనమేమియు లేదుగదా. లక్ష్మణుఁడు యుద్ధాగ్రంబున హతుఁడై యిట్లు పడియున్నపుడు నాకు రాజ్యముతోఁ బనేమి? ప్రాణములెందుకు? యుద్ధముచేసి కార్యమేమియుంగలుగదు. ప్రతిదేశమునను గావలసిన భార్యలు దొరకుదురు; కావలసిన బంధువులు దొరకుదురు. కూడఁబుట్టిన తమ్ముఁడు దొరుకునట్టి దేశముమాత్రము నెచ్చటను గానరాదు' అని విలపించెను. ఇట్లు విలపించుచు శోకమున నింద్రియములు విహ్వలించుచుండ, జాలిగొలుపునట్లు, నేలం బొరలుచు మాటికి నిట్టూర్పులు విడుచుచున్న రాముని, వీరుండయిన సుషేణుఁ డుచితవాక్యముల నాశ్వాసించుచు, 'మహాబాహూ! లక్ష్మీవర్ధనుఁడయిన యీలక్ష్మణుఁడు, మృతుఁడుగాఁడు. ఏలనఁగా నితనిముఖము వికృతమునుగాదు. వివర్ణముగాదు. కాంతియుఁ దూలదు. ఇతనిముఖము, మంచికాంతిగలిగి, ప్రసన్నముగాను చూపట్టుచున్నది. అఱచేతులు, ఎఱ్ఱదామరలవలె నెఱ్ఱగానున్నవి. కన్నులు మిక్కిలియు సుప్రసన్నములై యున్నవి. రాజా! ప్రాణములు పోయినవారికి నిట్లు రూపముండదు. దీర్ఘాయుష్యము గలమనుష్యులకే ముఖమిట్లుండును. వీరా! లక్ష్మీవర్ధనుండగు నీలక్ష్మణుఁడు మృతినొందలేదు. పగవారిపీఁచమడంచు నితఁడు ప్రాణములతోనే యున్నాఁడు. కాన దుఃఖింపవలదు. వీరా! ఇతఁడు మూర్ఛితుఁడై యవయవములు క్రిందవైచియున్నను గుండె మాటిమాటికిఁ గొట్టుకొనుచుండుటచే బ్రతికియున్నాఁడని తెలియుచున్నది' అనెను. మాటలాడ నెఱింగినసుషేణుఁడు రామున కిట్లు చెప్పి యంత మేలయినహనువులు (చెక్కిలిమీఁదిపట్లు) గల హనుమంతునిఁ ద్వరపెట్టుచు 'సౌమ్యా! వీరా! నీ విచటనుండి శీఘ్రముగా మున్ను నీకు జాంబవంతుఁడు చెప్పిన శుభంబగు నోషధిపర్వతమునకుఁ బోయి దానిదక్షిణశిఖరమునం బుట్టిన దివ్యౌషధిని శల్యములు లేకుండఁ జేయునట్టిదై శుభంబగు విశల్యకరణి యనుదానిని, సవర్ణకరణిని, సంజీవనిని, సంధానకరణినిని, వీరుఁడగు మహాత్ముని లక్ష్మణునిని జీవింపఁజేయుటకై త్వరితముగాఁ దీసికొనిరమ్ము' అనెను. ఇట్లు సుషేణుఁడు చెప్పఁగా శ్రీమంతుఁడగు హనుమంతుఁడు ఆయోషధిపర్వతమునకుఁ బోయి, ఆయోషధిస్వరూపము తెలియనందున చింతనొందెను. అమితతేజుండగు నాహనుమంతునికి 'ఇప్పర్వతమునం దీశిఖరమునే తీసికొనిపోయెదను. ఏలన లక్ష్మణునికి సుఖముగలిగించు నాయోషధి నాకుఁ గలిగిన యంతఃకరణప్రసాదాదులంబట్టి యనుమానింపఁగా ఈశిఖరమునందే పుట్టియుండవలయునని నాకుఁ దోఁచుచున్నది. మఱియు సుషేణుఁడును, దక్షిణశిఖరమునఁబుట్టిన యోషధిని దెమ్మన్నాఁడుగాన యతఁడు నిట్లు చెప్పియున్నాఁడు. కాన యీశిఖరమే యది గావలయును. నాకు విశల్యకరణియేదో తెలియలేదని దానిం దీసికొనకయే మరల సుషేణునడిగివచ్చుటకై పోవుదునేని, యంతలో కాలము మించిపోవుటవలన లక్ష్మణునకు ప్రాణహాని కలిగించుదోషము సంభవించును. నాకును నెంతమాత్రమును పౌరుషము లేదందురు' అని యీయాలోచనము పు

ట్టెను. మిక్కిలి బలవంతుఁడగు వానరసింహుఁ డాహనుమంతుఁడు, ఇట్లాలోచించి శీఘ్రంబునం బోయి, యామేటిపర్వతమును జేరి, దానిశిఖరమును మువ్మాఱు కదల్చి, పూచియున్న నానావిధవృక్షసమూహములతోఁగూడ నాపర్వతమును బెకలించి, చేతులతోఁ బయికెత్తికొనెను. అతఁ డాకాశముననుండి నీరునిండియున్న నల్లనిమేఘమునుంబోలె యాపర్వతశిఖరమును దీసికొని యాకాశముననుండి వచ్చెను. అతం డట్లు మహావేగమున రామాదులయొద్దకు వచ్చి యచట సేననడుమఁ బర్వతశిఖరమునుంచి, కొంచెము విశ్రమించి, సుషేణునిఁ జూచి 'వానరపుంగవా! నీవు చెప్పినమూలిక గుఱుతు నాకుఁ దెలియలేదు. కాన నేనాయోషధిపర్వతమందలి యీదక్షిణశిఖరమునంతయుఁ దెచ్చితిని' అని చెప్పెను. ఇట్లు చెప్పుచున్న యవ్వాయుకుమారుని హనుమంతునిఁ గొనియాడి వానరశ్రేష్ఠుఁడగు సుషేణుఁడు అమ్మహౌషధిని బెల్లగించి యెత్తుకొనెను. యుద్ధభూమింగల వానరులును రాక్షసులును, దేవతలకయినను నెంతమాత్రమును జేయందరముకాని హనుమంతునికార్యమును జూచి యందఱు నాశ్చర్యపడిరి. అంత * వానరోత్తముఁడగు సుషేణుఁడు ఆయోషధిని నలిపి, మిక్కిలియు తేజోవంతుఁడగు లక్ష్మణునిముక్కునఁ బిడిచెను. శత్రువీరుల నుఱుమాడు వాఁడై శల్యములు గ్రుచ్చుకొనియున్న యాలక్ష్మణుఁడు, ఆమూలిక నాఘ్రాణించి నంతనే, శల్యములుఁ వీడి యెంతమాత్రము నొవ్వులేక శీఘ్రమున భూమినుండి లేచెను. భూమినుండి లేచిన యాలక్ష్మణునిఁ జూచి, యవ్వానరులు, సుషేణుని 'బాగు బాగు' అని కొనియాడిరి. శత్రువీరుల నుఱుమాడు రాముఁడు లక్ష్మణుని రా రమ్మని పిలిచి కన్నులనిండ బాష్పములు గ్రమ్మ, మిక్కుటంబగు నెయ్యమున బిగియఁ గౌఁగిలించుకొనెను. రాముఁ డట్లప్పుడు లక్ష్మణునిఁ గౌఁగిలించుకొని 'వీరా! లక్ష్మణా! నీవు మరణము నొందియు మఱల నాభాగ్యవశమున బ్రతికి రాఁగంటిని. నీవు మృతినొందినయెడల, నాకుఁ బ్రాణములతోనే పనిలేదు. సీతయు నక్కఱలేదు. ఇక యుద్ధమున జయము నొందవలసినపని యేమున్నది' అనెను. మహాత్ముఁడగు నారాముఁ డిట్లు చెప్పుచుండఁగా లక్ష్మణుఁడు దుఃఖితుఁడై మాటలు తొట్రువడ నతనితో 'రామా! నీపరాక్రమ మెప్పుడును బొల్లుకానేరదు. ఇట్టినీవు మున్ను రావణునిఁ జంపి విభీషణునకు లంక నొసంగెదనని ప్రతిజ్ఞ సేసి,

---

* పూర్వము ఇంద్రజిత్తుతోడి యుద్ధమునందు శల్యపీడితులగు లక్ష్మణాదులకుఁ జికిత్స చేసినపుడు సుషేణుఁడు ఆయోషధిని సంగ్రహించియుండును. కాన మరల నిప్పు డాపర్వతమునకు హనుమంతునిఁ బంపెననుట పొసఁగకున్నది. అయినను లక్ష్మణవిభీషణాదుల చికిత్సయందు నౌషధమంతయు వ్యయమైపోయెనని పరిహారము చెప్పఁగూడును కాని మఱపు గలుగనివాఁడగు హనుమంతుఁడు తానే అచిరకాలమునకుముందు స్థాపించివచ్చినపర్వతమును తెలిసికొనలేక ముఖప్రసాదాది లక్షణములచే ననుమానించి తెలిసికొనుటయు మూఁడుమార్లు కదలించి పెల్లగించుటయు విరుద్ధముగాఁ దోఁచుచున్నది గాన దీనికి పరిహారము చింత్యము. గోవిందరాజులు.

యిపుడు బలహీనుఁడైన యొకయల్పునియట్లు, నీ వివ్విధమునఁ జెప్పఁదగదు. అన
ఘా! సత్పురుషులు, తాముచేసినప్రతిజ్ఞ వ్యర్థముగావింపరుగదా. చేసినప్రతిజ్ఞనుతప్ప
క నెఱవేర్చుటయేకదా గొప్పతనమునకు లక్షణము. అనఘా! నానిమిత్తమై నీవు
సీతాదేవియందును విజయమునందును నుపేక్షనొందుట చాలును. ఇఁక రావణుని
జంపి నీప్రతిజ్ఞను నెఱవేర్పుము. వాఁడికోఱలుగలిగి, బొబ్బలిడుచున్న సింహముబారిం
బడిన మహాగజముంబోలె నీబాణముబారిం బడినపగవాఁ డింతమాత్రమును బ్రతికి
పోఁజాలఁడు. నేనన్ననో, సూర్యుఁడు సంచారకర్మము తీర్చుకొని యస్తమించునంత
లో దురాత్ముఁడగు నీరావణుఁడు హతుఁడు గావలయునని కోరుచున్నాను. వీరా!
నీవు యుద్ధమున రావణునిఁ జంపఁగోరుదువేని, నీవు విభీషణునకుఁ గావించినప్రతిజ్ఞ
నెఱవేర్పఁ దలంతువేని, జనకమహారాజుకూఁతురయిన సీతయందు నీ కభిలాషగలదేని,
నేను జెప్పినమాటను శీఘ్రమునఁ గావింపుము' అనెను. ఇది నూటరెండవసర్గము.

ఇంద్రుండు పంపిన రథము నెక్కి రాముఁడు మరల వేఱురథ
ము నెక్కి వచ్చినరావణుని మార్కొనుట; రావణుఁడు
మాతలిని నశ్వములను మిక్కిలి నొప్పింపఁగా
రాముఁడు తీవ్రకోపము నొందుట.

శత్రువీరులం జక్కాడు వీర్యవంతుఁడగు రాముఁడు లక్ష్మణుఁడు చెప్పినయప్ప
లుకువిని విలుగొని యెక్కుపెట్టి సేనాగ్రంబున రావణునిపై భయంకరములయిన
బాణములను బ్రయోగించెను. ఇంతలో రాక్షసేశ్వరుఁడగు రావణుఁడు మఱియొక
రథము నెక్కి రాహువు సూర్యునిమీఁది కడరునట్లు, రామునిమీఁదికిఁ బోయెను.
అట్లు రావణుఁడు రథగతుఁడై మేఘము జలధారలుగురియునట్లు మిక్కిలియు భయం
కరములయి వజ్రముంబోలిన బాణములఁ బ్రయోగించి రాముని నొప్పించెను. రాముఁ
డు యుద్ధమున సమాహితుఁడై యున్న రావణునిపై మండుచున్న నిప్పువంటివియు బం
గారుచే రంగారునవియునగు బాణములేసి నొప్పించెను. రాముఁడు భూమిపయి నిలి
చియు, రావణుఁడు రథముపయినుండియు యుద్ధముసేయుట సమముకాదని దేవ
తలును గంధర్వులును దానవులును నాడుకొనిరి. అంత శ్రీమంతమగు దేవేంద్రుని మేటి
రథము నింద్రునిపనుపున నతనిసారథియగు మాతలి యారోహించి స్వర్గమునుండి
దిగి రామునియొద్దకు వచ్చెను. ఆరథము బంగారుచే నంగములు చిత్రితములై వందల
కొలఁది గంటలచే నలంకృతమై, బాలసూర్యునివలెఁ దేజరిల్లుచుండెను. దాని నొగ
వైడూర్యమణిచేఁ జేయఁబడియుండెను. కాంచనాభరణములచే నలంకృతములై తె
ల్లని వింజామరలతోఁ గూడి సూర్యునివలెఁ బ్రకాశించుచు నాకుపచ్చనిరంగుగల
యుత్తమాశ్వములు హేమజాలవిభూషితములైనవి పూన్పఁబడియుండెను. ఆరథ

మునకు బంగారుదండము ధ్వజముగానుండెను. అంత నింద్రునిసారథియగు మాతలి మునికోలం జేకొని రథముననున్నవాఁడై యంజలిఘటించి రామునితో 'కాకుత్స్థా! నీవు మహాబలుఁడవు, శ్రీమంతుఁడవు, పగవారి నడంచువాఁడవు. ఇట్టినీకు విజయము గలుగుటకై దేవేంద్రుఁ డీరథము నొసంగెను. మఱియు గొప్పదియగు నీ యింద్ర ధనువును, అగ్నివంటి యీకవచమును, సూర్యసమానములగు బాణములును నిర్మలమును వాఁడియునగు శక్తిని నింద్రుఁడు నీకొసంగెను. వీరా! రాజా! మున్ను దేవేంద్రుఁ డీరథము నారోహించి నాసారథ్యముక్రింద దానవులను వధించినట్లు, నీవిపుడు నేను సారథినై యుండఁగా, నీరథము నారోహించి, రావణునివధింపుము' అనెను. అప్పుడు రాముఁడు మాతలి యట్లుచెప్పఁగా, అమ్మహారథమునకుఁ బ్రదక్షిణనమస్కారములు గావించి, తన దేహకాంతిచే చంద్రకాంతిచేతంబోలె లోకములను వెలింగించుచు నారథము నారోహించెను. అంత మహాబాహుండగు రామునకును రావణునకును, జూపఱకాశ్చర్యమును గగుర్పును బుట్టించునట్టి మహాయుద్ధము ప్రవర్తించినదయ్యె. సమస్తములయిన దివ్యాస్త్రములనెఱింగిన యారాముఁడు, రావణుఁడు ప్రయోగించిన గాంధర్వాస్త్రమును గాంధర్వాస్త్రము చేతను, దైవాస్త్రమును దైవాస్త్రము చేతను వారించెను. రాక్షసాధిపతియైన రావణుఁడు మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై మరల పరమభయంకరమైన రాక్షసాస్త్రమును ప్రయోగించెను. కాంచనభూషితములైన యాబాణములు రావణునివింటినుండి వెడలి, మహావిషముగల సర్పములై రామునిమీఁదికి కడరినవి. ఆసర్పములు మొగంబులు జ్వలింప,నోరు దెఱచుకొని వానినుండి మండుచున్న నిప్పులు గ్రక్కుచు, భయంకరాకారములై రామునిమీఁదికే యడరినవి. వాసుకియుంబోలె బెట్టిదముగా నడరునవై పడగలుజ్వలించుచున్న మహావిషములగు నాసర్పములు, దిక్కులను విదిక్కులనన్నిటిని దట్టముగా నావరించినవి. యుద్ధంబున రాముఁడు తనమీఁదికి వచ్చుచున్న యమ్మహాసర్పములను జూచి ఘోరమును భయంకరమునగు గారుడాస్త్రమును బ్రయోగించెను. బంగారుపింజలుగలిగి, అగ్నివలె మెఱయుచున్న యారామబాణములు వింటినుండివిడివడి, సర్పశత్రువులును బంగారుమయములునగు గరుడపక్షులయి విహరించినవి. గరుడరూపముగలిగి కామరూపములగు నాబాణములు, సర్పరూపములును మహావేగములునగు నారావణబాణముల నన్నింటిని రూపుమాపినవి. రాక్షసేశ్వరుండయిన రావణుఁడు తనయస్త్రము ప్రతిహతమగుటంజూచి,కుపితుఁడై భయంకరములయిన బాణవర్షముల రామునిపయింగురిసెను.అంత నారావణుఁడు ఎట్టికార్యము నేని చుల్కఁగాఁ జేయునట్టి రామునివేయిబాణను లేసి నొప్పించి మఱియుఁబెక్కుబాణముల మాతలిని గాఁడనేసెను.రావణుఁడు, ఆయింద్రరథమునకుంగల ధ్వజపటమును గుఱిపెట్టి యొకబాణమేసి దానిని ఛేదించి రథావయవమగు దండమునుండి బంగారుధ్వజమును రథమునడుమఁ బడంజేసి, యంత బాణసమూహము చే నింద్రునియశ్వములను నొప్పించెను. దేవతలును

గంధర్వులును దానవులును చారణులును దురాత్ముఁడగు రావణుఁడు గావించినయామహాత్కార్యమునుజూచి విషణ్ణులయిరి.సిద్ధులును మహర్షులును వానరవీరులును విభీషణుఁడును రాముఁ డార్తుఁడగుటనుజూచి యందఱును వ్యథితులయిరి. రాహువు చంద్రుని గ్రసించినట్లు రావణుఁడు రాము నాక్రమింపఁగాఁ జూచి, బుధుఁడు ప్రజల కశుభము సేయువాఁడై ప్రజాపతి దేవతాకమును చంద్రునకు ప్రియమును నగురోహిణీనక్షత్రము*నాక్రమించి నిలిచెను.సముద్రము పొగలు పెనఁచుకొన్న యలలుగలదై మండుచున్నట్లు చూపట్టుచు, నపుడు క్రుద్ధమై సూర్యునిస్పృశించునట్లు పయికిఁ జిమ్మిరేఁగెను. సూర్యుఁడును గాంతి మందగిలి ఖడ్గమువలె నల్లనై కబంధాకారమగు ధూమకేతువుతోఁగూడి మిక్కిలి పరుషుఁడై చూపట్టెను. ఆకాశమున ఇక్ష్వాకువంశపురాజుల నక్షత్రమై యింద్రాగ్నిదేవతాకమగు విశాఖానక్షత్రమును అంగారకుఁ డాక్రమించి యుండెను. రావణుఁడు పదితలలతోను, నిరువదిభుజములతోను ధనుర్ధరుఁడై మైనాకపర్వతమువలెఁ జూపట్టెను.యుద్ధరంగమున రావణుఁడు,విజృంభించి రాముని నిట్లు నిరసించుచుండఁగా రామునకు వింట బాణంబుల సంధించుటయు సాధ్యముగాకుండెను. మునుపే క్రుద్ధుఁడై యున్న రాముఁడు బొమలుముడిచి కన్నుల నొక్కింత కెంపుగదుర వేఁడిచూపుననే కాల్చువాఁడుంబోలెఁ జూపట్టుచు మీఁదుమిక్కిలి మహాకోపంబు నొందినవాఁడయ్యె. ఇది నూటమూఁడవసర్గము.

{రావణుఁడు వైచినశూలమును రాముఁ డింద్రదత్తమగు శక్తిచే హతముసేసి రావణునియశ్వాదుల నొప్పించుట.}

బుద్ధిమంతుఁడగు రాముఁ డట్లు క్రుద్ధుఁడై యుండఁగా నతని ముఖమును జూచి సమస్తభూతములును భయమునొందినవి. భూమియుఁ గంపమునొందెను. పర్వతము తనయందలి సింగములతోను బెబ్బులులతోను వృక్షము లల్లలాడ మిక్కిలియుఁ జలించినదయ్యెను. నదీపతియగు సముద్రుఁడును మిక్కిలియు క్షోభమునొందెను. ఆకాశమున పరుషధ్వని గలపక్షులును బరుషములగు మేఘములును నుత్పాతసూచకములయిన ధ్వనులం గావించుచు, నంతటను విహరించినవి. రాముఁడు మిక్కిలియుఁ గ్రుద్ధుఁడగుటయు, మిక్కిలియు దారుణము లయినయుత్పాతములను,జూచి సమస్తభూతములును భయమునొందినవి. రావణునకు భయముగలిగెను. అపుడు,శూరులయ్యిరువురు భయంకరములైన నానావిధాయుధములతోఁ జిత్రముగా యుద్ధముసేయుచుండఁగా,జగత్త్రిశయాకారమై యున్న యమ్మహాయుద్ధమును, దేవతలును గంధర్వులును మహోరగులును మహర్షులును దానవులును దైత్యులును గరుడులును విమానగతులయి యాకాశముననుండి చూచుచుండిరి.అప్పుడు సురలును అసురులును అం

---

* బుధుఁడు రోహిణీనక్షత్రమును నొందినపుడు జగత్పీడగలుగునని జ్యోతిశ్శాస్త్రప్రసిద్ధము.

దఱును వచ్చియామహాయుద్ధమును జూచుచు రామరావణులవలని తమతమపక్షపాతముచే నొండొరులతో వాదులాడుచుండ నయ్యిరువురలో తమతమవీరులయందలి భక్తిం జేసి మిక్కిలి యుబ్బుఁజూపువాక్యముల ననుకూలు సమవస్థితులై 'రావణా'! జయింపు మనిరి. అంత దేవతలు,'రామా! నీవు జయింపు' మని రామునిం జూచి మాటిమాటికిం జెప్పిరి. ఈనడుమ దుష్టాత్ముండగు రావణుఁడు రామునివలన క్రుద్ధుఁడై యతనిని బ్రహరింపఁగోరి యుపుడు గొప్పయాయుధ మేది ప్రయోగింపవచ్చునని క్షణమాలోచించి వజ్రాయుధమువంటి సారముగలిగి మిక్కిలియు ధ్వనితోఁగూడినదై సర్వశత్రువులను రూపుమాపునట్టి శూలమును,రోషమున జ్వలించువాఁడుంబోలెఁ జూపట్టుచుంగయికొనెను. ఆశూలము పర్వతశిఖరములవంటి యినుపశంకువులచే వ్యాప్తమై చూచుటకు భయంకరమై కొంచెము నలుపుతోఁగలసి వాఁడిమొనగలిగి ధగధగమెఱయుచుండుటచే పొగతోఁగూడిన యగ్నిజ్వాలవలెఁ జూపట్టుచు ప్రలయకాలాగ్నిసమూహముంబోలి రుద్రునిశూలమును మించి యెట్టివారికిని చారసింపరాక, వేయేల! యమునికిఁగూడ సమీపింప నలవికాక సమస్తభూతములకును దిగులుగొలుపుచు ఱంపమువలెఁ గోయునదై కత్తియుంబోలెఁ దుండించునదియునై యొప్పుచుండెను. అట్లు వీర్యవంతుఁడగు రావణుఁడు పరమక్రుద్ధుఁడై యుద్ధమున శూరులు పెక్కండ్రు రాక్షసులు దన్నుఁబరివేష్టించి కొలువ నమ్మహాశూలము నడుమం బట్టెను. మహాకాయుఁడగు రావణుఁ డాయుద్ధమునందు రోషమువలన కన్నులు కెంపార నమ్మహాశూలము నెత్తి తనసైన్యమంతయు సంతోషించునట్లు, భయంకరముగా సింహనాదము గావించెను. అప్పుడు రాక్షసేంద్రుఁడగు రావణుని భయంకర సింహనాదముధ్వనికి, భూమియు నంతరిక్షమును దిక్కులును విదిక్కులును, అదిరెను. గొప్పధ్వని గలదు రాత్ముఁ డా రావణుఁ డిడినసింహనాదమునకు సమస్తభూతములు భయమునొందినవి. సముద్రమును సంక్షోభించెను. మహావీర్యుఁ డగునా రావణుఁ డ ట్లమ్మహాశూలమును గ్రహించి మహాధ్వనిగల్గునట్లు సింహనాదముగావించి రామునింజూచి పరుషముగా 'రామా! నీకొఱకై రోషమున నేనిపుడెత్తిన వజ్రసారమగు నీశూలము ఈ క్షణమున నే, నిన్నును, నీతమ్మునిని వధింపఁగలదు. రామా! యుద్ధమున విఱ్ఱవీఁగెదవు. నిన్నిపుడు శీఘ్రమున వధించి యిదివఱకు నాసైన్యముఖమున హతులయిన శూరులగు రాక్షసులతోఁ బాటిగాఁ జేర్చివైచెదను. రామా! కొంచెమునిలువుము.ఇపుడే శూలమున నిన్ను వధించి పుచ్చెదను' అనెను.రాక్షసేశ్వరుఁడగు రావణుఁ డిట్లుచెప్పి యాశూలమును బ్రయోగించెను. ఆశూలమా రావణునికరమునుండి విడివడినదై మెఱుపులజ్వాలలవంటి జ్వాలలతోఁగూడి, యెనిమిదిగంటలతో మహాధ్వని మీఱ నాకాశమున నెంతయుం బ్రకాశించెను. వీర్యవంతుఁడగు రాముఁడు జ్వలించుచు భయంకరాకారమై వచ్చుచున్న యమ్మహాశూలమును జూచి వింటి నాకర్షించి బాణములం బ్రయోగించెను. ప్రలయకాలమునందుఁ బ్రజ్వలించుచున్నయగ్ని నింద్రుఁడు జల

ప్రవాహములచే వారించునట్లు, రాముఁడు తనపయికి వచ్చుచున్న యాశూలమును బాణసమూహముచే వారించెను. రాముఁడు ప్రయోగించినబాణములు రావణుని యమ్మహాశూలముపైఁబడి యగ్గి నుఱికిన మిడుతలవలె దగ్ధములయ్యెను. రాముఁడు తన బాణము లంతరిక్షముననే శూలమును దాఁకి చూర్ణితములై దహింపఁబడుటఁ జూచి మిక్కిలియుఁ గ్రుద్ధుఁడయ్యె. అంత నా రఘునందనుఁడు రాముఁ డట్లు పరమకుపితుఁడై తనకు మాతలి దెచ్చియిచ్చినదియు దేవేంద్రనిర్మితమైనదియునగు మహాశక్తి నెత్తెను. బలవంతుఁడగు రాముఁ డమ్మహాశక్తి నెత్తి గిరగిరం ద్రిప్పఁగా, నది ఘంటలచే మ్రోఁగుచు, దేదీప్యమానమై ప్రలయకాలమందలి పెద్దయుల్కవలె నాకాశమునంతయుఁ బ్రకాశింపఁజేసెను. అమ్మహాశక్తి, ప్రయుక్తమై రావణుని శూలమును దాఁకఁగా నమ్మహాశూలము విఱిఁగి కాంతిమాలి నేలంగూలెను. అంత, రాముఁడు క్రూరములును, మహావేగములునై వజ్రముంబోలి చప్పుడు గలిగించుచున్న వాఁడిబాణములను బ్రయోగించి మిక్కిలి వేగముగల రావణుని యశ్వములను నొప్పించెను. పిదప రాముఁడు మిక్కిలి లాఘవమొప్ప, రావణునివక్షమున పెక్కువాఁడిబాణములను లలాటమున మూఁడుబాణములనుం గాఁడనేసెను. అప్పుడు యుద్ధంబున రాక్షసేంద్రుఁ డా రావణుఁడు సమస్తావయవములును బాణములచేఁ గ్రుచ్చుకొనఁగా దేహమంతయు నెత్తుటం దోఁగి పూచినయశోకవృక్షమువలెఁ బ్రకాశించెను. అప్పుడు యుద్ధమధ్యమున రాక్షసేశ్వరుఁ డా రావణుఁడు, రామబాణము లవయవములం దెల్లఁ గాడఁగా, నెత్తుటఁ దొప్పఁదోఁగి, యొకింత ఖేదమునొందియు నంతలో మీఁదుమిక్కిలియుఁ గ్రోధము నొందినవాఁడయ్యె. ఇది నూటనాలుగవ సర్గము.

రావణుని బాణములను రాముఁడు వారించి రావణునినిందిం
చుచుఁ బెక్కుబాణముల నొప్పించుట, విహ్వలుండయిన
రావణునింజూచి యతనిసారథి తేరు దొలంగంగొనిపోవుట.

యుద్ధగర్వితుఁడగు నా రావణుఁడు, అట్లు రాముఁడు క్రుద్ధుఁడై యుద్ధంబునఁ దన్ను నొప్పించుటయు, దాను మిక్కిలియుఁ గోపమునొందెను. వీర్యవంతుఁ డా రావణుఁడు అట్లు క్రుద్ధుఁడై కోపమున కన్నులు జ్వలింప, నమ్మహాయుద్ధమున వింటి నాకర్షించి బాణములు పరఁగించి రాము నొప్పించెను. ఆకాశమునుండి మేఘము, వేలకొలఁది వర్షధారలఁ గురిసి, తటాకమును బూరించునట్లు, రావణుఁడు మ్రోయుచున్న వేలకొలఁది బాణజాలములం బరఁగించి రాముని దేహమంతయుఁ బూర్ణముగాఁ గ్రమ్మెను. రాముఁ డట్లు యుద్ధంబున రావణువింటినుండి వెడలినబాణసమూహములచేఁ బూరితుండై నిశ్చలం బగుమహాపర్వతమువలె కంపము నొందఁడయ్యెను.

వీర్యవంతుఁడగు రాముఁడు, యుద్ధమునఁ గాలూని, బాణములచే బాణసమూహములను వారించుచు, రావణుని బాణములను సూర్యునికిరణములనుంబోలెఁ గయికొన్నవాఁడయ్యె. అంత రావణుఁడు క్రుద్ధుఁడై హస్తలాఘవమొప్ప, మహాత్ముఁడగు రాముని ఱొమ్మున వేలకొలఁది బాణములఁ గాఁడనేసెను. అప్పుడు యుద్ధమున లక్ష్మణాగ్రజుండగు రాముఁడు దేహమంతయు నెత్తుటం దొప్పఁదోఁగియుండుట వలన, నడవియందుఁ బూచియున్న యొకపెనుకింశుకవృక్షమువలెఁ జూడనొప్పెను. మహాతేజుండగు నా రాముఁడును, రావణుని బాణములఁ గొట్టువడి కుపితుఁడై ప్రళయకాల సూర్యసంబోని యత్యుగ్రములయిన బాణములను దీసెను. అంత వీరుండగు దశరథకుమారుఁడు రాముఁడు, కోపావేశమునొంది, రావణుంజూచి పెడనవ్వు నవ్వి. పరుషవచనముల నతనితో 'రాక్షసాధమా! నాభార్యను, నేను దగ్గఱ లేకుండఁగా, పరవశురాలై యున్నపుడు, నాకుఁ దెలియనట్లు జనస్థానమునుండి నపహరించి తెచ్చితివే! ఇట్టి నీవు విక్రమశాలివా? నీకెంతమాత్రమును బరాక్రమము లేదు. మహారణ్యమున నన్నెడఁబాసి దుఃఖితయై యున్నసీతను, నీవు బలాత్కారమున దొంగిలి తెచ్చి శూరుఁడనని యెన్నికొనుచున్నావే. ఎంతటిశూరుఁడవురా? పరస్త్రీలం దడవు శూరుఁడవుపో ! పెనిమిటి యొద్దలేనపుడు స్త్రీలవిషయమై దుర్జనులు చేయునట్టి కార్యమును జేసి శూరుఁడనని యెన్నికొనుచున్నావుగా. నీకు మర్యాద నుంటఁగలసినది. లజ్జయు లేదు. నీ నడవళ్లను ఒక్కవిధము గావు కావరమున నీకు నీవే మృత్యువుం దెచ్చుకొని చచ్చినట్లుగాఁ దలఁచుకొనక శూరుఁడని యెన్నికొనుచున్నావు. శూరుఁడవు, కుబేరునికిఁ దమ్ముఁడవు, తపోబలాది సంపన్నుఁడవు. ఇట్టి నీవు, సీత నపహరించి యెంతటిగొప్పకార్యమును జేసితివిరా? అది యెంతటిపొగడ్తకుఁ దగినది! ఎంతకీర్తికరమైనది రా? నీవు కండకావరమునఁ బోతరించి నిందితంబును అహితమును నగు కార్యమును గావించితివి. అందులకు మహాఫలము నిదె యిపు డనుభవింపుము. దుర్బుద్ధీ! శూరుఁడనని నిన్ను నీవే యెన్నికొనుచున్నావే. సీతను దొంగవలె నపహరించి తెచ్చునపుడు నీకు సిగ్గు కలుగదయ్యెనే! నీవు నాయెదుట నట్లు సీతను బలవంతముగాఁ గొనిపోవఁ గడఁగితివేని, యపుడే నాబాణములచే హతుఁడవై సీతమ్ముఁడగు ఖరునియొద్దకుఁ బోయియుందువే! దురాత్మా! నాభాగ్యవశమున నీవిపుడు నాకంటియెదుటం బడితివి. ఇదిగో నిన్ను వాఁడిబాణముల యమపురి కనిచెదను జూడుము. ఇదిగో కుండలములు దళుకొత్తుచున్న నీ శిరస్సు నాబాణములచే ఛిన్నమై యుద్ధభూమియందు దుమ్ముల బ్రుంగి నక్కలు మొదలగునవి యీడ్చుకొని పోవుఁగాక. రావణా! నీవు నేలంగూలియుండఁగా గద్దలు నీఱొమ్ముపయి నివ్రాలి, బాణపుటలుఁగులచే నయినగండ్లనుండి పయికిఁ జిప్పిలుచున్న నీ నెత్తురును దప్పిదీఱఁ ద్రావుఁగాక. ఇప్పుడే యిదిగో నీవు నాబాణములచేఁ ద్రుంగి ప్రాణములు వీడి నేలంబడఁగానే గరుడపక్షులు సర్పములను బట్టి లాగునట్లు గద్దలు మొదలగు పక్షులు నీ ప్రేఁగులనుబట్టి లాగుఁగాక' అనెను.

పగవారిని రూపుమాపు వీరుండు రాముఁడు, ఇవ్విధమునం జెప్పుచుఁ, దన్నుఁ దారసించియున్న రాక్షసేశ్వరుని రావణునిమీఁద బాణవర్షములు పరఁగించెను. శత్రువును రూపుమాప నువ్విళులూరుచున్న యా రామునకు, అప్పుడు వీర్యమును బలమును ఉత్సాహమును దివ్యాస్త్రబలమును యుద్ధమున నినుమడిగా నతిశయించినవయ్యె. విదితాత్ముఁడగు రామునకు సమస్తములయిన దివ్యాస్త్రములును ప్రత్యక్షముగా స్ఫురించినవి. అంత నమ్మహాతేజుఁడు, ఉబ్బువెల్లునం జేసి మఱింత హస్తలాఘవము గలవాఁడయ్యెను రాక్షసులం దుదముట్టించు దిట్ట యగు నా రాముఁ డిట్టి శుభచిహ్నములు తనకుఁ గలుగుటను దెలిసి మఱింత యుత్సహించి రావణుని మీఁదు మిక్కిలియు నొప్పించెను. వానరులు వైచు శిలాసమూహముల చేతను, రాముని బాణవర్షముల చేతను గొట్టువడుచు రావణుం డేమియుఁ దోఁపక హృదయమున తత్తఱపడఁ జొచ్చెను. రావణునకు మృత్యుకాల మపు డాసన్నమగుటం జేసి యతఁడు బాణములు ప్రయోగింపక వింటి నాకర్షింపక యుండెను; మఱియు నతనికి మనసు వివశమగుటచే రాముని వీర్యమును బదులేసి నిలువరింపఁ డయ్యె; మఱి రావణుఁ డేసిన బాణములును తక్కిన నానావిధములైన యాయుధములును, యుద్ధమున ఛేదనభేదనాదులయిన ప్రయోజనము లేవియుఁ గావింప నేరకుండెను. రావణుఁ డిట్టియవస్థయం దుండుటను జూచి యతని రథంబు నపుడు దోలుచున్న సూతుఁడు తొట్రుపడక, యుద్ధభూమినుండి రథమును మెల్లఁగఁ దొలఁగఁ దోలుకొనిపోయినవాఁడయ్యెను. ఇది నూటయైదవసర్గము.

రావణుఁడు మనంబునఁ దెప్పిఱి సూతుని రథము తొలఁగఁ దెచ్చినందులకై భర్జించుట; సూతుఁ డందులకుఁ దగిన సమాధానము చెప్పి రథమును మరల యుద్ధభూమికిం దోలుట.

ఆ రావణుఁడు మృత్యుబలమున ప్రేరితుఁడగుటం జేసి వివేకంబు దూలి మిక్కిలియుం గ్రుద్ధుఁడై కోపంబునఁ గన్నుంగవ కెంపుగదుర, సారథిని జూచి 'ఓరీ దుర్బుద్ధీ! నన్ను బలహీనునివలెను, ఉత్సాహము లేనివానివలెను, పౌరుషము మాలినవానివలెను, పిఱికివానివలెను, అల్పునివలెను, ధైర్యము లేనివానివలెను, తేజస్సు దూలినవానివలెను, మాయలు దెలియనివానివలెను, దివ్యాస్త్రములకు వెలియైనవానివలెను, నలక్ష్యముసేసి, నీబుద్ధికిఁ దోఁచినపోకలు పోవుచున్నావు. నా యభిప్రాయమును దెలిసికొనక నన్నలక్ష్యము చేసి శత్రుసమక్షమున నా యీ రథము నేల తొలఁగఁ దోలుకొని వచ్చితివి? అపూజ్యా! నేను జిరకాలముగా సంపాదించిన నా యశస్సును, వీర్యమును, తేజమును, రావణుఁడు యుద్ధమునం బలాయితుఁడు గాఁడని యందఱికిని నాయెడం గలిగియున్న నమ్మకమును, నీచేత నివిగో నాశము నొందెఁ జుమీ! శత్రువు వీర్యంబునఁ బ్రఖ్యాతినొందినవాఁడు. నా పరాక్రమకృత్యముల నెఱపి రంజింపఁ జేయఁ

దగినవాఁడు. అట్టిశత్రువు చూచుచుండఁగా, యుద్ధమునందుఁ బేరాస గలిగియుం డు నన్నుఁ బనికిమాలినవానిని గావించితివి. దుర్బుద్ధీ! నీ వీరథమును నాసంగతిని దెలియక శత్రువున కెదురుగాఁ దోలక తొలఁగఁదెచ్చుటఁ జూడఁగా, పగవాఁడు నీకేమో లంచమిచ్చి నిన్నుఁ గైవసము చేసికొన్నాఁడని నాకూహ గలుగుచున్నది. ఇదిసత్యమే యగును. హితమును గోరునట్టి మిత్రులుచేయునది యీపనిగాదు. ఇది పగవారికిఁ జేయఁదగినది. ఇట్టిపనినే చేసితివిగాని యట్టిపనిని జక్కఁ జేయవైతివి. నీవు నాయొద్దఁ జిరకాలమున్నవాఁడవేని, నేను జేసినసత్కారాదులు నీ తలంపునకు వచ్చు చున్నవేని, పగవాఁడు నాపైఁబడి రాకమునుపే రథమును వేగ మరల్చి యుద్ధమున కభిముఖముగాఁ దోలుము' అనెను. రావణుఁడు బుద్ధిమాలి యిట్లు పరుషముగాఁ జెప్పినది విని,సారథి యతనిహితమునుగోరు బుద్ధిగలవాఁడు గాన, యతని నాశ్వాసిం చుచు హితవచనమున 'నేను భయపడినవాఁడనుగాను, మూఢుఁడనుగాను, లంచ ముదీసికొని పగవారితోఁ జేరుకొన్నవాఁడనుగాను, ఏమఱినవాఁడనుగాను, నీయందు స్నేహము లేనివాఁడనుగాను, నీవు నాకుఁ జేసినసత్కారములు మఱచినవాఁడనుం గాను. మఱియేమన్నను నేను నీహితముగోరి, నీయశస్సును సురక్షితము గావింపఁ బూని, నీయందలి నెయ్యము దొలఁకాఁడుమనసుతో నిది నీకు ప్రియముగానుండు నని చేసితిని. ఇది నీ కప్రియమైనది. మహారాజా! నీవు, ఏదేనొకకులమునఁబుట్టి యల్పబుద్ధియై దుష్టహృదయుఁడగువాఁడుంబోలె, నాయందు, నీకుఁ బ్రియమును హితమును జేయుటయందే యాసక్తుఁ డయిననాయందు, ఇట్లు రథము తొలఁగఁదె చ్చిన విషయమై దోషము తలంచుట యుక్తముగాదు. ఉన్నతప్రదేశమునుండి నది వేగముగ మరలునట్లు, యుద్ధభూమినుండి యతివేగమున రథము మరల్చినందులకుఁ గల కారణమునుజెప్పెద వినుము. వీరా! నీ వపుడు చాలసేపు మహాయుద్ధము సేసి యలసియుండుట నాకుఁ దెలియవచ్చినది. నీవు యుద్ధమునకుఁ జక్క మొగము గలిగి యుండుటగాని నీయుత్సాహముగాని కాననయితిని. ఈ రథాశ్వములును, రథమునీడ్చి యీడ్చి యలసి, దీనములై యెండతాఁకున మిక్కిలియు సొలసి, వర్షమునఁ గొట్టుప డిన గోవులుంబోలె నుండినవి. మనకు నేయేశకునములు మిక్కిలియుఁ గలుగుచున్న వో అవన్నియును ప్రతికూలముగానే నాకుఁ దోఁచుచున్నవి. సారథియగువాఁడు దేశకాలములను, శుభాశుభనిమిత్తములను, తన రథికునియు నెదిరియు ముఖము నందలి తేటకలఁక మొదలయిన యింగితములను, ఉత్సాహములేమియు, దుఃఖము ను, సంతోషమును, బలాబలములును, భూమి మిట్టపల్లములను సమప్రదేశములను విషమప్రదేశములను (యుద్ధమునకు సమయాసమయములును) ఎదిరియందు క నుఁగొనందగిన ఛిద్రములును, మఱియు రథమును నెదిరికి సమీపముగాఁ దోలుట యు, ప్రక్కవాటులం దోలుటయు, నిలుకడగా నిలుపుటయు, ఎదురుమొగముతో నే వెనుకకు మరలుటయు, ఇవన్నియుఁ జక్కఁగా నెఱిఁగి రథము నడపవలెను.

వీరా! నీకును, నల్లే యీరథాశ్వములకును, విశ్రాంతిగలుగుకొఱకును దుస్సహమయిన దుఃఖమేమియుఁ గలుగకుండుటకును నిట్లు రథమును దోలఁగఁదెచ్చుట యుక్తమగు నని చేసితి నేకాని యట్టినిమిత్త మేమియులేక యే నాయిచ్ఛచేత నిట్లు చేసినవాఁడను గాను. ప్రభూ! నే నిపుడుచేసినది భర్తయగు నీయందలి స్నేహాతిశయమువలన నే కాని వేఱుగాదు. వీరా! శత్రుసంహారా! నీ విపు డాజ్ఞాపింపుము. నీవు కార్యస్వరూప మేది చెప్పెదవో దానిని, నీయుప్పుదిన్న ఋణము నీఁగవలయునని మనస్సున సంకల్పించుకొని, యట్లె చేయుచున్నాను' అనెను. రావణుం డా సారథిచెప్పిన యావాక్యమునకు సంతుష్టుఁడై పలువిధముల వానిం బ్రశంసించి యుద్ధముసేయు పేరాసగ డలుకొన, వానితో 'సారథీ! ఈరథమును శీఘ్రమున రామునకభిముఖముగాఁ దోలుము. రావణుఁడు యుద్ధమున శత్రువులఁ జంపక మఱలిరాఁడు'అనెను. రాక్షసేశ్వరుఁడగు రావణుఁ డిట్లుచెప్పి, వానియెడల సంతుష్టుఁడై యంత వానికి సొగసయిన మేలిహస్తాభరణ మొకటి నొసంగెను. సారథియు రావణునివచనమువిని రథమును మరల్చి యుద్ధాభిముఖముగాఁ దోలెను. అంత నాసారథి రావణునాజ్ఞచొప్పున శీఘ్రముగా గుఱ్ఱములం దోలెను. అంత రాక్షసేశ్వరుఁడగు రావణుని యమ్మహారథము క్షణములో యుద్ధాగ్రమున రామున కభిముఖమై నిలిచినదయ్యెను. ఇది నూటయాఱవసర్గము.

అగస్త్యుఁడు రామునకు నాదిత్యహృదయము నుపదేశించుట; రాముఁ డా స్తోత్రమును జపింపఁగా సూర్యుండు రాము ననుగ్రహించుట

అంత యుద్ధమునుజూచుటకై దేవతలతోఁగూడ వచ్చియున్న భగవంతుండగు నగస్త్యమహర్షి యుద్ధంబున నలసిపోయి మరల యుద్ధమునకువచ్చి మున్గలనున్న రావణుంగాంచి, రాముఁడు 'వీనిని జయించు టెట్లు?'అని చింతయందు మునిఁగియుండుటనుజూచి,యతనియొద్దకువచ్చి 'రామా! రామా! మహాబాహూ! నీకు వేదములవలె నిత్యమై రహస్యమయి యొప్పునాదిత్యహృదయము నుపదేశించెద వినుము. నాయనా! దానిచేత నీవు యుద్ధమున సమస్తశత్రువులను గెలువఁగలవు. * అది పఠించు

---

* ఇట నాదిత్యశబ్దముచే నాదిత్యమండలము చెప్పఁబడుచున్నది. అతనిహృదయమనఁగా నతనిలో పలసనుట 'య ఏషో౽న్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే' అను శ్రుతిచెప్పిన ఆదిత్యమండల మధ్యవర్తియగు పరమపురుషునిఁగా నెఱుంగునది. లేక:— ఆదిత్యుఁడనఁగా సూర్యుఁడు. అతని హృదయము అనఁగా హృద్గతము అని యర్థము. 'అయపయగతౌ' అని ధాతువు. 'య ఆదిత్యే తిష్ఠన్' 'య ఆదిత్యమంతరో యమయతి' అన్నట్లు సూర్యహృద్గతుఁడు పరమపురుషుఁడు కనుక ఆదిత్యహృదయమనఁగా పరమపురుషుని ప్రతిపాదించు స్తోత్రమని యర్థము.

వారికి బుణ్యమును వర్ధిల్లఁజేయునది. సర్వశత్రువులను నాశముసేయునది. జయము కలిగించునది. అక్షయమైన ఫలము నొసంగునది. పరమపావనమైనది. సమస్తమంగళములకును మంగళమైనది. (సమస్తశ్రేయములకు సాధనమైనది). సమస్త పూర్వాఘములును నాశముసేయునది. ఆధివ్యాధులను నివర్తింపఁజేయునది. ఉన్నయాయువుకంటె నధికాయువు నొసంగునది. జపింపఁదగిన వానిలోనెల్ల శ్రేష్ఠమైనది. ఇట్టి యాదిత్యహృదయ మనుస్తోత్రమును జపించునది. *సువర్ణవర్ణములగుటచేఁ బ్రశస్తములయిన కిరణములుగలవాఁడును, చక్కఁగ నుదయమునొందువాఁడును, దేవాసురులచే నమస్కృతుఁడును, నితర తేజస్సుల నన్నిటిని గప్పిపుచ్చునట్టి మహాతేజస్సు గలవాఁడును, చంద్రసూర్యాదులకుఁ దేజమునొసఁగువాఁడును, ఎండవానలచే సమస్తలోకముల నియమించువాఁడును నగు పరమపురుషుని నిమ్మహాస్తోత్రముచే సంతోషపెట్టుము. † ఏలన ఆదిత్యమండలాంతర్వర్తియగు నీపురుషుండు సమస్తదేవతలకు

---

* ఇందులకు 'రశ్మిమన్తంసముద్యన్తం దేవాసురనమస్కృతం । పూజయస్వ వివస్వన్తం భాస్కరం భువనేశ్వరమ్' అని మూలము. (రశ్మిమన్తం) రశ్మిశబ్దము పరమాంతరంగభక్తులను జెప్పునది. కనుక రశ్మిమంతుఁడనఁగా 'అట్టిభక్తులఁ దమ ప్రకాశించువాఁడు. 'రశ్మిగ్ంరశ్మీనాంమధ్యేతపన్తమ్' అని సువర్ణఘర్మానువాకోక్తి. (సముద్యన్తం) 'యఃపూర్వ్యాయవేధసేనవీయసే' అను శ్రుతి చెప్పున క్రొత్తక్రొత్తగా నుదయించినట్లు చూపట్టువాఁడు. (దేవాసురనమస్కృతం) 'దేవానాం దానవానాంచ సామాన్యమధిదైవతమ్' అన్నట్లు, సర్వజనులకు నుపాస్యుఁడైనవాఁడు. (వివస్వన్తం) నిరతిశయదీప్తిగలవాఁడు. 'అథయదతః పరోదివో జ్యోతిర్దీప్యతే విశ్వతః పృష్ఠేషు సర్వతః పృష్ఠేష్వనుత్తమేషూత్తమేషు లోకేషు' అని శ్రుతి. (భాస్కరం) సూర్యచంద్రాగ్ని ప్రభృతులకునుగూడ ప్రభ నొడఁగూర్చువాఁడు. 'నతత్రసూర్యోభాతి నచన్ద్రతారకం నేమావిద్యుతోభాన్తి కుతోఽయమగ్నిః । తమేవభాన్త మనుభాతి సర్వంతస్యభాసాసర్వమిదంవిభాతి' అని శ్రుతి. (భువనేశ్వరం) భువనశబ్దము సమస్తములైన యండములను జెప్పునది. సకలాండములకు నీశ్వరుఁడనుట. ఇట్టి భగవంతుని (పూజయస్వ) ఈస్తోత్రముచే నారాధింపుమనుట. మహేశ్వరతీర్థులు.

† ఇందులకు 'సర్వదేవాత్మకోహ్యేష తేజస్వీ రశ్మిభావనః । ఏషదేవాసురగణాన్ లోకాన్ పాతిగభస్తిభిః' అని మూలము. (సర్వదేవాత్మకః) సమస్తదేవతలును శరీరముగాఁగలవాఁడు, ఇందులకు 'యస్సర్వేషు దేవేషుతిష్ఠన్' ఇత్యాదులు శ్రుతులు. (తేజస్వీ) పరులను గ్రిందుపఱుచు సామర్థ్యముగలవాఁడు (రశ్మిభావనః) రశ్ములను అనఁగా నిత్యముక్తులను, భావనః= భావింపఁజేయువాఁడు, నిత్యముక్తులసత్తను నిర్వహించువాఁడు, వారు భగవంతుని నిత్యేచ్ఛను లోనై నిత్యులుగానుండువారు. వీరే 'నిత్యంప్రియాస్తస్యతుకేననతేహ నిత్యాః' అనఁబడిరి. (ఏషదేవాసురగణాన్ లోకాన్ పాతిగభస్తిభిః) 'అగ్నౌప్రాస్తాహుతిస్సమ్యగాదిత్యముపతిష్ఠతే । ఆదిత్యాజ్జాయతేవృష్టి ర్వృష్టేరన్నంతతః ప్రజాః' ఇత్యాద్యుక్తరీతిని వర్షముచే నన్నదానముచేత, 'దేవాన్ భావయతానేన తేదేవాభావయన్తువః' అని పురోడాశాది దానములచేతను సర్వమును రక్షించువాఁడని యర్థము. ఇందులకు 'యాభిరాదిత్యస్తపతి రశ్మిభిస్తాభిః పర్జన్యోవర్షతి' ఇత్యాది శ్రుతులచెప్పున కిరణములచే వర్షమొసంగి దానిచే నన్నముగలిగించి రక్షించునని భావము.

నాత్మభూతుఁడు. మిక్కిలి తేజంబుగలవాఁడు. తనకిరణములచే లోకములను రక్షించువాఁడు. దేవప్రకృతులును అసురప్రకృతులు నగుసమస్తలోకులను తనకిరణములచే నెండయు వానయుఁగలిగించి రక్షించును.* ఇతఁడు సమస్తదేవతలును శరీరముగాఁ

*ఇందులకు 'ఏషబ్రహ్మాచవిష్ణుశ్చ శివస్స్కన్దః ప్రజాపతిః। మహేన్ద్రో ధనదః కాలో యమస్సోమో హ్యపాంపతిః। పితరో వసవస్సాధ్యా హ్యశ్వినౌ మరుతో మనుః। వాయుర్వహ్నిః ప్రజాప్రాణ ఋతుకర్తా ప్రభాకరః' అని మూలము. 'యఏషోఽన్తరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే' అని చెప్పఁబడిన యోగిజనసాక్షాత్కారముచేత 'ఏష' అని మరలమరల నిర్దేశము. (బ్రహ్మా) చతుర్ముఖశరీరుఁడు. 'తవ చాన్తరాత్మా మమచయేచాన్యే దేహిసంజ్ఞితాః' అని శివునిఁగూర్చి చతుర్ముఖువచనము. (విష్ణుః) ఉపేంద్రావతారుఁడు (శివః) శివశరీరకుఁడు. 'సబ్రహ్మా సశివ స్సహరి స్సేన్ద్రః' అని రెంటికిని శ్రుతి. (స్కన్దః) 'స్కన్దిర్ గతిశోషణయోః' అను ధాతువుంబట్టి శత్రువులను శోషింపఁజేయువాఁడు స్కందుఁడు. లేక షణ్ముఖశరీరకుఁడు. (ప్రజాపతిః) 'ప్రజాపతిశ్చరతిగర్భేఅంతః' అన్నట్లు ప్రజాపతిశబ్దవాచ్యుఁడు. (మహేంద్రః) స్వరూపముచేతను ఐశ్వర్యముచేతను నిరవధికుఁడు. ఇందులకు 'ఇంద్రంనిచిక్యుః పరమే వ్యోమన్-ఇన్ద్రో మాయాభిః పురురూప ఈయతే' అని శ్రుతి. (ధనదః) 'అన్నాదో వసుదానః' అనిశ్రుతి ప్రసిద్ధుఁడయిన సకలఫలప్రదుఁడు. (కాలః) జగత్సంహారకుఁడు. 'కాలాయమహాగ్రాసాయవై నమః-అత్తాచరాచరగ్రహణాత్' అని శ్రుతిసూత్రములచేతను 'అనాదిర్భగవాన్ కాలః' అని పరాశరస్మరణమువలనను జగత్సంహారకుఁడని యర్థము. (యమః) యమయతి శిక్షయతి-శిక్షించువాఁడనుట. 'యమోవైవస్వతో రాజా యస్తవైష హృది స్థితః' అని మనుస్మృతి. (సోమః) 'సూతేఽమృతమితి సోమః' అమృతమును గనువాఁడు. 'సోమఃపవతే జనితామతీనాం జనితాదివః' ఇత్యాదులచే చెప్పఁబడిన సకలకారణ సోమశబ్దముచే వాచ్యుఁడయినవాఁడు. (అపాంపతిః) 'ఆపోనారా ఇతిప్రోక్తా ఆపోవై నరసూనవః। తాయదస్యాయనంపూర్వం తేననారాయణః స్మృతః' అన్నట్లు నారాయణుఁడు 'అపఏవససర్జాదౌ' అనుటవలన అప్ఛబ్దవాచ్యములయినవానికి స్వామి. (పితరః) అగ్నిష్వాత్తు మొదలగువారు (వసవః) 'సదావసన్తీతివసవః' వసువులు. వీరు 'ధ్రువో ధరస్తథా సోమ ఆపో వైశ్వానరోఽనిలః। ప్రత్యూషశ్చ ప్రభావశ్చ వసవోఽష్టౌ ప్రకీర్తితాః' అని యెనమండ్రు. లేక 'అగ్నిశ్చ పృథివీచ వాయుశ్చాన్తరిక్షంచ ఆదిత్యశ్చ ద్యౌశ్చ చన్ద్రమాశ్చ నక్షత్రాణి చైతే వసవః' అని శ్రుతిం జెప్పఁబడ్డ వసువులు. (సాధ్యాః) 'సిద్ధిరేషామస్తీతి సాధ్యాః' సిద్ధిగలవారు సాధ్యులు. వీరు పన్నిద్దఱు 'బ్రహ్మణో వై ముఖాత్సృష్టా యేతు దేవాః ప్రజేప్సయా। సాధ్యమన్త్రశరీరాస్తే స్థితా మన్వన్తరేష్వపి। ధర్మపుత్రా మహాభాగా విజ్ఞేయా ద్వాదశామరాః। మనుర్మన్త్రః ప్రాణశ్చ చేతయానశ్చవీర్యవాన్। విత్తిర్జయోనయశ్చైవ హంసో నారాయణస్తథా। ప్రభవో థవిభుశ్చైవ సాధ్యా ద్వాదశజజ్ఞిరే' అని వాయుపురాణమునం జెప్పఁబడి యున్నారు. (అశ్వినౌ) ఆదిత్యమహిషియగు సంజ్ఞాదేవి ఆఁడుగుఱ్ఱమైయుండ నందు ఆదిత్యుఁడు అశ్వమై పుట్టించినవారు అశ్వులనఁబడుదురు. (మరుతః) 'మ్రియన్తేనకదాచిదితిమరుతః' ఎన్నఁడును మరణింపనివారు. వీరు శుక్రజ్యోతిః ప్రభృతులు నలువదితొమ్మండ్రు. (మనుః) మననముసేయువాఁడు 'నాన్యతోఽస్తిమన్తా' 'ఇతనికంటె నితరుఁడు మననముసేయువాఁడు లేఁడు' అనిశ్రుతి. సృష్టికిఁ బూర్వము ప్రపంచవిషయకమగు మననముగలవాఁడనుట. (వాయుః) 'వాతిసురభీకరోతి' సమస్తమును వాసనగలదిగాఁ జేయువాఁడు. 'వాగతిగన్ధనయోః' అనిధాతువు. 'సర్వకర్మాసర్వకామ స్సర్వగన్ధస్సర్వరసః' అని శ్రుతి. (వహ్నిః) 'వహతిహవ్యమ్' హవ్యము దేవతలకుఁ గొనిపోవువాఁడు 'ఇష్టాపూర్తంబహుధాజాతం

గల పరమాత్ముఁడుగాన యితఁడే బ్రహ్మయు, విష్ణుఁడును, శివుఁడును, కుమారుఁడును, ప్రజాపతులును, దేవేంద్రుఁడును, కుబేరుఁడును, మృత్యువును, యముఁడును, చంద్రుఁడును, వరుణుఁడును, పితృదేవతలును, వసువులును, సాధ్యులును, అశ్వులును, ఆవహాది మరుద్గణములును, మనువును, భూతలోకసంచారియగు వాయువును, అగ్నియు, ప్రజలశరీరమందలి ప్రాణవాయువును, వసంతాది ఋతుకర్తయగు ప్రభాకరుఁడు నగును. * నీ వాదిత్యుఁడవు, సవితృఁడవు, నీవు సూర్యుఁడవు,

---

జాయమానం విశ్వంబిభర్తి భువనస్యనాభి । తదేవాగ్నిస్తద్వాయుస్తత్సూర్యస్తదుచన్ద్రమాః' 'ఏది భువనమునకు నాభియై పుట్టినదియు పుట్టుచున్నదియు నగు సమస్తమయిన యిష్టాస్రార్థము భరించుచున్నదో యదియేయగ్ని, అదియెవాయువు, అదియెసూర్యుఁడు, అదియెచంద్రుఁడు' అనిశ్రుతి. (ప్రజాప్రాణః) ప్రజలకు ప్రాణనహేతువు. 'కోహ్యేవాన్యాత్కఃప్రాణ్యాత్ - యదేష ఆకాశఆనందోన స్యాత్' 'ఆనందరూపమయిన యాకాశము అనఁగా బ్రహ్మము లేనియెడల, ఎవఁడు ప్రాణముగలవాఁడగును' అనిశ్రుతి. (ఋతుః) 'అర్యతే' పొందఁబడినవాఁడు, తెలియఁబడువాఁడు. 'ఋగతౌ' అనిధాతువు. 'ఋతుస్సుదర్శనఃకాలః' అని సహస్రనామపాఠము. (కర్తా) చేయువాఁడు. అతఁడులేక గడ్డిపోచయు గదలదుగాన సర్వభూతములలోపలఁజొచ్చి సకలకర్మములను జేయువాఁడు. 'అంతఃప్రవిష్టః కర్తారమేతం-అథరథాన్ రథయోగాన్ పథస్సృజతేసహికర్తా- సర్వకర్తా' 'లోపలఁబ్రవేశించిన కర్తయగునితని,మఱియు రథములును రథములతోఁగూడిన మార్గములను సృజించును.అతఁడుగదా కర్త!సమస్తకర్మములు గలవాఁడు' అని శ్రుతులును ప్రమాణములును. (ప్రభాకరః) ప్రభను సృజించువాఁడు.వెలుతురును అనఁగా జ్ఞానమును గలిగించువాఁడు. ప్రకృష్టజ్ఞానమునకు సాధనమైనవాఁడు. 'తేషాంసతతయుక్తానాం భజతాంప్రీతిపూర్వకమ్ । దదామిబుద్ధియోగంతం యేనమాముపయాన్తితే' 'అట్లు ఎల్లప్పుడును యోగముపూని నన్నుఁ బ్రీతిపూర్వకముగా భజించువారికి వారు నన్నుఁబొందునట్టి జ్ఞానయోగమును నే నొసంగుదును' అని గీతాదులు.

ఆదిత్యహృదయస్తోత్రప్రారంభః.

* 'ఆదిత్యస్సవితాసూర్యః ఖగఃపూషాగభస్తిమాన్ ।సువర్ణసదృశోభాను ర్హిరణ్యరేతాదివాకరః' 'సువర్ణస్తపనోభానుః' అని పాఠాంతరము. ఇట్లాదిత్యస్వరూపమునుపదేశించి తద్విషయమైన ఆదిత్యహృదయస్తోత్రము నుపదేశించుచున్నాఁడు. (ఆదిత్యః) అదితికి అపత్యముగా నవతరించినవాఁడు.లేక ('అదితేః)అఖండితమైనభూమికి పతియైనవాఁడు ఆదిత్యుఁడు.|(సవితా) 'సూతేజగత్'జగత్తును గనువాఁడు. (సూర్యః) 'సువతిప్రేరయతి జనాన్ కర్మణీతిసూర్యః' 'షూప్రేరణే' అనిధాతువు. జనులను కర్మములనుజేయఁ బ్రేరేపించువాఁడు. (సూర్యః) స్థావరజంగమాత్మకమగు జగత్తునకు అంతర్యామియై సూర్యశబ్దవాచ్యుఁడగువాఁడు 'సూర్యఆత్మాజగతస్తస్థుషశ్చ' అనిశ్రుతి. (ఖగః) 'ఖేగచ్ఛతీతిఖగః' లోకోపకారార్థ మాకాశమున సంచరించువాఁడు. (పూషా) 'వర్షేణపుష్ణాతిజగదితిపూషా' 'వర్షముచే జగత్తును బోషించువాఁడు. (గభస్తిమాన్)కిరణములుగలవాఁడు (సువర్ణసదృశః)బంగారునకు సాటియైనవాఁడు, బంగారు వన్నెగలవాఁడు 'హిరణ్యశ్మశ్రుర్హిరణ్యకేశ ఆప్రణఖాత్ సర్వఏవసువర్ణః' 'బంగారుమీసములును గలవాఁడును బంగారు వెండ్రుకలు గలవాఁడును గోళ్లుమొదలుకొని సమస్తశరీరమును సువర్ణవర్ణము' అనిశ్రుతి.(భానుః)'భాతీతిభానుః' ప్రకాశించువాఁడవు. (హిరణ్యరేతాః) హిరణ్యము రేతస్సుగాఁగల

నీవు ఖగుఁడవు, నీవు పూషవు, నీవు గభస్తిమంతుఁడవు, నీవు సువర్ణసదృశుఁడవు, నీవు భానుఁడవు, హిరణ్యరేతసుఁడవు, నీవు దివాకరుఁడవు, * నీవు హరి

వాఁడు-హిరణ్మయమైన బ్రహ్మాండమును సృజించినవాఁడవనుట (దివాకరః) పగలుసేయువాఁడు లేక పగటప్రాణములకు చేష్టగావించువాఁడు- గోవిందరాజులు. (ఆదిత్యః) అన్నిటిని గ్రహించువాఁడు 'యస్మాత్సర్వమాదత్తే తస్మాదాదిత్యః' ఎందువలన సమస్తమును గ్రహించుచున్నాఁడో అందువలన ఆదిత్యుఁడవు అను వ్యుత్పత్తిచే అఖిలవిషయభోక్తయని యర్థము. (సవితా) సమస్తజగత్తును ప్రసవింపఁజేయువాఁడు-జగమును గన్నవాఁడు-లేక జగమును బ్రేరించువాఁడు. (సూర్యః)'సుష్ఠుఈరయతి ప్రేరయతీతి సూర్యః' చక్కఁగా బ్రేరేపించువాఁడగు పరమాత్ముఁడు, 'అంతః ప్రవిష్టశ్శాస్తాజనానాంసర్వాత్మా। యస్సర్వాణిభూతాన్యంతరోయమయతి' అనిశ్రుతి. (ఖగః)పరమాకాశమున నధివసించువాఁడు.'యోఅస్యాధ్యక్షః పరమేవ్యోమన్' అనిశ్రుతి. (పూషా) పోషించువాఁడు స్థితికర్తయనుట. (గభస్తిమాన్) 'గాం దిశంవ్యాప్యభాస్తి ప్రకాశయతీతిగభస్తిః' కనుక గభస్తియనఁగా సర్వవ్యాపినియగు లక్ష్మి. (గభస్తిమాన్) అనుటచే లక్ష్మీనిత్యయుక్తుఁడనుట. లక్ష్మి 'యథాసర్వగతోవిష్ణుస్తథైవేయంద్విజోత్తమ' అను పరాశరస్మృతిచెప్పిన సర్వగతయగుట సిద్ధము. (సుపర్ణః) శోభనములయిన పక్షములు(ఱెక్కలు) గలవాఁడు. అనఁగా పరమాత్మ, 'ద్వాసుపర్ణా సయుజాసఖాయాసమానమ్' అనిశ్రుతి.(తపనః) తపింపఁజేయువాఁడు. 'సుపర్ణసదృశః' అనుపాఠమున పూర్వోక్తమైన యర్థమును. శ్రుతియు గ్రాహ్యములు. (భానుః) ప్రకాశించువాఁడు 'తమేవభాన్తమనుభాతిసర్వమ్' అనిశ్రుతి. (హిరణ్యరేతాః) హిరణ్మయమైన రేతస్సును అనఁగా అండోత్పాదకద్రవ్యమును గలవాఁడు. 'అపఏవససర్జాదౌ తాసువీర్యమపాసృజత్। తదండమభవద్ధైమం సహస్రాంశుసమప్రభమ్' అని మనుస్మృతి. (దివాకరః) అజ్ఞానమును నివర్తింపఁజేసి దివాకాంతివంటిజ్ఞానమును గలుగఁజేయువాఁడు. మహేశ్వరతీర్థులు.

* హరిదశ్వస్సహస్రార్చిస్సప్తసప్తిర్మరీచిమాన్। తిమిరోన్మథనశ్శంభుస్త్వష్టామార్తండఅంశుమాన్' (హరిదశ్వః) పచ్చనిగుఱ్ఱములవాఁడు, (సహస్రార్చిః) వేయికిరణములు గలవాఁడు, (సప్తసప్తిః) సప్తయనెడి సప్త (గుఱ్ఱము) గలవాఁడు, 'ఏకోఅశ్వోవహతిసప్తనామ' అనిశ్రుతి. (మరీచిమాన్) మరీచులుగలవాఁడు-ప్రకాశవంతుఁడనుట. (తిమిరోన్మథనః) చీఁకటిని రూపుమాపువాఁడు. (శంభుః) 'శం సుఖంభవతి అస్మాదితిశంభుః' సుఖముగలిగించువాఁడు, (త్వష్టా) 'సర్వాణిరూపాణి త్వక్షతితనూకరోతీతిత్వష్టా' సమస్తరూపములను చిన్నవిచేయువాఁడు సర్వసంహారకుఁడనుట. (మార్తండః) 'మృతేఅణ్డేజాతోమార్తండః' మృతమయిన అండమందుఁ బుట్టినవాఁడు,సర్వమును సంహారమునొందఁగా దానిని సృజించుటకు మరల ప్రాదుర్భవించినవాఁడనుట. (అంశుమాన్) అంశువులుగలవాఁడు - ప్రకాశించుచుండువాఁడనుట. గోవిందరాజులు. (హరిదశ్వః) 'హరతిమనః ఇతిహరిత్' మనస్సును హరించునట్టి, అశ్వః-వాహనమును అనఁగా గరుడుఁడుగలవాఁడు,(సహస్రార్చిః)అర్చ్యతే ఇతిఅర్చిః-అర్చిశ్శబ్దముచే అర్చనీయములు (పూజ్యములు) అయిన మంగళగుణములు చెప్పఁబడుచున్నవి. కనుక సహస్రార్చిః అనఁగా అనంతకల్యాణ గుణగణుఁడనుట. (సప్తసప్తిః) సప్తయనెడు అశ్వముగలవాఁడు-దీనిచే కల్క్యవతారము సూచితము (మరీచిమాన్) మ్రియన్తేశత్రవోఽనేనేతిమరీచిః చక్రమ్-శత్రువులను మరణము నొందించునట్టి సుదర్శనచక్రము. మరీచిమాన్-అట్టిచక్రము గలవాఁడనుట. ఈచక్రము ఇతరాయుధములకును నుపలక్షణముగాన శంఖచక్రగదాధరుఁడనుట. (తిమిరోన్మథనః) జ్ఞానోత్పత్తికి ప్రతిబంధకమైన

దశ్వుఁడవు, నీవు సహస్రార్చివి,నీవు సప్తసప్తివి, నీవు మరీచిమంతుఁడవు, నీవు తిమిరోన్మథనుఁడవు,నీవు శంభుఁడవు, నీవు త్వష్టవు, నీవు మార్తాండుఁడవు, నీవు అంశుమంతుఁడవు, * నీవు హిరణ్యగర్భుఁడవు,నీవు శిశిరుఁడవు నీవు తపనుండవు, నీవు భాస్కరుండవు, నీవు రవివి,నీవు అగ్నిగర్భుఁడవు,నీవు అదితిపుత్రుండవు,నీవు శంఖుఁడవు,నీవు శిశిరనాశనుఁడవు.† నీవు వ్యోమనాథుఁడవు,నీవు తమోభేదివి,నీవు ఋగ్యజుస్సామపారగుఁడవు,

---

దోషము నివర్తింపఁజేయువాఁడు. 'హృద్యన్తస్థో హ్యభద్రాణి విధునోతిసుహృత్సతామ్' అనిస్మృతి. (శంభుః) సుఖముగలిగించువాఁడు, 'విశ్వాత్మంవిశ్వశంభువమ్' అనిశ్రుతి. (త్వష్టా) 'త్వక్ష్ణోతిత్రిస్సప్త కృత్వః సక్షత్రియాంభూమిమితిత్వష్టా' క్షత్రియులతోడి భూమిని ముయ్యేడుమాఱులు తనూకరించినవాఁడు. దీనిచే పరశురామావతారము సూచితము. (మార్తాండమ్) 'మృతంఅచేతనంబ్రహ్మాణ్డంజీవయతీతి మార్తణ్డః'- అచేతనమైన బ్రహ్మాండమును జీవింపఁజేయువాఁడనుట. 'జీనాజీవమజీవయత్' అని భాగవతము. (అంశుమాన్) 'అశువ్యాప్తౌ' అనిధాతువు. అంతర్బహిర్వ్యాప్తిగలవాఁడు. 'అన్తర్బహిశ్చతత్సర్వం వ్యాప్యనారాయణస్థితః' అనిశ్రుతి. మహేశ్వరతీర్థులు.

* హిరణ్యగర్భశ్శిశిర స్తపనోభాస్కరోరవిః । అగ్నిగర్భోదితేఃపుత్ర శ్శంఖశ్శిశిరనాశనః (హిరణ్యగర్భః) హిరణ్యం-హిరణ్మయమైనయండము 'తదణ్డమభవద్ధైమం సహస్రాంశుసమప్రభమ్'అనిస్మృతి. ఇట్టియండము గర్భమునఁగలవాఁడు. బ్రహ్మాండోదరమున వర్తించువాఁడనుట,లేక హిరణ్యం-హితరమణీయమైన,గర్భం-అంతఃకరణము గలవాఁడనుట. (శిశిరః) తాపత్రయతప్తులయినవారికి విశ్రమస్థానమైనవాఁడు, (తపనః) తాపముగలిగించువాఁడు, (భాస్కరః) భాసఃకరోతీతి భాస్కరః - కిరణములను గలిగించువాఁడు, (రవిః)'రూయతేస్తూయతే సర్వైరితిరవిః' అందఱచే స్తోత్రముచేయఁబడువాఁడు, (అగ్నిగర్భః) పగట అగ్నిగర్భమునం గలవాఁడు. 'ఉద్యన్తంవావాదిత్య మగ్నిరనుసమారోహతి' అనిశ్రుతి. (అదితేఃపుత్రః)అదితికి పుత్రుఁడుగా-నవతరించినవాఁడు. (శంఖః) 'శమేః ఖః' సాయంకాలమున తానే శమించువాఁడు. (శిశిరనాశనః) మంచును నాశము సేయువాఁడు. గోవిందరాజులు. (హిరణ్యగర్భః)హిరణ్యం=అనఁగా సకలజగదుత్పాదకమైన సమష్టి జీవసమూహము, గర్భః=గర్భమందుఁగలవాఁడు. 'హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే హిరణ్యగర్భోభూగర్భః' అనిశ్రుతి. (శిశిరః) పూర్వమువలెనర్థము. (తపనః) తనయాశ్రితులకు విరోధులయినవారికి తాపముగలిగించువాఁడు, (భాస్కరః) కాంతికలిగించువాఁడు-సర్వవస్తువులును సాక్షాత్కరించుటకు హేతువైన లోకకర్తయనుట. (రవిః) పూర్వమువలెనర్థము, లేక 'రాత్యుపదిశతివేదానితివారవిః' వేదములుపదేశించువాఁడనుట"యోవై వేదాంశ్చప్రహిణోతితస్మై' అనిశ్రుతి. (అగ్నిగర్భః) అగ్ని=కాలాగ్నిరుద్రుఁడు, గర్భమందుఁగలవాఁడు, రుద్రునిఁగన్నవాఁడనుట. 'నారాయణాద్రుద్రోజాయత' అనిశ్రుతి. (అదితేఃపుత్రః) అదితికొడుకగు నింద్రునిరక్షించువాఁడు. (శంఖం) 'శం సుఖం ఖే ఆకాశే హృదయాకాశే యస్యసః శంఖః' హృదయాకాశమున సుఖముగలవాఁడు- నిరవధికానందవంతుఁడనుట. (శిశిరనాశనః) సూర్యరూపమున మంచును నాశము సేయువాఁడు. మహేశ్వరతీర్థులు.

† వ్యోమనాథస్తమోభేదీ ఋగ్యజుస్సామపారగః।ఘనవృష్టిరపాంమిత్రో విన్ధ్యవీథీప్లవంగమః 'వింధ్యవీథిఃప్లవంగమః' అనియు పాఠాంతరము. (వ్యోమనాథః) పరమాకాశమునకు నాథుఁడు. పరమపదనాథుఁడనుట. (తమోభేదీ) రాహువును భేదించు శీలముగలవాఁడు. (ఋగ్యజుస్సామపారగః) ఋగ్యజు

నీవుఘనవృష్టివి, నీవు అపాంమిత్రుఁడవు, నీవు వింధ్యవీథీప్లవంగముండవు.*నీవు ఆతపివి,

---

స్సామవేదములందు తుదనొందినవాఁడు. 'ఋగ్భిః పూర్వాహ్ణేదివిదేవఈయతే'-'యజుర్వేదేతిష్ఠతిమధ్యేఅహ్నః సామవేదేనా స్తమయేమహీయతే' 'వేదైరశూన్యస్త్రిభిరేతిసూర్యః' అనిశ్రుతి.(ఘనవృష్టిః)గొప్పవర్షము గురియువాఁడు 'అగ్నౌప్రాస్తాహుతి స్సమ్యగాదిత్యముపతిష్ఠతే। ఆదిత్యాజ్జాయతేవృష్టి ర్వృష్టేరన్నంతతఃప్రజాః' అనిస్మృతి. కావుననే (అపాంమిత్రః) జలములకు మిత్రమయినవాఁడు (వింధ్యవీథిః) దక్షిణాయనమందు వింధ్యము సంచారమార్గముగాఁగలవాఁడు. (ప్లవంగమః) తెప్పవలెపోవువాఁడు 'వింధ్యవీథీప్లవంగమః' అని యేకపదముగా గ్రహించినచో వింధ్యవీధియనఁగా ఆకాశమార్గము. అందు వేగపోవువాఁడని యర్థము-గోవిందరాజులు. (వ్యోమనాథః) ఆకాశమును చేసినవాఁడు-తామసాహంకారరూపమున ఆకాశమును సృజించినవాఁడు 'ఆత్మనఆకాశస్సంభూతః' అనిశ్రుతి. (తమోభేదీ) భక్తులతమోగుణమును భేదించువాఁడు, (ఋగ్యజుస్సామపారగః) సకలవేదములకు పర్యవసానభూమియైనవాఁడు. 'వేదైశ్చసర్వైరహమేవవేద్యః' 'యేచవేదవిదోవిప్రా యేచాధ్యాత్మవిదోజనాః। తేవదన్తిమహాత్మానం కృష్ణంధర్మంసనాతనమ్' ఇత్యాదులు ప్రమాణములు.(ఘనవృష్టిః) ఘన=అధికమైన,వృష్టిః=సకలకర్మఫలరూపమైన వర్షముగలవాఁడు, సకలకర్మఫలప్రదుఁడనుట. 'అహంహిసర్వయజ్ఞానాం భోక్తాచప్రభురేవచ' 'ఫలమతఉపపత్తేః'ఇత్యాదు లిందులకు ప్రమాణములు. (అపాంమిత్రః) మహార్ణవమున శయనించువాఁడును 'యమంతస్సముద్రే కవయోవయన్తి' ఇత్యాదు లిందులకు శ్రుతులు. (వింధ్యవీథీప్లవంగమః) వింధ్యమువలె దుర్గమమయిన వీథియందు-అనఁగా సుషుమ్నామార్గమందు, ప్లవం=శీఘ్రముగా, గమయతి=పొందించుచున్నాఁడు. ముక్తులకు ప్రాపకుఁడనుట. 'సఏతాన్ బ్రహ్మగమయతి- హార్దానుగృహీతశ్శతాధికయా' ఇత్యాదులు శ్రుతులు. మహేశ్వరతీర్థులు.

'ఆతపీమణ్డలీమృత్యుః పిఙ్గళస్సర్వతాపనః। కవిర్విశ్వోమహాతేజా రక్తస్సర్వభవోద్భవః' (ఆతపీ) ఎండగలవాఁడు, (మణ్డలీ) వర్తులమైన బింబముగలవాఁడు, (మృత్యుః) విరోధుల నివర్తించువాఁడు, (పింగళః) ఉదయసమయమున పింగళవర్ణముగలవాఁడు, (సర్వతాపనః) సర్వులను మధ్యాహ్నమున తపింపఁజేయువాఁడు, (కవిః) పండితుఁడు, వ్యాకరణాది సర్వశాస్త్ర ప్రవర్తకుఁడనుట - (విశ్వః) సమస్తమును నిర్వహించువాఁడు, (మహాతేజాః) గొప్పతేజస్సులు గలవాఁడు, (రక్తః) అందఱియందును రక్తుఁడైనవాఁడు, (సర్వభవోద్భవః) ఎల్లవారి సంసారమునకుఁ గారణమైనవాఁడవు - గోవిందరాజులు. (ఆతపీ) 'తపఆలోచనే' అనిధాతువు. ఆతప్-అనఁగా ఆ=అంతటను, తపః=జగన్నిర్మాణసంకల్పముగలవాఁడు, 'యస్యజ్ఞానమయంతపః' అనిశ్రుతి.(మండలీ) 'మండ్యతేనేనేతిమండలీ'-అలంకరించునట్టి కౌస్తుభాదులు ఇట మండలమగును. మండలీఅనఁగా అవిగలవాఁడనుట, (మృత్యుః) ఇట మృత్యువనఁగా ప్రకృతి- మృత్యుశరీరకుఁడనుట 'యస్యమృత్యుశ్శరీరమ్' అనిశ్రుతి.(పింగళః) 'పింగమేళనే' అనిధాతువు. కలయువాఁడు. సుశీలునికే మేళనము (కలుపుగోలుతనము) కలుగును. సౌశీల్యమనఁగా మహాత్ములు మూఢులతోఁగూడ దట్టముగాఁ గలసియుండుట. (సర్వతాపనః) ఒక్కమ్మడిని సమస్తాండములను సంహరించువాఁడు, (కవిః) సమస్తవేద్యములను దెలిసినవాఁడు, 'యస్సర్వజ్ఞస్సర్వవిత్' అనిశ్రుతి. (విశ్వః) విశ్వశరీరకుఁడు 'విశ్వమేవేదంపురుషః' అనిశ్రుతి. (మహాతేజాః) మహత్=నిరవధికమైన, తేజాః=ఇతరులను గ్రిందుపఱుచు సామర్థ్యముగలవాఁడు, (రక్తః) సర్వరంజకుఁడు, (సర్వభవోద్భవః) సర్వ=సమస్తములైన, భవ=కార్యవర్గమునకు, ఉద్భవః=హేతువైనవాఁడవు, సర్వోత్పత్తిహేతువనుట. లేక సర్వజనుల సంసారమును పుట్టుచోటయినవాఁడవనియు గ్రాహ్యము. మహేశ్వరతీర్థులు.

నీవు మండలివి, నీవు మృత్యువవు, నీవు పింగళుఁడవు, నీవు సర్వతాపనుఁడవు, నీవు కవివి, నీవు విశ్వుఁడవు, నీవు మహాతేజుండవు, నీవు రక్తుండవు, నీవు సర్వభవోద్భవుఁడవు,* నీవు నక్షత్రగ్రహతారాధిపుఁడవు, నీవు విశ్వభావనుఁడవు, నీవు అగ్న్యాదితేజస్సులకంటెను ప్రశస్తమైన తేజస్సుగలవాఁడవు, నీవు ద్వాదశాత్ముండవు, ఇట్టినీకు నమస్కారమగుఁగాక. †పూర్వగిరితోఁ గూడినవానికి నమస్కారము. పశ్చిమగిరితోఁ గూడినవానికిని నమస్కారము. జ్యోతిర్గణములకు పతియైనవానికి నమస్కారము. దినాధిపతికి నమస్కారము. ‡జయునకు నమస్కారము. జయభద్రునకు నమస్కారము.

---

*'నక్షత్రగ్రహతారాణా మధిపో విశ్వభావనః । తేజసామపి తేజస్వీ ద్వాదశాత్మన్నమోఽస్తుతే' (నక్షత్రగ్రహతారాణామధిపః) నక్షత్రగ్రహతారకముల కధిపుఁడయినవాఁడు, (విశ్వభావనః) సమస్తమును స్థాపించువాఁడు, (తేజసామపి తేజస్వీ) అగ్ని మొదలగువాని తేజస్సులకంటెను ప్రశస్తమైన తేజస్సుగలవాఁడు, (ద్వాదశాత్మా) పండ్రెండుమూర్తులుగలవాఁడు 'ఇన్ద్రో ధాతా భగః పూషా మిత్రోఽథ వరుణోఽర్యమా । అర్చిర్వివస్వాన్ త్వష్టా చ సవితా విష్ణురేవ చ' అని ద్వాదశమూర్తులు. ఇట్టి నీకు నమస్కారమని యోజన- గోవిందరాజులు. (నక్షత్ర... మధిపః) నక్షత్రగ్రహతారకముల కంతర్యామియైనవాఁడు, 'యశ్చన్ద్రతారకమన్తరో యమయతి' అని శ్రుతి. (విశ్వభావనః) విశ్వస్థితిహేతువు. 'ద్యౌస్స చన్ద్రార్కనక్షత్రం ఖం దిశో భూర్మహోదధిః । వాసుదేవస్య వీర్యేణ విధృతాని మహాత్మనః' అని శ్రుతి. (తేజసామపి తేజస్వీ) ప్రశస్తమైన తేజస్సుగలవాఁడనుట. 'యేన సూర్యస్తపతి తేజసేద్ధః' అని శ్రుతి. 'సూర్యస్యాపి భవేత్ సూర్యః' అనియుఁ గలదు. (ద్వాదశాత్మన్) ద్వాదశమండలాంతర్వర్తీ! నీకు నమస్కారమని యర్థము. మహేశ్వరతీర్థులు.

†'నమః పూర్వాయ గిరయే పశ్చిమే గిరయే నమః । జ్యోతిర్గణానాం పతయే దినాధిపతయే నమః' (పూర్వాయ గిరయే) పూర్వభాగమందున్న పర్వతముతోఁ గూడినవానికి, (పశ్చిమే గిరయే) పశ్చిమభాగమందున్న పర్వతముతోఁ గూడినవానికిని, (జ్యోతిర్గణానాంపతయే) జ్యోతిర్గణములకు పతియైనవానికిని, (దినాధిపతయే) దినమున కధిపతియైనవానికి, (నమః) నమస్కారము-గోవిందరాజులు. (పూర్వాయగిరయే) శ్రీవిష్ణుపురాణమందుఁ జెప్పఁబడిన యాయా పర్వతముల కంతర్యామియగువానికి, (జ్యోతిర్గణానాంపతయే) జ్యోతిర్గణములనఁగా ముక్తులు-ముక్తులకు స్వామియైనవానికి-సూర్యునకు పర్యాయములయిన నామములన్నియు తదంతర్యామియగు పరమాత్మునియందు పర్యవసించునని యభిప్రాయమున (దినాధిపతయే) ఇత్యాదులు చెప్పఁబడినవని తెలియునది. మహేశ్వరతీర్థులు.

‡'జయాయ జయభద్రాయ హర్యశ్వాయ నమో నమః । నమో నమస్సహస్రాంశో ఆదిత్యాయ నమో నమః । నమ ఉగ్రాయ వీరాయ సారంగాయ నమో నమః । నమః పద్మప్రబోధాయ మార్తాండాయ నమో నమః । బ్రహ్మేశానాచ్యుతేశాయ సూర్యాయాదిత్యవర్చసే । భాస్వతే సర్వభక్షాయ రౌద్రాయ వపుషే నమః' (జయాయ) ఉపాసకులకు జయముగలిగించువానికి, (జయభద్రాయ) జయభద్రములను నొసంగువానికి, (హర్యశ్వాయ) పచ్చనిగుఱ్ఱములవానికి- ఇచట స్తుతిగాన పునరుక్తియని చింతింపరాదు. సహస్రాంశుశబ్దమునకు ఆదిత్యశబ్దమునకును పూర్వమువలె నర్థములు దెలియునది. (ఉగ్రాయ) ఉపాసింపనివారికి ఉగ్రుఁడయినవానికి, (వీరాయ) 'వివిధమీరయతి ప్రేరయతీతి వీరః' పలువిధములుగా ప్రాణులను జేష్టింపఁజేయువానికి, (సారంగాయ) సారం శీఘ్రం గచ్ఛతీతి సారంగః=శీఘ్రముగాఁ బోవువానికి. ఒకనిమేషార్థ

హార్యశ్వునకు నమస్కారము. సహస్రాంశునకు మాటికి నమస్కారము. ఆదిత్యునకు రెండుమార్లు నమస్కారము. ఉగ్రునకు నమస్కారము. వీరునకు నమస్కారము. సారంగునకు నమస్కారము. పద్మప్రబోధునకు నమస్కారము. మార్తాండునకు రెండుమార్లు నమస్కారము. బ్రహ్మేశానాచ్యుతేశునకు నమస్కారము. సూర్యునకు నమస్కారము. ఆదిత్యవర్చసునకు నమస్కారము. భాస్వంతునకు నమస్కారము. సర్వభక్షునకు నమస్కారము. రౌద్రవపువునకు నమస్కారము.* తమోఘ్నునకు నమస్కారము. హిమఘ్నునకు నమస్కారము. శత్రుఘ్నునకు నమస్కారము. అమితాత్మునకు నమస్కారము. కృతఘ్నఘ్నునకు నమస్కారము. దేవునకు నమస్కారము. జ్యోతిషాంపతికి నమస్కారము. తప్తచామీకరాభునకు నమస్కారము. వహ్నికి నమస్కారము. విశ్వకర్మకు నమస్కారము. తమోభినిఘ్నునకు నమస్కారము. రుచికి నమస్కారము. లోకసాక్షికి నమస్కారము.

మున సహస్రసములయోజనములు పోవునని పురాణప్రసిద్ధి. (బ్రహ్మేశానాచ్యుతేశాయ) సృష్టిసంహారస్థితికర్తలగు బ్రహ్మ శివ విష్ణువులకు ఈశుఁడయినవానికి, ఇట పరబ్రహ్మరూపముగాస్తుతి, 'అసావాదిత్యోబ్రహ్మ' అని ఆదిత్యుఁడు బ్రహ్మముగా శ్రుతి. లేక (బ్రహ్మేశాన) బ్రహ్మరుద్రులకు, అచ్యుతేశ=అప్రచ్యుతుఁడైన నియామకుఁడు—ఎడతెగక నియామకుఁడై యుండువాఁడనుట. సమస్తాపదలంమను గాపాడువానికనుట. వేదాపహారగురుపాతిక దైత్యపీడాద్యాపదలును బోఁగొట్టి గొప్పఫలము నొసంగువానికని యర్థము. (ఆదిత్యవర్చసే)ఆదిత్యరూపమగు దీప్తిగలవానికి, (భాస్వతే) 'భాఅస్యాస్తీతిభాస్వాన్ తస్మై' కిరణములుగలవానికి,(సర్వభక్షాయ)సర్వమును సంహరించువానికి,కావున నాసమయమందు (రౌద్రాయవపుషే) రుద్రాకారము గలవానికి-గోవిందరాజులు. (జయాయ) 'జయతీతిజయః' అప్రతిహతపరాక్రమునికి, 'జయన్త్యనేనసద్భక్తా స్సంసారమితివాజయః' భక్తులకు సంసారభయము గలిగించువానికి,(జయభద్రాయ)ఉపాసకులకు రోగపాపాదుల జయమును కల్యాణమును నిచ్చువానికి,(హార్యశ్వాయ)హరిః=కోఁతియగు హనుమంతుఁడు, (అశ్వాయ) వాహనముగాఁగలవానికి-దీనిచే రామావతారము సూచితము. (సహస్రాంశో) ఇట అంశువనఁగా 'మమైవాంశో జీవలోకే జీవభూతః' అను స్మృతిచే జీవుఁడని యర్థము.(సహస్రాంశు) డనఁగా వేలకొలఁది జీవులుగలవాఁడనుట. (సారంగాయ) సారగ్రాహియైనవానికిని-లేక సారంగమనఁగా హంసముగనుక హంసావతారుఁడైనవానికి, లేక సారం అనఁగా ప్రణవము-దానిచే ప్రతిపాదితుఁడైనవానికి, (బ్రహ్మేశానాచ్యుతేశాయ) సృష్టిస్థితిసంహారకర్తలగు త్రిమూర్తులకు స్వామియైనవానికి-పరబ్రహ్మ మట్టివాఁడుగాన యిట్లు చెప్పఁబడినది. 'సృష్టిస్థిత్యంతకరణీం బ్రహ్మవిష్ణుశివాత్మికామ్ । సంజ్ఞాం సయాతి భగవా నేకఏవజనార్దనః' అనిస్మృతి. (సర్వభక్షాయ) సర్వయజ్ఞభోక్తయైనవానికి, లేక సర్వసంహారకుఁడైనవానికి, 'యస్యబ్రహ్మచక్షత్రంచ ఉభేభవతఓదనః' అనిశ్రుతి. (రౌద్రాయవపుషే) శత్రుసంహారమునకొఱకు రౌద్రాకారము దాల్చువానికి- దీనిచే నృసింహావతారము సూచితము.—మహేశ్వరతీర్థులు.

* 'తమోఘ్నాయ హిమఘ్నాయ శత్రుఘ్నాయామితాత్మనే। కృతఘ్నఘ్నాయ దేవాయ జ్యోతిషాంపతయేనమః। తప్తచామీకరాభాయ వహ్నయేవిశ్వకర్మణే।నమస్తమోభినిఘ్నాయ రుచయేలోకసాక్షిణే' (తమోఘ్నాయ) చీఁకటిని బోఁగొట్టువానికి, (హిమఘ్నాయ) మంచును బోఁగొట్టువానికి,

* ఈతఁడే మహాప్రలయమందు జగత్తును నాశముసేయును. మరల దానినే సృజించును. అత్యయకాలముపోఁగా పాలించును.(2)ఇతఁడు కిరణములచే శోషిల్లఁజేయును ఎండగాయును. వర్షముగురియును. సమస్తప్రాణులు నిదురింపఁగా, వానియం దంతర్యామియై నెలకొని, మేలుకొనియుండును. (3) ఇతఁడే అగ్నిహోత్రమును అగ్నిహోత్రులఫలమునగును.(4)వేదములును యజ్ఞములును,యజ్ఞములఫలమునునితఁడే. మఱియు లోకమునంగల కర్మములకెల్లను సర్వాత్మకుఁడగు(5)నీఁరవియే (సూర్యమండలాంతర్వర్తియగు పురుషుఁడే) నియామకుఁడు. రామా ! ఇందులకు వీఁడు వాఁడని యధికారినియమము లేదు. ఎవ్వఁడయిననుసరే, ఆపదలయందును, కష్టములు వచ్చి

(శత్రుఘ్నాయ) ఆశ్రితులశత్రువులను జంపువాఁడు, (అమితాత్మనే) అపరిచ్ఛిన్నమైన స్వరూపముగలవానికి, (కృతఘ్నఘ్నాయ) కృతఘ్నుని జంపువానికి, (దేవాయ) ప్రకాశించుచుండువానికి, (తప్తచామీకరాభాయ) హిరణ్యదేహము గలవానికిని, (వహ్నయే) అగ్నిరూపమున హవ్యమును వహించువానికి, (విశ్వకర్మణే) సర్వజగత్కర్తయైనవానికి, (లోకసాక్షిణే) లోకులకు అంతర్యామియైయుండి సుకృతదుష్కృతికర్మములకు సాక్షియగువానికి - గోవిందరాజులు. (శత్రుఘ్నాయ) శత్రుభూతములగు నింద్రియములను నిగ్రహించినవానికి, (అమితాత్మనే) అమితమహిమగలవానికి, (దేవాయ) స్వయంప్రకాశుఁడయినవానికి, (తప్తచామీకరాభాయ) హిరణ్మయుఁడైనపురుషునకి, (విశ్వకర్మణే) సమస్తమును తనకార్యమయినవానికి, 'సర్వకర్మాసర్వకామః' అనిశ్రుతి. (తమోభినిఘ్నాయ) అజ్ఞాననాశకుఁడయినవానికి, (రుచయే) రుచించువానికి, (లోకసాక్షిణే) సర్వసాక్షియైనవానికి నమస్కారము. 'సర్వదేవాత్మకోహ్యేష' అనుట మొదలుకొని 'లోకసాక్షిణే' అనువఱకు ఆదిత్యహృదయస్తోత్రనామమంత్రములు నూటయెనిమిదని తెలియునది.

* ఇట్లాదిత్యహృదయము నుపదేశించి యిదిమొదలు తత్ప్రతిపాద్యదేవతను స్తోత్రముచేయుట తెలియునది.

(2) ఇట పాలించువిధము చెప్పఁబడినది.

(3) దీనిచే సకలయజ్ఞముల కర్తయనియు ఫలప్రదుఁడనియు చెప్పఁబడినది.

(4) ఇతఁడే వేదములనుటచే వేదోక్తములయిన సమస్తకర్మములచే సమారాధ్యుఁడనియు, 'ఇతఁడే యజ్ఞాదులు' అనుటచే సమస్తయజ్ఞఫలప్రదుఁడనియు 'లోకమునందలి కర్మములకెల్ల నియామకుఁ' డనుటచే లౌకికకర్మఫలప్రదుఁడనియుఁ జెప్పఁబడెనని తెలియునది.

(5) మీఁద బ్రహ్మరుద్రాదులందఱు నేకవాక్యమున 'భవాన్నారాయణో దేవః' ఇత్యాదులచే విష్ణువే సర్వస్మాత్పరుఁడని మహాగ్రంథసందర్భముచే ప్రతిపాదించియున్నారు. ఇట సూర్యుఁడే సర్వోత్తరుఁడనుట యెట్లు పొసఁగునని యడిగితివో మధువిద్యయందు ఆదిత్యుఁడే పరుఁడుగా ప్రతిపాదించినను, ఆపరత్వము ఆదిత్యునియం దంతర్యామియగు పరమాత్మునియందే పర్యవసించునట్లు మధువిద్య తాత్పర్యముగదా. బాదరాయణుఁడు బ్రహ్మయని మీమాంసయందుఁ జెప్పియున్నాఁడుగదా. అట్లే, యీమంత్రమును ఆదిత్యునకంతర్యామివిషయమేయని తలఁచుటచే నంతయును సంగతమగుచున్నది. ఇట సూర్యుఁడు తనమండలమునువిడిచి యుద్ధముచూడ దేవతాసమూహము నడుమనిలిచి రామునకుఁ బొడమూపి స్తోత్రఫలము ననుగ్రహించినాఁడని తెలియునది.

నపుడును, అడవిమార్గములందును, ఇతరభయములు గలిగినపుడును, ఈస్తోత్రమును గీర్తించునేని, నతఁడు గీడ్పడక సుఖము నొందును. నీవు మనస్సు నిశ్చలముగా నిలిపి, దేవదేవుఁడును జగన్నాథుఁడునగు నీదేవుని, దీనిచేఁబూజింపుము. ఈస్తోత్రమును మూఁడుమాఱులు జపింతువేని, యుద్ధములందు జయమునొందఁగలవు. మహాబాహూ! ఈక్షణముననే నీవు రావణునిని వధింపఁగలవు' అనెను. ఇట్లగస్త్యుఁడు చెప్పి యపుడు తాను వచ్చినదారినిం బోయెను. అప్పుడు మహాతేజుండగు రాముఁడు, ఈస్తోత్రము విన్నంతనే శోకమంతయునశింప మిక్కిలియు సంతుష్టుఁడై పరిశుద్ధమయిన మనస్సుతో ఆచమనము సేసి శుచియై ఆదిత్యునిఁజూచి యీస్తోత్రమును జపించి మిక్కిలియు హర్షమునొంది యిట్లు మూఁడుమార్లు ఆచమనము చేసి వీర్యమతిశయించి విలుగొని దిటవుమై యుద్ధమున నిలిచెను. రాముఁ డంత రావణుంజూచి మనంబున నుబ్బి, సమస్తప్రయత్నముల నతనిని వధింప నిశ్చయించి యుద్ధముసేయుటకై తారసించెను. అంత ఆదిత్యుఁడు తన్నుస్తోత్రముచేయురామునిం జూచి మనంబున సంతసిల్లి ఆసంతోషమున మేను మిగుల గగురుపొడుచుచుండఁగా, రాక్షసరాజగు రావణునివధము ననుగ్రహించి తనమండలమునుండి దేవతాసమూహమధ్యమున నిలిచి 'రావణునివధింపఁ ద్వరపడుము' అని రామునకుం జెప్పెను ఇది నూటయేడవసర్గము.

—·◆·—

రావణునకు మరణసూచకములగు దుర్నిమిత్తములు తోఁచుట.

అట్లారావణునిసారథి సంతుష్టుఁడై యతనియాజ్ఞ చొప్పున రథమును వేగముగా యుద్ధభూమికిం దోలెను. ఆరథము, పరసైన్యముఁగలంచి నలంచునట్టిది. అది పొడవుగా నెత్తంబడిన పతాకలతోఁగూడి*గంధర్వనగరమువలె చిత్రాలంకారాది యుక్తమై యత్యాశ్చర్యకరమై యొప్పుచుండెను. బంగారుమాలికలుగలిగి మిక్కిలియు వేగ సంపన్నములయిన యశ్వములు దానికిఁ బూన్పంబడియుండెను. యుద్ధపరికరములగు దిండ్లు కవచములు మొదలగునవి సమృద్ధముగాఁ గలిగి, బహుళములయిన పతాకలును ధ్వజములును వెలయుచు తనవిఱివిచేత నాకాశమును గ్రమ్మి దానిని గ్రసించునట్లు చూపట్టుచు, భూమిని మ్రోయించుచు పరసైన్యములను నాశము సేయునదియు, స్వసైన్యముల కుల్లాసము గలిగించునదియునై యొప్పుచుండెను.

*గంధర్వనగరమనఁగా 'చిత్రవర్ణం చిత్రరూప ప్రాకార గృహగోపురం। అలంకృతమనేకాత్తైర్వితానధ్వజతోరణైః। గంధర్వనగరం దస్తిన్నృపాజిక్షయయుద్ధకృత్। దృశ్యతేచేన్మహద్యుద్ధ మన్యోన్యం ధరణీభుజామ్' నానావర్ణములుగలిగి, నానావిధములయిన ప్రాకారములును గృహములును పురద్వారములునుగలిగి నానావిధకాంతులుగల మేలుకట్లచేతను టెక్కెములచేతను తోరణములచేతను నలంకృతమై యుండునది గంధర్వనగరము. అది కనఁబడునేని ఏనుఁగులకు మనుష్యులకును గుఱ్ఱములకును నాశకరమయిన యుద్ధముగలుగును. రాజులకు పరస్పరము మహాయుద్ధము సంభవించును. అని గంధర్వనగరలక్షణము దెలియునది. గోవిందరాజులు.

నరనాథుండగు రాముఁడు, అట్లు రాక్షసనాథుఁడగు రావణునిరథము మిక్కిలియు శబ్దించుచు దిక్కులఁ బ్రతిధ్వనులం జెలంగించుచు వేగమున వచ్చుచుండఁగాఁ జూచెను. రాముండు తనశత్రుఁడయిన రావణుని యమ్మహారథము నల్లనిగుఱ్ఱములు పూన్పఁబడి, యుగ్రంబయిన వర్చస్సుతోఁ గూడి, తనపతాకాపరంపరలు మెఱపుఁదీఁగలవలె మెఱయ, ఇంద్రాయుధమువలె తనయందలి వెనుధనువు చూపట్ట, మేఘము జడివాన గురియునట్లు బాణధారలు పరఁగుచుండ, మేఘముంబోలెఁ జూపట్టుచున్నదై వచ్చుచుండుటనుజూచి బాలచంద్రునివలె తనవిల్లు మండలాకారముగ గుడుసువడునట్లు వంచి మోపెట్టి, వజ్రాయుధము న్రేటున పర్వతము బ్రద్దలువాఱు చప్పుడుంబోలె బెనుచప్పుడు గలుగ వేగమున నారి సారించుచు నింద్రునిసారథి యగుమాతలిం జూచి 'మాతలీ! పగవానిరథము వేగముగావచ్చుచున్నది చూడుము. ఆరావణుఁడు మరల మహావేగము *నప్రదక్షిణముగునట్లుగా వచ్చుచున్నాఁడుగావున వానికి యుద్ధంబున హతుఁడగుటకు బుద్ధి గలిగినట్లున్నది. అట్లగుటంజేసి నీ వేమఱపాటున నప్రదక్షిణగతి లేకుండునట్లుగా, మనరథమును శత్రురథమున కభిముఖముగాఁదోలుము. వాయు వాకాశంబున లేచిన మేఘమును బటాపంచలు సేయునట్లు నేను వీనిని నుఱుమాడివుచ్చెదను. నీవు దైన్యము నొందకయు, పరాకుపడకయు, మనస్సు కలంగకయు, చూపు చెదరకయు, పగ్గంబుల క్రమంబుగా మెలపుచు, రథమును త్వరితముగాఁ దోలుము. నీవు, దేవేంద్రునిరథమును మెలపి యలవాటు పడియున్నవాఁడవుగావున నీకీవిషయమై యుపదేశింప వలసినది లేదు సరే. అయినను నేను యుద్ధముసేయఁబోవుచున్నానుగావున మిక్కిలి యెచ్చరికగలిగి నీకుఁ దెలిసినవానినే తలఁపించెద నింతేకాని క్రొత్తవానిని నేర్పువాఁడనుగాను' అనెను. దేవసారథితిలకుండగుసమ్మాతలి రాముఁడు చెప్పినయామాటకు మిక్కిలి సంతుష్టుఁడై రథమును దోలెను. అంత నమ్మాతలి రావణునిమహారథము నప్రదక్షిణముగాఁ జేయుచు నట్లు తనరథమును ప్రదక్షిణముగాఁ బఱపఁగా చక్రములనుండి రేఁగినదుమ్ము రావణునకును, రామునకు నడ్డముగాఁ గ్రమ్మెను. అంత రావణుఁడు క్రుద్ధుఁడై కన్నులఁ గెంపుగదురఁ దేఱి పాఱంజూచుచు, తనరథమున కభిముఖుఁడై నిలిచియున్న రాముని, బాణములనొప్పించెను. మిక్కిలి తేజోవంతుఁడగు రాముఁడు రావణుఁడట్లు ధర్షించుటకు సైఁపక రోషంబున ధైర్యంబును మఱింత పట్టుకొలుపుచు యుద్ధమున మాతలి దెచ్చియిచ్చిన మహావేగంబగు నైంద్రధనుస్సును సూర్యకిరణములంబోని వాఁడిబాణములను గయికొనెను. అంత నయ్యిరువురకును, నొండొంటి కభిముఖములై, యొకటినొకటి వధింపఁగోరి పోరాడుచున్న మత్తిల్లిన సింగములకుంబోలె మహాయుద్ధము ప్రవర్తిల్లినదయ్యె. అంత దేవతలును గంధర్వులును సిద్ధులును మహర్షులును, రావణునినాశమును గోరుచుండువారుగాన, యాయిద్దఱరథికులయుద్ధమును జూడవచ్చిరి. అంత భయంకరములై గగుర్పుట్టించు

* అప్రదక్షిణముగావచ్చుట వినాశమును సూచించుచున్నదని యర్థము.

చు రావణునినాశమును తన్మూలమున రామునిజయమును సూచించుచున్నట్టి యుత్పాతములు తోఁచినవి. రావణునిరథముమీఁద పర్జన్యుఁడు నెత్తురుగురిసెను. వేండ్రములయిన సుడిగాడ్పు లప్రదక్షిణముగా వీచినవి. గద్దలు పెనుగుంపులుగాఁగూడి యాకాశంబునఁ దిరుగుచు రావణునిరథ మెట్లెట్లుపోవునో యాయామార్గమును వెంబడించిపోవుచుండెను పగటియందుఁగూడ లంకను, దాసానిపువ్వువలె నెఱ్ఱనయిన సంజకెంజాయ గ్రమ్ముటవలన, అది యున్నభూమియంతయు రాత్రియందు మండుచున్నట్లుంబోలె చూపట్టెను. పిడుగులతోడి పెద్దయుల్కలు మహాధ్వనితోఁబడినవి. అవి రావణునికిఁ బ్రతికూలశకునములగుటంజేసి రాక్షసులకు విషాదముగలిగించినవయ్యె. రావణుం డున్నచక్కటిని భూమి కంపమునొందినది. రాక్షసులు యుద్ధమున శత్రులం బ్రహరింపఁబూనినపుడు వారిచేతుల నెవ్వరో పట్టుకొన్నట్లుండెను. సూర్యకిరణములు ఎఱ్ఱగాను పచ్చగాను తెల్లగాను నల్లగాను, రావణునిదేహంబునం బ్రసరించి పర్వతమునందున్న పలువన్నెలు గల గైరికధాతువులవలెఁ జూపట్టినవి. గద్దలువెంటరా నక్కలు, నోళ్ల నిప్పుగలు గ్రక్కుచు రావణుని మొగము చూచి యురవడిగా నమంగళము సూచించుచు నఱచినవి. యుద్ధంబున గాలి రేఁగి రాక్షసరాజగునా రావణునికి కన్నులు తెలియకుండునట్లు దుమ్ములం జల్లుచుఁ బ్రతికూలముగావీచెను. మేఘముఱుమును లేకయే రావణునిసైన్యమునందంతటను భయంకరములై సహింప నలవిగానట్టి మహాధ్వనితోఁగూడి * యుల్కాశనులుపడినవి. దిశలును విదిశలను అంతటను జీఁకట్లు గ్రమ్మినవి. దుమ్ములు మిక్కుటముగాఁ గురియుటచేత నాకాశము కన్నెత్తిచూడ నలవిగాదయ్యె. ఆ యుద్ధమున గోరువంకలు బెట్టిదముగా కలహమాడుచు భయంకరముగాఁ గూఁతలిడుచు నా రావణునిరథముమీఁద వందలువందలుగాఁ బడినవి. రావణుని గుఱ్ఱములు, పిఱుఁదుపట్లనుండి యగ్నికణములను నేత్రములనుండి యశ్రువులను నిట్లు అగ్నిని జలమును సమముగా నెడతెగక దొరిఁగినవి. ఇట్లు భయంకరములును వేండ్రములునయిన పెక్కుదుర్నిమిత్తములుతోఁచి రావణునివినాశము సూచించినవయ్యె. మఱియు రామునకుఁగూడ మనోజ్ఞములును శుభోదర్కముల నగుటంజేసి జయసూచకములగు ననేకశుభనిమిత్తము లంతటను గానంబడెను. రాముఁడు తనకు జయసూచకములయిన శుభనిమిత్తములు దోఁచుటంజూచి, మిక్కిలిసంతుష్టుఁడై రావణుఁడు హతుఁడయినట్లె సీతలభించినట్టె తలంచినవాఁడయ్యె. అంతరాముఁ డు నిమిత్తముల లక్షణములు చక్కఁగా నెఱింగినవాఁడుగావున, యుద్ధమున తనకొఱకు జయమునుసూచించుచుఁ దోఁచినశుభనిమిత్తములనుజూచి, పులకితుఁడై మిక్కిలియు

---

* ఉల్కాశనులనఁగా 'ఉల్కాశిరసి విశాలానిపతన్తి వర్ధతేచ తనుపుచ్ఛా, అశనిస్స్వనేన మహతాయుక్తా నృగజాశ్వతరుముఖేషు । నిపతతి విదారయన్తీ ధరాతిలం చక్రసంస్థానా' అని మిహిరుఁడు.

సుఖమునొంది యుద్ధమున నధికముగాఁ బరాక్రమించినవాఁడయ్యె. ఇది నూటయెనిమిదవ సర్గము.

రావణుఁడు రాముని రథధ్వజమును ఛేదింప బాణము విడువఁగా నది యకార్యమునకు సశక్తమై పడుట; రాముఁడు రావణునిరథధ్వజమును ఛేదించుట.

అంత రథారూఢులయిన రామరావణు లిరువురకును, నపుడు మిక్కిలియు వేండ్రమై సమస్తలోకములకును భయంకరమయిన యతిక్రూరంపుద్వంద్వయుద్ధము చాలబెట్టిదముగా జరగెను. అంత రాక్షసుల పెనుసేనయు వానరులమహాసైన్యమును, ప్రహరణసాధనము లగు ఖడ్గశిలాదులంగొని సన్నద్ధములయ్యు నాయుద్ధమును జూచు కుతూహలమువలన చేష్టలుమాలి యూరకుండెను. అప్పుడు, రాముఁడును రావణుఁడును బిట్టుగా యుద్ధమునకుఁ బూనుటంజూచి యిరువాఁగువారును మిక్కిలియు యుద్ధమును జూచుటయందు మనసులు దగులువడ నెంతయు నాశ్చర్యమునొంది యుండిరి. ఆ యిరుదెగలసైనికులు, చేతుల నానాప్రహరణములుదాల్చి యుద్ధమునకుఁ దిమురుచుండియు జరుగుచున్న యమ్మహాయుద్ధమును జూచి బుద్ధిని మిక్కిలియాశ్చర్యపడి యొండొరులను దలపడ్డవారు గారయిరి. రాక్షసులసైన్యము రావణునిని, వానరులసైన్యము రామునిని, జూచుచు నద్భుతరసమున రెప్పపాటునుమఱచి కదలక మెదలకుండుటవలన నయ్యిరుదెగలును చిత్తరువున వ్రాయఁబడినటువలెఁ జూడనొప్పెను. రావణుఁడును రాముఁడును నిరువురును తమతమకుఁ దోఁచినదుర్నిమిత్తశుభనిమిత్తములను జూచి తమ కిది యది కలుగునని బుద్ధినిశ్చయమునొంది కోపము పాదుకొన నిర్భయముగాఁ బోరాడిరి. అప్పుడు రాముఁడు జయము తప్పకగలుగుననియు, రావణుఁడు తప్పక మరణముగలుగుననియు, నిరువురును బుద్ధిని నిశ్చయించుకొని, ధైర్యంబూని తమపరాక్రమమునంతయు యుద్ధంబునఁ జూపిరి. అంత వీర్యవంతుఁడగురావణుఁడు, బాణంబులు వింటం దొడిగి, రామునిరథమున నున్నధ్వజముపయిం బ్రయోగించెను. ఆ బాణములు, దేవేంద్రునిరథశక్తిచేఁ గొట్టువడి, యందలిధ్వజమును దాఁకకయే నేలంబడినవి. అంత, వీర్యవంతుఁడగురాముఁడు మిక్కిలియుఁ గ్రుద్ధుఁడై వింటి నాకర్షించి రావణుఁడు చేసినదానికి బదులుసేయ మనంబునం దలంచెను. రాముఁడు మహాసర్పమువలె సైఁపరానిదై తన తేజస్సుచే జ్వలించుచున్నట్టి యొక్కవాఁడిబాణమును రావణునిధ్వజముపయిం బ్రయోగించెను. ఆ బాణము, రావణునిధ్వజమును ఛేదించి భూమిని జొచ్చెను. రావణునియారథధ్వజ మట్లు ద్రుంగినదై నేలం ద్రెళ్లెను. మహాబలవంతుండగు రావణుఁడు, తనధ్వజము నట్లు రాముఁడు తుండించుటనుజూచి యతనియాటోపమునకు సహింపఁజాలకయు కోపము పట్టఁజాలకయు మిక్కిలియు జ్వలించుచున్నయగ్నివలె నెంతయుమండిపడెను. ఆరావణుఁడిట్లు, రోషపరవశుఁడై గొప్ప

బాణవర్షమును గ్రక్కువానివలె, వైచుచు, రామునిగుఱ్ఱములను జ్వలించుచున్న బాణములఁ గాఁడనేసి నొప్పించెను. ఆపచ్చనిగుఱ్ఱము లట్లు బాణములు గ్రుచ్చుకొనియు నెంతమాత్ర మడుగు తొట్రుపడకయు గతి తడఁబడకయు నుండుటయేకాక తామరతూండ్లఁ గొట్టువడినవానివలె మనస్సునఁగలంగక స్వస్థములైయుండినవి. రావణుఁ డపుడు తనబాణముల కాగుఱ్ఱములు తొట్రుపడకుండుటను జూచి మీఁదుమిక్కిలియుం గుపితుఁడై, మరల బాణవర్షమును గురిసెను. ఆ రావణుఁడు గదలను నినుపగుదియలను చక్రములను ముసలములను పర్వతశిఖరములను వృక్షములను శూలములను గండ్రగొడ్డండ్లను రామునిపయిఁ బ్రయోగించెను, వింటినుండి గదాదులు పొడముట యెట్లన్నచో ఆ రావణుఁడు వింటినుండి యాశ్చర్యకరం బగుశక్తివలన భయంకరమయి దిక్కుల బెడిదముగాఁ బ్రతిధ్వను లెసంగించుచు నానావిధమై దిగులుగొలుపుచున్న యీగదాదిశస్త్రవర్షమును గురియించెను. అనేక శస్త్రమయ మైనయిమ్మహావర్షము యుద్ధమున రామునిరథమును గుఱిపెట్టి గురిసియు రామబాణములచే వారితమగుటం బట్టి యాతనిరథముపయిని బడక చుట్టుపట్లనున్న వానరసైన్యముపయినంతటను బడెను. అంత రావణుఁ డుత్సాహంబున బ్రుంగుడువడక, మనం బన్యాయత్తంబుగా నీయక, వేలకొలఁదిని బాణంబులం బ్రయోగించి యాకాశమంతయు వేగ నెంతమాత్రము తెఱపిలేనట్లు బాణములచే నిండించినవాఁడయ్యె. రావణుఁడట్లు యుద్ధాసక్తుఁడై యెంతయుఁ బాటుపడుచుండుటనుజూచి రాముఁడు నవ్వుచున్నవాఁడుంబోలె ననాయాసంబున వాఁడిబాణములు వింటసంధించెను. అంత నతండు యుద్ధమున లక్షలకొలఁదిని బాణముల నేయుటయు, రావణుఁడు వానిని జూచి తానును బెక్కుబాణము లాకాశంబంతయు సందులేకుండునట్లుగా నిండునట్లు లడరించెను. అంత నయ్యిరువురు ప్రకాశించుచున్న బాణములను వర్షమువలెఁ బ్రయోగింపఁగా నాబాణపరంపరలు దట్టముగాఁ గ్రమ్మి వెలుంగుచున్న యాకాశము బాణములచే రచింపఁబడిన మఱియొక యాకాశమువలెఁ జూడనొప్పుచుండెను. ఒకబాణముగాని గుఱిలేక వేయఁబడినదిగాదు; కోరినకొలఁదినిమించి గుఱిని భేదింపను లేదు; గుఱిఁదగిలియు వ్యర్థమయినదియుఁ గానరాదు. అట్లద్భుతముగా యుద్ధంబున బాణములేయుచున్న రామరావణుల బాణములు ఒండొంటిం దాఁకి నేలఁబడినవి. అయ్యిరువురు సవ్యాపసవ్యంబుల నెడతెగక బాణములు పరఁగించుచు నాకాశమంతయు నూర్పువిడుచుటకేని యవకాశము లేకుండునట్లు బాణజాలములు నిండుకొన యుద్ధముగావించిరి. రాముఁడు రావణునశ్వములను గొట్టెను. రావణుఁడు రామునిగుఱ్ఱములను గొట్టెను. ఇట్లపు డిరువురు నొకరుచేసినదానికి మఱియొకరు బదులుచేయుచు నిట్లొండొరులఁ గొట్టుచుండిరి. ఇవ్విధమున నయ్యిరువురును మిక్కిలియుఁ గ్రుద్ధులయి, యద్భుతముగాయుద్ధముగావించిరి. అప్పుడు ముహూర్తకాలము యుద్ధము తుములంబై గగురుఁబుట్టించునంత బెట్టిదముగా జరగెను. అట్లు మహాబలవంతు లగు రామరావణులు వాఁడిబాణముల యుద్ధముసల్పుచుం

దునపుడు రాక్షసేశ్వరుఁ డారావణుఁడు తనధ్వజమును గూల్చినందులకు రామునిపయి మిక్కిలియుఁ గ్రోధమునొందినవాఁడయ్యె. ఇది నూటతొమ్మిదవసర్గము.

ఖండింప ఖండింప మరలమరల మొలచుచున్న రావణశిరస్సులను రాముఁడు నూటయొక్క మాఱు ఖండించుట.

ఆ యుత్పాతకాలమున యుద్ధభూమి నారామరావణులిరువురును నద్భుతముగా చేయుచున్నయుద్ధమును సమస్తభూతములును మనంబున వెఱఁగుపడి చూచుచుండెను. అమ్మేటిరథముల నారోహించియున్న యయ్యిరువురును నొండొరులయెడం గ్రుద్ధులై నొండొరులను బిట్టుదలపడి, ఒకరినొకరు చంపఁబూని, యొండొరుల నొప్పించుచుండఁగా, వారలరథములు, సారథులు సారథ్యనైపుణమువలన మండలగతులు,వీథిగతులు,* గతప్రత్యాగతులు మొదలగు పెక్కుగతులం జూపుచుండఁగా,మిక్కిలి భయంకరాకారములయి చూపట్టినవి.రాముఁడు రావణునినొప్పించుచును రావణుఁడు రామునినొప్పించుచును, నిట్లిరువురును నొండొరులపయి నడరించుటయందును మరల్చుటయందును మిక్కిలియు నురవడింజూపిరి. అయ్యిరువురు నట్లు బాణసమూహములు పరఁగించుచుండఁగా,వారల యమ్మేటిరథములు రెండును యుద్ధభూమియందు,జడివానలుగురియుచున్న మేఘములవలె మెలంగుచుండెను. అట్లు వారుయుద్ధమున తమరథముల నానావిధగతు లట్లుచూపి,మరల వాని నొండొంటి కభిముఖముగానిలిపిరి. అప్పుడు యుద్ధమున గమనము లేకున్నయయ్యిరువురరథములు నొకటికొకటి కాఁడి కాఁడితోను, గుఱ్ఱపుమొగము గుఱ్ఱపుమొగముతోను, పతాకలు పతాకలతోను గలిసియుండునట్లు నిలిచి పొలిచినవి. అంతరాముఁడు వింటినుండి ప్రకాశించుచున్న వాఁడిబాణములు నాలుగింటినేసి తనయశ్వముల కడ్డముగా నున్నరావణునశ్వముల నాలుగింటిని నవ్వలికిఁ దొలంగఁదోలెను. ఆరావణుఁడు తనగుఱ్ఱముల నవ్వలికిఁ దొలఁగించుటకు కోపపరవశుఁడై రామునిపయి వాఁడిబాణములం బరఁగించెను. రాముఁ డట్లు బలవంతుఁ డగురావణునిచే మిక్కిలియు నొప్పింపఁబడియు వ్యథగాని వేదన సూచించు ముఖవికారముగాని యెంతమాత్రమును బొందఁడయ్యె. అంత రావణుఁడు, దేవేంద్రునిసారథి యగుమాతలిపయి పిడుగుపాటుచప్పుడుంబోలె మహాధ్వనిగలబాణంబులను బ్రయోగించెను. ఆయుద్ధంబున నాబాణములు మహావేగంబున మాతలిదేహమునఁ గాఁడియు నతనికిఁ గొంచెమేని తెలివిదప్పుటగాని నొప్పిగాని కలుగదయ్యె. రాముఁడు రావణుఁడు తన్నునొప్పించుట కంతకోపము నొందలేదుగాని, మాతలి నట్లు ధర్షించినందులకుమాత్రము మిక్కిలి క్రుద్ధుఁడై బాణసమూహములు పరఁగించి యుద్ధంబున నతనినిఁ దనయెదుటనిలువలేక కొంత తొలఁగునట్లుగావించెను.

---

* గతమనఁగా శత్రురథమునుగూర్చి పోవుట.ప్రత్యాగతమనఁగా మరల నిజస్థానమునకువచ్చుట.

వీరుండగు రాముఁడు, అంత బాణములను నిరువదింటిని ముప్పదింటిని, అఱువదింటిని వందలకొలదిని, వేనవేలుగను, నిట్లు పలువిధములుగ రావణునిరథముపయి నడరించెను. అంత రాక్షసేశ్వరుఁడగు రావణుఁడు రథమున నిశ్చలుఁడై యుండి, క్రుద్ధుఁడై గదలను ముసలములను వర్షించి యుద్ధంబున రామునిని బదులునకు నొప్పించెను. అంత నయ్యుద్ధము మిక్కిలి పెచ్చుపెరిఁగి తుములమై గగురుపుట్టించునంత భయంకరమై చెలఁగెను. గదలయు ముసలములయు పరిఘములయు నోరపిల్లవలని ధ్వనులకును బాణముపింజలపాటులకును, సప్తసాగరములును ఘూర్ణిల్లినవి. అట్లు సప్తసాగరములు క్షోభిల్లుటయు పాతాళతలవాసు లయినయురగులును దానవులును వేలకొలఁదిని నందఱును వ్యథితులయిరి. పర్వతములతోను వనములతోనుంగూడ భూమియంతయుఁ జలనమునొందెను. సూర్యుండును కాంతిహీనుండయ్యె. వాయువును వీవఁడయ్యె. అంత దేవతులును గంధర్వులును సిద్ధులును గిన్నరులును, మహోరగులును పరమర్షులును, నందఱును చింతనొందిరి. దేవతలును ఋషిగణములును 'గోవులకును బ్రాహ్మణులకును క్షేమంబగుఁగాక. లోకములు శాశ్వతముగా నుండుఁగాక. రాముఁడు యుద్ధమున రాక్షసరాజును రావణుని జయించుఁగాక' అని జపముగావించిరి. ఇవ్విధంబున నపుడు దేవతలును మహర్షులును జపము సేయుచు, మహాభయంకరమై గగురుఁబుట్టించుచున్న రామరావణయుద్ధమును జూచుచుండిరి. గంధర్వులును అప్సరసలును, గుంపులుగట్టి యసమానమైనయమ్మహాయుద్ధమునుజూచి. 'ఆకాశమువంటిది ఆకాశమే. సముద్రమునకుసాటి సముద్రమే. అట్లు రామరావణయుద్ధమునకుసాటి రామరావణయుద్ధమేకాని వేఱొకటి కాదు' అని యిట్లుపలుకుచు మరల నా రామరావణయుద్ధమును జూచుచుండిరి. అంత రఘుకులకీర్తివర్ధనుండగు మహాబాహుఁడు రాముఁడు క్రుద్ధుఁడై క్రూరసర్పముంబోని క్షురాగ్రబాణమును వింటసంధించి కాంతిం దళుక్కొత్తుచు కుండలములచే వెలుంగుచున్న రావణునిశిరమును ద్రుంచెను. అప్పుడాశిరస్సును నేలంబడఁగా ముల్లోకములును జూచినవి. ఆశిరస్సువంటిదే మఱియొకశిరస్సు రావణునకు మొలచెను. అట్లు రావణునికి మొలచిన యారెండవశిరస్సును రాముఁడు కార్య మతివేగముగఁ జేయువాఁడుగాన హస్తలాఘవం బెరువడింప యుద్ధంబున శీఘ్రముగా బాణములం దుండించెను. ఆశిరస్సును దుండించినమాత్రలోనే మరల మఱియొకశిరస్సు కనఁబడినది. ఆశిరస్సునుగూడ రాముఁడు వజ్రసమానములయిన బాణముల ఖండించెను. ఇట్లు శిరస్సులొక్కటివలెనే మఱొక్కటి కనుపట్టుచు మొలచుచుండఁగా నూటయొక్కశిరస్సులను రాముండు నూటయొక్కమాఱు ఛేదించినను రావణుని ప్రాణములు నశించునని నిశ్చయమేమో తోఁపదయ్యె. అంత సర్వాస్త్రవిదుండును బహుదివ్యబాణయుక్తుండును కౌసల్యానందవర్ధనుండును వీరుండు నగు రాముఁడు మనంబున 'మునుపు మారీచు నేబాణములఁ జంపితినో, ఏ బాణముల ఖరదూషణులను వధించితినో, మఱియు దండకారణ్యమున విరాధునిని,

క్రౌంచావనమునఁ గబంధుని నేబాణంబుల రూపుమాపితినో, ఆబాణములన్ని యుద్ధంబున నెప్పుడును వ్యర్థములుగాక శత్రువును దప్పక వధించునవిగా నేను నమ్మియుండునట్టివి. ఇట్టిబాణములన్నియును రావణునందు నల్పశక్తిగలవై వ్యర్థములగుటకుఁ గారణమేమియో తెలియకున్నది'యని చింతాకులుఁడయ్యెను. ఇట్లు రాముఁడు చింతాపరుఁడయ్యు, యుద్ధమున నెంతమాత్రము పరాకువడక, రావణునివక్షముపై బాణవర్షములుగురిసెను. అంత రథస్థుండగు రాక్షసేశ్వరుఁడు రావణుఁడు కుపితుఁడై యుద్ధమున రామునిపైఁ గదలను ముసలములను వర్షించి నొప్పించెను. అట్లు రామరావణులు త్రికూటపర్వతశిఖరాగ్రమున నొండొరుఁ దాఁకిపోరుచు నాగ్రహావశమున రథసహితులై యాకాశమున కెగసియు, నేలకుడిగ్గియుఁ బోరఁగా నాయుద్ధము మిక్కిలి వెచ్చువెరిఁగి యాకాశమునను భూమిని త్రికూటపర్వతశిఖరమునను తుములమై చూపఱకు గగుర్పుఁబుట్టించుచుం బ్రవర్తించినదయ్యె. దేవతలును, దానవులును, యక్షులును, పిశాచులును, నురగులును, రాక్షసులును, జూచుచుండఁగా నమ్మహాయుద్ధము *రేయుంబవలు, నెడతెగకజరిగెను. రాత్రియందుఁగాని, పగటియందుఁగాని, యొకముహూర్తమాత్రముగాని, క్షణకాలముగాని, రామరావణులయుద్ధము విరామమొందినదిగాదు. దశరథకుమారుఁడు రాముఁడును రాక్షసేశ్వరుఁడగు రావణుఁడు నట్లు యుద్ధము చేయునపుడు రాముని కింకను జయముగలుగకుండుటం జూచి మహాబుద్ధిమంతుండగునింద్రుని రథసారథి యగుమాతలి యుద్ధము సేయుచున్న రామునిం జూచి వేగిరపడి యిట్లని పలికెను. ఇది నూటపదియవ సర్గము.

రాముఁడు బ్రహ్మాస్త్రమున రావణుని వధించుట.

అంత నపుడు మాతలి, రామునిఁజూచి 'వీరా! నీవేమియుఁ దెలియనివాఁడుంబోలె వీనివలె నస్త్రమునకుఁ బ్రత్యస్త్రము వేయుచుమాత్రమే యున్నావేమి? ప్రభూ! వీఁడు మనుష్యునిచే వధింపఁబడునని దేవతలు చెప్పినకాల మిపుడువచ్చినది. కాన వీని వధమునకై వీనిమీఁద నిపుడు బ్రహ్మాస్త్రమును బ్రయోగింపుము.' అని రామునకు రావణుని వధమునకై బ్రహ్మాస్త్రము వేయుటను దలఁపించినవాఁడయ్యె. అట్లు మాతలి చెప్పినమాటచే యుద్ధంబున మహావీర్యశాలియగు రాముఁడు స్మరణకుఁదెచ్చుకొని ధగధగమెఱయుచున్నదై రోఁజుచున్న సర్పమువలెఁ జూపట్టు నాదివ్యాస్త్రమును దీసికొన్నవాఁడయ్యె. భగవంతుఁడును వీర్యవంతుఁడునగు నగస్త్యమహర్షి మొదట బ్రహ్మదత్త

---

* ఇట 'సర్వరాత్రమహర్తా' అని మూలము. 'సప్తరాత్రమహర్తా' అనియుం బాఠములుగాని మీఁదటిదినముల లెక్కకు విరుద్ధముగాన యిది యొప్పదు. లేక యిదియే యొప్పదముగా నచ్చును ఎట్లన, ఫాల్గునచతుర్దశియందు హనుమంతుఁడు లంకంగాల్చుట. పున్నమయందు రాముఁడు సముద్రతీరమును జేరుట. ప్రథమాద్వితీయాతృతీయలందు దర్భశయనము అష్టమియందు సువేలారోహణము నవమియందు యుద్ధారంభము. అమావాస్యయందు రావణవధముగాన సప్తరాత్రమనుట చెల్లుచున్నది.

మును యుద్ధంబున నమోఘము నయినయమ్మహాబాణమును, రామునకొసంగెను. ఇది యమిత తేజుండగు బ్రహ్మచే మున్నింద్రునికొఱకై నిర్మింపఁబడినది. ఆ బ్రహ్మ, ముల్లోకములను జయింపఁగోరుచున్న యింద్రునకు మున్నట్లునిర్మించి దీనినొసంగెను, దీనిఱెక్కలందు వాయుదేవుఁడును, అలుఁగునందు సూర్యాగ్నులును, నధిదేవతలై యుందురు. దీనిశరీరము మధ్యభాగమాకాశమయమై దానింబోలెవ్యాప్తిసమర్థంబై యుండు. అది మేరు మందరపర్వతములుంబోలె గురుత్వమును ప్రజ్వరిల్లుచున్నయాకారమును గలిగి మంచిపింజతోఁగూడి బంగారుచే రంగారుచుండెను అది సర్వభూతములసారాంశములు గ్రహించి నిర్మింపఁబడినదై సూర్యునివలెఁ దేజరిల్లుచు, పొగతోఁగూడినప్రళయకాలాగ్నివలెను, ప్రజ్వలించుచున్నక్రూరసర్పమువలెను జూపట్టుచుండెను. అది శత్రువులగజాశ్వసమూహములను నతిశీఘ్రమున ఛేదించునది. వానినేకాదు. శత్రుపురద్వారములను పరిఘములను పర్వతములనుంగూడ భేదింపఁజాలునది. అది పలువిధము లయినరాక్షసులనెత్తుటం దడిసి, మేదస్సునబ్రుంగి, మిక్కిలియుబెట్టిదమై, వజ్రమునవలె మిక్కిలియు దృఢమై మహాధ్వని నెసంగించుచు నానావిధములయిన కపటయుద్ధంబులనుగూడ రూపడంచుచునుండును. అది భయంకరమై యెల్లవారికి బెదరుపుట్టించుచు, నిట్టూర్చుసర్పముంబోలి, కంకపక్షులకును గృధ్రములకు వశములకును, నక్కలగుంపులకును, రక్షోగణములకును నిత్యమును యుద్ధంబుల నాహారమునొసంగునది; యుద్ధంబుల యమునింబోలి భయంకరమై యుండును. వానరవీరులకెల్ల నది సంతోషమును, రాక్షసులకు వినాశమును గలిగించునదై సొగసయి చిత్రములయి పలువిధము లగుగరుత్మంతుని ఱెక్కలుగట్టంబడియుండెను. అది సమస్తలోకములలో నుత్తమంబగు బాణమై యిక్ష్వాకులవంశ్యులకెల్ల భయంబునుబోఁగొట్టుచు, శత్రువులకీర్తి నపహరించుచు, రామునకు మిక్కిలియు హర్షముగలిగించునదై యుండెను. మహాబలసంపన్నుఁడగు రాముఁ డట్లా దివ్యాస్త్రమును దీసికొని వేదోక్తమగువిధానమున నభిమంత్రించి వింటసంధించెను. రాముఁ డమ్మహాబాణమును వింట సంధించుచుండఁగా, సర్వభూతములును దిగులొందినవి. భూమియు వడంకెను, రాముఁడు మిక్కిలియు క్రుద్ధుఁడై బలంబుకొలఁదిని బిట్టుగా వింటి నాకర్ణాంతముగాలాగి, మర్మముల ఛేదించునమ్మహాబాణమును మిక్కిలియెచ్చరికమెయి రావణునిమీఁదఁ బ్రయోగించెను. అమ్మహాబాణము, దేవేంద్రునిబాహువునుండి విడఁబడ్డవజ్రాయుధమువలెఁ జెనకరానిదై, కల్పాంతయమునికైవడి వారింపరానిదై రావణువక్షమునఁ గాఁడెను. మహావేగంబై శత్రుదేహముల రూపుమాపునబ్బాణము, వెడివడి, దురాత్ముఁడగు రావణునివక్షముదాఁకి వీపున నుచ్చికొనిపోయెను. ప్రాణనాశకరమయినయబ్బాణము, రావణునెత్తురున దూసికొని వేగమున నతనిప్రాణములు హరించి నెత్తుటఁదోఁగినదై వెలువడి భూతలమును బ్రవేశించినది. అది రావణునివధించి నెత్తుటం దడియుటచే కాంతియెట్టిదైతోఁచక పంచిన కార్యమును జేసితీర్చినదగుటం జేసి యడఁకువతోఁగూడినదియుంబోలె, మరలఁ దనపొదికివచ్చి చొచ్చినదయ్యె. అట్లురావ

ణుఁడు హతుఁడై ప్రాణములను జీవితమును దొఱంగుచుండఁగా, నతనిచేతనున్న విల్లు,
పట్టువదలి వేగ బాణముతోఁగూడ నేలఁబడెను. భయంకరమైనయురవడియు, మహాతే
జంబును గలరాక్షసేంద్రుఁడౌ రావణుఁడు, ప్రాణములు వెడలఁగానే, వజ్రాయుధముచే
హతుఁడగువృత్రుఁడుంబోలె రథమునుండి నేలంగూలెను. అంత హతశేషులగు రాక్షసు
లు రావణుఁడు పడుటంజూచి, తమనాథుఁడు హతుఁడగుటవలన బెదరుగదిరి నలుదిక్కు
లకును బాఱిపోయిరి. వానరులును వృక్షహస్తులై సింహనాదములు సేయుచు నారాక్ష
సులం దఱిమిరి. ఆరాక్షసులు రావణుఁడు హతుఁడగుటయు రాముఁడు జయమునొందు
టయును జూచి, వానరులుబ్బున వెనుదగిలి నొప్పింపఁగా, ప్రాపులేనివారగుటం జేసి,
ముఖంబుల కన్నీరుచిప్పిల్లుచు చూచువారికి జాలిపుట్ట, భయమున లంకాభిముఖు
లయి పాఱిరి. అంత జయశాలురగువానరులు మిక్కిలియుబ్బునొంది రాముని
విజయమును రావణునివధమును నుగ్గడించుచు సింహనాదములు సేసిరి. అంత నాకాశ
మున మంగళకరముగా దేవదుందుభి మ్రోసెను. అచట వాయువు దివ్యగంధములం
దాల్చి సుఖముగా వీచెను అప్పు డంతరిక్షమునుండి, రామునిరథముపయి నంతయు పు
వ్వులనించుచు దుర్లభం బగుపువ్వులసోన మనోహరముగఁ గురిసెను. భూమియందు వా
నరులు సేయుస్తోత్రములేకాక యాకాశమునందును మహాత్ములగుదేవతలు, రాముని
పలువిధంబులఁ బొగడుచు, బాగుబాగని కొనియాడుమేలివాక్యమును భూమియందు
వినఁబడెను. క్రూరుఁడును సమస్తలోకభయంకరుండు నగురావణుండు హతుఁడగుట
యు, దేవతులును చారణులును మిక్కిలియు సంతోషావేశమునొందిరి. అంత రాముఁ
డు రాక్షసేశ్వరుని రావణుని వధించి తానును సంతుష్టుఁడై తనరాజ్యము గొన్నసుగ్రీ
వుఁడును యౌవరాజ్యము నొందినయంగదుఁడును ప్రత్యుపకారము సేయుటకు రావణు
నివధము గోరుచుండినవారుగాన, వారినిని గోర్కె యీడేఱినవారిని గావించెను. అంత
దేవతులెల్లను గలంకమాని ప్రసన్నతనొందిరి. దిక్కులు తేటలయ్యెను. ఆకాశము ని
ర్మలమయ్యెను. భూమి కంపింపకయ్యె. వాయువు వీవఁదొడఁగెను. సూర్యుఁడు స్థిరమ
యినకాంతితో వెలింగెను. అంతనపుడు సుగ్రీవుఁడును విభీషణుఁడు మొదలగువారును,
మఱియు జాంబవతుఁడు మొదలయిన సుహృదులును, లక్ష్మణసహితముగాఁ జేరి, రాముఁ
డు యుద్ధంబున జయమునొందుటకు సంతుష్టులై, యందఱును గూడి, జయలక్ష్మిచే మ
నోహరముగా వెలుంగుచున్న రాముని యుక్తప్రకారంబునం బూజించిరి. మహాతేజుం
డును రఘుకులరాజుల కానందకరుండు నగునా రాముఁడు, యుద్ధమున శత్రువునువధించి
ప్రతిజ్ఞ నెఱవేర్చి, తనజనములచేతను సైన్యములచేతను బరివృతుఁడై దేవగణములచే
తఁ బరివేష్టితుండగు దేవేంద్రునివలెఁ బ్రకాశించెను.*ఇది నూటపదునొకండవసర్గము.

* ఫాల్గునపుఅమమాస్యయందు రావణవధము. లేక 'సర్వాహోరాత్ర' మని యుద్ధము రేయుంబవలును
వర్తించె నన్నచో అమావాస్య శేషించియున్న చైత్రశుద్ధ పాడ్యమి ప్రాతఃకాలమున రావణవధమని
తెలియునది. గోవిందరాజులు.

భ్రాతృవధమునకై దుఃఖమున విలపించుచున్న విభీషణుని రాముఁడాశ్వాసించుట.

రామునిచేఁ బరాజితుఁడై హతినొంది యుద్ధభూమిం బడియున్న యన్నను జూచి, విభీషణుఁడు దుఃఖోద్రేకము మనంబునఁ బయికొన నిలువక విలపించువాఁడై 'వీరా! నీవు మహాపరాక్రమశాలివే! మహాప్రసిద్ధుఁడవే! సమస్తశాస్త్రముల శిక్షితుఁడవే! రాజనీతిం బండితుఁడవే! లోకోత్తరమయిన శయ్యాపయిం బవ్వళింపఁదగినవాఁడవే! ఇట్లు హతుడవై యిపుడు, బాహుపురులచే నలంకృతములయి యున్న దీర్ఘభుజములను యిట్టట్టు గదలకుండఁ జాఁచి, రథమునుండిపడఁగాఁ గొంచెముపట్టుతొలఁగి సూర్యునివలెఁ దేజరిల్లుచున్న కిరీటముతో, నేలంబరుండియున్నావేమి? వీరా! నేను మున్నే మిగలుగునని చెప్పితినో యామాట మన్మథమోహాక్రాంతుఁడవగుటం జేసి నీకు రుచింపక పోయినది. ఆమాట వొప్పననే యిదిగో నాఫల మనుభవించితివి. సీతనపహరించినంతటి మహాపాపకర్మమును గావించి ప్రహస్తుఁడుగాని యింద్రజిత్తుగాని యితర రాక్షసులుగాని, కుంభకర్ణుఁడుగాని యతిరథుండగు నతికాయుఁడుగాని నరాంతకుఁడుగాని నీవు నీయంతటఁగాని కావరమున నెంతమాత్రము సరకుసేయరైతిరి. అందులకు ఫలమిదిగో ప్రాప్తమయినది. సమస్తనీతులకు సేతువగు (మర్యాదయగు) వాఁడు గతించెను. ధర్మము యొక్క రూపమైనవాఁడు గతించెను. బలంబుల వెనుఁగుప్పయైనవాఁడు గతించెను. సకలస్తోత్రములకును విషయమైనవాఁడు గతించెను. ఆయుధధారులలోనెల్ల మేలుబంతి యగువీరుఁడితఁడు నేలంబడుటవలన, సూర్యుఁడు భూమిం బడినట్లయ్యె. చంద్రుఁడు చీఁకటిలో మునిఁగినట్లయ్యె. అగ్ని సెగచల్లారినట్లయ్యె. ఇఁక నింతటివాఁడు లేనందున యుత్సాహశక్తియె, ఆశ్రయము లేక వ్యాపారముదూలినదయ్యె. రాక్షససింహుఁడు యుద్ధంబున హతుఁడై దుమ్ములఁ బ్రుంగుచు నిదురించినట్లుండఁగా నిట్టిమహావీరుని గోలుపడ్డప్రపంచమునందు నిఁక నేమిమిగిలియున్నది? ఏమియు లేదు. సమస్తము శూన్యముగానే తోఁచుచున్నది. ధైర్యమె చిగురుగాను, సహనమె * మేలిపువ్వుగాను, తపమే దార్ఢ్యముగాను, శౌర్యమే దృఢమయిన వేరుగాను గలదై మిక్కిలిగొప్పది యగు రావణుఁడను వృక్షమును యుద్ధమున రాముఁడను వెనుగాలి విఱిచివైచెను. † పరాక్రమమే విషాణముగాను, పితృపితామహాదివర్గమే వెన్నెముక

* వృక్షమునకు చిగురువలె ధైర్యమే మొదటిఫలము. పండునకు పువ్వువలె ప్రసహనమే కార్యమునకు అవ్యవహితమైన హేతువు. కాన రావణవృక్షమునకు ధైర్యము చిగురుగాను సహనము పువ్వుగాను నిరూపింపఁబడినవి. శౌర్యమువలననే తపస్సు మొదలగునవి గలుగునుగాన శౌర్యము మూలముగాఁ జెప్పఁబడినది.

† విషాణము పరమర్మములను భేదించునట్లు తేజస్సును భేదించునుగాన తేజస్సు ఇట విషాణముగా రూపింపఁబడినది. వంశముచే (వీఁపుచే) ఆశ్రితులను ధరించునట్లె కులముచేతను ధరించుటచే కుల

గాను, కోపమే తలతప్ప తక్కినశరీరముగాను, అనుగ్రహమే హస్తముగాను, గల రావణుండను మత్తగజము, రాముఁడను సింహముచేఁ బట్టుకొనఁబడి హతమై నేలంబడినది. పరాక్రమోత్సాహములు విజృంభించిన జ్వాలలుగా, నిట్టూర్పు ధూమముగా, నిజబలమే వేడిమిగా, మహాతేజముగలిగి, వెలుఁగు రావణుం డనునగ్నిని యుద్ధమున రాముఁడను మేఘము చల్లార్చెను. రాక్షసులే * వాలమును మూఁపురమును గొమ్ములునుం గాఁగలిగి, శత్రులను గెలుచునదై శత్రుల పొడవడంచుటయందు ముఖ్యమై (గర్వంబున మదపు టెనుంగుబోలి) విషయచాపలమె చెవులును గన్నులునుగాఁగలిగియున్న రావణుం డను నాఁబోతుగూడ, రాముఁ డను వ్యాఘ్రముచే హతమైకూలెను' అని విలపించెను. అట్లు శోకావేశంబున యుక్తియుక్తంబు లగువాక్యములు చెప్పుచు నర్థమిట్టిదని పరామర్శించి నిశ్చయించి తెలిసినవాఁడగు విభీషణునిం జూచి రాముఁడు 'ఈ రావణుఁడు పరాక్రమముచూపక పిఱికివలె నశింపలేదు. యుద్ధంబున ప్రచండమయిన పరాక్రమమున మిక్కిలి యున్నతం బయినయుత్సాహమును నెఱపి నిర్భయముగా నేలంగూలినాఁడు. పరలోకవృద్ధిం గోరుచు, శూరధర్మమునఁ దప్పకనిలిచి యిట్లు యుద్ధమున నిర్భయులై హతులయినవారినిగుఱించి దుఃఖింపరాదు. యుద్ధమున దేవేంద్రసహితములయిన ముల్లోకములు నెవ్వనికి వెఱచునో, అట్టి పరాక్రమబుద్ధిసంపన్నుఁడగు రావణుఁడు కాలధర్మమునొంది వీరస్వర్గమునకుఁ బోయినపుడు దుఃఖించుట యుక్తముగాదు. 'మరణమన్న దుఃఖింపకుండనగునా' యందువా ? యుద్ధమునందు జయమేకలుగునని నియమ మింతవఱకెవ్వఁడును గలిగినదిలేదు. వీరుండగువాఁడు యుద్ధమున శత్రువులనయిన వధించును. శత్రువులచే తానైనను హతుఁడగును. అతనికి రెండు సమములే. క్షత్రధర్మ మాలోచింపుము. ఇట్లు యుద్ధంబున హతుఁడై వీరస్వర్గమునొందుట పూర్వులయిన పెద్దలచే నుపదేశింపఁబడినదే. మఱియు క్షత్రియులకెల్ల నభిమతమయినదే. యుద్ధమున హతుఁడయిన శూరునిగుఱించి, యతఁడు వీరస్వర్గమునొందుటంబట్టి యెంతమాత్రము దుఃఖింపరాదని శాస్త్రనిర్ణయము. అట్లగుటం జేసి శాస్త్రనిశ్చయ మిట్టిదని యెఱింగి పుట్టినవారికి మరణముదప్పదను పరమార్థబుద్ధిగలిగి శోకంబుమాలి, యిఁకమీఁద నేకార్య మనుష్ఠింపవలయునో దానినిగుఱించి యాలోచింపుము' అనెను. అట్లు పరాక్రమవంతుఁ డగురాజకుమారుఁడు రాముఁడు పలుకుటయు, నవ్విభీషణుఁడు శోకసంతప్తుఁడై తనయన్నకు వెంటనే చేయవలసిన హితమునుగుఱించి రామునితో 'సముద్రము చెలియలికట్టను దాఁకి భగ్నమగునట్లు, ఇపుడు యుద్ధమున నిన్నుఁదాఁకి, భగ్నుఁడయిన యీరావ

ము వంశముగా రూపింపఁబడెను. తలతప్పఁ దక్కినదేహము పెక్కువిధములుగ నుండుటంబట్టి కోపమును పెక్కులగుటచే అది అపరగాత్రముగా రూపితము. హస్తముచేత కోరినది యిచ్చునట్లు ప్రసాదము చేతను నిచ్చుటచేనది హస్తముగాఁ బోల్పఁబడెను.

* రాక్షససమృద్ధి గర్వహేతువగుటచే గర్వహేతువులగు లాంగూలాదులుగా రూపితమైనది.

ను డింతకుమునుపు దేవేంద్రునితోఁగూడ దేవతలెత్తివచ్చినను యుద్ధంబులం బరాజయుం బెఱుంగఁడు; కాన మహావీరుఁడు. ఇతఁడు పెక్కుదానములు చేసినాఁడు; గురుదేవతాదులం జక్కఁగాఁ బూజించినాఁడు; సమస్తభోగముల ననుభవించినాఁడు; భృత్యులను జక్కఁగాఁ బోషించినాఁడు. మిత్రులకు యథేష్టముగా ధనములొసఁగినాఁడు; శత్రువులందు పగతప్పక తీర్చిపుచ్చినాఁడు; కానధర్మశీలుండునగును. మఱియు నితఁడు ఆహితాగ్నియై యగ్నిహోత్రము తప్పక వేల్చుచుండినవాఁడు, మహాతపస్సంపన్నుఁడు, వేదాంతములు నెఱింగినవాఁడు, మిక్కిలియుఁ గర్మశూరుఁడు. ఇట్లు మహాశూరత్వాదిలక్షణములుగలిగి సంస్కారార్హుం డయినయితఁడు ప్రేతత్వమునొందఁగా నితనికిఁ జేయవలసిన యౌర్ధ్వదైహికమును, నీ ప్రసాదమునొంది చేయఁగోరుచున్నాను' అనెను. అట్లువిభీషణుఁడు జాలిగొలుపునట్టి మాటలాడి, చక్కఁగా బోధింపఁగా మహాత్ముండును నతిబలవంతుఁడు నగు రాజకుమారుఁడురాముఁడు రావణునకు స్వర్గమునకై హితమగు నంత్యేష్టికర్మమును గావింప నియోగించువాఁడై. 'మరణపర్యంతమే వైరమువర్తించును; కాని యటమీఁద వైరమువలనఁ బనయేమి * మన కార్యమును

* ఈశ్లోకము 'మరణాన్తాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనమ్। క్రియతామస్య సంస్కారో మమాప్యేష యథాతవ' అనిమూలము. ఇట 'నిర్వృత్తం నః' అనుచో 'నః' అనునక్షరముచే గాయత్రి యిరువదియవ యక్షరమగు నకారము గ్రహింపఁబడినదిగాన యిరువదవ శ్లోకసహస్రి మారంభించెనని తెలియునది. దీనికి విశేషార్థము. (మరణాన్తాని వైరాణి) ఋషిజనస్థానభ్రంశము సీతాహారణము మత్పాప్రాణభూతుఁడయినజటాయువు నఱుమాడుట మొదలుగా నాయెడల ద్వేషము నాచరించుపను లిఁక మీఁద చేయఁజాలఁడుగదా యనిభావము. (నిర్వృత్తం నః ప్రయోజనమ్) మన ప్రయోజనము నెఱవేఱినది. 'యదివా రావణస్స్వయం' 'రావణుఁడువచ్చినను గాని చోడ్కొనిరమ్ము' అనిచెప్పిన నేను, ఇతనివిషయమందు ఏదేని మంచిచేయవలయునని మనస్సునఁ దలఁచియుంటిని. కాని యితఁడు 'ద్విధాభజ్యేయమప్యేవం న నమేయంతు కస్యచిత్' 'రెండుతుంకములయిన నగుదునుగాని యెవ్వనికిని లొంగను' అనిచెప్పి చలముపట్టుటచే నేనుతలంచిన మంచిచేయుటకు లేకపోయినది. దానిని చేయుటకు నిపుడు సమయముదొరకినది. (క్రియతామస్య సంస్కారః) ఇప్పుడు మృతుఁడైయున్నాఁడు. మునుపటివలె నేను జేయు మంచికి అడ్డిచేయ నేరని యవస్థ యితనికి కలిగినది. కాఁబట్టి యిట్టియవస్థయం దితనిని విడువరాదు. ఇటమీఁద చేయవలసినదేదో దాని నితనికిఁ జేసియే తీఱవలయును. (మమాప్యేష యథాతవ) (ఏష మే యథా తథా తవాపి) 'ఈతఁడు నాకెట్లో యట్లె నీకును' అనియర్థము. మృతుఁడై నేనుజేయు మేలునకు నడ్డుచేయలేనివాఁడగుటచే నితఁడు నాచిత్తమున కనుకూలుఁడయినాఁడు. కాఁబట్టి నామిత్రుఁడగు నీవును నితని ననువర్తింపవలయునని భావము. లేక (ఏష తవ యథా తథా మమాపి) 'ఇతఁడు నీకెట్లో యట్లె నాకుఁగూడ' ననియర్థము. ఇతనిసంస్కారము నీకెట్లు ప్రాప్తమో యట్లె నాకును ప్రాప్తము అనిభావము. నీ వితనిరోషమునఁ జూచి యితనికి సంస్కారముచేయవేని నేనేచేయుచున్నాను. బంధువులలో ఎవరైనను దీనిని జేయవలయునుగదా. కాఁబట్టి నీవు దూరమున నుండుము. నేనేచేయుచున్నాను (మమాప్యేష యథాతవ) నాకు భ్రాతవగు నీకు భ్రాతయగుటచే యితఁడు నీకెట్లుభ్రాతయో యట్లె నాకును భ్రాతగాన నీవు సంస్కారము చేయవేని నేను చేసెదననియు భావము. గోవిందరాజులు.

నెఱవేఱినది. ఇఁక నితనికి సంస్కారము గావింపుము. ఇతఁడు నీకెట్లుతోఁబుట్టువో యట్లే యిఁక నాకునుతోఁబుట్టువేకాని వేఱుగాఁడు' అని చెప్పెను. ఇది నూటపండ్రెండవసర్గము.

{ రావణుభార్యలు మృతుండయినపతినిజూచి రోదనము సేయుట. }

మహాత్ముఁడగురామునిచే రావణుఁడు హతుఁడయ్యెనని విని రావణుని భార్యలయిన రాక్షసకామినులు, శోకంబున స్రుక్కుచు, ఎవ రెంతవారించినను నిలువక, నేలదుమ్ములంబడి పొరలుచు, తలవెండ్రుకలు విరియఁబోసికొని, దూడలు పోయిన గోవులపగిది దుఃఖంబునం బొక్కుచు నంతఃపురమునుండి వెడలివచ్చిరి. ఆరాక్షసస్త్రీలు రాక్షసులతోఁగూడ నుత్తరద్వారమున వెడలి, భయంకరమగు యుద్ధభూమిని బ్రవేశించి హతుఁడగుతమపతిని గలయవెదకుచు 'రాజపుత్రా'! యని రామునిని, 'నాథా' యని రావణునినిబేర్కొని విలపించుచుఁ, గబంధములచే చిహ్నితమై నెత్తురుబురదలతోఁ గూడియున్న యుద్ధభూమినంతటను దిరిగిరి. ఆస్త్రీలు, భర్తృమరణమువలని శోకముచే మిక్కిలియు గ్రుంగుడువడి, కన్నుల గవలనిండఁ గన్నీరొలుక, రోదనముసేయుచు యూథపతి మరణించిన యాఁడు గజములవలె బిగ్గఱ నఱచిరి. వారు, మహావీర్యశాలియు, మహాకాయుఁడును మహాతేజుండును నై నల్లనికాటుకరాశివలె నుల్లసిలుచు హతుండై భూమింబడియున్న పతిని రావణునిం జూచిరి. అంత నక్కాంతలు, యుద్ధభూమిని దుమ్ములను గ్రుంగి పరుండి యున్న ప్రాణేశ్వరునిఁ జూచి వివశలయి, త్రెంపఁబడ్డ యడవితీవియలవలె నతని యవయవములపయి గొబ్బునఁబడిరి. ఒకానొక చెలువ, ప్రేమాతిశయమున నారావణుం గౌఁగిలించుకొని రోదనముచేసెను. మఱియొక్కతి, యడుగులం జక్కఁబడియు, మఱియొక్కతి కంఠమును నాలింగనము సేసికొనియు విలపించెను. ఒకపడఁతి, పతిబుజములనెత్తికొని భూమిని బొరలాడెను. మఱియొకలలన హతుండగు నాథుని మొగమును జూచి సొమ్మసిలెను. ఒకానొకతరుణి, తనప్రియునిశిరస్సును నొడియం దిడుకొని యతని మొగమును దేఱిచూచుచు, మంచునీళ్లచే తామరపువ్వుం బోలె, కన్నీళ్లచే దానిం దొప్పఁదోఁచుచు రోదనముగావించెను. ఇట్లాస్త్రీలందఱు, హతుఁడై రణభూమినిబడి యున్నతమపెనిమిటిని రావణునిఁజూచి, యార్తలయి రోదనముచేసిరి. మఱియు శోక మంతకంత కగ్గలముకాఁగా పరవశలయి యతనినిగూర్చి 'ఎవ్వనికి దేవేంద్రుఁడు వెఱచునో, ఎవ్వనికి యముఁడు భయపడునో, ఎవ్వఁడు కుబేరునిజయించి యతని పుష్పకవిమానమును దీసికొనెనో, మఱియు నెవ్వనివలన గంధర్వులును మహర్షులును మహాప్రభావులగు దేవతలును మిక్కిలియు భయము నొందిరో, యట్టిమహావీరుఁ డితఁ డిపుడు యుద్ధంబున హతుండై నేలంబడియున్నాఁడే!

అసురులవలనఁగాని సురలవలనఁగాని, యురగులవలనఁగాని, యెవ్వఁడెంతమాత్రము భయమనుమాట యెఱుఁగఁడో యట్టిశూరున కిపుడొక మనుష్యునివలన భయము గలిగెనుగా! ఎవ్వనిని దేవతలకును నల్లె దానవులకును రాక్షసులకును వధింపనలవి గాదో యట్టి యీరావణుఁ డిపుడు యుద్ధంబున రథాదులులేక పట్టి కాలినడతోఁ వచ్చిన యొకబీదమనుజునిచే హతుఁడై పడియున్నాఁడే! దేవతలుగాని యక్షులుగాని యసురులుగాని యెవ్వని వధింపఁజాలరయిరో, యట్టిమహాశూరుం డితఁడు, ఎవ్వఁడో యొకబలహీనుండుంబోలె, మనుష్యమాత్రునిచే మృత్యువునొందెనే!' అని పలువిధములఁ బలవించిరి అస్త్రీలివ్విధంబున పెనిమిటిపరాక్రమాదులు పలువగల నుగ్గడించుచు రోదనము సేసి, మరల, దుఃఖ మతిశయింపఁగా పట్టలేక, మాటిమాటికి 'నీ వెప్పుడును నీహితమునే చెప్పునట్టిమిత్రు లెంత చెప్పినను వినక సీతను దెచ్చితివి. అది నీమరణమునకే యైనది. నుతి రాక్షసులును హతులయిరి. ఇప్పు డీమేమందఱమును, రాక్షసులును, నీవును, అందఱు నేకకాలమునఁ గూల్పఁబడితిమి. నీయందు ప్రీతి గలనీతమ్ముఁడు విభీషణుఁడు నీకు హితమునే బోధించుచున్నను, నీ వజ్ఞానమున నీచావునే కోరి, యతనిని ముందువెనుక చూడక పరుషవచనములాడి పరిభవించితివి. నీవు మిథిలరాజసుతను సీతను రామునకు మరల నొసంగియుందువేని, మాకందఱకు మూలమయిన నీ విట్లు మరణింపకుందువే! ఇట్టి నీమరణమువలన మాకు బెట్టిదముగాఁ గలిగినయీఘోర వ్యసనమును గలుగకుండునే! నీతమ్ముఁడయిన విభీషణుని కోరికయుఁ గావించినట్లగునే! రాముఁడును మనకులమునకుఁ గూరిమిమిత్రుఁడగునే! మేమందఱమును విధవలము గాకుందుమే! మనపగవారికోర్కెయు ఫలింపకుండునే! నీ వట్లు సేయక, క్రూరుఁడవై బలవంతముగా సీతను చెఱంబెట్టుకొనియె యుండుటవలన, ఈరాక్షసజనమును నీవును మేమును ముగ్గుర మేకకాలమునఁ గూలనయినది. రాక్షసోత్తమా! ఇదంతయు నీవు విచ్చలవిడిగాఁ జేసి తెచ్చుకొన్నదే కాదు. అన్నియు దైవమే చేయించుచున్నది. దైవముచే హతుఁడయినవాఁడే శత్రువుచేత హతుఁడగును గాని యితరుఁడుగాఁడు. మహాబాహూ! వానరులకును రాక్షసులకును, నీకును నిట్టిమహాయుద్ధమునం దీవినాశము దైవసంకల్పముననే కలిగినదిగాని వేఱుకారణమునఁ గాదు. లోకమున దైవ మొకకార్యమునకుఁ బూనినపిదప, అర్థబలమునఁగాని, యిచ్ఛచేతంగాని, పరాక్రమమునఁగాని, యాజ్ఞచేతఁగాని, దాని నెంతమాత్రము త్రిప్పనలవిగాదు' అని మాటిమాటికి విలపించిరి. ఇవ్విధంబున నారాక్షసేశ్వరుని భార్యలు, దీనలయి, దుఃఖార్తలయి, కన్నుంగివ కన్నీళ్లఁగ్రమ్మి కలంకనొంద క్రౌంచపిట్టలవలె విలపించిరి. ఇది నూటపదుమూఁడవ సర్గము.

రావణుని పట్టపుదేవియగు మండోదరి విలపించుట; విభీషణుఁడు రామునియోగంబున రావణునకు సంస్కారము సేయుట.

ఆరాక్షసస్త్రీ లనవ్విధమున విలపించుచుండఁగా వారిలో రావణునకు మిక్కిలియుఁ బ్రియురాలును, జ్యేష్ఠపత్నియు నయినమండోదరి, దీనయై తనభర్తం జూచెను. మండోదరి యచట నచింత్యకర్ముం డగురామునిచేత హతుఁడై యున్న తనప్రాణనాథుని రావణునిం జూచి, దుఃఖితయై 'అయ్యా! మహాభాగా! కుబేరునితమ్ముఁడా! నీవు క్రుద్ధుఁడై కన్నెఱ్ఱఁ జేసినపుడు నీయెదుట నిలుచుటకు దేవేంద్రుండేనియు ఋషులును బ్రాహ్మణులును మహాయశస్కులగు గంధర్వులును దిగులుపడుట తెల్లమేకదా. ఇట్టినీవు మనుష్యునిచే నెట్లు జయింపఁబడితివి! అయ్యా! నీకు భయపడి చారణులును దిక్కులకుం బాఱిరిగదా. రాక్షసతిలకా! అట్టి మహాశూరుండవగు నీవు మనుష్యమాత్రుం డగురామునిచేత యుద్ధమున నోడిపడితివే! రాజా! ఇందులకు లజ్జనొందవే. ఇదియేమి? పరాక్రమమున ముల్లోకముల నాక్రమించి త్రిలోకరాజ్యలక్ష్మిచే నెంతయు రాజిలుచు నెట్టివారికి నోర్వరాకుండుమగఁటిమి గలనిన్ను నొక కేవలమనుష్యుఁడు, అందును నడవిలోఁ దిమ్మరుచున్నట్టివాఁడు, ఎట్లు వధించెనో! ఆశ్చర్యముగానున్నదే! ఇంతేకాదు. నీవుండుదేశము మనుష్యులకుఁ బొందనలవికాదు. నీవును కామరూపివి. ఇట్టినిన్ను, మనుష్యుఁ డారాముఁడు యుద్ధమునఁ జంపెననుట యెంతమాత్రము పొసఁగకున్నది. సమస్తయుద్ధోపకరణములు పూర్ణముగా నున్ననిన్ను యుద్ధాగ్రమున నెదిర్చి రాముఁ డాక్రమించెననుట యిది రాముఁడే కేవలము మనుష్యుఁడై చేసినకార్యముగా నాకు నమ్మకము గలుగలేదు. జనస్థానమున ననేకరాక్షసులతోఁ గూడినసీతమ్ముని ఖరుని వధించునపుడే యీరాముఁడు మనుష్యమాత్రుఁడు గాఁడని స్పష్టముగాఁ దెలిసినది. దేవతలకుఁగూడఁ బ్రవేశింప నలవి గానియీలంకానగరములోపలికి హనుమంతుఁడు వీర్యము నెంపున వచ్చినపుడే మేము రాముఁడు మనుష్యమాత్రుఁడుగా నుండఁడని దిగులొందితిమి. భయంకరాకారులగువానరులు, ఇమ్మహాసముద్రమున సేతువు కట్టినపుడే నేను రాముఁడు మనుష్యమాత్రుఁడు గాఁడని మనస్సునం దలంచితిని. అటుగాదేని, యముఁడే, నిన్ను వధించుటకై యపరిమేయరూపలావణ్యము గలసీతారూప మగుమాయం బన్ని రామరూపంబు దాల్చి తానే నీమీఁదికి వచ్చియుండును. మహాబలశాలీ! దేవేంద్రుఁడు వచ్చి నిన్నిట్లు గీడ్పఱిచియుండునో. ఇదియు నొప్పదు. ఇంద్రుఁడు యుద్ధంబున నిన్నుఁ గన్నెత్తిచూచుటకుఁగూడ శక్తుఁడు గాఁడే. * లోకరక్షణోపాయంబును గుఱించి మహాచింత గలిగి, యెప్పుడు నునికియు,

* ఇందులకు 'వ్యక్తమేష మహాయోగీ పరమాత్మా సనాతనః । అనాదిమధ్యనిధనో మహతః పరమో మహాన్ । తమసః పరమో ధాతా శంఖచక్రగదాధరః । శ్రీవత్సవక్షా నిత్యశ్రీ రజయ్యశ్శాశ్వతో ధ్రువః' అనిమూలము. విశేషార్థము:—విష్ణువు సర్వదేవతలకంటె నుత్కృష్టుఁడనియు, రాముఁ డట్టి విష్ణు

జన్మవృద్ధినాశములు లేమియు, తఱుఁగకుండుటయు, మాఱకుండుటయుఁ గలిమిచే నపక్షయాది షడ్వికారములు లేక, గొప్పవారగు నింద్రాదులకును గొప్పవాఁడయి బ్ర

వేయనియు త్రిముఖముననే భగవంతుఁడగు వాల్మీకి వ్యాఖ్యానించుచున్నాఁడు. (వ్యక్తమేషః) స్పష్టముగా నితఁడు—పరిశేషమువలనను ప్రమాణముచేతను నిశ్చయింపఁబడిన రావణహంతయగు నితఁడు, (మహాయోగీ) 'యోగస్సన్నహనోపాయధ్యానసంగతియుక్తిషు' అన్నట్లు మహాసన్నహనము గలవాఁడు—ఆశ్రితరక్షణసన్నాహము గలవాఁడనుట, (మహాయోగీ) యోగమనఁగా నుపాయముఁ గనుక, వివిధమై విచిత్రమగు జగత్తు నిర్మించు నుపాయముఁ జతురుఁడు, (మహాయోగీ) యోగమనఁగా ధ్యానము అనఁగా సంకల్పము గనుక 'బహుస్యాం ప్రజాయేయ' 'పెక్కండ్రనయ్యెదను; ప్రజలను బుట్టించెదను' అని యిత్యాదులచేఁ జెప్పఁబడునట్లు మొట్టమొదట నొక్కఁడై యుండిన తాను పెక్కండ్రు అగునట్లు సంకల్పము చేసినవాఁడనుట, (మహాయోగీ) యోగమనఁగా యుక్తి యునగును గాన శరణాగతరక్షణాదులందు పూర్వపక్షులచే చలింపఁజేయ నలవికాని యుక్తి గలవాఁడనుట. (పరమాత్మా) చేతనాచేతనములు శరీరముగాఁ గలిగి వానియందెల్ల నాత్మయై యుండువాఁడు. అట్లు సమస్తశరీరములతో సంబంధించియున్నను వానిదోషములు తాఁకనివాఁడనుటకై, (సనాతనః) అన్నాఁడు. (అనాదిమధ్యనిధనః) ఆదిమధ్యాంతశూన్యుఁడు. (మహతః పరమో మహాన్) గొప్పవానికంటె మిక్కిలియు గొప్పవాఁడు. 'అణోరణీయాన్ మహతో మహీయాన్' ఇత్యాదులచేఁ జెప్పఁబడిన పరమమహత్త్వము గలవాఁడు. (తమసః పరమః) 'అక్షరాత్పరతః పరః' 'యస్మాత్ క్షరమతీతోఽహ మక్షరాదపి చోత్తమః' అని శ్రుతిస్మృతులచే క్షరాక్షరములకంటె పరుఁడయినవాఁడు. (తమసః పరమః) 'ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్' అన్న పరమపదమున వసించువాఁడు. (ధాతా) భూతభవిష్యద్వర్తమానకాలములందును సకలజగత్తునకు నిర్మాతయైనవాఁడు. 'సూర్యాచన్ద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్' అని శ్రుతి. (ధాతా) స్థితికర్త. ఆస్థితియు జగత్తు వివిధములుగాఁ జేయుటచే అనేకరూపమయినది. (ధాతా) ధరించువాఁడు, ప్రశాసనముచే లోకములు తనకు లోనయినవాఁడు. 'ఏతస్య వా అక్షరస్య ప్రశాసనే' అని శ్రుతి. ఇట్లు కారణస్వరూపమును ఉపాస్యమగు వస్తువును, అందులకుపయుక్తములగు గుణములును చెప్పఁబడినవి. ఇఁక దివ్యమంగళవిగ్రహయోగమును జెప్పుచున్నాఁడు. (శంఖచక్రగదాధరః) తాను ఉపాస్యుఁడై యుండుటకనుగుణముగా శరణాగతులవిరోధులను నిరసించుటయందు జాగరూకుఁడై అనఁగా వారిని రూపుమాపుటకు సిద్ధముగా నాయుధధారియై యుండుట చెప్పఁబడినది. (శ్రీవత్సవక్షాః) శ్రీవత్సమను మచ్చను వక్షమునఁ గలవాఁడు. శ్రీవత్సకౌస్తుభాదులు నిత్యములగుటచే రుద్రాదులకంటె విలక్షణుఁడగుట చెప్పఁబడినది. (నిత్యశ్రీః) లక్ష్మి నిత్యానపాయినియై యుండువాఁడు-లక్ష్మి యెప్పుడును దన్నెడఁబాయకుండువాఁడు.—ఇట శ్రీ నిత్యానపాయినియై యుండుననుటచే శ్రీ గలిగియున్న దివ్యవిగ్రహము నిత్యమే యగునని చెప్పఁబడినదగుచున్నది. స్వరూపము నిత్యమగుట సాధారణముగానే ప్రాప్తమగుటచే, నిట విగ్రహనిత్యత్వమే తెలియనగును. లేక జగన్మాతయగు నీ శ్రీదేవి నిత్యురాలనియె చెప్పఁబడినది కావచ్చును. శ్రీసంబంధమువలన మెఱుఁగుపెట్టఁబడిన తేజమును (అజయ్యః) అని చెప్పుచున్నాఁడు.—'అప్రమేయం హి తత్తేజో యస్య సా జనకాత్మజా' అనికదా చెప్పఁబడినది. (అజయ్యః) ఉపాసకులు తప్ప తక్కినవారికి జయింప నలవిగానివాఁడు. (అజయ్యః) 'అప్రధృష్యశ్చ సంగ్రామే సేన్ద్రైరపి సురాసురైః' దేవేంద్రునితోఁ గూడిన సురాసురులకుం గూడ యుద్ధమునం జెనకరానివాఁడు' అన్నట్లు జయింపనలవిగానివాఁడు (శాశ్వతః) మూఁడువిధములయిన పరిచ్ఛేదములు

ష్ఠాదులకంటెను గొప్పయై, ప్రాకృతమండలమున కవ్వల నప్రాకృతమగు వైకుంఠమున దివ్యవిగ్రహముతో వెలుంగుచు సర్వదా భక్తుల రక్షించుటకు శంఖచక్రగదాయుధములను ధరించి దక్షిణవక్షమున రక్తవర్ణమై మత్స్యాకారమయిన శ్రీవత్సమను మచ్చగలిగి, లక్ష్మీదేవితో నెప్పుడు నెడతెగక గూడి, యెట్టివారికిని జయింప శక్యుండు గాకున్న యాపరమాత్మయె యితఁడు. ఇది నిశ్చితము. 'ఇట్టిపరమాత్ముఁ డీ మానుషత్వాదులు నొంద నేల' యందువా? సత్యపరాక్రముఁడును మహాతేజస్సంపన్నుండునగు విష్ణుదేవుఁడు సర్వలోకములకును నియామకుఁడై యనిష్టములఁ దొలఁగించి యిష్టములను బొందించు కర్తగావున తోడనే సమస్తలోకములకును హితము

లేనివాఁడు.—వికారశూన్యుఁడును, (ధ్రువః) కంపింపఁజేయఁదలవిగానివాఁడు, ఇట సహస్రనామపాఠమున 'అనాదినిధనోధాతా' యనియు 'నిత్యశ్రీః' అనియు నుండుటంబట్టి ధాతయనుటయు నిత్యశ్రీయనుటయు రూఢిచేతనే చెల్లునని తెలియునది. తనిశ్లోకము.

(మహాయోగీ) లోకరక్షణోపాయమును గురించి మహాయోగము అనఁగా గొప్పచింతగలవాఁడనుట, (పరమాత్మా) సమస్తజీవాత్మలకంటె నుత్కృష్టుఁడయినవాఁడు, పరమత్వమెట్లనఁగా 'సనాతనః' ఇత్యాదులచే షడ్భావవికారములు లేమిని జెప్పుచున్నాఁడు. అవ్వికారములు జీవాత్మకుఁగలవు. అవిలేమిచే పరమాత్ముఁడనుట. (సనాతనః) సదా యునికిఁగలవాఁడు, (అనాదిమధ్యనిధనః) జన్మవృద్ధివినాశశూన్యుఁడు, (శాశ్వతః) అపక్షయములేనివాఁడు, (ధ్రువః) పరిణామములేనివాఁడు. ఈవిశేషణములచే జీవగతములయిన షడ్భావవికారములు లేమి చెప్పఁబడినవయ్యె. ఇవియే 'అపక్షయవినాశాభ్యాం పరిణామర్ధిజన్మభిః । వర్జితశ్శక్యతేవక్తుం యస్సదాస్తీతి కేవలమ్' అని విష్ణుపురాణమునఁ జెప్పఁబడినవి. పరమాత్మశబ్దార్థమును వివరించుచున్నాఁడు. (మహతఃపరమోమహాన్) మహాన్ ఇంద్రాదులు. వారికంటె మహనీయులు బ్రహ్మాదులు. వారికంటె మహనీయుఁడే 'పరమోమహాన్' అనఁబడినాఁడు. స్థానవిశేషముచేతను పరమత్వమును జెప్పుచున్నాఁడు. (తమసఃపరమః) ప్రాకృతమండలమునకు నవ్వల నప్రాకృతవైకుంఠమందుండువాఁడు. 'ఆదిత్యవర్ణం తమసఃపరస్తాత్' 'ఆదిత్యవర్ణంతమసస్తుపారే' అని శ్రుతి. సర్వత్రవ్యాపించియుండువాఁడు పరమపదమనెడి యొక్కచోట నుండుననుటయెట్లు? అనఁగా, విగ్రహమూలమున నక్కడనున్నాఁడనియు స్వరూపముచే సర్వత్రనున్నాఁడనియుఁ జెప్పుచున్నాఁడు. (శంఖచక్రగదాధరః) శంఖచక్రగదలను ధరించువాఁడు. సదాశంఖచక్రములను ధరించుటవలని ప్రయోజనమును జెప్పుచున్నాఁడు. (ధాతా) పోషకుఁడు. సర్వదా నాశ్రితుల రక్షించుకొఱకై యాయుధములను ధరించుచున్నాఁడనుట. ఇదియే 'పాతుప్రణతరక్షాయాం విలంబమసహన్నివ । సదాపంచాయుధీంబిభ్రత్ సనశ్శ్రీరంగనాయకః' అని యభియుక్తులచేతను జెప్పఁబడినది. అతనిసర్వేశ్వరత్వమును దెలుపులక్షణమును జెప్పుచున్నాఁడు. (శ్రీవత్సవక్షాః) శ్రీకరమైనవత్సమును, అనఁగా రక్తవర్ణమై మత్స్యవిశేషాకారమగు వత్సమును దక్షిణపుఱొమ్మునఁగలవాఁడు, (జగద్రక్షణమున కుపయుక్తమయిన పురుషకారసంబంధమును చెప్పుచున్నాఁడు. (నిత్యశ్రీః) నిత్యానపాయినియైన శ్రీగలవాఁడు. ఇందే 'విష్ణోః శ్రీరనపాయినీ' అనఁబడినది. కావుననే (అజయ్యః) జయించుట కశక్యుఁడయినవాఁడు. ఈరాముఁడు ఇటువంటిపరమాత్మయే యగును. (వ్యక్తం) ఇది నిశ్చితమని సంబంధము.—గోవిందరాజులు.

సేయఁగోరి, తనవలన నీకుఁ జావులేకుండునట్టి వరమును బరిహరించుటకై మనుష్య దేహమును దాల్చి, వానరత్వము నొంది సమస్తదేవతలును దన్ను బరివేష్టింపఁగా సమస్తలోకవిరోధి వగునిన్ను నీరాక్షసపరివారమును వధించిపుచ్చినాఁడు. ఇది స్పష్టము. నీవు మున్నింద్రియములను జయించి ముల్లోకములను జయించితివి.ఇప్పు డాయింద్రియములు తమ్ము నీవు గెలిచినయీ వైరమును దలఁచి నిన్ను జయించినవో యన్నట్లు, ఇంద్రియములకు లోనయినట్టిదశ నొందితివి. 'రామునితోడ పగవలదు. సంధిగా వింపుము' అని నే నెన్నిమార్లు చెప్పుచుండినను నీవు విన వయితివే. అందులకు ఫల మిపు డనుభవమునకు వచ్చినది. రాక్షసపుంగవా? నీ వేకారణము లేకయే సీతయందింత యభిలాష నొందితివి. ఆ చెలువను గుఱించి నీవి ట్లభిలషించుట అయుక్తమే.దానంజేసి నీయైశ్వర్యమును, నీబంధువులును నీవును నశించుటయే ఫలించినది. దుర్మతీ! అరుంధతికన్నను, రోహిణికన్నను, నధికురాలును పూజ్యురాలు నయినసీతాదేవిం జెఱపట్టితివే! ఇట్లు మిక్కిలి యనుచితము నే చేసితివి. 'అది పతివ్రత యేని యేల నన్ను దహింపలేదందువా? 'నాప్రభూ! నీ సొమ్మయియున్న నన్నుఁ దక్కువగాఁ దలఁచితివే! కాని నీవు భూదేవికి భూదేవియై మిక్కిలియోర్పుగలిగి, లక్ష్మికి లక్ష్మియుం బోలె సర్వసంపదధికురాలై భర్తయందు మిక్కిలియు మక్కువగల పతివ్రతామణియై సర్వాంగసుందరి యైనకల్యాణి నాసీతాదేవిని విజనం బగునడవియం దుండునపుడు నిన్నొల్లనిదానిని మారీచునిచేఁ గపటము పన్ని దీసికొనివచ్చి యా మిథిలరాజకుమారితో సంగమింపవలెనన్న నీకోర్కె తీరకయే యాపతివ్రత తపఃప్రభావముచే దగ్ధుఁడవయితివి ఇది నిశ్చయము.సన్నని నెన్నడుముగల యాసీతను నీవట్లు చెఱతెచ్చినపుడే దగ్ధుఁడు కావలసియుండఁగా నీవట్లు కాకపోయితివి గాన నీవుమిక్కిలియు మాహాత్మ్యము గలవాఁడవు. ఆమహాత్మ్యమునుబట్టియే, నీకు నింద్రుఁడు అగ్ని మొదలగు దేవతలందఱును భయపడువారయిరి. ఆ భీతివలన వారు సీత నట్లు చేసినందులకు ఫలముగా నిన్ను దహింపకపోయిరి.పాపకర్మము చేసిన వాఁడు ఫలసమయము ప్రాప్తించినపుడు, తాను గావించినపాపకర్మములకు ఘోరమయినఫలమును నవశ్య మనుభవించును ఇందుల కెంతమాత్రము సంశయము లేదు. మంచి చేసినవానికి మంచియే కలుగును. సెబ్బర చేసినవానికి సెబ్బరయే కలుగును. విభీషణుఁడు రామాశ్రయణమున మంచి చేసినాఁడుగాన సుఖము నొందెను. నీవో పాపము చేసితివిగావున నిట్టి దుఃఖము నొందితివి. ఆసీతకంటెను రూపమున మిక్కిలిచక్కనయిన స్త్రీలు నీకు వేఱు వెక్కండ్రుగలరు. అయినను నీవు మన్మథుని బారిం జిక్కి యాసీతం జూచి మోహితుఁడ వయితివిగావున, నీకది తోఁపకపోయినది.సీత, కులమునందును, రూపమునందును, విద్యాసామర్థ్యమునందును, నాకన్న నెక్కుడుగాదు. ఈడుజోడునుగాదు. అయినను నీవు మోహమునొందియుండుటవలన నిది నీకుతోఁపదయ్యెను. ఎట్లుగాని, యేప్రాణికినేని, నిమిత్తము లేక మృత్యువుగలుగదు. అట్లే నీకు సీతం దెచ్చుటయే కారణముగా

నిదే మృత్యువు గలిగినది. నీవు దూరమునుండి యాబిడను దెచ్చితివి; కాన దూరమునను(ం)డి నీవేపోయి మృత్యువును దెచ్చుకొన్నట్లయినది. సీత యింక శోకముం బాసి రామునితోం గూడ సుఖముగా విహరింపంగలదు. అల్పపుణ్య నగు నేనుమాత్ర మిట్లు భయంకర మయిన దుఃఖసముద్రమునం బడినదాన నయితిని. వీరా! నేను చిత్రములగు పుష్పమాలికలను వస్త్రములను ధరించి నీతోం గూడి, యెనలేనిసిరి దళుకొత్త, ఆసిరి పెంపునకు ననురూపమయిన విమానము నెక్కి, కైలాసమునందును మందరపర్వతమును మేరుగిరియందును చైత్రరథవనమునందును, దేవతల యుద్యానము లన్నింటియందును, నిచ్చలు విహరించి నానావిధము లయిన యన్యదేశములం జూచుచు సుఖ మనుభవించుచుంటినే. అట్టినే నిపుడు, నీవు హతుండగుటవలన, కామోపభోగములన్నిటిని దూలినదాన నయితిని! అట్టి సమస్తభోగముల ననుభవించుచుండినట్టి నేనే యిపుడిట్లు భోగములపేరే తెలియని సాధారణమైన యితరస్త్రీనంటిదాన నయితిని. కాన యిసీ! రాజులసంపదలు చంచలములు. అవి పాడయిపోవుంగాక. రాజా! సుకుమారమై సొగసయిన కనుబొమలు కలిగి, నిద్దపుచర్మముతోంగూడి, నిక్కగలముక్కుచే నీటుగులుకుచు, ప్రభయందుం జంద్రునికిని, సౌందర్యమందు పద్మమునకును, తేజమునందు సూర్యునికిని సాటియై, పర్వతశిఖరమువంటి కిరీటముచే తళతళమెఱయుచు, ఎఱ్ఱనిపెదవులును తళతళలాడుకుండలములును దులకించు నీముఖము, మున్ను పానభూములయందు, మత్తుచే కలంగి తిరుగుచున్న కన్నులతో నొప్పుచు, పలువిధములయిన పూదండలు దొడిగి, సొబగై, సొంపారు చిఱునవ్వు గులుకుపలుకు లాడుచు, శుభంబై యుండునే! అట్టి నీయీముఖమే యిపుడు, రామబాణములచే భిన్నమై నెత్తురువెల్లువలం దోంగి, మేదస్సును మస్తిష్కమును నెఱయంజెదరి, రథంపుదుమ్ములను బ్రుంగి, యెంతమాత్రము నా ప్రభూ! ప్రకాశింపకున్నది. అయ్యో! నీవు మృతుండవయి నేను ముండమోయవలసినదశ సంప్రాప్తమయినదే. ఇట్టియవస్థ వచ్చునని మూఢురాల నగు నాకు ముందెప్పుడును దోంచినది కాదు. నాతండ్రి మయుండు దానవరాజు. నాభర్త రాక్షసనాథుండు. నాకొడు కింద్రజిత్తు దేవేంద్రుని గెలిచిన యుక్కుండునియ యని మిక్కిలియుం గన్నుంగానక విఱ్ఱవీంగుచుంటినే. నాకు రక్షించుదిక్కయియున్న నాతండ్రి పెనిమిటి కొడుకులు మొదలయినవారలు, మత్తిల్లిన శత్రువులంగూడ పీంచమడంచు మహాశూరులనియు బహుయుద్ధములందు సడిసన్న బలపౌరుషములు గలవారనియు, వారి కెవ్వరివలనను భయము గలుగనేరదనియు గట్టిగా నమ్మియుంటినే. తుదకిట్లయ్యెనా? రాక్షసతిలకా! అట్లు ప్రసిద్ధులై యిటువంటిప్రభావము గలిగియుండిన మీకు, నిదివఱ కెన్నండు నిట్లు గలుగునని తలంపనియిట్టిభయము ఒకమనుష్యునిమాత్రునివలన నెట్లు గలిగెనో, ఆశ్చర్యముగా నున్నదే! రాజా! నీమేను నిగ్గుగల యింద్రనీలమువలె నీలమై, పొడవయినపర్వతమువలె నురువై, బాహుపురులు వైడూర్యమయము లయిన సందిటిపురులు, ముత్తెపు

హారములు పుష్పమాలికలు మొదలగువానిచే సుజ్జ్వలమై విహారసమయములందు
మఱింతరమణీయమై, యుద్ధభూములందు వీరోత్సాహంబున నినుమిక్కిలిగా
మెఱయుచు, మెఱపులచే మేఘంబునుంబోలె నాభరణకాంతులచే నెంతయు వెలుం
గుచుందువే. అట్టిశరీరమె యిపుడు, తీక్ష్ణము లయిన పెక్కుబాణము లంతటను నెరసి
యుండుటంజేసి యంటుటకేనియు నశక్యమై యెంతమాత్రమును గౌఁగిలించుకొన
నలవిగాకున్నదే. మఱియు నిది, యేదుపంది మేన ముండ్లు దట్టముగానుండునట్లు, నెఱఁకు
లందు చక్కఁగాఁడి గీలుకొని యున్నబాణము లెడతెఱపి లేకుండునట్లు దట్టము
గానుండ, నరములుముళ్లు బిట్టుగాత్రెగి, కపిలవర్ణమైయుండియు నెత్తుట మిక్కిలి
యునుజొత్తిల్లుటచే దానివలె నెఱ్ఱనివన్నెగలిగి, నేలంబడి,వజ్రాయుధపువ్రేటునఁ గొట్టు
వడి నేలంగూలిన పర్వతమువలెనున్నది. అయ్యో ! నీవు మృతుఁడవయినది స్వప్నమే.
స్వప్నమనుట సత్యమే. నీవంటిశూరుని రాముఁ డెట్లు చంపఁగలిగెను.మృత్యువుచేతఁ
జచ్చితినందువా? నీవు మృత్యువునకుఁగూడ మృత్యువవే ! మృత్యువుబారికి నెట్లు చి
క్కితివి. కాఁబట్టి నీవు మృతుఁడవగుట స్వప్నమే. ముల్లోకములందలి రత్నములనెల్ల
ననుభవించుచు, ముల్లోకములకును పెనుభయముగలిగించుచు,సమస్తలోకపాలురను
జయించి కైలాసాచలమునూఁచి శివుని గ్రిక్కదల్చి, బలగర్వితులను నడంచి, పరా
క్రమము దశదిశలం బ్రకటించి, లోకంబులనెల్ల కలంచి నలంచి,సమస్తభూతములను
సింహనాదములఁ గుయ్యో మొఱ్ఱో యని కూపెట్టించి, వీర్యము పెంపున శత్రువులు
దార్కొన్నపుడు సరకుసేయక గర్వోక్తులాడుచు, భయంకరకర్ములగు తనసైనికులను
భృత్యవర్గములను నాపదలు పొరయకుండఁ గాచుచు, వేలకొలఁదిని మేటిదానవవీరు
లను యక్షులనుజంపి నివాతకవచులను భయమున తనకోడి మిత్రులగునట్లు గా
వించుకొని, ముల్లోకములకును నియామకుఁడై, పెక్కుయజ్ఞములకు విఘ్నములు
గావించి, స్వజనముల నాదరమునఁ బ్రోచి, ధర్మపుమర్యాదలను ద్రెంచి, యుద్ధంబునఁ
బెక్కుమాయలంబన్నుచు, నయ్యైస్థలములనుండి దేవకన్యలను అసురకన్యలను మను
ష్యకన్యలను బలిమిం గొనివచ్చి, శత్రువులవధించి వారిస్త్రీలకు శోకమొసంగుచు
స్వజనంబులఁ జక్కఁగానడపుచు లంకాద్వీపము నేలుచు, తనశిరస్సుల నగ్నియందు
వేల్చుట మొదలగు భయంకరకర్మములంగావించి, మాకందఱకును గామభోగంబుల
నవ్వారిగా నొడఁగూర్చుచు, రథికశిరోమణివై యేతాదృశప్రభావసంపన్నుఁ డయిన
నాప్రియుఁడు నాప్రాణేశ్వరుఁడు రామునిచే హతుఁడై పడియుండుటనుజూచియు,నెని
మిటిని బాసి యింకను దేహమును బెట్టుకొనియున్నాను; కాన నేను వజ్రశిలాకఠినను
గాని వేఱుగాదు. రాక్షసేశ్వరా ! నీవు మిక్కిలియు వెల పొడుగయిన శయ్యలందుఁ
బరుండియుందువే ! ఇపు డిచట దేహమంతయు దుమ్ముల బ్రుంగి యెఱ్ఱనగునట్లు
నేలపయిని బరుండియున్నావేల? నాకొడు కింద్రజిత్తును యుద్ధమున లక్ష్మణుఁడు వధిం
చినపుడె, నేను వేండ్రముగా దుఃఖమునఁ గొట్టువడి క్రుంగితిని. ఇపు డిఁక నీవు హ

తుఁడవగుటచే మొదలే కూల్పఁబడితిని; కాన బ్రతుకుటలేదు. నీవు జీవించియుండి నచో నాబంధువులు హతులయిరని నాకు దుఃఖములేదు. నానాథుఁడవు, నీవు నన్నుఁ బాసిపోయితివి గావుననే, యిఁకఁ గలంతకాలము కామభోగములు వదలి దుఃఖము ననుభవించుచుండఁగలను. రాజా ! ఎవ్వరికిని బోంద నలవిగానిబహు దూర మయినస్థానమునకుఁ బోయితివి. (బోవనున్నావు.) దుఃఖార్తనగు నన్నుఁ గూడఁ గొనిపొమ్ము. నిన్నువదలి నే నెంతమాత్రము జీవింపఁజాలను. నీ విట్లు మిక్కిలియు దుఃఖించుచును మాటిమాటికి పలవించి పలవించి సోలియున్న దీనురాలిని భాగ్యహీనురాలిని నన్ను, నిచటనే యొంటి దిగవిడిచి పోఁగోరితివేల? ఇదితగునా? పోనీ. నాకు బదులు పలుకనయినను బలుకవచ్చునుగదా. అదిగూడ పలు కవేమి? ప్రభూ ! ముసుఁగు లేక నగరద్వారము వెడలి యిచటికి కాలినడకవచ్చిన నన్నుఁజూచి కోపపడినాఁడవు కావేమొ. అక్లేల కోపపడకున్నావు? భార్యలయం దు మిక్కిలియు మక్కువగలవాఁడవు. కాన నీభార్యల లందఱును, తెరయోలంపుము సుంగులు విడిచి,యంతఃపురము వెలువడి యిదె వచ్చియున్నారు చూడుము. చూచి వారలను కోపింపవేల? నీకు క్రీడలయందెల్ల సహాయులుగా నుండినయీభార్యాజనను లందఱు ని ట్లనాథలై పనివి పనివి పలవించుచున్నారే ! వీరల నూఱడింపను నూ ఱడింపవు. మిక్కిలియు మన్నింపను మన్నింపవు. ఇదేమి? రాజా! పతివ్రతలును ధర్మ పరాయణలును గురుశుశ్రూషాతత్పరలునగు కులస్త్రీలను నీవు మునుపు పెక్కం డ్రను, వారిపతులను జంపి విధవలం జేసితివే. వారెల్ల శోకంబునం బురపురఁబొక్కుచు నిన్ను శపించుటవలన నీ విట్లు శత్రులబారికిం జిక్కితివి. లేకున్నఁజిక్కుదువా? నీచే నట్లు పరిభవమునొందిన యాకులాంగనలు, తమభర్తలను నీవు వధించుకాలమున ని న్నేమిశపించిరో యందులకు ఫల మిపుడు ప్రాప్తమయినది. రాజా ! 'పతివ్రతలకు కన్నీళ్లు కారణములేక యూరక నేలంబడవు. అవిపడునేని యేదయిన ననర్థముఁ జేసి యేతీఱును.' అని లోకమునందు జనులు తఱచుగా వాడెడి యీనానుడి, నీవిషయ మున సత్యమేయైనది. రాజా ! తేజముచే ముల్లోకముల నాక్రమించి మహాశూరా గ్రణి నని విఱ్ఱవీఁగుచుండు నీవు, నీచమయిన యీ స్త్రీచౌర్యము నెట్లుదా చేసితివి? నీవు కపటోపాయమున మాయామృగమును బంచి రాముని నాశ్రమమునుండి తొలఁగఁదీయునట్లు గావించి, రామునిపత్నిని సీతను దెచ్చితివే. దీన నీకయి నదేమి ? నీ పిఱికితనమున కిది యొకగుఱుతియినది. అయినను నీవు యుద్ధమున నొకప్పుడుగాని పిఱికితనము చూపినట్లు, నేనెఱుఁగను. అట్టిధైర్యప్రకృతి వగునీవు భాగ్యము తలక్రిందగుటవలన సీతను దొంగిలితెచ్చినట్టి పిఱికివగుట నీకు వినాశము ముదిరినందులకు లక్షణమేకాని వేఱుగాదు. భూతభవిష్యత్కాలార్థములం దెలిసి, వర్త మానార్థమునందును ప్రాజ్ఞుఁడయి, సత్యవాదియు మహాభాగుండు నగునాపిన్నమ అంది విభీషణుఁడు నీవు సీతనుదెచ్చుటఁజూచి కొంతసేపుచింతించి నిట్టూర్పునిగిడించి

నాతో నేమిచెప్పెనో యాచొప్పుననే యిపుడు నీకామక్రోధములచేఁ బ్రసక్తించినవ్యసనమున సమస్తరాక్షససముఖ్యులకును వినాశ మిదే దాపరించినదయ్యె. సమస్తమును వేరుతోఁగూడ నాశముసేయునట్టి యీమహానర్థము నీకొఱకై యుద్భవిల్లినది. (నీవలననే కలిగినది). నీవే యీరాక్షసకులమునంతయు దిక్కుమాలినదానిని గావించితివి. బలపౌరుషములం బ్రఖ్యాతిగాంచిన మహాశూరుండగునీవు యుద్ధమున మృతినొందుటకు నేను దుఃఖింపవలసినది లేదు. అయినను, ఆఁడుదాననగుటం జేసి, నాబుద్ధి నిలువక యిట్లు దైన్యమునం దడఁబడుచున్నది. నీపుణ్యమును పాపమునుం దీసికొని నీకుఁ బొందఁదగుగతిని బొందితివి. కాన నిన్నుగుఱించి దుఃఖింప నక్కఱలేదు. కాని నిన్నెడఁబాసినందులకు దుఃఖము పట్టఁగూడ లేదుగాన నన్నుగుఱించియే దుఃఖించుచున్నాను. అనఘా! నీమిత్రులు నీహితముగోరి చెప్పినమాటను వినవయితివి. వారిమాట యటుండనీ. నీతమ్ములు నీకు మిక్కిలియు నూఱిపోసిన హితమునయినను వినఁగూడదా ? అదియును వినవయితివి. విభీషణుఁడు, యుక్తియుక్తముగాను ప్రయోజనకరముగాను, శాస్త్రోక్తప్రకారమునను, హితమయినమాటను సాంత్వనపూర్వకముగా చెప్పినను నీవు 'దాయాదివి నావ్యసనమునే కోరుదువు' అని యిట్టిహేతువు లేవో చెప్పి దానిని జేకొనవయితివి. అపుడు మారీచుఁడును కుంభకర్ణుఁడును * నాతండ్రిమయుఁడును జెప్పినవచనములను నీవు వీర్యంబున మత్తిల్లియుండుటచే వినవయితివి. దానికి నిటువంటిఫల మిదే ప్రాప్తించినది. ఏమిచేయవచ్చును. నీలమేఘముంబోలె చూపట్టుచు, పచ్చనిపుట్టముగట్టి సొగసయినబాహుపురులం దులకించుచుండువే ! ఇట్లు నెత్తుటందోఁగి కాలుసేతులుచాఁచి నిద్రించినట్లు పడియున్నావేమి. నేనిట్లు దుఃఖమునం బొక్కుచున్నను మాఱుపలుక వేమి ? మహాపరాక్రమశాలియు సమర్థుండునై, యుద్ధంబున వెన్నుఁజూపకుండు మాల్యవంతుని (లేక సుమాలి) దౌహిత్రుఁడవు (దౌహిత్రిని) నన్నుఁ గన్నెత్తియుఁ జూడవేమి? నీవుపడుటంజేసి భయముమాలి సూర్యకిరణము లిపుడు లంకను వీకం బ్రవేశించినవి. ఇట్లు క్రొత్తగా నవమానము వచ్చినపుడు పరుండియున్నావేమి ? లెమ్ములెమ్ము. నీవు యుద్ధంబున శత్రువులను రూపుమాపుటకు ముఖ్యసాధనమై, సూర్యునివలె ధగధగ మెఱయుచు, నీచేత నిత్యమును బూజలందుచు, పోరం బగతురఁ గూలనడుచునదై కాంచనజాలాలంకృతమై, యింద్రునివజ్రాయుధముంబోలె వెలయుచున్న నీయినుపగుదియ, రామబాణములచే వేయిదునియలుగా ఖండింపఁబడి యిపుడు నేలంబడియున్నది. నీవు ప్రియురాలింబోలె యుద్ధభూమిని గౌఁగిలించుకొని పరుండియున్నావే. ప్రియురాలుగానిదానివలె నన్నుమాత్రము విడిచి నాతోఁబలుక నొల్లకున్నావేల? నీవు మరణమునొందినపిమ్మటను, నాయీహృదయము దుఃఖమునం బీడితమై వేయిపఱియలుగాఁ బగులకున్నదే. ఇసీ!

* దీనిచె మయుఁడుగూడ హితముపదేశించినట్లు తెలియునది. ఇట 'మమపితుః' అనుటకు మాల్యవంతుఁడని మహేశ్వరతీర్థులు.

యిట్టికతినురాలను బాడయిపోవుదునుగాక!" యని విలపించెను. రాణి మండోదరి, యివ్విధమున కన్నుంగవకన్నీళ్లు కలంగంబాఱ, విలపించుచునే యుండి పతియందలి మిక్కుటపునెయ్యమున హృదయము మఱఁగియుండుటచే దుఃఖముపట్టఁజాలక మూర్ఛనొందెను. మండోదరి యిట్లు దుఃఖమున స్రుక్కి మూర్ఛిలి, నీలవర్ణము నెత్తుటం దోఁగియున్న రావణునివక్షమునందుఁ బడినదై, సంజకెంజాయచే నెఱ్ఱవాఱిన నల్లనిమేఘమునందు వెలుంగుచున్న క్రొమ్మెఱుంగుఁదీఁగవలెఁ బ్రకాశించెను. అట్లు మండోదరి రోదనముసేయుచు మూర్ఛిలి పతివక్షమునఁ బడఁగా, ఆసవతులు మిక్కిలియుఁ దొందరపడివచ్చి తాము ను మిక్కిలియు రోదనముసేయుచు నాబిడను లేవనెత్తి 'దేవీ! రాజులసంపదలు చంచలమని నీకుఁ జక్కఁగాఁ దెలిసియేయున్నది. మఱియు, బాల్యము కౌమారము యౌవనము వార్ధకము మరణము మొదలుగా వేఱువేఱవస్థలు పెక్కులుగలిగి మాఱుచునేయుండుటచే లోకులస్థితిగూడ స్థిరముగాదని లెస్సగా నెఱుంగనేయెఱుంగుదువే. ఇందులకు వగవనేల?' అని యాశ్వాసించిరి. ఇట్లు సవతు లూఱడించుచుండఁగా, అమ్మండోదరి, నిక్కుంగల చన్నుగుబ్బల కాలువలుగట్టు నశ్రుజలములం దడుపుచు, మహాధ్వనితో రోదనముచేసెను. ఇట్లు వారు రోదనముసేయుచుండఁగా రాముఁడు విభీషణునిఁ జూచి 'ఈ స్త్రీలనందఱను పురమునకు మరలించి యన్నకు నుత్తరక్రియలుగావింపుము' అనెను. అంత ధర్మజ్ఞుండగువిభీషణుఁడు, రాముఁడు చెప్పినవాక్యమును విని, మునుపు రావణున కుత్తరక్రియలు చేసెదనని తానై చెప్పఁగా రాముఁ డంగీకరించుటను తనబుద్ధి నాలోచించి తనమాటను ద్రోయలేక యతఁ డట్లు చెప్పెనో యేమో యతఁడే యనుజ్ఞ చేయునేని యప్పటికే చేయుదునుగాని మఱొకవిధమునఁ జేయనని యతనినే యనువర్తించుకొఱకై వినయంబున ధర్మార్థయుక్తంబగు వచనమున నతనితో 'ఈరావణుఁడు ధర్మమును వ్రతములను వదలినవాఁడు, క్రూరుఁడు, ప్రాణిహింసకుఁడు, అసత్యవాది, మఱియుఁ బరస్త్రీగమనము సేయువాఁడు. ఇట్టివానికి సంస్కారము సేయుటకు నే నర్హుఁడనుగాను. ఈరావణుఁడు నాకు తోఁబుట్టువు రూపుదాల్చిన శత్రువేకాని వేఱుగాదు. మఱియు సమస్తప్రాణులకును కీడుసేయుటయందే యాసక్తుఁడు. కాన నాకుఁ బెద్దయని పూజింపవలసినవాఁ డయినను, ఈదోషములంబట్టి యెంతమాత్రము పూజకర్హుఁడుగాఁడు. నేను అన్నకు సంస్కారమును గావింపనందున భూమియందు మహాజనులు, నన్ను క్రూరుఁడని యిచ్చకొలఁదిని జెప్పినను జెప్పుదురు. అయిన నితఁడు గావించినదోషములను విందురేని, 'విభీషణుఁడు రావణునికి సంస్కారము చేయకున్నను మంచిపనియే చేసినాఁడు' అని మరల నందఱు చెప్పఁగలరు" అనెను. మాటలందు నిపుణుఁడును ధార్మికులలో నుత్తముండునగు రాముఁడు విభీషణుఁ డట్లుచెప్పినదివిని, అసంతుష్టి మిక్కిలియుం జెంది, వాక్యసమర్థుం డగునా విభీషణునితో "రాక్షసేశ్వరా! నీవు నాకు ప్రియమే చేయవలసినవాఁడవు. మఱియు నీ మహిమవలననే నా కీజయ

ము కలిగినదిగావున నేనవశ్యము నీకు హితమునే చెప్పవలసినవాఁడను. రావణునిసంస్కారము నాకుఁ బ్రియమైనది. నీకును హితమైనది. కాన దానిని జేయుము. ఈరావణుఁడు, అధర్మమును అసత్యమును గలవాఁడనుట వాస్తవమే. దోషియయినను గుణములు పెక్కులుగలవాఁడు. మిక్కిలియు తేజస్వియు బలవంతుఁడునై యెప్పుడును యుద్ధములం బరాజయమునొందని మహాశూరుండునై యున్నాఁడు. ఇతఁడు దేవేంద్రుఁడు మొదలయిన దేవతలవలననుం బరాజయమునొందఁడని వినుచున్నాము. మఱియు నితఁడుమహాత్ముఁడు బలసంపన్నుఁడు; సమస్తలోకంబులకు రోదనముగలిగించుటచే రావణుం డనఁబడినవాఁడు. 'గుణములు పెక్కులుండినను నీకు వైరియగువాని నెట్లు సంస్కరింపవచ్చు' నందువా? చావకుండునంతవఱకే యన్నివైరములు. చచ్చినపిదప వైరములు పెట్టుకొనఁదగవు. ఇదిగాక మనపనియు నెఱవేఱినది. కాన యితని కుత్తరక్రియలు గావింపుము. ఇఁక నీకితఁ డెట్లు బంధువో యట్లె నాకును బంధువు గాని వేఱుగాఁడు. నీవలెనే యితఁడును నాకు బంధుఁడు. విభీషణా ! నీకు ధర్మములన్నియుఁ దెలిసినవే. కనుక, రావణుఁడు నీచేతులార శాస్త్రోక్తప్రకారమున సంస్కారమును బొందుటకుఁ దగినవాఁడే. అట్లు పాపకారి యగువానికిని సంస్కారము చేసినాఁడని నీకుఁ గీర్తియు రాఁగలదు" అనెను. రాముఁడు చెప్పినదివిని, విభీషణుఁడు స్త్రీలనెల్లఁ బంపివైచి రావణునకు వేగిరపడి యజ్ఞశీలునకుఁ దగురీతిని సంస్కారము గావించువాఁడయ్యెను. అంత ఋత్విజులు, పద్మకము వట్టివేళ్లు మొదలగు గంధద్రవ్యములతోఁగూడఁ జందనకాష్ఠములచే చితిని బేర్చి, దానిపయిని దెల్లనిమెంద్రుకలజింకచర్మమును బఱచి, వేదోక్తమయిన ప్రక్రియచే రావణుని నందుఁ జేర్చిరి. అట్లు చితిం జేర్చియైనపిదప రాక్షసరాజగురావణునకు వేదవిహితమగు నంత్యేష్టి జరుపఁబడెను. అప్పు డా రాక్షసేశ్వరునకు పితృమేధసంస్కారము క్రమముచొప్పున జరిపిరి. అది యెట్లన, ఋత్విజులు చితికి నాగ్నేయభాగమున వేదిని గల్పించి, యందు పడమట గార్హపత్యమును దూర్పున నాహవనీయమును, దక్షిణమున దక్షిణాగ్నిని నిట్లుయథాస్థానంబులఁ త్రేతాగ్నులను స్థాపించిరి. అంతఁ బెరుఁగుతోఁగలిసినయాజ్యము నిండియున్నహోమపాత్రము నదఱును ప్రతిపత్తికై చితియందువైచిరి. కర్మవిదు లగురావణుని ఋత్విజులు రావణునిపాదములయందు సోమరాజం దెచ్చుశకటమును, తొడలనడుమ యజ్ఞార్థము వడ్లుదంచురోలును సమస్తము లయినదారుపాత్రములను అరణిని ఉత్తరారణిని రోఁకలిని నితరములయిన స్థాలి మొదలగువానిని, నయ్యెస్థానములనుంచి, వేదములందును మహర్షిప్రోక్తములయిన స్మృతులయందును విధింపఁబడిన విధానమున నాచితికి సమీపమున పవిత్రమగు ఛాగపశువును వధించి హోమముగావించి * పయికప్పులను నేతితోఁదడిపి రాక్షసరాజగు రావణుని

* ఇందులకు 'పరిస్తరణికాంరాజ్ఞో ఘృతాక్తాంసమవేశయన్' అనిమూలము. మహేశ్వరతీర్థులు 'అనుస్తరణికాంరాజ్ఞో ఘృతాక్తాం' అనిపాఠముగ్రహించి 'అనుస్తరణిక' యనఁగా రాజగవి గా

పయి వైచిరి. అప్పుడా రాక్షసులు విభీషణసహితులై, మనంబులు విన్ననై యుండ, రావణుని గంధమాల్యములచేతను పలువిధములయిన వస్త్రములచేతను నలంకరించి, ముఖములఁ గన్నీళ్లు దొరఁగుచుండ, నపుడు చితిపయిని బేలాలు చల్లిరి. అంత విభీషణుఁడు మంత్రయుక్తముగా రావణునకు నగ్నినొసంగెను. అవ్విభీషణుఁడు స్నానముగావించి తడివస్త్రముతో భూమియందు గఱికలను నువ్వులను నీళ్లనునుంచి యందుఁ బ్రేతావాహనము చేసి, రావణున కుదకదానము గావించి తలసోఁక నమస్కారము చేసి,యా రావణస్త్రీలను పట్టణమునకుఁబొండని పలుమఱు సాంత్వవచనమునం జెప్పి వారలను పట్టణమునకుం గొనిపోయెను. వారలందఱును నపుడు పట్టణముం బ్రవేశించిరి. ఆరాక్షసస్త్రీలందఱును బట్టణమును బ్రవేశించినపిదప, విభీషణుఁడు రామునియొద్దకువచ్చి యతనిపార్శ్వమున వినయయుక్తుండై నిలిచి కొలిచియుండెను. రాముండును నట్లు శత్రువును జంపి, వృత్రాసురునిఁ జంపినయింద్రునివలె వెలుంగుచు సైన్యములును సుగ్రీవుండును లక్ష్మణుండును బలసికొలువ మిక్కిలి హర్షమునొందినవాఁడయ్యె. ఇది నూటపదునాలుగవ సర్గము.

రామనియోగమున లక్ష్మణుఁడు లంకయందు విభీషణునకు రావణసింహాసనమునఁ బట్టాభిషేకము సేయుట; విభీషణుఁడు పట్టాభిషిక్తుఁడై ప్రజలను సంతోషపఱిచి మరల రాముని సన్నిధికివచ్చుట; రాముఁడు సీతకుఁ దనవిజయము దెలుపుటకై హనుమంతునిఁ బంపుట.

అంత యుద్ధమును జూడవచ్చిన యాదేవతలును గంధర్వులును,దానవులును రావణునివధమును జూచి తమతమవిమానముల నెక్కి మేలయినముచ్చట లాడుకొనుచు తమతమనెలవులకుంబోయిరి. అమ్మహాభాగులు, హర్షయుక్తులై భయంకరమయిన రావణవధమును, రామునిపరాక్రమమును, వానరులు గావించిన మహాయుద్ధమును,సుగ్రీవుని మంత్రమును, లక్ష్మణునకు రామునందుఁగల యనురాగమును, నతనిపరాక్రమమును, నట్టి సుపుత్రులఁబడసిన సుమిత్రసౌభాగ్యంబును ముచ్చటలాడుకొనుచు తమవచ్చినదారిం బోయిరి. మహానుభావుం డగురాముఁడు మాతలిని మిక్కిలియు గారవించి దేవేంద్రుఁడు పంపినదియు నగ్నివలె ధగధగ వెలుఁగుచున్నదియు నగుదివ్యరథమును గొనిపొమ్మని యనుజ్ఞయిచ్చెను. ఇంద్రసారథియగు మాతలియు రాముననుజ్ఞనొంది యాదివ్యరథము నెక్కి దేవలోకమునకుంబోయెను. దేవతాసారథులలో మేటియగు నమ్మాతలి స్వర్గలోకమునకుఁ బోయినపిదప రాముఁ

న రాజగవిని జంపి దానిచర్మముచే రావణునకుఁ గప్పిరని యర్థముసేసి యిందులకు 'యథామృతాయానుస్తరణీం ఘ్నన్తి' అని శ్రుతిని ప్రమాణీకరించియున్నారు.

డింత విజయమును సుగ్రీవుని సాహాయ్యంబునం గలిగినదిగావున పరమసంతుష్టుండై యతనిని గౌఁగిలించుకొనెను. అతం డిట్లు సుగ్రీవునిఁ గౌఁగిలించుకొని గారవించి లక్ష్మణుఁడు శిబిరమునకుఁ బోదమని ప్రేరింప,వానరోత్తములపూజ లందుచు శిబిరమునకుఁ బోయెను. రాము డపుడు, తనసమీపమున తేజంబు మిక్కిలియు దీపింప నున్న సత్త్వసంపన్నుని సుమిత్రాపుత్త్రుఁ డగులక్ష్మణునిం జూచి *'సౌమ్యా! నాయందనురక్తియు భక్తియుం గలిగి నాకుపకారము గావించినయావిభీషణునకు ముందు లంకకుఁబోయి పట్టాభిషేకము గావింపుము. సౌమ్యా! రావణునితమ్ముఁడగు నీ విభీషణుఁడు లంకయందు పట్టాభిషిక్తుఁడగుటను జూడం గందునేని యిదియ నాదు ముఖ్యమయినకోరికి' అనెను. మహాత్ముఁడగురాముఁ డట్లుచెప్పఁగా లక్ష్మణుఁడు వల్లెయని మిక్కిలి సంతోషమున బంగారుకలశముల రావించెను. లక్ష్మణుఁడు సువర్ణకలశములను మేటివానరముఖ్యులవశమున నిచ్చి సముద్రజలములను దెచ్చుటకు మనోవేగముగల మహాబలులగు వానరుల నియోగించెను. అట్లు లక్ష్మణుఁ డాజ్ఞాపించుటం జేసి మహాబలవంతులును వానరోత్తములు నగునవ్వానరులు నచటనుండి శీఘ్రముగాఁ బోయి సముద్రములనుండి జలంబులఁ దీసికొనివచ్చిరి. అంత లక్ష్మణుఁడు విభీషణుని సింహాసనమునం గూర్చుండఁబెట్టి ఒకకలశ మెత్తి దానిచే నతని కభిషేకముగావించెను. ధర్మాత్ముండగు నాలక్ష్మణుఁడు రామునియాజ్ఞవలన, లంకాపురమున మిత్త్రగణపరివేష్టితుఁడయి యున్నశుద్ధాత్మునకు విభీషణునకు, వేదోక్తప్రకారమున సమస్త రాక్షసమధ్యమునఁ బట్టాభిషేకముగావించెను. విభీషణుఁడు లంకయందు పట్టాభిషిక్తుండై రాక్షసరాజగుటనుజూచి విభీషణునిమంత్త్రులును నతనికి భక్తులయిన రాక్షసులును సంతోషమునొందిరి. అవ్విభీషణుఁడు అట్లు రాముఁ డొసంగినయమ్మహారాజ్యమునొంది ప్రజలనందఱ చల్లనివాక్యముల నలరించి యంత మరల రామునిసన్నిధికి వచ్చెను. అంత నపుడు పౌరులగు రాక్షసులు అక్షతలను కుడుములను, పేలాలను దివ్యములగు పుష్పములను, మిక్కిలియు సంతుష్టులై మంగళార్థముగ నవ్విభీషణునకు సమర్పించిరి. వీర్యశాలియు దుర్ధర్షుండునగు విభీషణుఁడు ఆవస్తువులనన్నింటిని

* ఇందులకు 'విభీషణమిమంసౌమ్య లంకాయామభిషేచయ। అనురక్తంచభక్తంచ మమచైవోపకారిణమ్॥ ఏష మేపరమః కామో యదీమం రావణానుజమ్। లంకాయాం సౌమ్యపశ్యేయమభిషిక్తం విభీషణమ్' అనిమూలము. మునుపు సముద్రతీరముననే లంకారాజ్యమునకు అభిషేకము జరిగియుండియు మరల దానిని విధించుట రావణసింహాసనమందు అభిషేకము సేయుటకని తెలియునది. 'అనురక్తమ్' అనుటచే మిత్త్రునికృత్యము చెప్పఁబడినది. 'భక్తమ్' అనుటచే దాస్యకృత్యము చెప్పఁబడినది. 'ఉపకారిణమ్' అనుటచే అనురాగమును భక్తియు కార్యమునం బర్యవసించుట—అనఁగా చేసిచూపుట చెప్పఁబడినది. 'ఏష మేపరమః కామః' అని విభీషణుని లంకారాజ్యపట్టాభిషేకమె తనకు పరమమైన కామముగా చెప్పుటచే శరణాగతుఁడయిన విభీషణునియభిమతమును బూరించుటయే తనవిజయమునకు ముఖ్యప్రయోజనమని సూచితమయినది.

బరిగ్రహించి *తాను రామునకును లక్ష్మణునకును మంగళప్రయోజనము లయినవారి త్రాదిమంగళద్రవ్యములనెల్ల నర్పించెను. రాముం డట్లుకృతార్థుండై పరిపూర్ణమనోరథుండై యున్న విభీషణునిఁ జూచి తనకు భోగేచ్ఛకొఱకుఁగాక విభీషణునికిఁ బ్రీతి సేయంగోరియే యావద్వస్తువుల నన్నింటిని బ్రతిగ్రహించెను. అంత రాముఁడు తనపార్శ్వభాగమున నంజలి గీలించి కొలిచి యున్న పర్వతాకారుండును వీరుండును నగు కపిని హనుమంతునిం జూచి, 'సౌమ్యా! జయశీలాగ్రణీ! నీవు మహారాజగునీవిభీషణునియనుమతి నొంది లంకకుఁ బొమ్ము. పోయి యథావిధిని విభీషణునియనుజ్ఞ నొంది రావణునిగృహమును బ్రవేశించి విజయమును జెప్పి సీతకు సంతోషముగలిగించి యావిదేహరాజకుమారికి నేనును సుగ్రీవుఁడును లక్ష్మణుఁడును కుశలముగా నున్నారమనియు రావణుఁడు నాచే హతుఁ డయ్యెననియుఁ జెప్పుము. వానరేశ్వరా! నీ వీప్రియవృత్తాంతమును సీతకుఁ జెప్పి యాపడఁతి చెప్పుసందేశమును దీసికొని మరలి రావలయును' అనెను. ఇది నూటపదియేనవసర్గము.

—•—

హనుమంతుఁడు సీతకు రామువిజయమును దెలిపి యాబిడ సందేశమును గొని రామునొద్దకు వచ్చుట.

రాముఁ డిట్లాజ్ఞాపింపఁగా వాయుపుత్త్రుఁడు హనుమంతుఁడు రాక్షసులచేఁ బూజితుండగుచు, లంకాపురమును బ్రవేశించెను. మహాతేజుం డగునాహనుమంతుఁడు రావణునిగృహమును జొచ్చి యచట నొకవృక్షముక్రింద రాక్షసస్త్రీపరివృతయై యానందము దూలి దేహసంస్కారము లేక క్రూరగ్రహపీడిత యగురోహిణివలె నున్నసీతాదేవిని జూచెను. హనుమంతుఁడు సీతసమీపమునకుఁబోయి తన పేరు చెప్పి, ప్రణామము చేసి, నిశ్చలుఁడై వినయసంకుచితగాత్రుఁడై నిలుచుండెను. అట్లు వచ్చిన మహాబలుని హనుమంతునిఁజూచి సీతాదేవి, మొదటఁజూచియు గుఱుతుపట్టఁజాలక యూరకుండెనుగాని పిమ్మటఁ దేఱిపాఱఁజూచి మున్నువచ్చిపోయినవాఁడని తలంపునకుఁ దెచ్చుకొని మిక్కిలియునుబ్బు చెందినదయ్యె. వానరోత్తముఁ డగుహనుమంతుఁడు తన్నుఁజూచి సీతాదేవి మొగము వికసిల్లుటను గాంచి రాముఁడు చెప్పినవృత్తాంతమంతయు చెప్పందొడంగి, "సీతాదేవీ! రాముడును సుగ్రీవుఁడును, లక్ష్మణుఁడును విభీషణుఁడును వానరసైన్యములును క్షేమముగానున్నవారు. పగవారిపీఁచమడంచు రాముఁడు తా నిప్పుడు శత్రువును గీటడంచి కృతకృత్యుండై తనక్షేమమును సీతోఁ జెప్పు మనెను. దేవీ! విభీషణునితోడ్పాటునను వానరులసాహాయ్యమునను లక్ష్మణునినీతిబలమునను రాముఁడు రావణుని వధించెను. వీరుఁ డగురఘునందనుఁడు శత్రు

* కృతార్థుఁ డనుటచే రామాజ్ఞచేతనే అభిషేకము నంగీకరించినాఁడుగాన వాస్తవమునకు రామకైంకర్యమందే యాసక్తుఁడయ్యెనని తెలియునది. ఆజ్ఞాకైంకర్యమేకదా కర్తవ్యము. కనుక పట్టాభిషేకము చేసికొనుట రామాజ్ఞాకైంకర్యమే యనిభావము.

వును వధించినవాఁడగుటంజేసి మిక్కిలియుసంతుష్టుఁడై కృతార్థుం బగుమనంబున నీతోనిట్లు చెప్పుమనెను. 'నాదుదేవీ! నీకుఁ బ్రియవార్తను జెప్పెద. నిన్ను మిక్కిలియు సంతోషపెట్టెదను. పాతివ్రత్యధర్మము దెలిసినదానా! నాభాగ్యమున నీవు జీవించి యున్నావు. నీవు లేనిచో నేను జయించినది వ్యర్థమే యగును. సీతా! నాపరాక్రమముచేత మనకు యుద్ధమున జయము గలిగినది. కనుక నీ వింక కుందు మాని స్వస్థముగా నుండుము. పగవాఁడగురావణుఁడును హతుఁడయ్యె. ఈలంకయు మనవశమున నున్నది. నిన్ను శత్రువుచేతినుండి విడిపించుటయందే మనస్సు గట్టిగా నిలిపి, దానివలన నిదురయుఁ బట్టక, మహాసముద్రమున సేతువుగట్టి, రావణుని వధింతునన్నయీప్రతిజ్ఞను దీర్చుకొంటిని. రావణునికి వాస మయినయీలంకయం దున్నాననీ వెంతమాత్రము తత్తఱపడవలదు. రావణుండు చచ్చి యీలంకపరిపాలనమంతయు మనవిభీషణునికి లోనయినదిగనుక నీవు సొంతగృహమున నున్నట్టేకాని వేఱుగాదు. కాన భయమేమియుఁగలుగదని నమ్మి యూఱడిల్లుము. ఈవిభీషణుఁడును, నిన్నుఁజూడవలయునని తుకతుకపడుచు నిదిగోరాఁగలఁడు!' అని తనమాటగా నీతోఁజెప్పు" మని చెప్పె'ననెను. సీతకు హనుమంతుఁ డిట్లు చెప్పఁగానే చంద్రబింబమువంటి మొగముగలయాబిడసంతోషము వెల్లిగొన దిగ్గనలేచి యుబ్బుమిక్కుటమై యేపనియుఁజేయనీయక యాఁగుటచేమ్రానుపడి యేమియుఁబలుకఁజాలక యూరకుండెను. అట్లుసీత తనకు మాఱుపలుకకుండుటఁ జూచి యవ్వానరోత్తముఁడు హనుమంతుఁడు, 'దేవీ! ఏమి యాలోచించెదవు? నాతో బదులుమాటాడవదియేల?' యని యడిగెను. సీత హనుమంతుఁ డిట్లడుగఁగా పతివ్రతాధర్మమునం దెంతయు నెలకొనియుండునదిగాన పతిసందేశవార్తకు నెంతయుసంతోషము నొంది, యుబ్బువెల్లున పలుకులు డగ్గుత్తికపడ 'నాభర్త విజయము నొందెనన్నయీప్రియవార్తను విన్నంతనే మిక్కుటమైన సంతోషపారవశ్యముచే నేవ్యాపారమును జేయఁగూడకుండెను; కాన క్షణమాత్రము మాటలాడఁ జాలకుంటిని. హనుమంతా! నాకిట్టిప్రియవార్తను జెప్పినమహోపకారనిధికి నీకు బదులుగాఁ జెప్పుటకై తగినట్టిప్రియవచనము, నెంత యాలోచించినను ఈలోకమునందంతటను నాకుఁ గనఁబడలేదు. ఎట్టిప్రియవచనమును జెప్పవచ్చినను నది నీవు దెచ్చినప్రియవాక్యమునకుఁ దక్కువగానే తోఁచుచున్నది. సౌమ్యా! హనుమంతా! నీవు నాకిట్టిప్రియవార్తను జెప్పినందులకై నీకు బదులు చెప్పుటకుఁ దగినమాట లేకపోవుటేకాదు, మఱియిచ్చుటకు మిక్కిలియుందగినట్టివస్తువుగూడ భూమియందును స్వర్గపాతాళములయందును నాకుఁ గనఁబడకున్నది. వెండిగాని బంగారుగాని నానావిధము లయినరత్నములుగాని త్రైలోక్యరాజ్యాధిపత్యముగాని, యివన్నియు నీవుచెప్పిన ప్రియవచనమునకు సాటియని చెప్పనుం దగదు' అనెను. సీత యిట్లు చెప్పఁగా హనుమంతుఁడు, చేతులుమోడ్చి యాబిడసమ్ముఖమున నిలిచి 'నీవు సెనిమిటికి ప్రియమును హితమును గూర్చుటయందే యాసక్తురాలవు. పెనిమిటి జ

యమునొంద వలయునని యే యువ్విళ్లూరుదానవు. నెయ్యము దోలఁ కాదు నిటువంటి వాక్యము పలుకుట నీకే తగునుగాని మఱియొక్కతికిఁ దగదు. ఇటువంటి నెయ్యంపు మాటయే నాకు బదులుగాఁ జెప్పఁదగినట్టి లోకోత్తర మైన ప్రియవచనము. సౌమ్యురాలా! మఱియు నాకు బదులు గాఁ జెప్పఁదగినట్టి ప్రియవచనము నీకుఁ గానఁబడ లేదంటివే; ఇట్లు నీవు చెప్పినమాటకు, నామాట మితి మీఱిన ప్రీతిని గలిగించునది, యనుగొప్ప తాత్పర్యము గలుగుచున్నది. మఱియు నీమాట ప్రీతిపూర్వకమయినది. ఇట్టి నీమాట యొక్కటియే నానావిధము లగురత్నసమూహములకంటెను మాత్రమే కాదు; దేవేంద్రపదవికన్నను విశేషించినది. ఇట్టి వచనమును వినుటచేతనే నాకు నీ విచ్చుటకుఁ దగినదిగా లేదన్న సర్వోత్తర మైనవస్తువు లభించినట్టయినది. రాముఁడు శత్రువును వధించి విజయము నొంది నెమ్మది నుండఁగాఁ జూచుచున్నానే; ఈయొక్క ప్రయోజనమువలననే దేవరాజ్యము మొదలయిన యతిశయములు గలిగినట్లయినవి. రామవిజయమును జూడఁగనుటయే నాకు దేవరాజ్యము మొదలైన సంపదలు సుమీ' అనెను. అతం డట్లు చెప్పినదివిని జనకరాజసుత యగుసీత యవ్వాయుకుమారునితో మఱింత శుభం బగువాక్యమున 'వాక్యమునకు *వలయు సమస్తలక్షణములతోఁ గూడి విన్నంతనే యానందము గలిగించునట్టి మాధుర్యగుణమున వన్నెకెక్కి, గ్రహణధారణాదు లయిన యెనిమిదియంగములతోఁ గూడిన బుద్ధి దళుకొత్తునట్టి వాక్యముల మాడులాడుటకు నీవే సమర్థుఁడవుగాని మఱియొకఁడుగాఁడు. నీ వానృశంస్యధర్మము మిక్కిలియుఁ గలవాఁడవు. ఆధర్మమువలన నీవు వాయువునకుఁ బొగడందగినపుత్త్రుండ వగుదువు. నీ వాధర్మమువలన మాకోఁటిలోకులకు వాయువునకంటెను సంజీవనకరుఁడవై యున్నావు. ప్రయాసము నోర్చుబలమును, యుద్ధము న కుత్సహించుశౌర్యము, శాస్త్రజ్ఞానము, దేహదార్ఢ్యము, పరాక్రమము, సామర్థ్యము, పరులను గ్రిందుపఱుచు తేజము, అపరాధముల సైఁచుక్షమ, ప్రభావము కలఁగించునవియున్నను కలంగకుండు ధైర్యము, వినయసంపన్నత, విశిష్టనీతిసంపత్తి, యివి మొదలుగా నుత్తమము లయినమంగళగుణము లనేకములు నిన్నాశ్రయించియే మెంతయు శోభిల్లుచున్నవి. ఇందులకు సందియము లేదు. నేను లేనిగుణముల నారోపించి పొగడుచున్నదాననుగాను' అనెను. అంత నాహనుమంతుఁడు హర్షంబున సంభ్రమమునొందక యంజలిగీలించి సవినయముగా సీతయెదుటనిలిచి, 'నీవుపతియే దైవముగాఁ గలిగినదానవుగాన యతనింబాసినదుఃఖముచే నశోకవనమునఁ గృశించుచుండఁగాఁ

---

*ఆకాంక్ష యోగ్యత సన్నిధి యనునివి వాక్యలక్షణములు. 'గ్రహణం ధారణం చైవ స్మరణం ప్రతిపాదనమ్ । ఊహాపోహోర్థవిజ్ఞానం తత్త్వజ్ఞానంచ ధీగుణాః ' గ్రహించుట ధరించుట, స్మరించుట బోధించుట ఊహించుట అపూర్వమునూహించుట, అర్థము దెలియుట తత్త్వము దెలియుట అనునెనిమిదియు బుద్ధికి గుణములు. మునుపు రాముఁడు కిష్కింధాకాండమున 'నానృగ్వేదవినీతస్య 'ఇత్యాదులచే హనుమంతుని వాక్యసౌష్ఠవమును ప్రసంగించినట్లే సీతయు నిట ప్రశంసించుచున్నదని తెలియునది.

నిన్ను భయంకరము లయినరూపములును నడవళ్లును గలిగి,దయ మాలినమనంబులును నంతకన్న దయమాలినచూపులును గలిగి, యీరాక్షస స్త్రీలు మునుపు బెట్టిదపు మాటలు పలికినారు; మఱి మిక్కిలియుఁ దర్జించినారు. కాన నీవనుమతి యొసంగినయెడ వీరినందఱను బట్టి చంపవలెనని కోరుచున్నాను. నీకుఁ బ్రియవార్త చెప్పినందులకుఁ బారితోషికముగా నా కీవరమిమ్ము. కల్యాణీ! నీకప్రియము గావించినభయంకరాకారలగు నీరాక్షస స్త్రీలను భూమిం బడఁద్రోసి పిడికిళ్లం బొడిచియు, చేతులం జఱచియు, కాలం దన్నియు, మోఁకాళ్ల బెట్టిదముగా మోఁదియు, పండ్ల రాల్చియు, చెవులను ముక్కులను గొఱికి వైచియు, వెండ్రుకలనూడఁ బెఱికియు, వాఁడిమూఁతులుగలగోళ్లం జీల్చియు, పలువిధములం బీడించియు, నెగిరిమీఁదం బడియు, చేతుల గ్రుద్దియు నాకోపముకొలఁది నిట్లు నానావిధములఁ జంపఁ గోరుచున్నాను. దేవీ! యశస్విని! నీకపరాధముగావించిన దుష్టలయినయీరాక్షస స్త్రీలను ఈచెప్పినట్లు నానావిధములు గఁ బీడించి వధింపఁ గోరుచున్నాను' అనెను. కీర్తిమతి యగు జనకరాజపుత్రి సీత, హనుమంతుఁ డట్లు చెప్పినది విని యతనితో ధర్మయుక్తముగా 'వానరోత్తమా! రాజును గొలిచి బ్రతుకువారలు గాన రాజు చెప్పినపని చేయుచుఁ జేయకున్న దండమునకుఁ బాలయి యుండుదాసీలయెడ నెవఁడు కోపించును? రావణునకట్టిదాసీలు వీరు. కాన వీరలపయి నినుబోఁటివాఁడు కోపపడుట యెంతమాత్రము యుక్తము గాదు. మఱియు నాభాగ్యము పరిపక్వము గాక తలక్రిందగుటం జేసియు, పూర్వము నేను జేసికొన్న దుష్కర్మముచేతను, నా కీతర్జన భర్జనాదులన్నియు సంభవించిన దే కాని మఱేమి కాదు. మునుపు చేసికొన్నది యిప్పు డనుభవింపక తీఱదు గదా. రావణుని దాసీలవలన నిట్టితర్జనభర్జనాదులను అనుభవింపవలసినకాలము గూడినందున, నేను బడి తీఱవలసినదే యని నిశ్చయించుకొంటిని (ఇట్లు వీరిని దండించుటకుఁ దగు కారణబలము నాకు లేనందున) కృపాపరవశురాలనై వీరిని మన్నించుచున్నాను. వానరోత్తమా! రావణుఁ డాజ్ఞాపింపగా నీరాక్షస స్త్రీలు నన్నట్లు తర్జించిరి. అతఁడు హతుఁడు కాఁగా నన్నట్లు తర్జింపకున్నారు గదా. ఇట్లు తమయిచ్చను గాక రాజాజ్ఞం బట్టి వీరు చేసిన దానిని మనము తప్పుగాఁ గొనరాదు. వీరు తమంతట నే తప్పు చేసియుండినను ఉండనీ. అప్పటికిని మన్నింపవలసినదే. ఎట్లన వానరా! ఈ విషయమై * యొకభల్లూకము పురాతన

* ఒకవేటకాఁడు, ఒకపులి తన్నుతఱుమఁగా నొకచెట్టెక్కెను. ఆచెట్టుమీఁద నెలుఁగుబంటి యొకటియుండెను. చెట్టుక్రిందనున్న పులి యాయెలుఁగుబంటిని జూచి 'అడవి మృగములగు మనకెల్ల జాతిశత్రువు వీఁడు కాన వీనిని చెట్టునుండి పడఁద్రోయు' మనఁగా 'నేనున్నచోటికి వచ్చినవీనిని పడఁద్రోయను. అట్లు చేసినచో ధర్మహానియగు' నని చెప్పి యది నిదురించెను. అనంతరము పులి యావేటకానితో 'నిన్నుఁ జంపక విడిచెదను. నిదురించుచున్న యాయెలుంగుబంటిని బడఁద్రోయు' మనఁగా వాఁడట్లె దానిని క్రిందఁ బడఁద్రోసెను. ఆయెలుఁగుబంటి యభ్యాసవశమున మఱియొకకొమ్మను నూఁతగొని పడదయ్యెను. అంత పులి 'వీఁ డిదిగో నీకపరాధము చేసినాఁడు కాన వీనిం బడఁద్రోయుము' అని మాటిమాటికి చెప్పుచున్న

మును ధర్మయుక్తమునగు నీశ్లోకమును నొకవ్యాఘ్రమునకుఁ జెప్పెను. దానిని జెప్పెద వినుము. *భల్లూకము 'ప్రాజ్ఞుఁడగువాఁడు తనకపకారముచేసినవారికి ప్రత్యపకారము చేయఁడు. అపకారముచేసినవారికి బదులునకపకారము చేయరాదనుట యాచారము. దానినవశ్యము రక్షింపవలయును. సత్పురుషులకు సచ్చరిత్రమే భూషణము' అని చెప్పెను. †హనుమంతా! పాపులయినను గాని మంచివారయినను గాని, వధమునకర్హులయినపుడు, గొప్పవాఁడగువాఁడు, వారియెడఁ గారుణ్యమె కావింపవలయును. 'అపరాధులను దండింపకుండుట ప్రసక్తించునే' యందువా? ఈలోకమున నపరాధము చేయనివాఁడొక్కఁడును లేఁడు. శాస్త్రము చొప్పున వీరికి దండనమును గలుగదు. రాక్షసులు కామరూపులయి లోకహింసనమే వినోదముగా విహరించుచు నానావిధములగు పాపములు చేయుచుండువారలయినను అది వారికి జాతిప్రయుక్తమైనదిగాన వారికి దండనము చేయుటెంతమాత్రము దగదు' అనెను. సీత యిట్లు చెప్పఁగా వాక్యనిపుణుఁడగు హనుమంతుఁడంత కీర్తిమతియును రామునిపత్నియు నగు నా సీతం జూచి 'శరణాగతరక్షణమే

ను ఎలుఁగుబంటి 'వీఁడు ఈ యొక్క తేఁపయేకాదు. ఇట్టి పెక్కు తేఁపలు నాకపరాధము చేసినను నీకుఁ బట్టియియ్యను' అనిచెప్పి వానిని రక్షించెనని పురాణకథ యిట అనుసంధించునది.

* ఇందులకు 'నపరః పాపమాపత్తే పరేషాంపాపకర్మణామ్ । సమయో రక్షితవ్యస్తు సన్తశ్చారిత్రభూషణాః' అని శ్లోకము. సుగ్రీవునికి రాముఁడు కపోతాఖ్యానముం బోలె దేవి హనుమంతునికి తనయభిప్రాయపడినయర్థమునకు ఋక్షగీతమును ప్రమాణీకరించినదని తెలియునది.

† ఇందులకు 'పాపానాం వా శుభానాం వా వధార్హాణాం ప్లవంగమ । కార్యం కరుణమార్యేణ నకశ్చిన్నాపరాధ్యతి' అని మూలము. ఇది దేవియభయప్రదానశ్లోకము. విశేషార్థము—(పాపానాం వా శుభానాం వా) నీయభిప్రాయముచొప్పున పాపులును నాయభిప్రాయముచొప్పున సాధువులు నయినవారియెడ 'దోషోయద్యపితస్యస్యాత్' అని రాముఁడన్నట్లు దోషమే నాకుద్దేశ్యము. ముఱికి గలవాఁడే కద స్నానమపేక్షించును. వారు పాపులగుటంబట్టియే నన్నపేక్షించెదరు. సాధువులకు పనతోఁ బనియేమి? వారిపుణ్యమే వారికి రక్షకమగును కాఁబట్టి వారిపాపమే నాకుద్దేశ్యము. అయినను 'దండింపఁదగినవారిని దండింపవలయును. దండింపరానివారిని గాదు' అను ధర్మశాస్త్రము నిన్నుఁజెంది భంగము నొందుచున్నదే యన్నచో 'దుష్టుఁడయినను శరణాగతుఁడు రక్షింపఁదగినవాఁడు'. అను విశేషశాస్త్రము నిన్నుఁజెంది భంగము నొందవలయునా యనుచున్నది (వధార్హాణాం) వధార్హులయిన వారియందును. ఇచట సప్తమ్యర్థమందు షష్ఠి. (ప్లవంగమ) అభిలషింపరానిదానినే అభిలషించితివి క్రోఁతివిగాన. అట్టివారియందు (ఆర్యేణ) మహాపురుషుఁడగువానిచేత, (కరుణం) దయ, (కార్యం) చేయఁదగినది. మహాపురుషుఁడగువాఁడు దయయే చూపవలయుననుట- పుణ్యాత్మును పాపమును అటుండనీ ఇప్పుడు జాలిఁబుట్టించుచున్న వీరిదసను జూడుము. లేక (శుభానాం వధార్హాణాం యథాకరుణం కార్యం తథా పాపానాం వధార్హాణామపి కార్యమిత్యర్థః) సాధువులయెడ వధార్హులయినను కరుణ చూపునట్లు పాపులయెడను జూపవలయునని యర్థము. అప్పుడు సాపరాధులగువారికి దండనము లేకపోవుచున్నదేయనఁగా (నకశ్చిన్నాపరాధ్యతి) అపరాధము చేయనివాఁ డెవ్వఁడు. అందఱును అపరాధులే యని యర్థము. తనిశ్లోకి.

వ్రతముగాఁ గలరామునకు నీవే తగినధర్మపత్నివి. పాతివ్రత్యాదిగుణములఁ గీర్తి వహించినదానవు. దేవీ ! నాకు బదులుసమాచారము చెప్పిపంపుము. రాముఁ డున్నయెడకుఁ బోయెదను' అనెను. హనుమంతుఁ డట్లు పలుకఁగా జనకరాజసుత యగుసీత యతనితో 'వానరోత్తమా! నాప్రాణేశ్వరుని రాముని఼ఁ గన్నారఁ జూడఁగోరెదను' అనెను. సీత యిట్లు చెప్పినది విని మహాతేజుం డగువాయుతనూజుండు హనుమంతుఁడు సీతకు సంతోషము గలిగించుచు 'పూజ్యురాలా! శచీదేవి యసురులను జంపి వచ్చినదేవేంద్రుని఼ఁ జూచినట్లు సమస్తశత్రువులను రూపుమాపి క్షేమముగ నున్నమిత్రులతోను తమ్ముఁడు లక్ష్మణునితోను గూడి పూర్ణచంద్రునివలె నెమ్మొగంబు దులకించుచున్నరాముని నవశ్యము చూడఁగలవు' అనెను. సాక్షాన్మహాలక్ష్మివలె రాజిలుచున్నయాసీతతో హనుమంతుఁ డివ్విధంబునఁ బలికి, యంత రాముఁ డున్నయెడకు మహావేగంబున వచ్చినవాఁ డయ్యె. ఇది నూటపదియాఱవసర్గము.

{ శ్రీరామనియోగమున విభీషణుఁడు సీతకు శిరస్స్నానదివ్యాలంకారాదులుగావించి రామునియొద్దకుఁ దెచ్చుట.
సీత హర్షవిస్మయస్నేహాభరితహృదయయై శ్రీరామవదనమును సందర్శించుట. }

కార్యజ్ఞుం డగుహనుమంతుఁడు మహాప్రాజ్ఞుండును సమస్తధనుర్ధరులలో మేటియు నగురామునొద్దకుఁ బోయి, "ఎవతెకొఱకు సేతుబంధాదికార్యములనెల్ల నిట్లు దొడంగి చేసితిమో, ఎవ్వతిని బడయుటకై రావణుని జయించుట యనుఫలమును బొందనయ్యెనో, యట్టిసీతాదేవి శోకమున పురపురం బొక్కుచున్నది గాన మీరాకుఁ జూడఁదగును. శోకావేశమున కన్నులనీళ్లు కలఁగంబాఱుచున్నయాసీతాదేవి, నీవు జయమునొందినది విన్నంతనే సంతోషము నొందినదయ్యె. ఆబిడ పూర్వము నన్నుఁ దెలిసియున్నందున నాయందునమ్మికగలిగి, నాతో 'విజయమునొంది కృతార్థుం డయి యున్నరాముని లక్ష్మణసహితముగాఁ జూడఁగోరెదను ' అని చెప్పె" ననెను. హనుమంతుఁ డిట్లు చెప్పఁగా రాముఁడు ధార్మికులలోనెల్ల నుత్తముఁడుగావున, కొంచెము కన్నీరొలుక 'చిరకాలము రావణునింట నుండినసీతను బరిగ్రహించినయెడ లోకాపవాదము గలుగును. నిర్దోష యగునాపడఁతిని బరిత్యజించినయెడఁ బాపము గలుగును. ఏమి చేయవచ్చును ' అని తోడనే చింత నొందినవాఁ డయ్యె. అంత రాముఁడు *దీర్ఘముగాను నుష్ణముగాను నూర్పుపుచ్చి, నేలం జూచుచు దాపున మేఘముంబోలె నల్లని

---

* ఊర్పు దీర్ఘముగా నుండుటచే చింత దీర్ఘముగా నుండుటయు, ఉష్ణముగానుండుటచే కందియున్నసీతను మఱలనెట్లు కుందింపఁజేయుదునని లోపలితాపమును సూచితములు. నేలం జూచుట చింతాపారవశ్యకృతము. గోవిందరాజులు.

మేనుతో సీతం దేర వేగిరపడుచున్న విభీషణునిం జూచి* 'నీవు, సీతను, అభ్యంగస్నానము చేయించి మంచిమైపూఁతల నలందఁ జేసి మేలయినభూషణముల నలంకృతం గావించి పొంతకుఁ దెమ్ము. జాగు వలదు' అనెను. రాముఁడిట్లు చెప్పఁగా విభీషణుండు త్వరితుండై, లంకను బ్రవేశించి యంతఃపురమునకుఁ బోయి తన స్త్రీలచేత సీతాదేవికి 'సీతాదేవీ! నీవు స్నానము సేసి దివ్యములయిన మైపూఁత లలంది, దివ్యము లయిన యాభరణముల నలంకరించుకొని వాహనము నారోహింపుము. నీకు శుభంబగుఁగాక. నీభర్త నిన్నుఁ జూడఁ గోరుచున్నాఁడు' అని చెప్పించెను. విభీషణుఁడట్లు స్త్రీముఖమునఁ జెప్పినమాట నువిని, సీత, యతనిం జూచి 'రాక్షసరాజా! నే నింతవఱకున్న రీతినే స్నానముఁ సేయక యే నాభర్తను జూడఁ గోరెదను' అనెను. ఆబిడ యిట్లు చెప్పినది విని విభీషణుఁడు 'అట్లుగాదు. రాముఁడు నీకు భర్తయు మనకు రాజు నగును గాన నాతఁ డేమి చెప్పెనో యది యట్లే నీకుఁ గావింపఁదగును' అని స్త్రీముఖమున బదులు చెప్పెను. అతఁడట్లు చెప్పినమాట విని సీత భర్తనే దైవముగాఁ దలఁచి, పతిభక్తియే వ్రతముగా నుండు నట్టిమహాపతివ్రతగాన యట్లే చేసెదనని ప్రత్యుత్తర మొసంగెను. అంత, విభీషణుఁడు సీతకు శిరస్స్నానము చేయించి, స్త్రీలచే నంగరాగపుష్పాదులచే నలంకృతం గావించి మిక్కిలి వెలపాడుగయినభూషణములఁ దొడిగించి దివ్యమయిన వస్త్రము గట్టం జేసి యాబిడను మేలయినవస్త్రము పఱవంబడి మెఱయుచున్న పల్లకి నెక్కించి పెక్కండ్రు రాక్షసులు బలసి రక్షించుచు రాఁగా రామునియొద్దకుఁ దోడ్కొనివచ్చెను. అవ్విభీషణుఁడు సీతతో రామునికడకు రాఁగా నమ్మహాత్ముఁడది తెలిసియుఁ నేమియుఁ జెప్పక చింతను గూరియుండెను. విభీషణుండు నమస్కరించి మిక్కిలియు హర్షముప్పొంగ 'సీతాదేవిని దోడ్కొనివచ్చితి'నని విన్నవించెను. అట్లు రాక్షసునింటఁ జిరకాల ముండిన సీత వచ్చినదని విన్నంతనే రామునకు, రావణుం జంపి సీతను దెచ్చినందులకు నుబ్బును, చిరకాలము రావణునింటనుండినదే యని దీనతయును, ఇట్టిదాని నెట్లు పరిగ్రహింపవచ్చునని రోషమును, ఈ మూఁడును బయికొనెను. అంత రాముండు కొంతసేపు సాధకబంధకముల వితర్కించుచు నాలోచనము చేసి, యుబ్బు దక్క తనపార్శ్వమున నున్నవిభీషణునిఁ జూచి 'సౌమ్యా! రాక్షసరాజా! నీ వెల్లప్పుడును నావిజయమునందే యాసక్తిగలవాఁడవుగదే. శీఘ్రముగా సీతను నాసమీపమునకుఁ దోడి తెమ్ము' అనెను. అతఁడు రాముఁడు చెప్పిన యామాటం దెలిసి, శీఘ్రముగా నచ్చట నంతటను గలజనము నెల్ల నవ్వలికిఁ దొలఁగించుటకుఁ దగినవారి నియమించెను. చొక్కాయీలను తలగుడ్డలను దాల్చి, యెల్లప్పుడును బెత్తమును బట్టుటచే గడును పాఱిన చేతులు గలపురుషులు బెత్తములనచటిజనులను

* రాముఁడు సీతతో మీఁద పరుషములాడం గోరి యుండుటచే నప్పటివలె నలంకారాదులు లేని దీనదశయం దుండఁగా నట్లు పరుషమాడఁదగదు గాన పరుషము లాడందగుటకై స్నానాలంకారాదులు గావించి తెమ్మనెనని తెలియునది. అట్లు పరుషములాడుట యాబిడను త్యజించుటకుఁ గాదు. బ్రహ్మాదిదేవతలయెదుట నామెపాతివ్రత్యమును బ్రకటించుట కని తెలియునది. గోవిందరాజులు.

దొలంగ బడియుచు చుట్టును దిరిగిరి. అట్లు వారిని నలుగడలఁ దొలంగఁదోలుచుండఁగా మూఁకలుగొని యున్న భల్లూకులును వానరులును రాక్షసులును గుంపులుగుంపులుగా దవ్వగఁ దొలంగిపోయిరి. వారిందఱను దొలంగఁ దోలుచుండఁగాఁ బుట్టిన వెను ధ్వని వాయువుచేఁ జిమ్మఁబడుచుండు మహాసముద్రపుఘోషమువలె వినఁబడెను. అట్లు నలుగడల తొలంగ ద్రోయఁబడుచు తొందరపడుచున్న వారలం గలయఁజూచి రాముఁడు వానరులందఱి దాక్షిణ్యమువలన సహింపక 'త్రోయ వలదు' అని వారించెను. రాముఁడు వేగిరపడి కంటఁ జుఱచుఱం జూడుచునట్లు వేఁడిచూపుల మహాప్రాజ్ఞుండగు విభీషణునిం జూచి పొడుపుమాటల నతనితో 'నీవు నన్నుఁ బాటింపక యీజనమునంతయు నెందుకిట్లు కష్టపెట్టెదవు? వీరలం దొలఁగఁద్రోయుపూనికి నిలుపుము. వీరెల్ల నాజనులే కాని వేఱుగారు. స్త్రీకి ఆవరణము గృహములుగాదు, వస్త్రములుగాదు, ప్రాకారములు గాదు, తెరలు గాదు, మఱియు నిట్లు జనులను దొలఁగఁద్రోయుట మొదలగు రాజమర్యాదలు గాదు. ఆచారమే వారికి ఆవరణము. ఇష్టజనవియోగము మొదలగుననవ్యసనములయందును, రాజ్యక్షోభము మొదలయిన యాపదలయందును యుద్ధభూములయందును, స్వయంవరమునందును, యజ్ఞమునందును, వివాహమునందును స్త్రీ పరులకగపడుట దోషముగాదు. ఈసీతయిప్పుడు యుద్ధగామినున్నది. * మఱియు మహాకష్టమునను దగిలియున్నది. కాఁబట్టి యీపడఁతిని జూచుటవలన దోషములేదు. విశేషించి నేను సమీపమున నుండునపుడు దోషమే కలుగదు. విభీషణా! అట్లు పటంజేసి, చెలువను శీఘ్రముగా నాసమీపమునకుఁ దెమ్ము. మిత్రసమూహములచేఁ బరివృతుండయి యున్న నన్ను సీత చూచుంగాత' మనెను. రాముఁడిట్లు చెప్పఁగా విభీషణుఁడు 'మహాకష్టమునఁ దగిలియున్నది' అన్న యతనిమాటకు మనసున శంకగూరి వినయమున సీతాదేవిని రామునిసమీపమునకుఁ దోడితెచ్చెను. అంత లక్ష్మణుఁడును సుగ్రీవుండును హనుమంతుఁడును అట్లు రామునిమాటయందు సీతపయి ననురాగములేకుండుటను జూచి మిక్కిలియుదుఃఖితు లయిరి. ఏలన వారు రామునకు భార్యయందపేక్ష లేమిని బెట్టిదముగాఁ దెలుపుచున్న యింగితములనుజూచి రామునకు సీతయందుఁ బ్రీతి దప్పినట్టు లూహించిరి. ఆసీత విభీషణుఁడు వెంటనంటిరా సిగ్గుచే తనయవయములలో తానుముడుంగుకొనుచు పెనిమిటిసన్నిధికిఁ బోయెను. ఆబిడ పెనిమిటిసన్నిధిఁజేరి జనసమూహమునడుమ నుండుటంజేసి లజ్జచే వస్త్రమున మొగముంగప్పుకొని 'ఆర్యపుత్ర' యని పలుకుచు రోదనముగావించెను. భర్తయే దైవముగాఁగల సూపడంతి, పెనిమిటిని జూడఁగానే మఱింత మొగమున తెలివివొలఁకాడ, ప్రసన్నముగు ప్రాణేశ్వరుని నెమ్మొగమును జూచి, అట్టివశనుండి మరల భర్తను జూడఁగంటినేయని యాశ్చర్యమునను, బహుకాలము చూడని ప్రియునిఁ జూచున్నానుగదా' య

* అనఁగా మీఁద నగ్నిప్రవేశము చేయవలసియుండుట మహాకష్టముగా రాముఁడు చెప్పెనని యూహించునది.

ని మిక్కిలి సంతోషమునను, ప్రియునందు సహజముగాఁ గలనెయ్యమునను జూచినద
య్యెఁ. అంత నపుడు నచ్చంపుచందురునివంటినెమ్మొగము గలయాచెలువ, యుదయిం
చిననిండుచందురునివలె కోపంబున నించుక యెఱ్ఱవాఱియు చెలువంపుముద్దు గులుకు
చును జిరకాలము దాను జూడకయున్న ప్రియునిమొగమును జూచి మనస్సునందలి
కుందును మాలి మిక్కిలిసంతోషము నొందిన దయ్యెఁ. ఇది నూటపదునేడవసర్గము.

రాముండు సీతను జూచి రావణగృహంబునఁ జిరకాలముం డినందులకుఁ బరుషము లాడుట.

రాముం డిట్లు తనపార్శ్వమున లజ్జచే నమ్రయై నిలుచున్నసీతను జూడఁగానే హృదయములోన కోపంబు దీపింప పలుకఁదొడంగి 'కల్యాణీ! ఇదిగో యుద్ధంబున శత్రువును జయించి నిన్ను సాధించితిని. ఇదియంతయు పౌరుషమునుబట్టి చేయవలసియుండుటచేఁ జేయఁబడినదే కాని నిన్నుఁబడయుటకై చేసినయత్నమేమియుఁగాదు. కోపమునకు ఫలము నొందితిని. పగవాఁడు చేసినతిరస్కారమునకు బదులుచేసి తీర్చుకొంటిని. అవమానమును దానిని జేసినపగవానిని నొక్కుమ్మడి నిర్మూలము గావించితిని. ఇపుడు నాపౌరుషము దెలియనయ్యెఁ. ఇపుడు నాశ్రమము సఫలమయ్యెఁ. ఇప్పుడు ప్రతిజ్ఞను జేసి తీర్చుకొంటినిగాని నాయంతట నేను స్వతంత్రుఁడనయితిని. నేను లేనందునపుడు, చపలచిత్తుండగు రాక్షసుఁడు నిన్నపహరించుకొని పోయినాఁడు. ఇట్లు నిన్నుఁబట్టి నాకు దైవముచేఁ బ్రాప్తించినయవమానమును బురుషప్రయత్నముచే నేను నివర్తించుకొంటిని. అవమానము వచ్చినపుడు, దాని నెవ్వఁడు తేజంబునఁ బోఁగొట్టుకొనఁడో యల్పతేజుండగునట్టివానికిఁ బురుషార్థ మేమి యున్నది? ఏమియు లేదు. సముద్రమును లంఘించుట లంకను మర్దించుట యని హనుమంతుఁడు గావించిన శ్లాఘ్యములగు మహాకార్యములును నాకుఁ గలిగినతిరస్కారమును బోఁగొట్టినందున నిపుడు సఫలములయినవి. సుగ్రీవుఁడు, యుద్ధమునఁ బరాక్రమము జూపుచు నాహితము నాలోచించుచు, సైన్యములును దానును నాకుఁగాఁబడ్డప్రయాసమంతయు నిపుడు సఫలమయినది. గుణహీనుండయినయన్నను దిగవిడిచి తనంతట నాయొద్దకువచ్చి యుండఁగొన్న భక్తుఁడు విభీషణుఁడు పడినప్రయాస మంతయు నిపుడు నాకుఁ గలిగినతిరస్కారమును దుడిచివైచుటవలన సఫలమయ్యెను' అనెను.
ఇట్లారాముఁ డతికఠినముగా నిర్దాక్షిణ్యపుపలుకులు లాడుచుండఁగా, సీత, లేడివలె మిక్కిలి వికసిల్లిన బెళుకుఁగన్నుంగవతో చాలఁ గలఁగినదై కన్నీళ్లు కాలువలుగట్టుచుండెను. మొగట మండుచునేయున్న యగ్గిమీఁదు జిక్కటముగా నేయి వ్రాసి తడిపిన నది మఱియు తీవ్రముగా జ్వలించునట్లు మొదలే కుపితుండయి యున్నరామునకు నట్లు దుఃఖించుచున్నసీతను జూడఁగానే మఱియుఁగోపము పెచ్చుపెరిఁగెను. అతం డట్లు మిక్కిలియుఁగ్రుద్ధుఁడై మోమున బొమలు ముడిచి, మ్రోల సీత

ను జక్కంజూడ నోపక యడ్డముగాఁ జూడ్కులనిగుడ్చుచు వానరులయు రాక్షసులయుమధ్యమున నాబిడను జూచి పరుషముగా 'సీతా ! ప్రాప్తించినతిరస్కారమును బోఁగొట్టుకొనఁ దివురువాఁడు, ఏమి సేసితీఅవలయునో యది యంతయుఁ జేసినైనది; మున్ను దక్షిణపుదిక్కు ఇల్వలవాతాపు లాక్రమించి యుండుటచే ప్రాణిసమూహమునకు సంచరింపరాకుండినందునఁ గోపమునొంది యాత్మధ్యానగరిష్ఠుఁడగు నగస్త్యుఁడు తపోబలమున వారిని రూపుమాపి దానిని సాధించినట్లు, నేను రావణుం డపహరించిననిన్ను కోపమునం జేసి యాపగవానినిజంపి సాధించితిని. కల్యాణీ! నే నింతకు నాస్నేహితులపరాక్రమమువలన యుద్ధమున నిర్వహించి తీర్చినప్రయాసమంతయు నీకొఱకై చేసినదిగాదని నీకుఁ దెలిసియుండనీ. మఱియెందులకొఱకందువా? ఆచారమును రక్షించుటకును, అంతటను గలుగునపవాదమును ప్రఖ్యాతి గాంచిననావంశమునకుఁ గలిగిన యపకీర్తినిని బరిహరించుటకును, నే నిట్లు యుద్ధమునఁ బ్రయాసము పుచ్చుకొంటినిగాని వేఱుగాదు. పరగృహవాసముచే నీచరితను గుఱించి నాకు సందేహము గలిగియుండుటవలన నాకట్టెదుట నిలిచియున్న నీవు నేత్రరోగము గలవానికి దీపమువలె బిట్టు *ప్రతికూలవై యున్నావు. కల్యాణీ ! జనకపుత్త్రి ! అట్లగుటవలన పొమ్ము, అనుజ్ఞ యిచ్చితిని. ఈదశదిశలందును నీయిష్టము వచ్చినచోటికిఁ బోవచ్చును. ఇఁక నాకు నీతోఁ బనిలేదు. మంచికులమునఁ బుట్టి, అందును మిక్కిలి తేజంబున రాజిల్లుపురుషుఁ డెవ్వఁడు పరునియింట బహుకాల ముండినతనపడఁతిని మనసున మిక్కుటమయిన తహతహపడుచుఁ మరలఁ జేకొనును ? ఇంతకాలము రావణునితొడనుండి యిపుడు జాఱివచ్చినదానవు. కామదుష్టమయిన వానిచూడ్కులకుఁ బాలయినదానవు. గొప్పకులమును నలుగడఁ బ్రకటించుకొనుచున్న నేను, ఇట్టినిన్ను మరల నెట్లు చేపట్టుదును? ఆకులముకీర్తికొఱకు నిన్ను సాధించితిని గాని వేఱు గాదు. పోయినకీర్తిని మరలఁ దెచ్చుకొంటిని. ఇఁక నీయందు నాకాసక్తి యేమియు లేదు. ఇచ్చటనుండి యిచ్చవచ్చినచోటికిఁ బోవచ్చును. కల్యాణీ! ఇది నేను బుద్ధిని జక్కఁగా నిశ్చయించి చెప్పినమాటయే కాని మఱివేఱు గాదు. కాన సీతా! నీకు సుఖమెట్లో యట్లు † లక్ష్మణునియందుఁగాని భరతునియందుఁ గాని బుద్ధి నుంపుము. లేక వానరరాజయినసుగ్రీ

* ఇట నేత్రరోగికి దీపము ప్రతికూలమగుటకుఁ గారణము వాని నేత్రమందలిదోషముకాని దీపమందలిదోషము కానట్లు, రాముఁడు తనకు సీత ప్రతికూలయగుటకు కారణము తనయొక్క సందేహమనెడిదోషమే కాని సీతయందలి దోషమేమియుఁగాదని భావపడుట వ్యంజితము.

† ఇట లక్ష్మణాదులందు మనస్సునుంపుము బుద్ధినుంపుమనఁగా భర్తృపరిత్యజించిన స్త్రీకి బంధుగృహమున వాసము విధించియుండుటవలన స్త్రీకి స్వాతంత్ర్యము విధింపఁబడనందున పుత్త్రసమానులగు లక్ష్మణాదులగృహములందు వారిరక్షణక్రిందనుండి యాత్మపోషణము సేసి కాలముగడుపుము అని యర్థముగాని వేఱుగా నర్థము గ్రహింపరాదు.

ఘ్నునియందుఁగాని, రాక్షసరాజగువిభీషణునియందుఁగాని, మఱియు నీకెట్లు సుఖమనితోఁచునో యట్లుగాని, యుండుటకు మనస్సునుంపుము. సీతా! దివ్యరూపము గలిగి మనోజ్ఞురాల వగునీవు వేఱుదిక్కు లేక రావణునియింటనే చిక్కియుండఁగా వాఁడిట్లున్న నిన్నుఁ జూచుచు, నింత పెద్దయుఁగాలము సైఁచి యూరకుండునా? ఊరకుండఁడు.' అని పరుషములాడెను. అంత ప్రియవచనములు వినుటకే తగినయాసీత చిరకాలమునకుఁ బ్రియునివలన నట్టియప్రియవచనమును విని మేటియేనుంగు తుండముచే బిట్టాడింపఁగా సందుగుతీఁగ మిక్కిలియు వడఁకుచు పాలుదొరఁగునట్లు తాను వడవడవడఁకి మిక్కిలియుఁ గన్నీరు విడిచినదయ్యె. ఇది నూటపదునెనిమిదవ సర్గము.

సీత రామునివచనములకు బదులుసెప్పి పతికి నమ్మిక గలుగుటకై యగ్నిప్రవేశము సేయుట.

ఇట్లు రాముఁడు రోషమున, వినువారి కితరులకును భయమున గగురుపుట్టించునట్టిపరుషభాష లాడుటయు సీత మిక్కిలియుదుఃఖిత యయ్యెను. సీత, తా నిదివఱకెన్నఁడు వినియెఱుంగనియా పరుసంపుమాటను భర్తవలన మహాజనమధ్యమున విని, లజ్జచే వంచియున్నతలను మఱియు వంచుకొన్నదయ్యెను. జనకరాజసుత సీత తనయవయవములందు దానుజొరఁబడునట్లు మిక్కిలియు ముడుఁగుకొనుచు, అలుఁగులవంటి యప్పలుకులు గాఁడ, నలుఁగులు గ్రుచ్చుకొన్నదియుంబోలె నొవ్వసయిఁపఁజాలక మిక్కిలియుఁ గన్నీరుదొరఁగెను. అంత నద్దేవి కన్నీటం దోఁగియున్నతన మొగమును దుడుచుకొనుచు భర్తనుజూచి మెల్లమెల్లగా డగ్గుత్తికవడిన పలుకుల 'వీరా! ఇటువంటి మాట నన్నేలపలికెదవు? ఇది నీవు చెప్పుటకును నేను వినుటకును దగునా? ఇది మిక్కిలి పరుసనై చెవుల బ్రద్దలుచేయుచున్నదే. సామాన్యుఁడయినవాఁడు సాధారణయైనయొక తెకుఁ జెప్పునట్లు లిట్టిమాట నినుబోఁటి పలుకుదువా? మహాబాహూ! నీకు నేనెట్టిదిగాఁ దోఁచుచున్నదో యట్టిదానను గాను. నీకుఁగా నాసచ్చరిత్రముపై నొట్టుపెట్టుచున్నాను. (ఏదయిన నొకప్రమాణముచే నాయందు నమ్మకముంపుము) అల్పస్త్రీల కొందఱిదురాచారమును జూచి స్త్రీజాతినంతయు నట్టిదిగానే యుండునని శంకించుచున్నావు. నీవు నాస్వభావమును జక్కఁగాఁ బరీక్షించి తెలియుదువేని, యీ సందేహము దిగవిడువుము. ప్రభూ! నాస్వభావము నీకుఁ దెలిసియున్నను రావణునియంగము నాకుఁ దగిలినదోషమున్నది కాననన్ను దిగవిడుతునందువా? అప్పుడు నేను పరాధీనురాలను; కాన వానియంగములతాఁకు నొందవలసివచ్చెను. అయినను అందు నాయిచ్ఛతోఁ జేసినతప్పు లేదు. అది దైవము చేసినయపరాధము. నామనసో యితరులకు గ్రహింపనలవిగాక నాయధీనమైయుండునది; కాన యది యక్కాలమున నీయందే యుండెను. నాయవయవములో నితరులకు గ్రహింప శక్యములైనవి. మఱి

వానిని విడిపించుకొనుటకు నేను స్వతంత్రురాలను గానయితిని. కాబట్టి వానివిషయమై నేనేమిచేయఁగలను? మానదా! మనమిద్దఱును నొకరితోనొకరు చాలఁగాలము కూడి యాడి పెరిఁగితిమి. ఒకరితోనొకరు పెక్కేండ్లు గలసిమెలసియుంటిమి. ఈ రెంటివలన నే నాస్వభావము నీకుఁ జక్కఁగఁ దెలిసియుండవలయును. ఇట్టివానిచేతను నీకు నాస్వభావము తెలియకపోయెనేని యిఁక దేనిచేతనుం దెలియనేరదు. కావున నే నిఁక కలకాలము హతనయితిని. వీరా! నీవు నన్ను వెదకుటకై వీరుఁ డగుహనుమంతునిఁ బంపితివే. అట్లు పంపునపుడు నేను లంకలోనున్నపుడే నన్నేల విడువవయితివి. వీరా! నీవప్పుడే నన్ను విడిచియుందువేని, యాసంగతిని విన్న వెంటనే,నన్ను నీవు దిగవిడిచితి వని వానరోత్తముఁ డగుహనుమంతునిసమక్షమున నే ప్రాణములు విడిచియుందును. ఇంతకాలముని న్నెడఁబాసినవ్యథ నేను పడియుండనుగదా. నావిషయ మట్లుండనిమ్ము. అట్లు చేసియుందువేని, ప్రాణసంకటమున నునుపు పెట్టుకొని యింతయుద్ధముచేసి వ్యర్థముగా మీకు శ్రమపడవలసియుండదే. నీమిత్రులకు నింతదూరము నిష్ఫలముగా కష్టపడవలసినది లేకయేయుండునే. నరసింహానూ! నీ వల్పుం డగునొక మనుష్యునివలెఁ గోపమునే యనుసరించి నాయాఁడుతనమునే మున్నిడుకొని పలికితివిగాని నిష్కళముగా నాశీలమును పరికింపవయితివి.(నన్నాఁడుదియనిమాత్రమే తలంచి పలికితివిగాని నాశీలమును దలంపవయితివి)నీ వాచారముం దెలిసినవాఁడవే.అయిన నేమి! జనకునకుఁ బుట్టినట్లు వ్యాజమేకాని వాస్తవముగా భూమినుండియే పుట్టితిని. ఇట్టినాపుట్టుకను, బహుకాలము నీవు పరిశీలించి యున్న నాయాచారమునుగూడ, మున్నిడుకొనవైతివి; ముఖ్యముగా పాటింపవైతివి. నీవు పిన్నవాఁడవై యుండునపుడే,నన్ను,నాపిన్నతనముననే నగ్నిసాక్షికముగాఁ బాణిగ్రహించితివే. అట్లు పిన్ననాఁడే పట్టినపాణియుఁగూడఁ బ్రమాణముగా దయ్యె. మనపిన్ననాఁడే యాడినపెండ్లినిగూడ, పిన్ననాఁటినుండి యున్న పెండ్లమని కూడ, పాటింపవయితివి. నీయందునాకుఁ గలభక్తిని నాశీలమును, అంతటిని వెనుకకు ద్రోచితివిగాని మున్నిడుకొనవయితివి' అనెను. సీత రామునితో నిట్లుపలుకుచు రోదనము సేయుచు,కన్నీళ్లచే డగ్గుత్తికపడినపలుకులతో,దీనుండై యేమియుఁదోఁచక చింతంగూరి నిలఁబడియున్న లక్ష్మణుం జూచి 'లక్ష్మణా! నాకు చితిఁబేర్పుము. ఇదియే నావ్యసనమునకు మందు. మఱేదియుఁగాదు. దానిని జొచ్చిప్రాణములు విడిచెదను. వట్టియపవాదమునఁ గొట్టువడి నేనిఁక బ్రతుకనొల్లను. నాపాతివ్రత్యాదిగుణములకుఁ బ్రీతినొందక, పతి నన్ను మహాజనసభామధ్యమునఁ బరిత్యజించినపుడు నాపునాథునకు నమ్మికఁబుట్టించుటకై యోగ్యమగుగతి యగ్నిని జొచ్చుటయే. కాన యగ్నిం బ్రవేశించెదను. ఇంతకన్న వేఱుగతి లేదు' అనెను. సీతయిట్లు చెప్పఁగా శత్రువీరుల నణఁచువాఁడు లక్ష్మణుఁడు దైన్యముబొరిచిక్కి రాముని ముఖముచాయం జూచెను. అంత వీర్యవంతుఁ డగులక్ష్మణుఁడు రాముని బొమలసైగ మొదలగు సుఖసూచనలచే నదియతని కభిమతమని తెలిసికొని, రామునిమతము చొప్పున చితిసిబేర్చెను. అప్పుడురాముడు 'పతివ్రత నెప

ములేక మే చేయుప్రత్యయము నెట్లు చూతు' నని లజ్జనొంది సీత మొగము చూచి నచో మోమోటము గలుగునని తలంచి మొగము వంచుకొనియుండఁగా సీత రామానుభవముచే మెల్లగా నతనికిఁ బ్రదక్షిణము గావించి ధగధగ జ్వలించుచున్నయగ్నిహోత్రమునొద్దకు వచ్చెను. సీత దేవతలకును బ్రాహ్మణులకును నమస్కరించి యగ్ని సమీపమునం జేరి చేమోడ్పుగీలించి, 'నాహృదయము నెప్పుడును రామునినుండి మఱియొకపురుషునియెడకుఁ జలింపదేని యిట్లే లోకమున కెల్ల సాక్షి యయినయీయగ్నిహోత్రుఁడునన్ను సర్వవిధముల రక్షించుఁగాక. నేను బరిశుద్ధమయినవడవడి గలదాననయ్యె రాముఁడు నన్నన్యాయముగా దుష్టురాలినిగాఁ దలంచినయెడ సమస్తలోకసాక్షి యగునగ్నిహోత్రుఁడు నన్ను సర్వవిధముల రక్షించుఁగాక. నేను మనస్సునను వాక్కునను కర్మమునను సకలధర్మవిదుండగు రాముని నతిక్రమించి నడచుకొనకుందునేని, సకలలోకసాక్షి యగునగ్నిహోత్రుఁడు నన్నివిధంబుల నన్ను రక్షించుఁగాక. భగవంతుఁడగు సూర్యుఁడును వాయువును, దిశలును, చంద్రుఁడును, పగలును, రాత్రియు, ప్రాతస్సాయంసంధ్యలును, భూమియు, మఱియుఁ దక్కినవారును, నన్ను సచ్చరిత్రముగలదానినిగానే తలంతురేని, అగ్నిహోత్రుఁడు నన్ను రక్షించుఁగాక' అని పలికెను. ఇట్లు చెప్పి సీతాదేవి యగ్నిహోత్రమునకుఁ బ్రదక్షిణము గావించి మనంబునం దెంతమాత్రము శరీరముపయి నభిలాష లేక, జ్వలించుచున్నయామంటలోఁ బ్రవేశించెను. అచ్చట మూఁగియుండినమహాజనము ఆబాలవృద్ధము, మిక్కిలియు భయముగదుర, సీత యగ్ని ని బ్రవేశించుటను జూచెను. మేలిబంగారుభూషణములం దాల్చి మంచికడానిబంగరువన్నె గలిగి వెలుంగునాబిడ సమస్తలోకములును జూచుచుండ, జ్వలించుచున్నయగ్నిహోత్రమునఁ బడెను. అమ్మహాభాగ్యవతి సీత పవిత్రమయిన*యాజ్యాహుతియుంబోలె నగ్నిని బ్రవేశించునపుడు మూఁడులోకములును జూచినవి. ఆసీత యజ్ఞంబున మంత్రములచే సంస్కరింపఁబడి నిరంతరముగా వేల్వఁబడి పడుచున్న యాజ్యధారవలె, పెనుమంటలు చెలంగుచున్నయగ్నిహోత్రమునం బడఁగా స్త్రీలందఱును జూచి యాక్రోశించిరి. స్వర్గమునందును భూలోకమునందును బాతాళమునందు నున్నట్టిదేవతలును గంధర్వులును దానవులును శాపమునొంది స్వర్గమునుండి †నరకమునం బడుదేవతనుంబోలె నగ్నియందుఁ బడుచున్నసీతాదేవిని జూచిరి. ఆబిడ యగ్నిని బ్రవేశము సేయునపుడు రాక్షసు

* సీతకు ఈఆజ్యాహుతిదృష్టాంతముచేత పరమపవిత్రత దెలియునది. గోవిందరాజులు.

† సమస్తభోగములకు నర్హమయినట్టిదివ్యరూపము గలసీత అగ్నింబడుట, స్వర్గమండలిదేవత నరకమునంబడుట యెంత యనర్హమో యంత యనర్హముగా నుండెనని దృష్టాంతార్థము. సీత రావణుఁడు తనకడకు వచ్చినది మొదలుకొని యింతవఱకును పరమభాగవతుం డగులక్ష్మణునియెడఁ గావించినయపచారమునకు ననుభవించిన ఫలము చెప్పఁబడెను. వాస్తవమునకు సీత రావణుఁడువచ్చినకాలమున అగ్నిం బ్రవేశించెననియు రావణుఁడు కొనిపోయినది మాయాసీతయనియు నిజమయినసీత యగ్నినుండి యుద్గమించుటకై మాయాసీత యగ్నినిబ్రవేశించినదనియుఁ గొందఱు చెప్పెదరు.

లును వానరులును మిక్కిలి యద్భుతముగా నుండునట్లు మహాధ్వని సెలంగ హాహాకారములు సేసిరి. ఇది నూటపందొమ్మిదవసర్గము.

బ్రహ్మాదిదేవతలు విమానారూఢులయి శ్రీరామసన్నిధికి వచ్చుట. దేవతలందఱును రాముని బ్రస్తుతించుట. బ్రహ్మ విశేషించి శ్రీరామునిస్తోత్రము సేయుట.

అంత ధర్మాత్ముం డగు రాముఁడు, సమస్తజను లాడుకొను మాటల వినుచునే మనంబున దుఃఖితుఁడై కన్నుల నీళ్లు కలంగం బాఱ కొంతసేపు మనంబునఁ జింతించుచుండెను. అంత రాజరాజగుఁ కుబేరుండును శత్రువుల నుఱుక్కించు యముండును, సహస్రాక్షుండగు దేవేంద్రుఁడును, పగవారిని దపింపఁ జేయు వరుణుండును, ముక్కంటియు శ్రీమంతుఁడును వృషభధ్వజుండు నగు శివుండును, సమస్తలోకంబులను సృజించువాఁడును బ్రహ్మవేత్తలలో నెల్లనుత్తముండు నగు బ్రహ్మదేవుండును, వీరలందఱును సూర్యునింబోని విమానంబుల నెక్కి లంకాపురిఁ జేరి రామునియొద్దకు వచ్చిరి. అంత నా బ్రహ్మాదిదేవతాశ్రేష్ఠులు తమ్ముం జూచి చేతులు మోడ్చి నిలుచున్న రామునిఁ గాంచి కంకణాదిహస్తాభరణములతో నొప్పుతమ నిడుద బాహువులను బయికెత్తి రామునితో 'నీవు సమస్తలోకములకును గర్తవు, సర్వోత్తముండవు, జ్ఞానవంతులలో నెల్ల మేటివి. ఇట్లు సర్వజ్ఞుఁడవగు నీవు సీత యగ్నిలోఁ బడుచుండఁగా నేమియుఁ దెలియనివానివలె నుపేక్షింప నేల? బ్రహ్మాదిదేవతలలో నెల్ల నీవే శ్రేష్ఠుఁడవని నీమహిమ నీకే యెట్లు తెలియక పోయెను. నీవు మున్ను అష్టవసువులలో ప్రజాధిపతి యగు ఋతధాముం డను వసువుగా నుంటివి. నీవే కదా మూఁడులోకములకును అండాధిపతిపర్యంతమును మొట్టమొదట సృజించినకర్తవు. నీకు నీయంత స్వతంత్రుఁడవే కాని నిన్ను నియమించువాఁడు లేఁడు. అష్టరుద్రులలో మహాదేవుఁడను నెనిమిదవరుద్రుఁడవు. పన్నిరువురు సాధ్యులలో వీర్యవంతుఁ డనఁబడు పదునైదవవాఁడవు. పరంతపా! నీకశ్వి దేవతలు చెవులు, చంద్రసూర్యులు కన్నులు. లోకముల సృష్టికి ముందును ప్రలయమందును నీవుత్పత్తివినాశరహితుఁడవై కనఁబడుచుందువు. ఇట్లు సర్వజ్ఞుఁడును సర్వశక్తియు సర్వేశ్వరుండవు నయ్యు నేమియుఁ దెలియని యొక కేవలమనుష్యునియట్లు సీత యగ్నిఁబడుచుండఁగా నుపేక్షించుచుండ నేల?' యని యడిగిరి. ఇట్లు లోకరక్షకు లగు నా బ్రహ్మాదు లడుగఁగా లోకనాథుఁడును ధార్మికశిరోమణియు రఘుకులీనుండు నగు రాముఁడు ఆ దేవతాశ్రేష్ఠులను జూచి నేను * దశరథకుమారుం

---

* ఇందులకు 'ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్ । యోఽహం యస్య యతశ్చాహం భగవాం స్తద్బ్రవీతు మే' అని మూలము. విశేషార్థము:—రాముఁడు బ్రహ్మాదులచే సామాన్యముగా స్తోత్రము చేయఁబడుచున్నను సమస్తదేవతాపూజనీయుఁ డగు చతుర్ముఖునివలన తన ప్రభావమును లోకమునం బ్రఖ్యాపించుటకు తనసౌశీల్యమును (అనఁగా సర్వోత్కృష్టుఁడయ్యుఁ దనకంటె మిక్కిలియుఁ దక్కువయగువారితో పాటిగాఁ గలసి మెలసి తానుండుటను) దెలుపుచున్నాఁడు. (ఆత్మానం మా

డగురాముఁడ ననియే మనుష్యుండ ననియే నన్నుఁ దలఁచుకొనుచున్నాను. నే నెవ్వఁడనో ఎవ్వరివాఁడనో యెందులకువచ్చితినో యావివరమంతయు భగవంతుఁడగుబ్రహ్మదేవుండు చెప్పవలయును' అనెను. ఇట్లు రాముఁడనుగఁగా, బ్రహ్మవేత్తలలో నెల్లనుత్తముండగుబ్రహ్మదేవుఁ డతనిఁ జూచి 'రామా! సత్యపరాక్రమా! యథార్థము చెప్పెదను వినుము. * నీవు నారములు అనునముగాఁ గలిగి జగత్కారణుండ వైననారాయణుం

నుషం మన్యే) నన్ను మనుష్యునిగాఁ దలంచుకొనుచున్నాను. నాపరత్వమునకంటె మనుష్యత్వము నభినయించుటయేనాకు నభిమతమని యర్థము. అందును విశేషముచెప్పుచున్నాఁడు (రామం) రాముఁడను పేరుగలవానినిగాఁ దలంచుచున్నాను. మనుష్యుఁడుగాను అందును రాముఁ డను పేరు గలిగియు నుండుటయే నాకభిమత మనుట. అంతకంటె నతిశయమును జెప్పుచున్నాఁడు. (దశరథాత్మజమ్) దశరథకుమారుఁ డగురాముఁడు గాఁ దలఁచుచున్నా ననుట. అవతారములం దెల్ల దశరథచక్రవర్తిపుత్రుఁడుగానుండుటయేనాకు మిక్కిలియు ప్రియమనిభావము. ఇటసంప్రదాయోదాహరణ మొకటిగలదు 'శంఖచక్రగదాపాణే ద్వారకానిలయాచ్యుత । గోవిన్ద పుణ్డరీకాక్ష పాహిమాం శరణాగతామ్' అని ద్రౌపదీవాక్యము గలదు. (శంఖచక్రగదాపాణే) అని పరత్వవ్యంజకము లగుశంఖచక్రాద్యాయుధములను ధరించుటను జెప్పుటచే కృష్ణుఁడనాపరము నేపి సుఖమునంచుకొన్నవాఁడయ్యెననియు, (ద్వారకానిలయ) అని కృష్ణావతారమును జెప్పుటచే కొంచెము మొగమెత్తినాఁడనియు, (గోవిందపుండరీకాక్ష) అని గోపందశబ్దముచే గోపాలపుత్రుఁడు గొల్లపిల్లవాఁడని వినుటచే పరత్వమునకంటె వసుదేవునికి పుత్రుఁడగుటయే తనకభిమతమని విప్పాలితాక్షుం డయ్యెననియుఁ జెప్పంబడెడిని. మనుష్యత్వమున నతిశయించిన తనపరవాసుదేవత్వాదికము సుగ్రీవాదులకు చక్కఁగా నిశ్చితమయియున్నది గాన యందు దృఢముగా విశ్వాసము వారికిఁ గలిగించుటకై చతుర్ముఖునిచే తనపరత్వమును బ్రకటించుటకు స్వస్వరూపము నడుగుచున్నాఁడు. (యోఽహం) నేనెవఁడు? నాస్వరూపమేమియనుట. (యస్య) నేనెవ్వరివాఁడను అనితన సంబంధమును గురించిన ప్రశ్నము. (యతః) ఎందుకొఱకు? అని తాను వచ్చిన ప్రయోజనమును గురించిన ప్రశ్నము. (భగవాం స్త్వద్బ్రవీతు) భగవంతుఁడగు బ్రహ్మ దానిని జెప్పఁగాత. చక్రవర్తిపుత్రుఁడగుటయే నాకు మిక్కిలియు ప్రియతమమైనది. నీవు నీయంతట సర్వజ్ఞుఁడవుగాన నాకభిమతముగాకున్నను పరత్వమును బ్రకటింపుమని యర్థము. తనయాకారమును వివరించుట తనకభిమతముగాని దయినను తాను వివరింప ననుమతియొసంగుట రాముఁ డనుపేరఁ దాను జేయవలసినకార్య మొనఁగూడి యుంటంబట్టియని తెలియునది.

* ఇందులకు 'భవాన్నారాయణో దేవః శ్రీమాన్ చక్రాయుధో విభుః । ఏకశృంగో వరాహస్త్వం భూతభవ్యసపత్నజిత్' విశేషార్థము:— (నారాయణః) 'ఆపో నారా ఇతి ప్రోక్తా ఆపో వై నరసూనవః । తా యదస్యాయనం పూర్వం తేన నారాయణః స్మృతః' 'జలములు నారములనంబడినవి. ఏలననవి నరునిచేఁ (పరమాత్మచేఁ) బుట్టినవి. ఆజలములు మునుపు ఇతనికి స్థానముగా నుండినవగుటంజేసి యితఁడు నారాయణుఁ డనఁబడెను' అని మనుస్మృతి. ముందు జలములను సృజించి యితరములను సృజించుటకుమునుపు ఆజలములందు నివసించినాఁడనుట. ఇట్టినారాయణుఁ డనుటచే జగత్కారణుఁ డగుటయు చెప్పఁబడెను. ఇందులకు 'ఏకో హ వై నారాయణ ఆసీన్న బ్రహ్మా నేశానో నేమే ద్యావాపృథివీ' అని శ్రుతి. అవాప్తసమస్తకాముఁ డగువానికి జగత్తు సృజించుట మొదలగువ్యాపారములు సేయుట

డవు. అవాప్తసమస్తకాముఁడవయ్యు క్రీడాప్రవృత్తుఁడవుగాన జగత్సృష్టి మొదలగు వ్యాపారములు లీలలుగాఁ జేయుచుందువు. నీవెల్లప్పుడును లక్ష్మితోఁ గూడియుండువాఁడవు. సుదర్శనచక్రం బసాధారణ మగునాయుధముగాఁ దాల్చియుందువు. సర్వవ్యాపకుఁడవు. ఒకకొమ్ముగలిగి భూమి నుద్ధరించినయాదివరాహమూర్తివి. ఇంతకుమునుపుండినశత్రువులను నిఁకఁ బుట్టఁగలశత్రువులను గెలుచువాఁడవు. * రామా! నీవక్షరమవు. నీవు పరబ్రహ్మమవు. షడ్భావవికారశూన్యుండవు. ఆదిమధ్యాంతములందు వర్తిం

పాసఁగఁ జేయఁగా (దేవః) 'దీవ్యతీతి దేవః' క్రీడించువాఁడు. క్రీడాప్రవృత్తుఁడగుటచే సృష్టి మొదలగు వానిని లీలకొఱకుఁ జేయుచున్నాఁ డనుట. కాఁబట్టి అన్నిట పరిపూర్ణుఁడయినవానికి నేదయినపని, సంభవించునని భావము. ఇట్లు పరత్వమునకు అసాధారణమయిన నామధేయమును జెప్పి పత్నీవైశిష్ట్యమును జెప్పుచున్నాఁడు. (శ్రీమాన్) శ్రీతోడి నిత్యయోగము గలవాఁడు. అసాధారణమైనయాయుధమును జెప్పుచున్నాఁడు, (చక్రాయుధః) సుదర్శనచక్రమే నాయుధముగాఁగలవాఁడు. స్వరూపవైలక్షణ్యమును జెప్పుచున్నాఁడు. (విభుః) వ్యాపకుఁడనుట. అణుస్వరూపులగు ఆత్మలకు స్వరూపవ్యాప్తి లేదు. పరమాత్మునికి స్వరూపముచే సర్వత్రవ్యాప్తి గలదు. వారికంటె విలక్షణుఁడనుట. దీనిచే ఫలితమైన రక్షకత్వమును జెప్పుచున్నాఁడు. (ఏకశృంగో వరాహః) ఒకకొమ్ము గలయాదివరాహుఁడవు. ప్రళయసముద్రము పొంగి పొరలినపుడు వరాహరూపమును దాల్చి భూమి నుద్ధరించినవాఁడవనుట 'ఉద్ధృతాసి వరాహేణ' అని శ్రుతి 'దంష్ట్రియా పర్వతేంద్రాణాం చాలనం కృతవాన్మహాత్ । తత స్తంతుష్టువుర్దేవా ఏకశృంగత్వ సిద్ధయే । ఏకశృంగ వరాహోఽభూత్తదా ప్రభృతి మాధవః' వరాహమూర్తి ఒకకోఱతో భూమినిమోయుచు రెండవకోఱతోఁ బర్వతములను గదల్పసాగెను. అంత దేవతలు ఒకకోఱ గలిగియుండుటకై భగవంతుని బ్రస్తుతించిరి. అంత నదిమొదలుగా వరాహమూర్తి ఒకకొమ్ము గలవాఁడయ్యెను.' అని స్కాందము. అనిష్టనివర్తకత్వమును జెప్పుచున్నాఁడు. (భూతభవ్యసపత్నజిత్) మునుపటిశత్రువులను పిమ్మటశత్రువులను గెలుచువాఁడు. మునుపటిశత్రువులు మధుకైటభాదులు పిమ్మట రానున్నశత్రువులు శిశుపాలాదులు అని తెలియునది.

* ఇందులకు, 'అక్షరం బ్రహ్మ సత్యం చ మధ్యే చాన్తే చ రాఘవ। లోకానాం త్వం పరో ధర్మో విష్వక్సేన శ్చతుర్భుజః' అని మూలము. (అక్షరం) నక్షరతీత్యక్షరం - క్షరింపనిది నాశములేనిదనుట, 'ఏతద్వై తదక్షరం గార్గి బ్రాహ్మణా అభివదన్తి' అని శ్రుతి. (భవాన్) నీవు, ఇదియిట్లే మీఁదనెల్ల నొక్కొక్కదానితోఁ గూర్చుకొనునది. 'అథ పరాయయా తదక్షర మధిగమ్యతే' ఇత్యాది శ్రుతులు. దీనిచే 'యేనాక్షరం పురుషం వేద' అను శ్రుతి యుపబృంహితమయ్యె. 'విశ్వం నారాయణం దేవ మక్షరం పరమం ప్రభుమ్' అను అక్షరవిద్యోపసంహారము నయ్యె. ఇట్లె మీఁదనువ్యాపనములచే నాయావిద్యల యుపసంహారము దెలియునది. (బ్రహ్మ) 'బృహతి బృంహయతీతి బ్రహ్మ' జగదాకారముగా బృంహణము (ఉబ్బుట) నొందునది. 'బృహతి బృంహయతి తస్మాదుచ్యతే పరం బ్రహ్మ' అని శ్రుతినిర్వచనము. (సత్యం) విపర్యాసము నొందనివాఁడవు. షడ్భావవికారశూన్యుఁడ వనుట. 'అస్తి, జాయతే, పరిణమతే, వర్ధతే, అపక్షీయతే, వినశ్యతి' 'ఉండుట, పుట్టుట, మాఱుపడుట, పెరుఁగుట, తగ్గుట, నశించుట' యనునది యాఱు భావవికారములు. (మధ్యే చాన్తే చ) చకారముచే 'ఆదౌ' అనియు గ్రాహ్యము. ఆదిమధ్యాంతములందు వర్తించువాఁ డనుట. దీనిచే నిత్యత్వము చెప్పఁబడినది. (లోకానాం

చునిత్యుండవు. నీవు సమస్తలోకముల శ్రేయస్సునకు పరమధర్మరూపమున సాధనభూతుండయిన వాఁడవు. సర్వస్వామివి. నాలుగుభుజముల నొక్కమ్మడినే నాలుగుపురుషార్థముల నొసంగువాఁడవు * నీవు శార్ఙ్గమనుధనువు దాల్చువాఁడవు, సమస్తేంద్రియములకు నియామకుఁడవు. పురుషుఁడవు, పురుషోత్తముఁడవు. ఎవ్వరిచేతను జయింపఁబడనివాఁడవు. నందక మనుఖడ్గము ధరించువాఁడవు. విష్ణుఁడవు, కృష్ణుఁడవు, బృహద్బలుండవు. † నీవు సేనానివి, గ్రామణివి, బుద్ధివి, సత్వమువు, క్షమవు, దమమవు,

---

పరో ధర్మః) లోకములకు సిద్ధరూపమయిన పరమధర్మము. ధర్మమనఁగా శ్రేయస్సాధనముగాన సర్వలోక శ్రేయస్సాధనభూతుఁ డయినవాఁడ వని యర్థము. (విష్వక్సేనః) 'విష్వద్రీచీ సేనాయస్యస విష్వక్సేనః' అంతటనుగల సేనగలవాఁడు. సర్వస్వామియనుట. (చతుర్భుజః) నాలుగుభుజములు గలవాఁడవు. నాలుగుభుజములచే నొక్కసారినే నాలుగుపురుషార్థముల నిచ్చువాఁ డనుట.

* ఇందులకు 'శార్ఙ్గధన్వాహృషీకేశః పురుషః పురుషోత్తమః। అజితః ఖడ్గధృద్విష్ణుఃకృష్ణశ్చైవ బృహద్బలః' అని మూలము. (శార్ఙ్గధన్వా) శృంగవికారమగుధనువు గలవాఁడవు. దీనిచే రక్షణోపకరణముగలవాఁడని తెలియునది. (హృషీకేశః) హృషీకములనఁగా నింద్రియములు. ఇంద్రియములకు నియంత యైనవాఁడవనుట, సర్వేంద్రియముల నాకర్షించునట్టి దివ్య విగ్రహముగలవాఁడవు. (పురుషః) పురుసనోతీతిపురుషః—బహుప్రదుఁడవనుట—లేక పురి=హృదయగుహాయాంను, శేతే=శయించువాఁడవు 'పురిశయం పురుషమిత్యాక్షతే' అని నిర్వచనశ్రుతి, లేక యేనజగత్ పూర్ణం సపురుషః—జగమెల్ల నిండినవాఁడు. 'తేనేదంపూర్ణం పురుషేణసర్వమ్' అనిశ్రుతి. లేక పురాతనత్వాత్ పురుషః—పురాతనుఁడయినవాఁడు 'పూర్వమేవాహామిహాసమితి, తత్పురుషస్య, పురుషత్వమ్' అనిశ్రుతి, (పురుషోత్తమః) క్షరము అక్షరము అనెడి పురుషులకంటె నుత్తముఁడయినవాఁడు-చిదచిత్తులకంటె నుత్కృష్టుఁడనుట 'యస్మాత్క్షరమతీతోఽహమక్షరాదపిచోత్తమః। అతోఽస్మిలోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః' అని గీత. లేక పురుషులందుత్తముఁడగుటచే పురుషోత్తముఁడు. (అజితః) ఎవరిచేతను జయింపఁబడనివాఁడు—ఆశ్రిత సంరక్షణమందు ఎప్పుడుగాని భంగము నొందనివాఁడు (ఖడ్గధృత్) నందకమను ఖడ్గమును ధరించినవాఁడు, (విష్ణుః) వ్యాపనశీలుఁడు. ఎవఁడు తనదయకు విషయమయ్యెనో వానినప్పుడే అచ్చటనే యుండి రక్షించువాఁ డనుట. (కృష్ణః) 'కృషిర్భూవాచకశ్శబ్దో ణశ్చ నిర్వృతివాచకః' అను నిర్వచనముచేత భూమికిభారమునుదీర్చి యానందము గలిగించువాఁడు. (బృహద్బలః) ధారణశక్తి మిక్కిలిగలవాఁడవు.

† 'సేనానీర్గ్రామణీశ్చత్వం బుద్ధిస్సత్త్వం క్షమాదమః। ప్రభవ శ్చాప్యయశ్చ త్వ ముపేంద్రో మధుసూదనః' అని మూలము. విశేషార్థం (సేనానీ) సేనల నడపించువాఁడు. ఉపసేనానిర్వాహకుఁ డనుట, (గ్రామణీః) గ్రామములనడపువాఁడు-దివ్యజనపదాదులను పాలించువాఁడనుట. (బుద్ధిః సత్త్వంక్షమాదమః) బుద్ధిని సత్యమును క్షమను దమమును బ్రవర్తింపఁజేయువాఁడు. 'న దేవాయష్టిమాదాయ రక్షంతి పశుపాలవత్ । యంహిరక్షితుమిచ్ఛన్తి బుద్ధ్యా సంయోజయన్తితమ్' 'దేవతలుకఱ్ఱనుగొని పసుల కాపరివలెఁగాచువారుగారు. ఎవనిని రక్షింపఁగోరుదురో వానికి బుద్ధిగలిగింతురు' అనుటంబట్టి యీశ్వరుఁడు బుద్ధ్యాదులనుగలిగించి రక్షించువాఁడనుట. 'మహాన్ ప్రభుర్వై పురుషస్సత్వస్యైష ప్రవర్తకః' అనిశ్రుతి, (ప్రభవః) జగత్తునకు ఉత్పత్తిస్థానము-సమస్తమున కుపాదానమైనవాఁడనుట. (అప్యయః) సమస్తజగమునకు లయస్థానము. 'కృష్ణఏవహి భూతానాముత్పత్తిరపిచాప్యయః' అనిశ్రుతి. (ఉపేం

జగత్తుప్రభవమును నాశము నయినవాఁడవు. ఉపేంద్రుఁడవు. మధుసూదనుఁడవు. *నీవు ఇంద్రకర్ముఁడవు. మహేంద్రుఁడవు నీవు. నీవుపద్మనాభుఁడవు,నీవు రణాంతకరుండవు. దివ్యు లగుమహర్షులు నిన్నుశరణ్యునిఁగాను శరణముఁగాను జెప్పుదురు. సహస్రశాఖారూపములగు శృంగములు గలిగి యనేకవిధబోధనా (విధి)రూపములగు జిహ్వలతోఁగూడి కర్మముల నాలోచించుమహార్షభ మగువేదము నీవు. మూఁడులోకముల కు నీవు సమష్టికర్తవుగద. స్వయంప్రభుఁడవు,ముక్తులకును నిత్యులకును నీతోడిసామ్యభోగము నొసంగువాఁడవు. ఆశ్రితు లపేక్షించుటకుఁ బూర్వమె వారలను రక్షించుటకుఁ బుట్టువాఁడవు నగుదువు. ‡ నీవు * యజ్ఞ రూపుఁడవు, నీవు వషట్కారమవు,

---

(ద్రః) ఇంద్రునికిఁ దమ్ముఁడుగా మొదటనవతరించినవాఁడు. (మధుసూదనః) వేదముల నపహరించినదైత్యునిఁ జంపినవాఁడు.

* 'ఇంద్రకర్మా మహేంద్ర స్త్వం పద్మనాభో రణాంతకృత్ । శరణ్యం శరణంచత్వా మాహుర్దివ్యా మహర్షయః' అని మూలము. విశేషార్థము. (ఇంద్రకర్మా) ఇంద్రుని కర్మమువంటి కర్మము గలవాఁడవు. 'తం విష్ణురన్వతిష్ఠత' అనిశ్రుతి, ఎవనికర్మము ఇంద్రునికర్మమువలె నుండునో వాఁ డనుట. వృత్రాదివధమును నింద్రునియం దంతర్యామియగు పరమాత్మునికర్మమే గాన యదిపైకి నింద్రునికర్మమువలె నుండు ననుట. (మహేంద్రః) నిరతిశయైశ్వర్యసంపన్నుఁడవు. (పద్మనాభః) పద్మము నాభియందుఁ గలవాఁడవు. నాకను జనకుఁడవనుట, ఇదియే 'పద్మే దివ్యేర్కసజ్కాశే నాభ్యా ముత్పాద్యమామపి । ప్రాజాపత్యం త్వయాకర్మ మయిసర్వం నివేశితమ్' అని మీఁదఁజెప్పెడిని. (రణాంతకృత్) రణమందు శత్రువులకు నాశము సేయువాఁడవు, (శరణ్యం) శరణమున కర్హుఁడవు. శరణమున కుచితమయిన జ్ఞానశక్తిదయాదిసంపన్నుఁ డనుట,(శరణం) రక్షణోపాయ మైనవాఁడనుట, 'సర్వస్యశరణంసుహృత్' అనిశ్రుతి, అని, (మహర్షయః) అలౌకికతత్త్వ సాక్షాత్కార సమర్థు లయినసనకాదులు అందును (దివ్యాః) అవతారరహస్యాది విశేషజ్ఞానవంతు లగు వాల్మీకాదులు లేక 'యత్రర్షయః ప్రథమజాయే పురాణాః' అన్నట్లు నిత్యసూరులు, (ఆహుః) చెప్పుదురు.

† 'సహస్రశృంగోవేదాత్మా శతజిహ్వోమహర్షభః । త్వంత్రయాణాంహి లోకానా మాదికర్తా స్వయంప్రభుః।సిద్ధానామపిసాధ్యానామాశ్రయశ్చాసి పూర్వజః' అ మూలము. సహస్రశాఖారూపము లయిన శృంగములు గలదియు, (శతజిహ్వః) అనేకవిధిచోదనారూపములగు జిహ్వలు గలదియు, నగు (మహర్షభః) గొప్ప ఋషభమయిన-'ఋష ఆలోచనే' గొప్ప ఆలోచనచేయువాఁడు, కర్మముల నాలోచించువాఁడయిన (వేదాత్మా) వేదమయుఁడయినవాఁడవు. ఇట్టిశృంగములును జిహ్వలునుగలవేద మనెడి ఋషభమయినవాఁడవనుట, (ఆదికర్తా) సమష్టికర్తవు- దీనిచే వ్యష్టికర్తయగు తన్ను వ్యావర్తించుకొన్నాఁడు, (స్వయంప్రభుః) తనకుఁదా నే ప్రేరకుఁడుగాని యితరులచే ప్రేరింపఁబడువాఁడుగాఁడు 'నతస్యేశే కశ్చన ' అనిశ్రుతి. (సిద్ధానాం) ముక్తులకును, (సాధ్యానాం) యత్రపూర్వేసాధ్యాస్సన్తిదేవాః' అనఁబడిన నిత్యులకును (ఆశ్రయః) తనతోడిసామ్యభోగమునొసంగువాఁడు. (పూర్వజః) ఆశ్రితులపేక్షించుటకుఁ బూర్వమే వారిని రక్షింపఁ బుట్టువాఁడు.

‡ 'త్వం యజ్ఞ స్త్వం వషట్కార స్త్వమోంకారః పరంతపః।ప్రభవం నిధనం వా తే న విదుః కో భవానితి' అనిమూలము. (త్వంయజ్ఞః) నీవు యజ్ఞమవు. 'యజ్ఞోవై విష్ణుః' అని శ్రుతి-యజ్ఞనిర్వాహక

(వషట్, ఆశ్రావయ, అస్తుశ్రౌషట్, యజే, యజామహే, అనువానిచే నారాధ్యుఁడవు), నీవు ఉత్కృష్టతపస్సుచే నారాధ్యుఁడవు. వేదములును వైదికులును నీపుట్టుకయును నాశమును నెఱుఁగరు. నీ వెవ్వఁడో యదియు నెఱుఁగరు. * నిన్ను యోగులు సమస్తభూతములందును విశేషించి బ్రాహ్మణులందును గోవులందును సమస్తదిక్కులందును, ఆకాశమందును పర్వతములందును వనములందును సమస్తభూతములందునుఁ జూతురు. † సహస్రపాదుఁడవు నీవ. శ్రీభూపతివి. సహస్రశిరస్కుఁడవు, సహస్రనేత్రుఁడవు నీవ. ‡ నీవు పర్వతములతోఁ గూడిన భూమిని తక్కిన మహాభూతములను ధరించుచున్నావు. ¶ రామా! దైవందిన ప్రళయమున భూమి నాశము నొందునపుడు, నీవు జలములందు శేషశాయి వగుచు దేవతలును గంధర్వులును దానవులును వసించు స్వర్గమర్త్యపాతాళము లనెడిమూఁడులోకములను కుక్షిని ధరిం

ములగు పశుపతివిరాజ్యస్రుక్స్రువాదులు శరీరముగాఁగలవాఁడవు. యజ్ఞారాధ్యులగు నింద్రాదులు శరీరముగాఁ గలవాఁడవనుట. 'బ్రహ్మార్పణం బ్రహ్మహవి ర్బ్రహ్మాగ్నౌ బ్రహ్మణాహుతమ్' అని గీత. (వషట్కారః) వషట్కారమవు. ఇది యుపలక్షణము 'వషట్' అను ద్వ్యక్షరము 'ఆశ్రావయ' అను చతురక్షరమును 'అస్తుశ్రౌషట్' అను చతురక్షరమును 'యజ' అను ద్వ్యక్షరమును 'యేయజామహే' అని పంచాక్షరమును; మొత్తమునకు నీవను పదక్షరములచేతను ఆరాధ్యుఁడవనుట 'చతుర్భిశ్చ చతుర్భిశ్చ ద్వాభ్యాం పఞ్చభిరేవ చ। హూయతే చ పునర్ద్వాభ్యాం స నో విష్ణుః ప్రసీదతు' అని చప్పఁబడెనది. (ఓంకారః) ప్రణవవాచ్యుఁడవు. 'ఓమిత్యేకాక్షరం బ్రహ్మ' అని శ్రుతి. (పరంతపః) ఉత్కృష్టతపము గలవాఁడవు. ఉత్కృష్టతపముచే సమారాధ్యుఁడవనుట, (ప్రభవం నిధనం వా) వేదములును వైదికులును నీపుట్టుకను నాశమును నెఱుఁగరు. (కో భవానితి) నీవెవ్వఁడవో యదియు నెఱుఁగరు- అపరిచ్ఛిన్నమహిమగలవాఁడవగుటచే నెఱుంగరనుట. (క ఇత్థా వేద యత్ర సః) అని శ్రుతి. దీనిచే నీస్వరూపమేమి యనుప్రశ్నమునకు నుత్తరము చెప్పఁబడెను.

* ఇందు సంబంధప్రశ్నమున కుత్తరము చెప్పఁబడుచున్నది. 'దృశ్యసే సర్వభూతేషు బ్రాహ్మణేషు గోషు చ। దిక్షు సర్వాసు గగనే పర్వతేషు వనేషు చ' అని మూలము. ఇందు సర్వాంతర్యామియగుట చెప్పఁబడినది. 'భూతాని విష్ణుర్భువనాని విష్ణుర్వనాని విష్ణుర్గిరయో దిశశ్చ। నద్యస్సముద్రాశ్చ స ఏవ సర్వం యదస్తి యన్నాస్తి చ విప్రవర్య' అని స్మృతి.

ఇందు పురుషసూక్తార్థము చెప్పుచున్నాఁడు. 'సహస్రచరణః శ్రీమాన్ శతశీర్షః సహస్రదృక్। త్వం ధారయసి భూతాని వసుధాం చ సపర్వతామ్' అని మూలము. ఇట శతశబ్దము సహస్రవాచకము. శతశీర్షా అనఁగా సహస్రశీర్షుఁడనుట. 'సహస్రశీర్షా పురుషః సహస్రాక్షస్సహస్రపాత్' అని శ్రుతి. (శ్రీమాన్) శ్రీపతివి. ఇది భూపతియనుటకు నుపలక్షణము 'హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ' అని ఉత్తరనారాయణోక్తి.

‡ ఇందు సర్వాధారత్వము చెప్పఁబడెను. మఱియు శరీరాత్మభావసంబంధమును చెప్పఁబడెను.

¶ దైవందిన ప్రళయవృత్తాంతము జెప్పుచున్నాఁడు. 'అంతే పృథివ్యాః సలిలే దృశ్యసే త్వం మహోరగః। త్రీన్ లోకాన్ ధారయన్ రామ దేవగన్ధర్వదానవాన్' అని మూలము.

చుచు సూర్యకాండేయాదులకుఁ గనుపట్టెదవు. * రామా ! నేను నీకు వక్షము. సరస్వతీదేవి జిహ్వ. ప్రభూ! దేవతలు పరబ్రహ్మమ వగునీగాత్రమునందు రోమములవలె నీకవినాభూతులై యుందురు. నీకు ఱెప్పమూయుట రాత్రియగును; కన్ను తెఱచుట పగలగును. నీయూర్పులే వేదములయినవి. వేయేల ! నీవులేనిది యొకటియు లేదు. † జగత్తుసర్వమును. నీకుశరీరము. భూతలముస్థైర్యమును నీవు. అగ్నితాపమే నీకోపము. చంద్రునిప్రసాదమే నీప్రసాదము. శ్రీవత్సమే నీకు గుఱుతు. ‡ త్రివిక్రముండ వగునీవు మున్నుమూఁడడుగులచే మల్లోకములను బలినుండి పుచ్చుకొంటివి. అట్లుదాఁటి మహాసురుఁడగు బలిని బంధించి యతనిచే పలాయితుఁడయిన దేవేంద్రుని మూఁడులోకములకు రాజును జేసితివి. ¶ సీత లక్ష్మి. నీవు విష్ణుఁడవు, దేవుఁడవు. పుట్టఁగలకృష్ణుండవు నీవ. ప్రజాపతియనఁబడువాఁడవు నీవ. రావణుని వధించుటకై యిందు మనుష్యదేహమును జొచ్చితివి. రామా! ధార్మికశిరోమణీ! నీవిదె మాకయి

---

* ఇందు ‘ అంగాన్యన్యాదేవతాః ’ అన్నట్లు సర్వదేవాత్మత్వము చెప్పఁబడుచున్నది. ‘అహం తే హృదయం రామజిహ్వాదేవీ సరస్వతీ। దేవా గాత్రేషు రోమాణి నిర్మితా బ్రహ్మణఃప్రభో॥నిమేషస్తే భవేద్రాత్రి రున్మేషస్తే భవేద్దివా।సంస్కారా స్తేఽభవన్ వేదా న తదస్తి త్వయావినా ॥’ అని మూలము. సంస్కారము లనఁగాని శ్వాసములనుట ‘తస్యహవా ఏతస్య మహతోభూతస్య నిశ్వసితమేతద్యదృగ్వేదః ’ అని శ్రుతి. వేయేల (నతదస్తి వినాత్వయా) నీవు అంతర్యామిగా లేనివస్తువే లేదని యర్థము.

† ఇట్లు నిషేధశ్రుత్యర్థమును జెప్పి ‘సర్వంఖల్విదంబ్రహ్మ తత్త్వమసి’ ఇత్యాదిసామానాధికరణ్యశ్రుత్యర్థమును జెప్పుచున్నాఁడు ‘ జగత్సర్వం శరీరంతే స్థైర్యంతే వసుధాతలమ్ । అగ్నిఃకోపః ప్రసాదస్తే సోమ శ్శ్రీవత్సలక్షణః’ అని మూలము.(సర్వంజగత్)సమస్తజగమును...(తే)నీకు,(శరీరమ్) నీ నియమముచేత ఆధేయమును విధేయమును శేషభూతమునగునని యర్థము. ఇదియే కదా శరీరలక్షణము. ఇట్లుజగత్తు నీశరీరమగుటవలన శరీరగతములగు విశేషణములు నీవిశేషణములే యనుచున్నాఁడు. (వసుధాతలంస్థైర్యమ్) వసుధాతలస్థైర్యమనుట. భూమియొక్క పృథత్వము నీదియనుట. ‘కాఠిన్యవాన్ యోబిభర్తి తస్మైభూమ్యాత్మనే నమః’ అని విష్ణుపురాణోక్తిచొప్పున భూరూపమున కాఠిన్యవంతుఁడై సమస్తమును భరించుచున్నాఁడని యర్థము.

‡ ఇందు వామనావతారమును త్రివిక్రమావతారమును వ్యంజితములు ‘ఇదంవిష్ణుర్విచక్రమే త్రేధా నిదధే పదమ్’ అనిశ్రుతియు.ఇందులకు ‘త్వయాలోకా స్త్రయః క్రాన్తాః పురాణే విక్రమైస్త్రిభిః। మహేన్ద్రశ్చ కృతో రాజా బలిం బధ్వామహాసురమ్’ అని మూలము.

¶ ప్రయోజనమేమి యన్న దానికిందు నుత్తరముచెప్పఁబడుచున్నది. ‘ సీతా లక్ష్మీర్భవాన్ విష్ణుర్దేవః కృష్ణఃప్రజాపతిః । వధార్థం రావణస్యేహ ప్రవిష్టో మానుషీంతనుమ్’ ఇందు భగవదవతారములందెల్లలక్ష్మి అనువర్తించివచ్చుట చెప్పఁబడినది. (కృష్ణః) భవిష్యత్కృష్ణావతారుఁడవు నీవే. (ప్రజాపతిః) ప్రజాపతిశబ్దవాచ్యుఁడవు నీవే. అవతారప్రయోజనము చెప్పుచున్నాఁడు. (మానుషీం) మనుష్యసంస్థానరూపమైన (తనుం) అప్రాకృతశరీరము నొందినవాఁడవు. దేహము అప్రాకృతమే. రూపము మనుష్యసంబంధి యని భావము.

పూనినకార్యము చేసి తైనది. రావణుని వధించితివి. ఇఁక సంతుష్టుఁడవై వైకుంఠమున కుద్గమింపుము. నీబలమును వీర్యమును అమోఘము. నీపరాక్రమమును అమోఘము. నీదర్శనమును వ్యర్థము గాదు. నిన్ను స్తోత్రము సేయుటయు వ్యర్థము గాదు. మహాఫలప్రదములు. నీయందు భక్తి గలమనుష్యులు అవిలంబముగా నభిమత ఫలము నొందుదురు. పురాతనుఁడును పురుషోత్తముఁడు నగునీయందు నిశ్చలముగా భక్తియుంచినవారు ఈలోకమున సదా దేహముండువఱకు భోగము లనుభవించి దేహావసానమున పరలోకమునను సమస్తకామములను బొందుదురు.* వేదసిద్ధమును బురాతనమును నితిహాసరూపము నయినదిగాన యీస్తోత్రము నెవ్వరు నిత్యమును గీర్తింతురో యానరులకుఁ బునరావృత్తి గలుగదు' అనెను. ఇది నూటయిరువదియవ సర్గము.

అగ్నిపురుషుఁడు చితిమధ్యమునుండి లేచి సీతచరిత్రమును శ్లాఘించుచు రాముని కాబిడ నర్పించుట. రాముఁడును సీతచరిత్రమును గొనియాడుచు నామెను స్వీకరించుట. నిరతిశయానంద ప్రాప్తి.

బ్రహ్మదేవుండు రామునితోఁ బలికిన యీ శుభవాక్యమును విని యగ్నిపురుషుఁడు సీతాదేవిని తొడలనిడికొని చితినుండి దిగ్గన లేచివచ్చెను. ఆయగ్నిహోత్రుఁడు ఆచితిని చెల్లాచెదరఁ ద్రోచికొని, మనుష్యవిగ్రహము దాల్చి జనకరాజసుతను సీతను దీసికొని శీఘ్రంబునఁ బయికి నావిర్భవించెను. బాలసూర్యునివలె వెలుంగుచు, మేలి బంగారుసొమ్ములు దాల్చి, యెఱ్ఱనిచీరం గట్టి, యెలప్రాయంబు మఱంతినవన్నె గులుక నలువెక్కిన కుటిలకుంతలము లందగింప, తొడిగిన పూదండలును నాభరణములును గసుగందక యుండ నగ్గిం బ్రవేశించుటకు మును వుండినరూపముననే పోలుపారుచు, మనస్సు కలంక లేక యున్నసీతను తనయొడినిడికొని యగ్నిహోత్రుండు రామునకొసంగెను. అప్పుడు లోకములగావించు సమస్త శుభాశుభకర్మములకు సాక్షియగు నగ్నిహోత్రుండు రామునిఁజూచి 'రామా! నన్ను ముందుఁ జొచ్చిననీపత్ని యాసీత యిది గో! ఈబిడయం దేపాపము లేదు; కాన పరిగ్రహింపుము. మిక్కిలియు గూర్చునీయిల్లాలునందు దోషము లేదని యెఱింగియు నీయాచారమునకుఁ గొఱంతకలుగకుండునట్టు లగ్గిం జొప్పించితి వెంతయాచారశూరుండవు! ఈబిడ వాక్కుచేఁగాని, మనసుచేఁగాని, సంకల్పముచేఁగాని, కంటిచేఁగాని, నిన్ను మీఱి యొండుపురుషునియందు వర్తించినదిగాదు; సదాచారచుమీ. ఇది సమ్మతింపక రావణుఁడెట్లు కొంపోవునందువా? నీవు లేనపుడు ఈబిడ దీనురాలై పరవశయైయుండఁగా రావణుఁడు పరాక్రమంబునఁ

* దీనిచే తపస్సు మొదలగువానికంటె రామభక్తియె పరమధర్మమని చెప్పఁబడినది. రామభక్తిం జేయలేనివారికి ఈస్తోత్రమె యట్టిఫలము నిచ్చుననుచున్నాఁడు.

గన్నఁగానని వాఁడగుటచే బలవంతముగా నిర్జనమగు వనమునుండి నపహరించుకొనిపోయినాఁడు. ఇట్లు చెఱఁబెట్టి యంతఃపురమునఁ బదిలముగానుంచి, వికృతరూపలయి భయంకరముగాఁ జూపట్టు రాక్షసస్త్రీలను బెక్కండ్రఁ గావలియుంచి వాఁ డెంతనిర్బంధపెట్టినను, ఈసతి నీయందే మనస్సునుంచి నిన్నే పరమగతిగా భావించియుండెను. మించిపోయె నేని యిట్లుండునా? ఆరాక్షసుఁడు రావణుఁడు, ధనకనకవస్తువాహనాదుల నిచ్చెదనని పలువిధములఁ బేరాస గొలుపుచుండినను, చంపెద నఱికెదనని యెంత బెదరించుచుండినను, సీత వాని నెంత మాత్రమును గణింపక మనస్సంతయు నీయందే యుంచి నిన్నే ధ్యానించుచు నుండెను. రామా! పరిశుద్ధ మయినహృదయము గలిగి పాపమెఱుంగ కున్నయీపూబోఁడిని ప్రతిగ్రహింపుము. నామాటకు బదులు చెప్పఁగూడదు. నేను నీకాజ్ఞాపించెదను' అనెను. అంత మాటనేర్పరియు ధర్మాత్ముండు నగు రాముఁడు, అగ్నిపురుషుండు చెప్పినయప్పలుకు విని తనయిల్లాలు నిర్దోషురాలని చెప్పినందులకు మనంబు మిక్కిలియు నుల్లసిల్ల, నట్టిపడఁతిని నగ్నిం జొప్పించినందులకు కన్నుల నీళ్లు కలంగంబాఱ, వ్యర్థముగా దిగవిడిచితినని కొంత సేపు చింతించుచుండెను. అగ్ని యిట్లు చెప్పఁగా, మహాతేజుండును గాంతిమంతుఁడును దృఢపరాక్రముండును పరమధార్మికుండు నగు రాముఁడు, దేవశ్రేష్ఠుం డగు నగ్నిం (బ్రహ్మదేవునిం) జూచి 'ముల్లోకములందును సీతపయి పాపము చెప్పుట యెంతమాత్రము తగనే తగదనుట వాస్తవమే. అయినను ఈ శుభాత్మురాలు రావణునంతఃపురమున బహుకాలముండినది గదా. కాన యపవాదము గలుగవచ్చును. నేను సీతను పరిశోధింపకయె పరిగ్రహించి యుందునేని, సుజనులు నన్ను దశరథమహారాజకడుపునఁ బుట్టియు రాముఁడు మూఁఢుఁడును కాముకుఁడునే యగుఁగాని మానవంతుఁడుగాఁడని నిందింతురు. కాన యా యపవాదమును బోఁగొట్టుటకై యిట్లు చేయవలసివచ్చెను. జనకమహారాజకుమారిత యైనదానికిఁగూడ నాచారము నుఱియొకరు చెప్పవలయునా? సీత నాయందే మనస్సుదగులుపడి నామనసు పోయినపోకలే పోవుచుండునుగాని తానుస్వతంత్రముగా నే పనియుఁ గావింపనిదనియు నాకును దెలియును. అయినను సత్యమునే యవలంబించి సరియైననడవడి నడపఁ గోరువాఁడను గావున, సత్యము బయలుపఱుటకును, ముల్లోకములవారికిని నమ్మకము గలుగుకొఱకును, సీత యగ్నిని బ్రవేశించుచుండఁగా నుపేక్షించుచుంటిని. ఇటువంటిసుందరిని జూచి రావణుఁడూరకుండునా యందువేని, ఈవాలుంగన్నులచిన్నారి తన తేజముచేతనే సురక్షితయైనది. ఇట్టిచెలువయెడఁగూడ రావణుఁడతిక్రమించి నడచునా? సముద్రము చెలియకట్ట మీఱఁజాలనట్లు వాఁడు సీతను నతిక్రమింపఁజాలఁడు. సీతను బెనకుట యెంతమాత్రము శక్యముగాదు గాన దుష్టాత్ముండగు రావణుఁడు మనస్సున నయినను నాచెలువను బెనకంజాలఁడు. మండుచున్న యగ్నిజ్వాలను నెవ్వఁడు స్పృశించును? అయిన నీయమ యిటువంటి యైశ్వర్యము నెట్లు విడుచునందువా? రావణాంతఃపురమునందలి యైశ్వర్యము ఈకల్యాణి కెంతమాత్ర మగ్రాహ్యము గా

దు. నాయైశ్వర్యమె దీనికిఁదగును. ఏలనఁగా సూర్యునికంటె వెలుతురు వేఱు గానట్లు సీత నాకు నెంతమాత్రము వేఱుపడియుండునది గాదు. ముల్లోకములందును అందఱి కన్నను బరిశుద్ధురాలగు జనకరాజసుత యీసీతను, బుద్ధిమంతునకుఁ గీర్తిని విడువ నలవిగానియట్లు నాకు విడువశక్యముగాదు. కాన సీతకు నేనును వేఱుపడియుండు వాఁడను గాను. మీరు నాయందు నెయ్యము గలవారలు; మఱి లోకపూజ్యులరు; ఇట్లు హిత ముపదేశించుచున్నవారలు. ఇట్టి మీరు యందఱును జెప్పినమాట నాకు శుభకరమగును. కాన నేనవశ్యము దానిని జేసి తీఱవలయును' అనెను. మహాబలవంతుఁ డగు రాముఁ డిట్లు తనకుం జక్కఁగాఁ దెలిసియె యీమాటం బలికి, మహాబలసంప న్నులయిన యాబ్రహ్మాదులు దాను గావించిన కార్యమునకుఁ బ్రశంసించుచుండఁగా, సుఖార్హుండు గావునఁ బ్రియురాలిం దగ్గఱకుఁ జేరఁదీసికొని యెంతయుసుఖము ననుభ వించినవాఁ డయ్యె. ఇది నూటయిరువదియొకండవసర్గము.

శివుఁడు రావణుని వధించినందులకుఁ బొగడుచు రాముని జిరకాల మయోధ్యారాజ్యము పూని యశ్వమేధాదులు చేసి ధర్మమును స్థాపించి రమ్మని దివ్యశరీరుండయి దివ్యవిమానమున వచ్చి యున్న దశరథునిం జూపుట. రామాదులు దశరథునకు నమస్కరించుట. అతం డందఱను వేఱువేఱ యభినందించి స్వర్గమున కరుగుట.

రాముఁడు లెస్సగాఁ జెప్పినయీశుభవచనమును * విని శివుం డంతకన్న శుభం బగువాక్యమున నతనితో,† 'పుండరీకాక్షా! మహాబాహూ! విశాలవక్షా! పరంతపా! రామా! శస్త్రధారిశిరోమణీ! మాభాగ్యమున నీ విట్లు రావణుని వధించితివి. రామా! సమస్తలోకములకును రావణువలనఁ బుట్టి చెలంగిన భయం బను బెడిదంపుగాఢాంధకారమును మాభాగ్యవశంబున నీ విపుడు యుద్ధమున రావణునిం

* బ్రహ్మ దేవకార్యమును జేసితివైనదిగాన దేవలోకమునకు రాముని రమ్మనఁగా శివుఁడు లోకమున ధర్మము సంస్థాపింపవలయునని రామునిహృదయమగుటం దెలిసి యట్లే యతఁడు చేయ ననుమతించుచున్నాఁడు.

† ఇందులకు 'పుష్కరాక్ష మహాబాహో మహావక్ష పరంతప' అని మూలము. పుష్కరాక్షుఁ డనఁగా పుండరీకాక్షుఁడు. 'తస్యయథాకప్యాసం పుండరీకే ఇవ అక్షిణీ' 'పురుషః పుండరీకాక్షః' అని శ్రుతిస్మృతులయందు పరబ్రహ్మమునకసాధారణచిహ్నముగాఁ బ్రతిపాదితమైన పుండరీకాక్షత్వము రామునకుఁ జెప్పఁబడుటచే రామరూపమున నవతరించిన విష్ణుఁడే వేదాంతవేద్యుండగు పరబ్రహ్మమని చెప్పఁబడినదయ్యెను. మహావక్షుఁడనఁగా శ్రీనివాసమువలన గొప్ప వక్షముగలవాఁడనుట.

జంపి పోఁగొట్టితివి. మహాబలశాలీ ! నీవయోధ్యకుఁ బోయి, దీనుండై నీరాకకెదురు చూచుచున్న భరతు నాశ్వాసించి కౌసల్యను,నింతటిమహాకార్యమునకు మూల మగుటచేఁ గీర్తిగాంచినకైకేయినిం గాంచి, లక్ష్మణునియందలి నెయ్యమువలన నతనిం గన్న సుమిత్రను విశేషించియుఁ జూచి, రాజ్యంబుఁ జేకొని సుహృజ్జనులకెల్ల సంతోషము గూర్చి పుత్రపౌత్రాదులం గని యిక్ష్వాకువంశమును శాశ్వతముగా నెలకొల్పి యశ్వమేధమును గావించి యసదృశమయిన కీర్తినిగాంచి బ్రాహ్మణులకు వలయు ధనం బొసంగి, యంత వైకుంఠమునకు వేంచేయం దగును; కాని యింతకుముందు గాదు. రామా! ఇదిగో మనుష్యలోకమున నీకు గురుండును మహాయశుండు నయిన నీతండ్రి దశరథమహారాజు విమానమున వచ్చియున్నాఁడు చూడు. శ్రీమంతుఁ డితఁడు,పుత్రుఁడవగు నీచేత నసత్యదోషమును తరించునట్లు చేయఁబడి యింద్రలోకము నొందెను. నీవును నీతమ్ముఁడు లక్ష్మణుఁడును నితనికి నమస్కారము గావింపుఁడు' అనెను. శివుఁడు చెప్పినదివిని, రాముఁడును లక్ష్మణుఁడును విమానశిఖరమునందున్న తండ్రికి ప్రణామము గావించిరి. ప్రభుండగు రాముఁడును లక్ష్మణుఁడును, తనదివ్యదేహకాంతిచే వెలుంగుచు దివ్యంబు లయిననిర్మలవస్త్రములను ధరించియున్న తండ్రిని దశరథుని దర్శించిరి. అప్పుడు విమానంబునం దుత్తమాసనంబునఁ గూర్చుండి యున్న మహాబాహుండగుదశరథమహారాజు తనకుఁ బ్రాణములకంటె మిక్కిలియుఁ బ్రియుండయిన పుత్రుని రామునిం జూచి మిక్కిలియుహర్షము పయికొనఁగాఁ దనతొడపయి నుంచుకొని బారసాఁచి బిగ్గ కౌఁగిలించుకొని యంత నతనితో 'రామా! నిన్నుఁ బాసినందున నాకు నీస్వర్గభోగము గాని యీదేవర్షులు గావించు సమ్మానముగూడ నంతగా మెచ్చు గాకున్నది. ఇది సత్యము. ఇట్లని యొట్టుపెట్టి చెప్పుచున్నాను. ఇప్పుడు శత్రువులను వధించి వనవాసప్రతిజ్ఞను తీర్చి నిండుమనంబున సంతుష్టుండవై యున్న నిన్నుఁ జూడఁగా నాకు మిక్కిలియుఁ బ్రీతియగుచున్నది. మేటిమాటకారీ! నిన్నారు వెడలఁ బంపుటకై కైక యేమిమాటలు చెప్పినదో యవియన్నియు మఱపునొందక నా మనస్సునే నాటుకొని నన్ను దుఃఖపెట్టుచునేయున్నవి. నీవును లక్ష్మణుఁడును కుశలముగానుండుటఁజూచి నిన్నును వానిని కౌఁగిలించుకొన్నపిదప నిపు డాదుఃఖమునుండి, మంచునుండి సూర్యుఁడు విడివడినట్లు,విముక్తుఁడనయితిని. పుత్రా!మున్ను అష్టావక్రుండు కహోళుం డను బ్రాహ్మణుని జనకసభయందు వాదంబునఁ బగవాని దరింపఁజేసినట్లు, మహాత్ముండును సుపుత్రుండు నగునీవు సత్యపాశబద్ధుఁడ నగునన్ను నసత్యదోషమునుండి తరింపజేసితివి. సౌమ్యా! పురుషోత్తమా ! మేటిదేవతలే రావణుని వధము గావించుటకై యప్పు డాయభిషేకవిఘ్నాదులు గలిగించిరని నాకిప్పుడే తెలిసినది. శత్రునిషూదనా! కౌసల్య వనమునుండి గృహమునకు వచ్చిననిన్ను మిక్కిలి సంతోషము పొంగఁ జూడఁగలదు. కాన, యది కృతార్థురాలుచుమీ. రామా! అయోధ్యాపురమునకుఁ బోయి పట్టాభిషిక్తుండవై యభిషేకజలంబులం దోఁగి యపుడు భూనా

ఘుండవై తేజరిలుచున్న నిన్నుఁ జూడఁగల మనుష్యులందఱును గృతార్థులే కదా. నీయందనురక్తిగలిగి, బలవంతుఁడును శుచియును ధర్మవర్తనుండునై యొప్పు భరతునిఁ బోయి నీవు గలియఁగాఁ జూడఁగోరెద. కాన యవశ్య మతనిని బోయి చేరుము. సౌమ్యా! నీవు సీతను బుద్ధిమంతుఁ డగులక్ష్మణునిని గూడి, యరణ్యంబున వాసము సేయుచుఁ బదునాలుగేండ్లనుఁ గడపి వచ్చితివి. నీవు వనవాసంబు దీర్చుకొంటివి. నీ ప్రతిజ్ఞయు సఫలమయ్యెను. రావణుని యుద్ధమున వధించి దేవతలనందఱ సంతోషపఱిచితివి. శత్రుసూదనా! చేయవలసిన కార్యము చేసితివి. శ్లాఘ్యమయిన యశస్సును బొందితివి. ఇంక రాజ్యమునందుఁ బట్టాభిషిక్తుఁడవై నెలకొని, నీవును దమ్ములును దీర్ఘాయుల రై సుఖముండుఁడు' అనెను. దశరథమహారా జిట్లు పలుకఁగా రాముఁ డంజలి గీలించి యతనితో 'తండ్రీ! నీవు సమస్తధర్మములను దెలిసినవాఁడవు. రాము నడవికిఁ బంపుదువేని, నిన్నును నీకొడుకునుగూడ దిగవిడుతు' నని కైకేయితో నీవు శపథము చేసితివే! కాఁబట్టి యిపుడా కైకేయియందును భరతునియందు ననుగ్రహము సేయుము. ప్రభూ! ఘోర మయినయాశాపము, కైకేయిని యామెపుత్త్రుఁ డగుభరతునిఁ దాఁకకుండునట్లు దయసేయుము' అనెను. అమ్మహారాజు తనయెదుట చేతులు మోడ్చి యున్న రాముని జూచి 'వల్లె' యని యంగీకరించి, లక్ష్మణుని మరలఁ గౌఁగిటంజేర్చి యతనితో 'నీవు రామునకును విదేహరాజసుతకు సీతకును భక్తితోడ శుశ్రూష సేసి నాకు మిక్కిలియునంతోషము గలిగించితివి. ధర్మమున కగుఫలము నీకుఁ గలిగినదయ్యె. ధర్మజ్ఞా! *రాముఁడు ప్రసన్నుండు కాఁగా నీకు ధర్మంబును భూమియందు విశాల మయినయశస్సును సుఖమును గొప్పతనమునుఁ గలుగును. సుమిత్రానందవర్ధనా! రామునకు శుశ్రూష సేయుచుండుము. దాన నీకు శుభం బగును. రాముఁడు సమస్తలోకములకును నెల్లప్పుడును, శుభము లాచరించుటయందే యాసక్తిగలవాఁడు. † ఈదేవేంద్రుఁడు మొద లగుమూఁడులోకములవారును సిద్ధులును మహర్షులును, మహాత్ముండును బురుషోత్తముండు నగురామునిఁ గొలిచి పూజించుచున్నారు. సౌమ్యా! సమస్తదేవతాంతర్యామియు వేదతాత్పర్యభూతము నై యగ్నీంద్రాదిరూపమున సర్వకర్మములచే నారాధ్యమై సాక్షాదుపనిషత్తులచేఁ దెలియందగి భక్తిశూన్యులకుఁ దెలియ నలవి గానిదై షడ్భావవికారరహిత మై యొప్పెడి యాబ్రహ్మమే యిట్లు రామరూపమున నవతరించినదని బ్రహ్మాదులు చెప్పుదురు. నీవు రామునకును వైదేహికి సీతకును భక్తితో శుశ్రూష సేయుటవలన ధర్మము నాచరించినవాఁడ వయితివి; విశాలమయిన కీర్తిని జెందితివి' అనెను. మహాబాహుండగు ధర్మాత్ముఁ డాదశరథుఁడు తనమ్రోల చేమోడ్చి నిలిచి యున్నలక్ష్మణున కవ్విధంబునం

* లక్ష్మణుఁగూడ విష్ణువవతారమని దశరథుఁ డెఱుఁగఁడు.

† ఇందు దశరథుఁడు రాముఁడు సర్వోత్తముఁ డని యింద్రాదిశిష్టులయాచారమునుబట్టి తెలుపుచున్నాఁడు.

జెప్పి యంత సీతాదేవిని జూచి శుభవచనమున 'సీతా! రాముఁడిప్పుడు నిన్ను 'పరిత్యజించినా'నని చెప్పినందులకై నీవు కోపము సేయరాదు. నీచరిత్రము పరిశుద్ధముగా నుండవలయునని రాముఁడు నీమేలుగోరి నీపరిశుద్ధత వెల్లడియగుటకై యిట్లు చేసినాఁడేకాని మఱేమి గాదు. సుభ్రూ! వెనిమిటికి శుశ్రూష సేయువిషయమునుగుఱించి నీ కుపదేశింపవలసినది లేదు. అయిన నేను మామనగుటచే చెప్పవలసినవాఁడను. కాన యవశ్యము చెప్పెదను. ఈరాముఁడె నీకు పరదైవము' అనెను.' దశరథుఁ డివ్విధమున పుత్త్రులగు రామలక్ష్మణులకును కోడలయిన సీతకును జెప్పి విమానంబుతోఁ దేజరిల్లుచు నింద్రలోకమునకుం బోయెను. ఇది నూటయిరువదిరెండవ సర్గము.

(దేవేంద్రుని ప్రసాదమువలన నిదురించి లేచినట్లు యుద్ధమృతు లయినవానరు లెల్ల లేచుట. దేవతలు స్వస్థానమునకుఁ బోవుట.)

దశరథుఁడు మహేంద్రవైభవమున మరలి దేవలోకమునకుఁ బోఁగానే, దేవేంద్రుఁడు మిక్కిలియు సంతుష్టుఁడై తనముంగల నంజలి గీలించి నిలుచున్న రామునిఁ జూచి 'రామా! పరంతపా!* మేము దశరథునిపుత్త్రకామేష్టికాలమున నొసంగినదర్శనము నీకు రావణవధ పర్యంతమగు ఫలము కలిగించినది. మేము మిక్కిలియు సంతోషించితిమి. అందువలనఁ బ్రత్యుపకారముగా నీవు మనమున నేమిగోరెదవో చెప్పుము' అనెను. ఇంద్రుఁ డిట్లు చెప్పఁగా, రాముఁడు తానును తమ్ముం డగులక్ష్మణుండును భార్యయగు సీతయుఁ జేతులుమోడ్చి 'సమస్తదేవాధిపతీ! మాటలాడువారలలో మేటీ! నీకు నాయందుఁ బ్రీతిగలిగినయెడల నేను గోరునది చెప్పెదను. నీవట్లుచేసి నీమాటను సత్యము గావించుకొనుము. నాకొఱకై పరాక్రమించి యుద్ధంబున మృతులై యమలోకమునకుఁ బోయినవానరు లందఱును మరల బ్రతికి లేచునట్లుగావింపుము. ఎవ్వరు నాకుఁ బ్రియము లయినకార్యములం దాసక్తులై మరణమునుగూడ లెక్కగొనక కావించి, కొడుకులను పెండ్లాలనుం బాసి మృతులయిరో యావానరులందఱును మరల బ్రతికి తమపుత్త్రకళత్త్రములతోఁ గూడునట్లు లనుగ్రహింపుము. ఈవరమే నేను వేఁడుచున్నాను. మానదా! వానరులును భల్లూకములు నెంతమాత్రమును బీడలేక, గాయములునులేక యెప్పటియట్లు బలపరాక్రమసంపన్నులై యుండఁగం జూడఁగోరుచున్నాను. వానరులుండు స్థలములందు కాలముగానియప్పుడుగూడ ముఖ్యము లయినఫలమూలములు గలుగవలయును. నదులు నిర్మలజలములతో నొప్పుచుండవలయును' అనెను. మహాత్ముం డారాముఁడు పలికినమాటను విని,

---

* నీవిప్పుడు మమ్ము దర్శించినది వ్యర్థముగారాదు. మేమును సంతోషించితిమి. కాన నీవు మనసునఁ గోరువర మమును ఇచ్చెదమని యర్థాంతరము.

దేవేంద్రుఁడు ప్రీతిసూచకంబగుమాటల 'నాయనా! రఘునందనా! చెల్లాచెదర
యిన కాలుసేతులు తోఁకలు మొదలగు నవయవముల నెప్పటిరూపుగాఁ జేర్చి లో
కాంతరగతు లయినవారిని మరలఁ దెచ్చి యిట్లు వానరాదుల బ్రతికింపవలసియున్నది
గాన నీ వడిగినయీవరము మిక్కిలియుఁగొప్పది. అయిన నేను మొదలొకటిచెప్పి మఱి
యొకటి రెండవతూరి యింతవఱకుఁ జెప్పినది లేదు. కాన నీవడిగినట్లు కాఁగలదు. రాక్ష
సులచే యుద్ధంబునఁ గాలుసేతులు తలలుదెగి హతులయిన కొండముచ్చులు నెలుఁగు
గొడ్డులును వానరులును మరల బ్రతికి లేవఁగలరు. వానరు లందఱు నేపీడయును గాయ
మును లేక యెప్పటిబలపరాక్రములు చక్కఁగాఁబడసి, నిదురించి మేలుకొన్నపుడు లేచు
నట్లు, లేవఁగలరు. అందఱును మిక్కిలియు మోదమునఁబొంది తనుస్నేహితులతోను
బంధువులతోను దాయాదులతోను స్వజనములతోను జేరి సుఖముండఁగలరు. మే
టివిలుకాఁడా! ఈవానరు లున్నస్థలములందుఁగూడ, అకాలమునందును వృక్షము
లు నానావిధపుష్పములచే పలువన్నెలు గులుకుచు మంచిపండ్లునుం గలిగియుండఁ
గలవు. నదులు నిర్మలజలములు గలిగియుండఁగలవు. మునుపు గాయములుపడిన
యంగములతోఁ గూడియుండినవానరులందఱును మరల నవయవములందు గాయము
లు లేక యుందురు', అనెను. అంత మృతు లయినవానరవీరు లందఱును నిదురించి
లేచినట్లు బ్రతికి లేచిరి. మృతులు గాకుండినవానరులందఱును చచ్చినవారు మరల లే
చుటను జూచి 'ఇదేమివింత' యని యాశ్చర్యమునొందిరి. మరల బ్రతికినవానరులం
దఱును లేచివచ్చి రామునకు నమస్కారము గావించిరి. ఆదేవోత్తములందఱును
అట్లు రాముఁడు సమస్తాభీష్టంబులనొంది యలరుచుండుటను గాంచి, స్తోత్రార్హుండగు
నతనిని మొదట స్తుతించి, యంతలక్ష్మణుఁడు వినుచుండ నతనితో 'వీరా! పరంతపా!
నీవిచటనుండి యయోధ్యకుఁబొమ్ము. ఈవానరులను వారివారినెలవులకు వీడ్కొలుపు
ము. నీయం దెంతయు ననురాగముగలిగి, మిక్కిలి తపస్సంపన్నయై యున్న యీసీత
పడిన యిడుమలను దలంపఁగా జాలిగలుగుచున్నది. కాన యీదేవి నుపలాలింపుము.
నీతల్లులనందఱను, మహాత్ముండగు శత్రుఘ్నుని,నిన్నుఁ బాసినశోకముచేఁ దాపసవ్రత
ముదాల్చియున్ననీతమ్ముని భరతునిని జూడుము. నీవు పట్టాభిషేకము చేసికొని పురజ
నులనందఱను మిక్కిలియు సంతోషపెట్టుము' అనిరి.ఇట్లు చెప్పి దేవతలు రామలక్ష్మణు
లయొద్ద సెలవుపుచ్చుకొని సంతుష్టులై సూర్యునివలెఁ బ్రకాశించుచున్న విమానము
లనారోహించి *దేవలోకమునకుం బోయిరి. రాముఁడు, లక్ష్మణుండును దానును,ఆదే
వోత్తములకందఱకును నమస్కరించి యపుడు వానరులనందఱను వీడుఁబట్లు విశ్ర
మించున ట్లాజ్ఞాపించెను. అంత విజయమునొంది కీర్తి గాంచిన యమ్మహావానరసైన్య
ము మిక్కిలియు సంతుష్టినొందె. రామలక్ష్మణులపాలనము క్రింద శాంతిసొంపునం

---

* ఇట ప్రథమయందు రావణసంస్కారము జరుగఁగా ద్వితీయయందు విభీషణాభిషేకమును
సీతాప్రాప్తియును దేవతలను బంపుటయుఁ దెలియునది.

దళ్కొత్తుచు చంద్రునిచేఁ బ్రకాశించుశుక్లపక్షరాత్రివలె నెంతయు విలసిల్లు చుం డెను. ఇది నూటయిరువదిమూఁడవసర్గము.

విభీషణుఁడు రాముని మంగళస్నానము సేయఁ బ్రార్థింపఁగా భరతుండులేక తానట్లు చేయనని చెప్పుట. విభీషణుఁడు రెండుమూఁడు దినములు లంక నుండునట్లు ప్రార్థించినను రాముఁడు భరతునిఁ జూడఁగోరి యట్లు సేయ నొల్లక పుష్పక విమానమును దేరఁబంచుట.

బ్రహ్మాదిదేవతలు వచ్చి పోయినపిదప, ఆనాఁటిరాత్రియంతయు నరిందముఁ డగు రాముఁడు లంకయందుండి సుఖముగా నిదురించి వేకువను మేలుకొనియుం డఁగా, విభీషణుం డంజలి గీలించి జయం బడిగి యతనితో 'రామా! స్నానంబు నకుఁ దగిన జలములు, కుంకుమ మొదలయిన మైపూఁతలు, వస్త్రములు భూషణ ములు, దివ్యంబులగు చందనములు, నానావిధములయిన పుష్పమాలికలునుం దెచ్చి యున్నాను. చక్కఁగా నలంకరింప నలంతు లయి తామరలవంటి కన్నుంగవలఁ జెన్నారుచున్న యీకాంతలును వచ్చియున్నారు. నిన్ను నుపచారముతోఁ జక్కఁగా స్నానము సేయింతురు. మఱెందులకుఁ గాదు; నన్ననుగ్రహించుటకై నీవు వాని నం తయుఁ బ్రతిగ్రహింపుము' అనెను. విభీషణుఁ డిట్లుచెప్పఁగా రాముఁడతనితో 'సుగ్రీ వుఁడు మొద లగువానరవీరులనే నీవు స్నానార్థము పిలువుము. ఏలనఁగా, మహా బాహుఁ డాభరతుఁడు నామననుననే యున్నాఁడు. వాఁడు సుకుమారుఁడు; మఱి యుఁ బసివాఁడు; కామ సుఖములకే తగినవాఁడయ్యు నాకొఱకు, నన్ను మరల లభిం చుకొఱకు, తాపసధర్మము నాచరించుటవలననే కష్టపడుచున్నాఁడు. మఱి పదు నాలుగేండ్లు నిండఁగానే రానియెడల నగ్గిలోఁబడుదునని ప్రతిజ్ఞచేసియు నున్నాఁడు; ప్రతిజ్ఞను దప్పువాఁడు గాఁడు. అట్టివాఁడు నాకు స్నానమున కుపకరణము గనుక నతఁడులేక స్నానమెట్లు సేయఁగూడును. కైకకడుపునం బుట్టినందులకే యాయువ వలన దుఃఖను పడియున్నాఁడు. ఇఁక నేనుగూడ నాదుఃఖము పెట్టవలయునా? నన్నుఁబాసినందున బహువ్రతధర్మము లతఁ డాచరించుచుండఁగా నేనుమాత్రము వ్రతమువిడుచుట యుక్తమగునా? మఱియు రాజయిన నేను లేనపుడు రాజ్యమును జక్కఁగ జరిపినవాఁడు. అట్టివాఁడు దగ్గఱలేనందున నాకు మొదలు స్నానమె యంత గా మెచ్చు గాకున్నది. ఇఁక వస్త్రాభరణములసంగతి చెప్పనేల? ఇది యే కదా య యోధ్యకుఁ బోవుమార్గము. ఇది చాలదూరమగుటచేఁ బోవుటకు మిక్కిలియుఁ గ ష్టమైనది. ఈమార్గముననే పట్టి నేనిప్పుడే శీఘ్రముగా నాపట్టణమునకుఁ బోయెదను' అనెను. రాముఁ డిట్లుచెప్పఁగా విభీషణుండు మరల నతనితో 'రాజకుమారా! అన ధృశపరాక్రమశాలీ! ఒకదినములోపల నిన్నాయయోధ్యాపురమును జేర్చెదను. నీకు శుభంబగుఁగాక. సూర్యప్రకాశంబగు పుష్పక మను విమానమున్నది. అది నా

యన్నదైన కుబేరునిది. దానిని రావణుఁడు బలవంతముగాఁ బట్టి తెచ్చుకొనెను. దొంగిలించి కాదు; కుబేరుని యుద్ధంబున జయించి తెచ్చుకొన్నాఁడు. మిక్కిలి యుత్తమంబయిన యది దివ్యమయినది గాన తలఁచినచోటికి తనంతటఁ బోవంగలదు. ఇయ్యది యిప్పుడు కుబేరుఁడు వచ్చినను నియ్యక నీవెక్కి పోవుటకొఱకై పదిలముగా నిలుపుకొనియున్నాను. మేఘమువలె నాకాశమున మహావేగమున సంచరించునట్టి యాపుష్పకవిమాన మిదె యిచటనున్నది. నీ వావిమానము నెక్కి యేతుందుడుకు లేక యయోధ్యను జేరంగలవు. రామా! స్నానాదులు గయికొనకున్నఁ బోయెఁగాక. నీవు ప్రాజ్ఞుండవు; కాన నీకుఁ దెలియని దేదియు లేదు. నీకు నాయందనుగ్రహ ముంపఁదగునేని, నాభక్త్యాదిగుణములు నీమనంబునకు వచ్చునేని, నాయందు నీకు నెయ్యము గలదేని, రెండొకదినములు నీవును నీతమ్ముఁడు లక్ష్మణుఁడును నీభార్య సీతయు నిందు నిలువుఁడు. నేను సమస్తకామితపదార్థములఁ గావించుపూజలం గయికొని యటుపిమ్మటఁ బోదువు. నీకు వలయుపూజ మునుపే సమకట్టియున్నాను. క్రొత్తగా సమకట్టఁబూని జాగుసేయుట లేదు; కనుక ఆయితముగా సమకట్టి యున్న నాసత్కారమును నేనత్యంతప్రీతిని జేయఁగా నీవు నీసైన్యమువారును నీమిత్రగణమును,నంతకుఁ బ్రతిగ్రహింపుఁడు. నిర్బంధము సేసెదనని తలంపకుము. నామాటతప్పక విందువనెడినమ్మకమువలనను, నాయందు నీవు గావించులాలనమువలనను, నీయందు నాకుఁగల భక్తిబలమువలనను, నీభృత్యుఁడగు నేనిట్లుగావింపఁ బ్రార్థించుచున్నానింతే కాని నిన్నాజ్ఞాపించువాఁడను గాను జుమీ' అనెను. విభీషణుఁ డిట్లు చెప్పఁగా నంత రాముఁడు, రాక్షసులును వానరులును నందఱును వినుచుండఁగా నతనితో 'సౌమ్యా! పరంతపా! నీవు గావించినసాహాయ్యము, యుద్ధంబున నీవు నెఱపినపౌరుషములు, ఉత్తమమయిన నీభక్తి, వీనిచేత నే నన్నివిధములఁ బూజితుండనయితిని. రాక్షసేశ్వరా! నీవు చెప్పినయీమాటను నేను జేయకుండనుజుమీ. అయినను నన్ను వనమునుండి మరల్చి పట్టణమునకుఁ గొనిపోవుటకై యెవ్వఁడు చిత్రకూటపర్వతమునకు వచ్చెనో, ఎవ్వండు పట్టాభిషేకము సేసికొమ్మని తల నేల సోఁక మ్రొక్కి యెంత బతిమాలుకొన్నను నే నట్లుచేయనయితినో, అట్టిపరమభక్తుని నాతమ్ముని భరతునిఁ గన్నారంజూచుటకు నామనను తొందరపడుచున్నది. భరతునే కాదు, కౌసల్యను, సుమిత్రను, కీర్తిమతి యగుకైకేయిని, వసిష్ఠాదిగురువులను స్నేహితులను పురజనులను వారిపుత్రులనుం జూడవలయునని నామనస్సు తుకతుకలాడుచున్నది. రాక్షసేశ్వరా! నాకొఱకు శీఘ్రము పుష్పకవిమానమును రావింపుము. రెండుమూఁడుదినము లుండమన్నను, పదునాలుగేండ్ల వనవాసము నిర్వర్తించి వచ్చినపని తీర్చి యయినపిదప, పదునాలుగేండ్లకు రానిచో, యగ్నిం బ్రవేశింతునని ప్రతినచేసి యుండునపుడు, నేనిచటనుండ మనసెట్లు వచ్చును? సౌమ్యా! విభీషణా! నాకనుజ్ఞయిమ్ము. ఈవిమానము నొసఁగుటచేత నే పూజితుండనయితిని. నీవు కోపము సేయవలదు. నాకు శీఘ్రము

గాఁబోవ ననుమతియొసంగుము' అనెను. రాముఁడు చెప్పినదివిని, రాక్షసేశ్వరుఁడగు విభీషణుఁడు పోయి శీఘ్రముగా నావిమానమును దీసికొని మరలివచ్చెను. అది బంగారుమయము లయినచిత్రావయవములును వైడూర్యమయము లయినవేదికలును గలిగియుండెను. దానిలోపల మంటపములు పెక్కులు వ్యాపించియుండెను. అది యంతటను వెండివలె నతివిశదకాంతి నొప్పుచు తెల్లనిపతాకలచేతను ధ్వజములచేతను జక్కఁగా నలంకృతమై యుండెను. అందు మఱియు బంగారుమయములైన యవాంతర రాజగృహములును వన్నెఁజూపుచుండెను. వ్రేలాడుచున్న బంగారుపద్మములును దానికొక చెలువు గూర్చుచుండెను. దానికి ముత్తెములచే నిర్మింపఁబడిన కిటికీలుండెను. మఱియు దానినలుప్రక్కల చిఱుగంటల సమూహములును కోణములందు పెద్దగంటలును వ్యాపించియుండుటచే నది యన్నిప్రక్కల శ్రావ్యముగా శబ్దించుచుండెను. అది విశ్వకర్మచే నిర్మితము. మేరుశిఖరాకారమునం జూపట్టుచు, ముత్తెములవలెను రజతమువలెను నచ్ఛమయిన పెక్కుహర్మ్యములచే పొలుపు గులుకుచు, పటికమయము లైన చిత్రావయవములు గలప్రదేశములతోను, వైడూర్యమయములై మేలయినపఱపులు గలిగి మిక్కిలి వెలపొడుగయియున్న యుత్తమాసనములతోను గూడియుండెను. అది యెట్టివారికిని జెనకరానిదై మనోవేగమున నొప్పుచుండెను. అట్లు విభీషణుఁ డావిమానమును దెచ్చి రామునకు సమర్పించి యచ్చో నిలుచుండెను. ఇది నూటయిరువదినాలుగవసర్గము.

రామునియాజ్ఞచే విభీషణుఁడు సమస్తవానరులను బహుమానించుట. శ్రీరాముఁడు తనతోఁ గోరినసుగ్రీవాది వానరులతోను విభీషణునితోను సతనిమంత్రులతోను సీతాలక్ష్మణులతోను బుష్పక మారోహించి యయోధ్యకుఁ బయనమగుట.

విభీషణుండు పుష్పమాలికాలంకృత మగునాపుష్పకవిమానము వచ్చి యుండుటను రామునకుం జూపి సమీపంబున నిలుచుండి యతనితో నిట్లనియె. రాక్షసేశ్వరుం డతఁడు చేతులు మోడ్చి, వినయవినమితాంగుండై యాదరాతిశయంబువలన వేగపాటు గదుర రాముని 'ఇంక నేనేమి సేయవలయును' అని యడిగెను. మహాతేజుం డగురాముం డాలోచించి లక్ష్మణుఁడు మాత్రము దాపున వినుచుండఁగా, నతని సమ్మతిమీఁద స్నేహంబు దొలఁకాడ నవ్విభీషణునితో 'విభీషణా! కష్టసాధ్యమగు నీకార్యమునంతయుఁ దగినట్లు పాటుపడి సాధించినవారలు వానరులు. కావున నీవు నానావిధములైన రత్నములను వస్త్రములను ఆభరణములను నొసంగి వీరిని సత్కరింపుము. రాక్షసేశ్వరా! ఇదివఱకు దేవతలకుంగూడ జయింపరాకుండినయీలంకను యుద్ధంబున వెనుదీయక ప్రాణభయంబును దిగవిడిచి యుబ్బున వీరు సాహాయ్యపడుట

చేత మనము జయించితిమిగాని వేఱుగాదు. వీరివలననే నీకు లంకారాజ్యప్రాప్తియు ననఁదగు. అట్లు కార్యమును సాధించినయీవానరుల నందఱను బూజింపుము. ధనముల ను రత్నములనునొసంగి వీరు పడిన ప్రయాసమును సఫలముగావింపుము. మానదా! నీవు కృతజ్ఞత గలిగి సమ్మానార్హులగునీవానరవీరుల నిట్లు సమ్మానింతువేని వీరందఱును పూర్ణమనోరథులై సుఖముండుదురు. అట్లుగావింతువేని, నీవు త్యాగశీలుండవనియు త్యాగములచే మిత్రుల సంగ్రహించుకొనువాఁడవనియు, దయావంతుఁడవనియు త్యాగంబువలన యశస్సంపన్నుఁడవనియు నిన్నందఱును దలంతురు. కావుననే యిది నీకుఁ దెలుపుచున్నానింతేకాని యాజ్ఞాపింపలేదు. తమకు స్వామి యయ్యును, ప్రీతికరములయిన యౌదార్యాదిగుణము లొక్కటియు లేనివాఁడయి, దయలేక క్రోధమునే యవలంబించి హింసించుచుండునట్టిరాజును సైనికులు విసుగునంజేసి యుద్ధకాలమున దిగవిడుతురు. కాన వారిని సమ్మానించుటయే మంచిది' అనెను. రాముండిట్లు చెప్పఁగా, విభీషణుఁడావానరుల నందఱను వారివారియంతరువులకుం దగినట్లు మణులను ధనములను భాగములు సేసి యొసంగి సమ్మానించెను. అంత నవ్వానరయూథపతులందఱును రత్నవస్త్రాదులచేత సమ్మానితులగుటను జూచి రాముండు యశస్సంపన్నురాలగుసీతను లజ్జించుచుండఁగా *నంకంబునం జేకొని, పరాక్రమవంతుఁడగుతమ్ముఁడు లక్ష్మణుఁడు తనవిలుగొని వెనువెంట నెక్క, నుత్తమం బగునాపుష్పకవిమానము నారోహించెను. రాముఁడట్లు విమానము నారోహించుటయేకాక సమస్తవానరులను మహావీర్యశాలియగు సుగ్రీవుని, విభీషణునిం జూచి సమ్మానపూర్వకముగా 'వానరోత్తములారా! మీరలు మీమిత్రుండ నగునాయీకార్యమును గావించితిరి. మీకందఱకును సెలవొసంగితిని. మీయిష్టముచొప్పున మీమీనెలవులకుఁ బొండు. పరంతపా! సుగ్రీవా! మంచిహృదయము గలచెలికాఁడేమి చేయవలయునో నీవు, అధర్మమునకు వెఱచి, అది యంతయు నాకుఁ జేసితివి. ఇఁక నీవు నీసేనలతోఁగూడి శీఘ్రంబుగాఁ గిష్కింధకుం బోయి సుఖముండుము. విభీషణా! †నీవు నేనొసంగిననీసొంతరాజ్యము ననుభవించుచు రావణునివలె నితరరాజ్యముల నాక్రమింపక లంకయందు సుఖముగానుండుము. అప్పుడు దేవేంద్రసహితముగా దేవతలెత్తివచ్చినను నిన్నుఁ జెనక నలవిగాదు. నేనింక నాతండ్రిరాజధాని యగునయోధ్యకుఁ బోయెదను. మీరు నా కనుమతియొసంగఁ గోరెదను. మిమ్మందఱను వీడ్కొనుచున్నాను' అనెను. రాముఁ డిట్లు చెప్పఁగా మహాబలశాలు రగునాసుగ్రీవాదివానరులును, రాక్షసుం డగువిభీషణుఁడును నంజలిగీలించి రామునిఁ జూచి 'మే మయోధ్యకు రాఁగోరుచున్నాము. దేవర మమ్మునెల్లఁ దోడ్కొనిపోవలయును. అచ్చట జనపదముల కెంతమాత్రము బాధ

* రాముఁడు వేఱొక స్త్రీసహాయము లేనందున సీతను తొడయం దిడుకొనె నని తెలియునది.

† దీనింబట్టి జనస్థానము విడిచి యంపలి కాఁపుపెట్టియున్నవారిని రప్పించుకొను మనియు సూచితము.

లేకుండునట్లు వనములందును నగరములందును నెచ్చరికతో మెలఁగెదము. రాజకుమారా! నీవుపట్టాభిషేకజలంబులం దోఁగుటనుజూచి కౌసల్యాదేవికి నమస్కరించి, త్వరితముగానే మామాగృహములను చేరెదము' అనిరి. అట్లు విభీషణుండును సుగ్రీవాదివానరులును బ్రార్థింపఁగా, ధర్మాత్ముండును శ్రీమంతుఁడు నగురాముఁడు వారల నందఱను జూచి 'నేను భరతాదు లయిననాబంధువులను, మిమ్ము నందఱనుం గూడి యయోధ్యాపురమును బ్రవేశించి ప్రీతిం బొందఁగంటిని; కానయిది* ప్రియమునకంటె మఱిమఱిప్రియము ను నాకులభించినది. సుగ్రీవా! నీవును వానరులును శీఘ్రముగాఁ బుష్పకము నారోహింపుఁడు. రాక్షసేంద్రా! విభీషణా! నీమంత్రులతోడ నీవును శీఘ్రముగ నారోహింపుము' అనెను. అంత శీఘ్రగమనంబును దివ్యంబు నగునాపుష్పకవిమానమును సుగ్రీవుఁడును వానరసైన్యమును వేవేగ నారోహించిరి; విభీషణుండును నతనిమంత్రులును నారోహించిరి. వారందఱు నారోహింపఁగానే కుబేరుని మేటివాహన మయినయవ్విమానము రాముడు బయలుదేఱున ట్లనుజ్ఞసేయఁగా నాకాశమున కెగసెను. రాముఁడు హంసప్రతిమలతోఁగూడి ప్రకాశించుచున్నయావిమానమున మిక్కిలి సంతుష్టుండై దేవాదులు గొనియాడుచుండ కుబేరునియట్లు చూపట్టుచుం బోయెను. ఆపుష్పకము దేవనిర్మితమై యిఱుకటమునొందక యెందఱికేని యెడము గలిగి యుండునది గాన మహాబలశాలు రగునవ్వానరులును రాక్షసులును నందఱును నెంతమాత్రము నిఱుకు లేక హాయిగా నందుఁ గూర్చుండి యుండిరి. ఇది నూటయిరువదియైదవసర్గము.

రాముఁడు సీతకు మార్గమునందు లంకాపురి మొదలుగా నయోధ్యవఱకుఁ గలయయ్యైవిశేషములను జెప్పుట. రాముఁడు కిష్కింధకుఁ బోయినపుడు సీతాప్రార్థనమున సుగ్రీవాదివానరపత్నులను బుష్పకమెక్కించి యందఱితోఁ గూడ భరద్వాజాశ్రమమును జేరుట.

అత్యుత్తమ మయినయాపుష్పకవిమానము రాముఁ డనుజ్ఞ యియ్యఁగానే, వాయువుచేఁ జిమ్మంబడినమహామేఘముంబోలె నాకాశమున కతివేగమున నుద్గమించి పోయెను. అంత రఘునందనుండు రాఘుఁడు నలుదిక్కులను జూపు నిగిడించి చందురునివంటిముద్దు నెమ్మొగంబు గల రాచకుమారిని సీతను జూచి 'సీతా! కైలాసశిఖ

* 'ప్రియాత్ప్రియతరం లబ్ధం యదహంససుహృజ్జనః । సర్వైర్భవద్భిస్సహితః ప్రీతింలప్స్యే పురీంగతః' అనిమూలము. సీతాలాభము ప్రియము, భరతదర్శనము ప్రియాత్ప్రియము—ప్రియమునకంటె ప్రియము. మీతోఁగూడి పురమును బ్రవేశించుట 'ప్రియాత్ ప్రియతరము—ప్రియమైనదానికంటె మఱి మఱి ప్రియమైనదని భావము.

రముం బోలుత్రికూటశిఖరముపయి నున్నలంకాపురిని జూడుము. ఇది విశ్వకర్మచే నిర్మింపఁబడినది. సీతా! ఇదిగో యిటుచూడు. కండలు నెత్తురును రొంపిగొనియున్న యుద్ధభూమి యిది. వానరులును రాక్షసులును బెక్కండ్రిందు హతులయిరి. వాలుఁగంటీ! బ్రహ్మవలన వరమువడసి,లోకములనెల్ల కలంచి నలంచు చుండినరాక్షసరాజు రావణుఁడు నీనిమిత్తము నాచే హతుండై యిచట నీలుగాఁబడియున్నాఁడు చూడుము. ఈచోట కుంభకర్ణుఁడు నాచేత హతుఁడయ్యె.ఇచటఁ బ్రహస్తుఁ డనురాక్షసుఁడు గూలెను. ఇచట హనుమంతునిచే ధూమ్రాక్షుఁడు గెడసెను. లెస్సఁజూడుము. * మహాత్ముఁ డగుసుషేణునిచే నిచట విద్యున్మాలి హతుఁడయ్యెను. ఈచోట లక్ష్మణుఁడు రావణకుమారుని నింద్రజితుని వధించెను. ఈస్థలమున నంగదుఁడు వికటుం డను రాక్షసుని వధించెను. ఇచట దుర్ధర్షుం డగువిరూపాక్షుండును, ఇచట మహోదరుఁడును మహాపార్శ్వుఁడును,ఇచట నకంపనుఁడు,నిచ్చట నిచ్చట బలవంతు లయినయితరరాక్షసులు కొందఱును వధింపఁబడిరి.రావణునిభార్య యగుమండోదరి, వేగురుసవతులు కన్నులనీళ్లు గార్చుచు చుట్టియుండఁగా మృతుం డయినరావణుంగూర్చి ప్రలాపించినస్థలమిది.సుందరవదనా! ఇదిగో నీసముద్రము రేవును జూడుము.ఇచట మేము సముద్రము దాఁటి యానాఁటిరాత్రి యంతయు నివసించియుంటిమి.విశాలాక్షీ!సగరునిచేఁ ద్రవ్వింపఁబడినయీసముద్రమునందు నీనిమిత్తమై నలునిచే నేను గట్టించినసేతువిదె చూడుము. ఇది యెంతయు దుష్కరమయినది. సీతా! క్షోభ పెట్టనలవిగానిదియు వరుణునికి స్థానమయినదియు నగుసముద్రమును జూడుము. ఇందు నడుమదీవులు మొదలగు నేలపట్లు లేవు. ఇది కరుళ్లచేఁగర్జిల్లుచు ముత్తెపుఁజిప్పలచే నొప్పుచున్నది. సీతా!హనుమంతుఁడు సముద్రమును దాఁటినపుడు,అతఁడు విశ్రమించుటకై సముద్రమును భేదించి లేచినయీబంగారుమయ మయినమేటిపర్వతమును మైనాకమును జూడుము.సముద్రమధ్యమున † సేతువుపయి,నీస్థలంబున వానర సేనయంతయు విడిసియుండినది. మహాత్ముం డగుసముద్రుని యందు సేతుబంధ మనెడియీ రేవునుజూపట్టుచున్నది చూడు. ఇది ముల్లోకముల చేతను బూజింపఁదగినది. ఇది పరమపావనమై సమస్తపాపముల నాశముచేయుచుండునది కాఁగలదు.‡ఇట సముద్రజలాధిష్ఠాతయగు సముద్ర

* సుషేణుఁడు విద్యున్మాలిని వధించుటయు అంగదుఁడు వికటుని వధించుటయు పూర్వము చెప్పఁబడకున్నను ఇప్పుడు అనువదించుటచే జరిగినట్లు తెలియునది.

† ఇంతకుపూర్వము సేతువు దక్షిణకోటినిజెప్పి యిచట నుత్తరకోటిని జెప్పుట తెలియునది.

‡ ఇందులకు 'అత్రపూర్వం మహాదేవః ప్రసాద మకరోత్ప్రభుః' అని మూలము. 'ఇచట పూర్వము, ప్రభుండగు మహాదేవుఁడు నాయం దనుగ్రహముచేసెను' అని సామాన్యముగా నర్థము. ఇట మహాదేవుఁడనఁగా రుద్రుండని కొందఱుచెప్పెదరు గాని యది సరికాదు. పూర్వము రుద్రుఁడు రామునికి ప్రసాదముచేసినట్లు చెప్పఁబడలేదు. పూర్వము చెప్పఁబడినవియేకదా మరల నిట అనువదింపఁబడినవి. కాన చెప్పఁబడని రుద్రుని నిట చెప్పుట దగదు. అయినను 'అంగదుఁడు వికటునిఁ జంపినది పూ

రాజు తన్ను శోషింపఁజేయుటకై కుపితుఁడగు నాకు ప్రసన్నుఁడయ్యెను. రాక్షసరాజగువిభీషణుఁడు నాకడకు వచ్చిచేరినచోటిది. సీతా! ఇదిగో! చిత్రములయినయడవులు

ర్వము చెప్పఁబడకున్నను ఇట అనువాదముచే (మరల చెప్పుటచే) సిద్ధించినట్లు రుద్రుఁడు ప్రసాదము సేయుటయు పూర్వము చెప్పఁబడకున్నను నిప్పటియనువాదముచే సిద్ధించెననఁగూడదా? యనవచ్చును. కాని యిది సరికాదు. అందు విరోధమేమియులేదు. అట్లె యిందును విరోధములే దనరాదు. ఇందు విరోధము చూపట్టుచున్నది. ఎట్లనఁగా, రుద్రుఁడు చూపినప్రసాదము సేతువును నిర్మించుకాలమందా? లేక మరల వచ్చుకాలమందా? సేతువు నిర్మించునప్పుడన్నచో పూర్వమే సిద్ధించి యున్నసముద్రప్రసాదముచేతనే యది (సేతునిర్మాణము) కలుగుచున్నది గాన యందులకావశ్యకముగాదు. మఱియిప్పుడు రావణవధము మొదలయిన కారణము లేమియు లేవు గాన యందులకై ప్రసాదము చూపవలసినదియులేదు. మహాదేవుఁడను పేరునకు సముద్రప్రసాదమని శ్రుతిచే బాధించుటకు యుక్తమైయున్నది. కాన సముద్రము నిర్మించునపుడనుట చెల్లదు. మరలివచ్చునపు డన్నచో 'అత్రపూర్వమ్' అను పూర్వశబ్దమున కది విరోధించును. 'పూర్వ'మనుటకు పూర్వకల్పమని యర్థముఁజెప్పుటయుఁ దగదు. 'ఆత్మానం మానుషంమన్యే' అని తనపరత్వమును మఱుఁగుచేసి మనుష్యునిఁగాఁ జెప్పుకొన్నవాఁడు సుగ్రీవాదుల యెదుట తనవిష్ణ్వవతారమును తెలుపునట్టి పూర్వవృత్తమును 'పూర్వకల్ప' మని చెప్పి వెలిపుచ్చెననుట ఉచితముగాదు. పూర్వకల్పమందలిసేతు వున్నయెడల మరలదానిని నిర్మించుటయు వ్యర్థము. 'అత్ర' అనుపదము పూర్వశ్లోకమునఁ జెప్పఁబడినదియు నలునిచేఁ జేయింపఁబడినదియునగు సేతువునే పరామర్శించుచున్నదిగాని పూర్వకల్పసేతువును గాదు. అప్పటిసేతు వుండినను అది యితరములయిన పిమ్మటివానిచే అంతరితముకాఁగూడును. పురాణాంతరముల ననుసరించి యీయర్థమిట యనుసంధించుట తగదు. ఎట్లన కూర్మపురాణమున 'సేతుమధ్యే మహాదేవ మీశానం కృత్తివాససం। స్థాపయామాస వై లింగం పూజయామాస రాఘవః। తస్యదేవో మహాదేవః పార్వత్యా సహశంకరః। ప్రత్యక్షమేవ భగవాన్ దత్తవాన్ వరముత్తమమ్। యే త్వయా స్థాపితం లిఙ్గం ద్రక్ష్యన్తీహ ద్విజాతయః। మహాపాతకసంయుక్తాస్తేషాం పాపం వినశ్యతి। అన్యానిచైవ పాపాని తీరే తత్రమహోదధేః। దర్శనాదేవ లిఙ్గస్య నాశంయాతి నసంశయః। యావత్ స్థాస్యన్తి తరవో యావదేవచ మేదినీ। యావత్సేతుశ్చ తావచ్చ స్థాస్యామ్యత్ర తిరోహితః। స్నానం దానం జపశ్శ్రాద్ధం భవిష్య త్యక్షయంతతః। స్మరణాదేవ లిఙ్గస్య దినపాపం ప్రణశ్యతి। ఇత్యుక్త్వా భగవాన్ వాచం పరిష్వజ్యచ రాఘవమ్। సనందసగణోరుద్ర స్తత్రైవాన్తరధీయత' అని యిందు సేతుమధ్యమున రాముఁడు శివుని లింగరూపమునస్థాపించి పూజించినట్లును శివుఁడు పార్వతీసహితుఁడై రామునకు ప్రత్యక్షమై యతఁడు స్థాపించినలింగమును దర్శించుద్విజులకెల్ల పాపములు నశించుననియు, సముద్రతీరమునం దాలింగమును దర్శించినమాత్రనే యితరపాపములును నశించుననియు, వృక్షములు భూమియు సేతువునుండువఱకు తానందు నుండునట్లును, అచట స్నానాదానాదు లక్షయముగా జరుగుననియు, లింగమును స్మరించినమాత్రముననే పాపముపోవుననియుఁ జెప్పి రామునిఁ గౌఁగిలించి సపరివారముగాఁ బోయెనని యున్నది. పాద్మపురాణమందును, రాముఁడు పుష్పకమునుండి దిగి శివునిం బ్రతిష్ఠించినాఁడనియు నతఁడతనికిఁ బ్రసన్నుఁడయ్యెననియుఁ జెప్పఁబడియున్నది. ఇట్టి పురాణవచనములచొప్పున ఈశ్లోకము లింగప్రతిష్ఠను దెలుపుచున్నది అని చెప్పవచ్చును. కాని యిందులకు దోషము విస్తరించియున్నది గాన యిది చెల్లదు. ఇతిహాసము ఎక్కువగా పరిగ్రహింపఁబడుచున్నది. మఱి యందు గ్రంథము సౌష్ఠవముగలిగియుండును. 'ఇతిహాసపురాణ పంచమమ్' ఇత్యాదులందు 'ఇతి

గలిగి,సుందరముగా సుగ్రీవునిపట్టణము కిష్కింధ కానఁబడుచున్నది చూడు. ఇచ్చట నే నేను వాలిని వధించితిని' అనెను. అంత, సీత, పూర్వము వాలిచే పాలితమయిన కిష్కింధాపురమును జూచి, సుగ్రీవాదులసమక్ష మగుటం జేసి ప్రణయముతో భయంబును గూడికొన రామునితో సవినయవాక్యమున 'అనఘా! రాజా! తార మొద లయినసుగ్రీవుని ప్రియభార్యలను నితర లయినవానరోత్తములభార్యలనుం బిలుచుకొనియే, నీవును నేనును రాజధాని యగునయోధ్యకుఁ బోవలయు నని కోరుచున్నాను' అనెను. సీత యిట్లడుగఁగా రాముం డట్లె యగుఁగాక యని యాబిడకు బదులుచెప్పి కిష్కింధను జేరి విమానమును గ్రింద నిలిపి సుగ్రీవునిఁ జూచి'వానరసింహమా! సీతకుఁగా వానరోత్తములందఱితోను, తమతమభార్యలతోఁగూడ నందఱు నయోధ్యకు రావలయునని చెప్పుము. మహాబలా! వానరేశ్వరా! అట్లె నీవును భార్యల నందఱినుం దీసికొనిరమ్ము. జాగుపలదు.త్వరితముగాఁ బోవలయును' అనెను.అపారతేజుం డగురాముం డట్లు శ్రీమంతుఁడగువానరేశ్వరునకు సుగ్రీవునకును నతనిం బరివేష్టించి యున్నసమస్తవానరులకును జెప్పెను. సుగ్రీవుండు నంతఃపురమునకు శీఘ్రముగాఁ బోయి తారనుజూచి,' ప్రియురాలా!నీవును మహాపరాక్రము లగునితరవానరుల భార్యలును నయోధ్యకురావలయునని సీతాదేవి గోరుటచే రాముఁడామెకు ప్రీతి గావింపఁగోరి యట్లే యందఱును రావలయుననియాజ్ఞాపించెను. కాన జాగుపలదు. వానరకాంతల నందఱిను బిలుచుకొనిపోవుదము. అయోధ్యానగరమును జూచి దశరథమహారాజుభార్యల నందఱిను సందర్శించివత్తము' అనెను. సుగ్రీవుఁడుచెప్పినదివిని, సమస్తావయవములను భూషణముల నలంకరించుకొనియున్నతార,వానరకాంతలనందఱిను బిలిచి'మీరు మీమీభర్తలతో నయోధ్యకు రావలయు నని సుగ్రీవుఁడానతిచ్చెను.మీరు నాతోఁగూడ నయోధ్యకువచ్చి యందలివిశేషములను జూచుటవలన నాకు సంతోషము గావింపవలయు. పౌరులును జానపదులు నెదుర్కొన వారింగూడి రాముఁడు పేరోలగమున నయోధ్యాపురమును బ్రవేశించుటను, దశరథమహారాజుభార్య లంద

హాస'శబ్దము అధికాక్షరముగానుండుటచే ఉత్తరపదముగా నుండవలసియుండఁగా పూర్వపదముగాప్రయోగింపఁబడుటంబట్టి పూజ్యత్వమును చూపుచున్నది. కాఁబట్టి యదిపురాణమునకంటె గొప్పదియగును. మఱియు,'వేదఃప్రాచేతసాదాసీత్సాక్షాద్రామాయణాత్మనా' అని వేదమయమని చెప్పుటచేతను చతుర్ముఖవరప్రదాన మూలమగుటచేతను రామాయణము పురాణములకంటెను ప్రబలమైనది. కాన దానితో విరోధించినపుడు తామసపురాణములు ప్రమాణము గాదు. మఱియు పురాణము సర్గప్రతిసర్గాదులలో దేనినయిన గుఱించినదే కాని యితిహాసమువలె పూర్వచరిత్రములను జెప్పుటయందు తాత్పర్యముగలదిగాదు. మఱియు నీసర్గమందలిశ్లోకములు తఱచుగా వ్యత్యస్తముగా నున్న వని పూర్వవ్యాఖ్యాతలు చెప్పెదరుగాన యీశ్లోకము మండోదరీప్రలాపము చెప్పినపిదప నుండఁదగినది. అప్పుడు'మహాదేవప్రసాద'మనఁగా శివునివలని పితృదర్శనమేయగును. ఇదియె రాముఁడు హనుమంతుని భరతునికడకుఁ బంపునపుడు 'మహాదేవప్రసాదాచ్చ పిత్రామమసమాగమమ్' అని చెప్పియున్నాఁడు. గోవిందరాజులు.

ఱకుం గలయైశ్వర్యమును గన్నులారం జూచివత్తము' అనెను.* తార యిట్లనుజ్ఞ సేయఁగా వానరకాంతలందఱును మంగళాచరణాదివిధిపూర్వకముగా నలంకారములు గావించుకొని సీతాదేవిని జూచుకోరికలు ముప్పిరిగొన నవ్విమానమునకుఁ* బ్రదక్షిణమగునట్లుగాఁబోయి తారయును దామును నారోహించిరి. రాముఁడు, తారమున్నగు వానరకాంత లారోహించువఱకు నవ్విమానము క్రిందనుండినదై వార లెక్కిన వెనుక పయికి శీఘ్రముగా నుద్గమించుటనుజూచి ఋశ్యమూకసమీపమును జేరఁగా మరలసీతనుజూచి 'సీతా! పర్వతరాజ మగునీ మేటిఋశ్యమూకము బంగారుధాతువులచేఁ బరివృతమై మెఱపులతోఁగూడిన మేఘమువలెనొప్పుచున్నది, చూడుము సీతా! ఇందు, నాకును వానరరాజయినసుగ్రీవునకును సమాగమము గలిగెను. ఇచ్చటనే నేనువాలిని వధించుటకై ప్రతిజ్ఞగావించితిని. చిత్రము లయినయడవులు గలయాపంపాసరస్సు నిదె చూపట్టుచున్నది చూడుము. ఇచట నిన్నుఁబాసి మిక్కిలియు దుఃఖముపట్టఁజాలక విలపించితిని. ఈసరస్సుతీరమున నేను ధర్మచారిణి యగుశబరిని జూచితిని. ఈచోట నేను యోజనముపొడ వయినబాహువులు గలకబంధునిఁ జంపితిని. విలాసినీ! సీతా! జనస్థానమున జటాయువు వాసమగుటచే శ్రీమంతం బగువటవృక్ష మదె కానఁబడుచున్నది చూడుము. ఆవృక్షముదాపున క్రూరుం డగురావణునకును మహాత్ముం డగుజటాయువునకును నీనిమిత్తమై మహాయుద్ధము జరిగెను. వరవర్ణినీ! నేను ఖరుని దూషణుని మహావీర్యుఁ డగుత్రిశిరునిని గుఱిదప్పక సూటిగాఁ దగులుబాణముల నేస్థలమునం గూల్చితినో యాయాశ్రమపదం బిదిగో చూడుము. ఇదిగో చిత్రమై శుభంబుగాఁ జూపట్టుమనపర్ణశాలను జూడుము. ఇచటనే రాక్షసరా జగురావణుఁడు బలాత్కారమున నిన్నపహరించెను. సీతా! ఇదిగో గోదావరీనది రమణీయమై నిర్మలజలములు గలిగి మంగళప్రదముగాఁ జూపట్టుచున్నది చూడు. ఇదిగో అగస్త్యాశ్రమము కానఁబడుచున్నది. మహాత్ముఁ డగుసుతీక్ష్ణునియాశ్రమ మదిగో దేదీప్యమానమైయున్నది చూడు. సీతా! పగవారిపురంబుల భేదించువేయుగన్నులప్రోడ యగునింద్రుఁ డెచటికి వచ్చెనో యట్టిమహనీయం బగుశరభంగాశ్రమ మిచటఁ జూపట్టుచున్నది చూడు. ఈప్రదేశముననే మహాకాయుం డగువిరాధుఁడు నాచేత హతుఁడయ్యెను. సీతా! సన్నని నెన్నడుము గలదానా! మనము పదిసంవత్సరములందంద వసించియుండినయాఋష్యాశ్రమము లివియె చుమీ. ఇచట వారలకుఁ గులపతియు సూర్యాగ్నిసమానతేజుండు నగునత్రిమహర్షి యున్నాఁడు. ఇచట ధర్మచారిణి యగుతాపసిని అనసూయాదేవిని నీవు దర్శించితివి. సుందరగాత్రీ! ఇదిగో

* వానరభార్యలనందఱను బిలుచుటకు, వార లలంకారముగావించుకొనివచ్చి విమానమెక్కుటకును కిష్కింధయందు ఒకదినము పట్టినదని చెప్పెదరు. మఱియు వానరస్త్రీలు 'కృత్వాచాపిప్రదక్షిణమ్' అని యావిమానమునకుఁ బ్రదక్షిణముచేసినట్లు చెప్పినను అది చాల విశాలమగుటచే నట్లు త్వరితముగాఁ జేయసాధ్యముగాదుగాన ప్రదక్షిణమగునట్లుగా దానినెక్కిరని గ్రహింపవలయును.

పర్వతరాజం బగుచిత్రకూటము ప్రకాశించుచున్నది చూడుము. కైకకుమారుం డగుభరతుఁడు నన్నుఁ గలఁకఁ దేర్చి రాజ్యము నంగీకరింపఁ జేయుటకై వచ్చినస్థల మిదియే. అల్లదిగో యమునానది సుందరము లయినయడవులతో దూరంబునం గనఁబడుచున్నది. మనము మున్ను భరద్వాజాశ్రమమును జూచినయాశ్రీమంత మగు ప్రదేశము దాపుగానుండుటచే నదిగోఁ జక్కఁగా కనఁబడుచున్నది చూడుము. వరవర్ణినీ! ఇదిగో ఆకాశభూపాతాళము లనుమూఁడుమార్గములం బ్రవహించుటచే త్రిపథగ యనంబడుగంగ యిదిగో నానావిధములయిన పక్షులు నెరయ తీరములందు చక్కఁగాఁ బూచినయడవులు నిక్కుఁజూపఁ జూపట్టుచున్నది. ఇదియే శృంగిబేరపురము. ఇచటనే గుహుఁడు మనయొద్దకు వచ్చెను. సీతా! అల్లదిగో ఆసరయువు కనఁబడుచున్నది చూఁడు. దానితీరములందు పెక్కుయజ్ఞములు గావింపఁబడుటవలన వరుసలు వరుసలుగా పెక్కు †యూపస్తంభము లున్నవి. పలువిధము లయినవందల కొలఁదివృక్షములును చక్కఁగాఁ బూచినయడవులును దానియిరుప్రక్కల నొప్పుచున్నవి. మాతండ్రి రాజధాని యైనయాయయోధ్యానగరము నదె కానవచ్చుచున్నది చూడు. సీతా! అయోధ్యకు మరలి క్షేమముగా వచ్చితివి గావున ఆపట్టణమునకు నమస్కరింపుము ’ అనెను. అంత నావచ్చినవానరు లందఱును రాక్షసుఁ డగువిభీషణుఁడును అందఱును లేచిలేచి శుభదర్శన మగునాయయోధ్యాపురమును జూచిరి. అంత తెల్లని మేడలవరుసలచే మురువు చూపుచు విశాలము లయినకక్ష్యలు గలిగి గుఱ్ఱములును నేనుఁగులును గ్రిక్కిఱిసి దేవేంద్రునియమరావతిపురముం బోలి వెలుంగుచున్నయయోధ్యానగరమును వానరులు సందర్శించినవారయిరి. ఇది నూటయిరువదియాఱవసర్గము.

(రాముఁడు భరద్వాజాశ్రమమున భరద్వాజమునివలననయోధ్యయందలిమాతృభరతాదులక్షేమమును వినుట. ఆముని ప్రార్థనమున భరద్వాజాశ్రమమం దొకదినమునిలుచుట. అమ్ముని తనయాశ్రమము మొదలుకొని యయోధ్యవఱకు మార్గమునఁ గలవృక్షముల తాదులకాలకుసుమపుష్పఫలాదులతోనుండునట్లు వరమిచ్చుట.)

లక్ష్మణాగ్రజుం డగురాముఁడు పదునాలుగేండ్లు నిండఁగా* చైత్రశుద్ధపంచమి

---

* ఇక్ష్వాకువులు తీరమందు యాగము చేసినపిదపఁ గీర్తికొఱకు శిలలతోఁ గావించినయూపము లని తెలియునది.

† చైత్రశుద్ధపంచమియందు రాముఁ డరణ్యవాసమునకై అయోధ్యను విడిచెనుగాన యాచైత్రశుద్ధచతుర్థికి పదునాలుగేండ్లు నిండఁగా చైత్రశుద్ధపంచమిని భరద్వాజాశ్రమము చేరెనని తెలియునది. ఇదియెట్లన చైత్రశుద్ధపంచమియందు అయోధ్యనుండి వెడలుట; ఆనాఁటిరాత్రి తమసాతీరమునవాసము.

యందు భరద్వాజాశ్రమముఁ జేరి త్రికరణశుద్ధిగా నమ్మహామునికి వందనము చేసెను. రాముఁడు తపమే ధనముగాఁ గలభరద్వాజమహర్షికి నమస్కరించి 'మహాత్మా! అయోధ్యానగరమున సుభిక్షమును ఆరోగ్యము గానున్నసంగతిని విందువారా యేమి? భరతుఁడు ప్రజాపాలనమందు జాగరూకుఁడే కదా. మాతల్లులు మొదలగువారందఱును బ్రతికియున్నారా యేమి?' అని యడిగెను. రాముఁ డిట్లడుగఁగానే భరద్వాజ

షష్ఠినాఁడు శృంగిబేరపురమునందు, సప్తమిని వృక్షమూలమందు, అష్టమిని భరద్వాజాశ్రమమునందు, నవమిని యమునాతీరమునందు. దశమిని రాముఁడు చిత్రకూటమునకు పోవనున్నాఁ డని గుహునిచారులవలన వృత్తాంత మెఱిఁగి సుమంత్రుఁడు నాఁటిసాయంకాలము అయోధ్యను బ్రవేశించుట. నాఁటిరాత్రియె దశరథునిమరణము. ఏకాదశియందు రాజుకళేబరమును తైలద్రోణియందు నిక్షేపించుట. ద్వాదశిని భరతునియొద్దకు దూతలనుబంపుట, అదూతలు మార్గమునందు త్రయోదశిని చతుర్దశిని గడపి పున్నమరాత్రి కేకయనగరమును బ్రవేశించుట. పాడ్యమియందు భరతుఁ డయోధ్యకుఁ బయనమగుట. మార్గమున ఏడురాత్రులుండి అష్టమదినమున మిక్కుటమైన త్వరచే రేయుంబవలు పోయి నవమి సూర్యోదయమున భరతుఁ డయోధ్యను బ్రవేశించుట. ఆనవమినాఁడే దశరథునికి సంస్కారము. ఆదినము మొదలుకొని పదుమూఁడవదినమున అనఁగా వైశాఖశుద్ధపంచమియందు దానికి మునుపటిదినమందును భరతుఁడు రాజునకు శ్రాద్ధకర్మములు సేయుట. షష్ఠిని ఆదేశాచారముచొప్పున దహనదేశమును శోధించుట, సప్తమియందు రామునియొద్దకుఁ బోవ మార్గము చక్కఁబెట్టుటకు పనివాండ్రను బంపుట. పనివాండ్రు దశమివఱకు, నాలుగుదినములుమార్గము చక్కఁబెట్టుట. ఏకాదశిని భరతుఁడు రామునియొద్దకు పయనమగుట, ఆనాఁటిరాత్రి గంగాతీరమున వసించుట. ద్వాదశిని భరద్వాజాశ్రమమున నుండుట, త్రయోదశిని రామునితో సమాగమము, చతుర్దశీ పూర్ణిమా పాడ్యములయందు భరతుఁడు చిత్రకూటమున వసించియుండుట. వైశాఖబహుళద్వితీయయందు భరతుఁ డయోధ్యకు పయనమగుట. చతుర్థిని అయోధ్యను బ్రవేశించుట. ఇట్లు రాముఁడు అయోధ్యనుండి చైత్రశుద్ధపంచమిని వెడలినదిమొదలుగా వైశాఖబహుళ చతుర్థివఱకు ఒకటిన్నరమాసమయ్యెను. వైశాఖబహుళ పంచమియందు రాముఁడు చిత్రకూటమునుండి బయలుదేఱి అత్రియాశ్రమమును బ్రవేశించుట. ఆశ్రమమండలమున పదిసంవత్సరములు. ఇట్లు పదిసంవత్సరములును ఒకటిన్నరమాసమును గడవఁగా మిగతకాలమున పంచవటియందు వాసము. అందు మూఁడేండ్లు. అనఁగా మొత్తమున పదుమూఁడేండ్లు గడచిపోఁగా పిదప పదునాలుగవయేఁట చైత్రమాసమున సీతాపహరణము. వైశాఖమున సుగ్రీవదర్శనము. ఆషాఢమున వాలివధము, ఆశ్వయుజమున సీతాన్వేషణమునకు సైన్యము లుద్యోగించుట. ఫాల్గునమున హనుమదాదులప్రాయోపవేశము. ఫాల్గున శుద్ధచతుర్దశియందు లంకాదహనము. ఫాల్గునము అమావాస్యయందు రావణవధము. చైత్రశుద్ధపాడ్యమిని రావణసంస్కారాదులు. ద్వితీయయందు విభీషణాభిషేకము సీతాప్రాప్తి దేవతాప్రస్థాపనము. తృతీయయందు లంకనుండి బయలుదేఱుట. చతుర్థిని కిష్కింధయందు నాఁగుట, పంచమిని భరద్వాజాశ్రమమం దుండుట అని తెలియుచున్నది. ఇందు వానివాని కుపపత్తులు అందందు తెలుపఁబడినవి. కాఁబట్టి హనుమంతునిసమక్షమున రావణుఁడు 'ద్వౌమాసౌరక్షితవ్యౌ' అని రెండునెలలుచెప్పుట సీత నూఱడించుటకే కాని వేఱుగాదు. 'మాసాదూర్ధ్వం నజీవిష్యే' మాసమునకుమీఁద బ్రతుకను అని సీత చెప్పినదే సరిగా పొసఁగుచున్నది. ఆసీత చెప్పినమాసము అప్పుడు జరుగుచుండినమాసమే యని పలు

మహర్షి రాముని మరలఁ జూచినందులకు సంతుష్టుఁడై *చిఱునగవు మోమునం దోఁప నతనితో 'భరతుఁడన్నను †దుమ్ముననుఁ బ్రుంగి జడలుదాల్చి నీపాదుకల మున్నిడుకొని ప్రజాపాలనము సేయుచు నీరాక కెదురుచూచుచున్నాఁడు గృహమున నన్నియు క్షేమమే. సమితింజయా! నీవు మున్ను కేవలము ధర్మమునుమాత్రమే కోరినవాఁడవై పితృవాక్యము దప్పక చేయువాఁడవై కైకేయివచనముఁ గయికొని సర్వస్వమును దిగవిడిచి సమస్తభోగములను బరిత్యజించి ప్రాంతనారచీరలం గట్టుకొని సీతయు లక్ష్మణుఁడును దోడరా స్వర్గమును బాసిన దేవతయుంబోలె రాజ్యమును బాసి మహారణ్యమున కందమూలఫలాదు లాహారముగాఁ గాలినడక నడచి ప్రవేశించుచు వచ్చినపుడు నిన్నుఁ జూడఁగా నాకు దుఃఖము కలిగినది. ఇప్పుడో శత్రులను జయించి కార్యసిద్ధి నొంతయునొంది, మిత్రగణములను బంధువులనుం గూడి క్షేమముగా నీవు వచ్చుటను జూడఁగా నాకు మిక్కిలియుఁ బ్రీతి యైనది. రామా! నీకు వనవాసకాలమున పంచవటీవాసాదులం గలిగినసుఖమును సీతాహరణమునం గలిగినదుఃఖమును నాకుఁ దెలిసియున్నది. ధర్మవత్సలా! నీవు జనస్థానమున రాక్షసుల మహాఘోర యుద్ధమున వధింప సంభవించుటయు, ఋషిజనులు వేఁడికొనఁగా నీవిట్లు ఖరాదులను వధించి వారలను రక్షించుచుండఁగా అనిందిత యైననీభార్యను ఈబిడను రావణుం డపహరింపఁ దలంచుటయు, మారీచుండు జింకరూపమునఁ బొడతెంచుటయు, సీత యపహృత యగుటయు, కబంధునిఁ గాంచుటయు, పంపాసరస్సునకుఁ బోవుటయు, సుగ్రీవునితోడ నీవు స్నేహముచేయుటయు, వాలిని నీవు వధించుటయు, సీతను వెదకుటయు, హనుమంతుఁడు సముద్రము దాఁటి సీతను జూచి లంకం గాల్చి వచ్చిన మహాకర్మమును, సీతావృత్తాంతము దెలిసినపిదప నలునిచే సేతువు గట్టించినవిధ

మాఱు చెప్పఁబడినది. రావణుఁడు 'పదినెలలయినవి, ఇఁక మిగత రెండుమాసములున్నవి' అని చెప్పుట మధుపానమత్తతచే వివేచింపక చెప్పినదగును. సీత 'మాసాదూర్ధ్వమ్' 'మాసమునకు మీఁదుగా' ననుట జరగుచుండినమాసమే యని తెలియునది—గోవిందరాజులు. భరద్వాజాశ్రమమును ప్రాపించుటను జెప్పుటచే మహనీయులస్థానము లనుప్రాప్యము లగునని చెప్పఁబడినది.

* ఇట మునికి చిఱునగవు 'రాముఁడు సర్వజ్ఞుఁ డయి తెలియనట్లడుగుచున్నాఁడే' యని కలుగవలయును. లేక 'భరతుఁడు పరిపాలనమున జాగరూకుఁడా' అని రాము డడుగుటకు భరతుఁడు ప్రజాపాలనమున సంతుష్టుఁడైయున్నాఁడా యని యతనిప్రశ్నాభిప్రాయము గాన పరతంత్రుఁడైయున్న భరతుఁ డిట్లు సంతుష్టుఁడైయుండుట యెక్కడిది యనికాని కలిగినది గావలయును.

†భరతుఁడు జటలుధరించియుండుటచే స్నానముచేయకుండుటవలన దుమ్మున ఁబ్రుంగినాఁడని తెలియునది. స్నానములేకపోయినను నిత్యానుష్ఠానముల దీక్షితునివలె గౌణస్నానముచే జరుపుట తెలియునది. స్నానములేనప్పుడు 'కథం న్వపరరాత్రేషు సరయూ మవగాహతే' అని రాముఁడు భరతుని సరయువునందు గ్రుంకు లిడునని వగచెనే. ఇదియెట్లు? అన్నచో ఇది యొకానొకప్పుడు చేయుస్నానముగా గ్రహించినచో పొసఁగుపాటు గావచ్చును.

మును, వానరవీరు లుబ్బునఁ జెలరేఁగి లంకను దహించిన తెఱంగును, దేవకంటకుం డగురావణుండు పుత్రమంత్రిబంధుసహితముగా సైనికులతోను వాహనములతోను యుద్ధంబున నీచే వధింపఁబడిన ప్రకారమును, బ్రహ్మాది దేవతలు నీయొద్దకు వచ్చుటయు, నీ కింద్రుఁడు మృతవానరులు జీవించున ట్లిచ్చినవరముచొప్పును, ఇది యంతయు నేను తపోబలంబున నెఱింగియున్నవాఁడను. ఆయుధధారులలోనెల్ల మేటీ! నేను గూడ నీ కిచట వర మొసంగెదను. అడుగుము. ఇప్పుడు నేను గావించెడియీపూజను గయికొని రే పయోధ్యకుం బోవచ్చును' అనెను. రాజకుమారుఁడు రాముఁడు బుద్ధిమంతుఁడు గాన యచటనుండి భరతునియొద్దకు దూతఁ బంపుట యుచితమని తలంచుకొని భరద్వాజమహర్షి వచనమును శిరసా వహించి యట్లేయని పలికి మిక్కిలియు హర్షంబున నతనిని జూచి ' మహానుభావా ! నే నయోధ్యకుఁ బోవుమార్గమున వృక్షము లన్నియును గాలము కానపుడు గూడ, ఫలవంతము లై మధువు స్రవించుచుండవలయును. ఫలములు అమృతముంబోలె రుచి గలిగి పెక్కులు పలువిధములుగా నుండవలయును ' అని వర మడిగెను. ఆమహర్షి యట్లే యని ప్రతిజ్ఞ సేయఁగానే ఆయనమాటవెంబడినే యచటివృక్షము లన్నియు స్వర్గమునందలికల్పవృక్షములవలె సర్వకాలసమృద్ధము లై యుండినవి. అప్పు డావానరు లయోధ్యకుఁ బోవునపుడు మార్గము నేవైపు చూచినను మూఁడామడలవఱకును ఫలింప కుండినవృక్షములు ఫలవంతము లయినవి. పుష్పింపనివి పుష్పించినవి. ఎండిపోయినవృక్షము లన్నియు ఆకులతో దట్టముగా నిండిన వై మధువు స్రవించినవి. అంత నవ్వానరసింహములు మేను గగురుపొడువఁ బరమసంతుష్టు లై దివ్యంబు లగుఫలముల ననేకంబులను యథేష్టముగా వేలకొలఁదిని భక్షించుచు స్వర్గమునుం బొందినవారలుంబోలె నానందంబు నొందిరి. ఇది నూటయిరువదియేడవసర్గము.

రామనియోగంబున హనుమంతుఁడు శృంగిబేరపురమున
గుహునికి రామాగమనముఁ జెప్పి భరతునికి నట్లేపోయి
రామురాక నెఱిఁగింపఁగా నతం డానందమగ్నుఁ డగుట.

రాముఁ డయోధ్యను దలంచుకొని కొంతసే పాలోచించెను. అంతఁ డట్లాలోచించి వానరోత్తముం డగుహనుమంతునిఁ బిలిచి 'అయోధ్యలో రాజుగారినగరిలో మా తల్లి మొదలగువా రందఱును క్షేమమా?యని తెలిసికొనుము. నీవు శృంగిబేరపురమునకుఁ బోయి యచట వనచరుండును నిషాదరాజు నగుగుహునిఁ జూచి నేను జెప్పినట్లు నీవు నాక్షేమ మతనికిఁ జెప్పుము. ఆగుహుఁడు నే నారోగ్యముతో మరలఁ గుశలముగా వచ్చితినని నన్నుఁ బాసినతుండుకు కంతయుఁ దీఱఁగా విన్నంతనే మిక్కిలియు సం

తోషము నొందఁగలఁడు. *అతఁడు నాకు నాయంతటివాఁ డగుచెలికాఁడు. ఆబోయల రాజు గుహుఁడు అయోధ్యకుఁ బోవుమార్గమును భరతునివృత్తాంతమును నీకు సంతోషమునఁ దెలుపఁగలఁడు. నేను జెప్పినట్టుగా భరతునకు నాక్షేమమునుఁ జెప్పవలయును. నేను వనవాసము తీర్చి పితృవచనపరిపాలన గావించి భార్య యగుసీతతోడను లక్ష్మణునితోడను క్షేమముగ వచ్చితినని యతనికిఁ జెప్పుము. మఱియు బలవంతుఁ డగురావణుఁడు సీత నపహరించుకొని పోవుటయు, సుగ్రీవునితోఁ గలసి సఖ్యము గావించుటయు, వాలిసుగ్రీవులయుద్ధంబున వాలిని వధించుటయు, సీతను వెదకుటయు, నీ వపారబలంబు గలిగియుండుటం జేసి యవ్యయ మైననదీపతిని సముద్రమును దాఁటి సీతను జూడఁగాంచినవిధమును, అందఱును సముద్రమునకడకుఁ బోవుటయు, సముద్రరాజు దర్శన మొసంగుటయు, అందు సేతువు గట్టించినవిధమును, రావణుని నేను వధించినతెఱంగును, †దేవేంద్రుఁడును బ్రహ్మయు వరుణుండును నాకు వర మొసంగుటయు,శివుని ప్రసాదమున నాకు తండ్రితోడ సమాగమము గలుగుటయును, భరతునకుం జెప్పుము. మఱియు నేను రాక్షసరా జగువిభీషణునితోను వానరనాథుఁ డగుసుగ్రీవునితోను ‡సమీపించి వచ్చియున్నాననియు సౌమ్యుఁడవు గాన మెల్లమెల్లఁగ నతనికిఁ జెప్పుము. ఈ వృత్తాంతము వినినపుడు § భరతుని ముఖమున నేమి జాడలు తోఁచునో, నావిషయ మై యింగిత చేష్టాదు లేమేమి గనఁబడునో, దాని నంతయు నీవు సూటిగాఁ దెలిసికొనవలయును. నీవు భరతునితో 'రాముఁడు శత్రుసమూహములను జయించి యుత్తమ మయినయశము నొంది యభీష్టము చక్కఁగా నీడేఱి మహాబలవంతు లగుమిత్రులతోఁ గూడి సమీపించి వచ్చుచున్నాఁడు' అని చెప్పి, యతనిముఖవర్ణమువలనను, దృష్టివలనను, మాటలవలనను, అతనివృత్తాంతములను ఇంగితముల నన్నింటిని గలరూపునఁ దెలిసి

---

* 'సమ మాత్మసమస్సఖా' అనిమూలము. 'ఆత్మసమః'అని రాముఁడు గుహునిం జెప్పుటచే గుహుని హీనజాతిని బాటింపక ప్రేమాతిశయమున తనవలె నిక్ష్వాకుకులీనునిగాఁ దలఁచెనని యర్థము. గోవిందరాజులు.

† మునుపు దేవేంద్రుఁడొకఁడే వర మొసంగిన ట్లుండఁగా బ్రహ్మయు వరుణుండును గూడ నిచ్చినట్లు చెప్పుటచే బ్రహ్మాదులయనుమతియు నావరదానమునకుఁ గలదని తెలియుచున్నది.

‡ చతుర్థినాఁడే పదునాలుగవయేఁడు గడచిపోవుటచే నేను వచ్చియుండుట చెప్పనియెడల భరతుఁడగ్ని ప్రవేశించుననియు 'సౌమ్య'శబ్దముచే మెల్లగాఁ జెప్పవలయుననియు లేనిచో ఆనంద మతనికి ఉన్మత్తకమయి పోవుననియు రాముని భావము.

§ ఇక్కడ భరతునియింగితాదులను దెలిసికొని రమ్మనుటకుఁ గారణము—అతనితో 'నీవే రాజ్యమును పరిపాలింపుము' అన్నచో అంగీకరించునా అంగీకరింపఁడా యని తెలిసికొనుటకని తెలియునది. అట్లు తెలిసికొననియెడ భరతునిప్రకృతికిని రామప్రకృతికిని విరుద్ధ మైనది కలుగును. రాముఁడు 'న సర్వే భ్రాతరస్తాత భవన్తి భరతోపమాః' 'నాయనా! అందఱు తోఁబుట్టువులును భరతునివంటి

కొనవలయును. 'అందఱకును రాజ్యాధిపత్యమం దాశ యేగదా. ఇందు భరతుని మాత్రము పరీక్షింపవలయునా' యందువా? సమస్తకాలములందు సమృద్ధమై రథగజతురగములచేతను నెరసి బెరసి కులపరంపరాగతమై యొప్పురాజ్యము ననుభవించు చుండునప్పుడు (భరతుఁడు దప్ప మఱి) యెవ్వనిని మనస్సు నాకర్షింపక విడుచును. 'భరతునియింగితము తెలిసి పిదప నేమిచేయవలయు'నందువా? (పూర్వము తా నెంతమాత్రము రాజ్యపాలన మంగీకరింపనని చెప్పినను పదునాలుగేండ్లు సన్న్యాసిఁబాసి యాతురుఁడై యుండుటవలన) నన్నుఁ గలియఁగానే, పూర్వము నా ప్రీతికొఱకు రాజ్యభారము నంగీకరించి నాయెడ సహజపారతంత్ర్య సంపత్తి గలిగియుండు నా భరతుఁడు (నన్నుఁ జూచినయుబ్బు పట్టఁజాలక నేను నీవే రాజ్యము నేలు మనఁగా) అట్లె రాజ్యము నేలఁగోరునా? అని యువ్విళ్లూరెద. అట్లేని యతఁడే జనసమృద్ధమైనభూమండల మంతయు నేలుఁగాక. (తండ్రి నాయభిషేకసంభ్రమము పొందనివాఁడయ్యె. నే నయినను భరతాభిషేకమహోత్సవము ననుభవించెదను). అతఁడు త్రైలోక్యమును భరింపఁ జాలురఘుకులమున కానందకరము గాఁ బుట్టినవాఁడు గాన యీరాజ్యమును భరింపఁగలఁడు. హనుమంతా! అతఁడు నాసన్నిధానమున నెట్లో రాజ్య మంగీకరింప నున్నబుద్ధిని, సర్వవిధముల నంగీకరింపననియే యున్ననిశ్చయమును, దెలిసికొని రాజ్యము నంగీకరించునేని మే మిచ్చోటనుండి దూరము వచ్చుటకు మునుపే మాయొద్దకు శీఘ్రముగా రావలయును. *అంగీకరింపని

వారు గారు' అనియు భరతుఁడు 'యావన్న చరణౌ భ్రాతుః పార్థివవ్యఞ్జనాన్వితౌ। శిరసా ధారయిష్యామి న మేశాన్తి ర్భవిష్యతి 'రాజలక్షణలక్షితము లయినయన్న చరణములు శిరస్సునఁ దాల్చునంతవఱకును నాకు నెమ్మదికలుగదు' అన్నాఁడు. వీరిరువుర ప్రకృతు లిట్లున్నది గనుక రాముఁడు భరతునిప్రకృతిని బరిశీలింపక తనప్రకృతిచొప్పున 'నీవే రాజ్యమేలు' మని యతనితోఁ జెప్పినచో పాసఁగునో పాసఁగదో యని తెలియుటకై యిట్లు పరిశీలనము చేయుచున్నాఁడు—గోవిందరాజులు. భరతునకు రాజ్యమునందే యభిలాష యున్నదో లేదో ఆకారమువలనను ఇంగితములవలనను దెలిసికొమ్మని రాముఁడు చెప్పఁగా అట్టిసాహ్యదముగలవాని నట్లు పరీక్షింపవచ్చునాయని హనుమంతుఁ డడుగ కులక్రమాగతమైనరాజ్య మెట్టివానిని మనస్సునాకర్షించునని రాముఁడు చెప్పఁగా, అట్లైని యతఁడు తానే యేలెదనన్నచో నేమిచేసెదవని యతఁ డడుగ చిరకాలము రాజ్యముతోడిపరిచయముచే దానిని తానే యేలఁగోరునేని యతనినే యేలనిత్తునని రాముఁడు చెప్పెనని తెలియునది—మహేశ్వరతీర్థులు.

* కావుననే హనుమంతుఁడు భరతుఁడు రాజ్యమంగీకరింపఁడన్ననిశ్చయము నెఱింగి, భరతునియొక్కనే యుండెను గాని మరలి రామునొద్దకు రాలేదని తెలియునది. కొందఱు 'రాముఁడు భరతుని భావము తెలిసినవాఁడయ్యును సర్వవిధముల ననురక్తుఁడయినవానినిగూడ రాజు పరీక్షింపవలయునని లోకమునందు రాజనీతి ప్రవర్తించుటకైయే యిట్లు మిక్కిలిశంకతోఁగూడిన మాటలు చెప్పెను. వాస్తవమునకు తాను తటాలున వచ్చినయెడల భరతునకు హర్షము ఉన్మత్తకమైపోవునని ముందు హనుమంతునిఁ బంపినాఁడు. హనుమంతుఁడు రామునిహృదయము నెఱింగినవాఁడు గావున భరతునికి రామునిరాకం జెప్పి భరతునితోడనే రామునొద్దకు వచ్చె'నని చెప్పెదరు—గోవిందరాజులు.

యెడ రావలదు ' అనెను. రాముఁ డిట్లు తనహృదయమును గాక యందులకు ప్రతికూల మయినదానిని జేయ నాజ్ఞాపింపఁగా వాయుపుత్త్రుం డగుహనుమంతుండు మనుష్యరూపమును ధరించి త్వరితముగ నయోధ్యాపురమునకుఁ బోవ నుద్యుక్తుఁడయ్యెను. అట్లుద్యుక్తుం డై యవ్వాయుకుమారుఁడు హనుమంతుఁడు, గరుత్మంతుఁడు మంచి సర్పమును బట్టుకొనఁగోరి దానిపయికి వేగ మెగసి పోవునట్లు అతివేగమున నాకాశమున కెగసిపోయెను. వీర్యవంతుఁ డగు నాహనుమంతుఁడు, అట్లు తనతండ్రిసంచారమార్గ మయినయాకాశంబునకుఁ గుప్పించి, మహాసర్పములకు నివాసస్థానమును మంగళకరము నగుగంగాయమునాసంగమము నతిక్రమించి, శృంగిబేరపురమునకుఁ బోయి గుహునిం జూచి సంతుష్టుఁ డై శుభవచనంబున నతనితో 'సత్యపరాక్రముఁడును కాకుత్థ్సకులుండు నగునీచెలికాఁడు రాముఁడు సీతను లక్ష్మణునిని గూడి నీతో తనక్షేమమును జెప్పుమనెను. రాముఁడు భరద్వాజమహర్షి పంపునం జేసి యీపంచమిరాత్రి యమ్ముని యాశ్రమముననుండి రేపు తెల్లవాఱునంతకు నమ్మునియనుజ్ఞ నొంది బయలుదేఱి రాఁగలఁడు. అతిత్వరలోనే యతనిం జూడఁగలవు' అని యతనికిఁ జెప్పెను. మహాతేజుండును వేగవంతుఁడు నగునాహనుమంతుఁ డిట్లు చెప్పి సకలలోకానందకర మగు రామాగమము భరతునకు వినిపింప వలసినభాగ్యము లభించినందులకు పులకాంకిత శరీరుఁ డై మార్గమందలిపర్వతనద్యాదుల యొప్పిదమను బాటింపక యతివేగంబున నాకాశమునకు నెగసిపోయెను. అతండు మార్గమునఁ బరశురామతీర్థమును వాలుకినీనదిని ప్రసిద్ధం బగుగోమతినదిని, భయంకర మగుసాలవృక్షవనమును, నానాసస్యసమృద్ధము లయిన కోసలజనపదములను అందుఁ బెక్కువేలకొలఁది నున్న ప్రజలనుం గాంచెను. ఆకపికుంజరుఁడు త్వరితముగా బహుదూరము పోయి నందిగ్రామమునకు సమీపమున పుష్పితము లై యున్నవృక్షములను జూచెను. ఆవృక్షములు స్త్రీ లని బాలు రనియు వృద్ధు లనియు లేక యందఱకు నానందము గూర్చుచుండుటచే స్త్రీలును పుత్త్రులతోడ వృద్ధులును వానియందుఁ గ్రీడించుచు వాని కొక చెలువు గూర్చుచుండిరి. మఱియును దేవేంద్రునినందనవనమునందును కుబేరుని చైత్త్రరథవనమందును గలవృక్షములుంబోలె నవి వెలయుచుండెను. అయోధ్యానగరముకు రెండుగడియలదూరమున, చీరకృష్ణాజినముల నడుమునంగట్టి యాశ్రమంబున వసించుచుఁ గృశుం డై రాముఁ డంతకును రాకుండుటకు దీనుం డై యున్నభరతునిఁ గాంచెను. ఆభరతుఁడు జడలు దాల్చి రామునిఁ బాసినవ్యసనంబున నకనక స్రుక్కి, దేహ మంతయు ముఱికి గ్రమ్మియుండ, బహిరింద్రియముల నిగ్రహించి ఫలమూలాహారుం డై తాపసవృత్తిని ధర్మము లాచరించుచునుండెను. అతఁడు పెనుపొంది పొడవయినజడలగుంపుతో వల్కలాజినముల నుత్తరీయము గా వైచుకొని వాఙ్నియమము గలిగి మనోనియమమున నాత్మధ్యానముసేయుచు బ్రహ్మర్షికింబోని తేజంబున వెలుంగుచుండెను. మఱియు నతండు రాముఁ డొసంగినపాదుకలు మున్నిడుకొని

భూమండలమును బాలించుచుఁ జతుర్వర్ణములవారికిని నేభయమునుం గలుగకుండ రక్షించుచు నుండెను. అతనిని జాగరూకులై పరిశుద్ధులై యున్నమంత్రులును బురోహితులును సేనాపతులును గాషాయవస్త్రంబులు ధరించి కొలుచుచుండిరి. వార లట్లు కాషాయవస్త్రముల ధరింప నేల యన్నచో *రాజపుత్రుం డగుభరతుఁడు నారచీరలను వల్కలములను ధరించి యుండఁగా ధర్మమునం దెంతయు నాసక్తు లగుతాము నతనిని విడిచి మంచి వస్త్రములు మొదలయినభోగముల ననుభవింప నొల్లనివా రయిరి. వాయుకుమారుఁ డగుహనుమంతుఁడు, సమస్తధర్మంబులను దెలిసి దేహము నొందినమఱియొకధర్మమువలె (మూర్తి వహించిన రెండవ ధర్మదేవతయుంబోలె) చూపట్టుచు,(అగ్నిని విధ్యుక్తప్రకారమున దరికొలిపి శుచియై దేహమును ద్యజింపఁ గోరుచు) నున్నయాభరతునిఁ జూచి యంజలి గీలించి 'దండకారణ్యమున వల్కలములు ధరించి జడలం దాల్చియున్న యెవ్వనినిగుఱించి నీ విట్లు దుఃఖించుచున్నావో యారాముఁడు తనక్షేమమును నీకుఁ జెప్పుటకై నన్నుఁ బంపెను. దేవా! ప్రియమైనవార్త నీకుఁ జెప్పెదను. మిక్కిలిభయంకర మయిననీయీదుఃఖ మంతయు నిదె దిగవిడువఁగలవు. ఏలన ఈముహూర్తమందే నీవు నీయన్న యగు రామునితోఁ గూడికొందువు. రాముఁడు రావణునిఁ జంపి సీతను మరలం బడసి మనోరథ మీడేఱినవాఁడై మహాబలవంతు లగుమిత్రులతో వచ్చుచున్నాఁడు. మహాతేజుం డగులక్ష్మణుండును వచ్చుచున్నాఁడు. కీర్తిమతి యగుసీతయు మనోరథ మీడేఱినదై, దేవేంద్రునితోఁ గూడ శచీదేవివలె, రామునితోఁ గూడ వచ్చుచున్నది' అనెను. †హనుమంతుఁ డిట్లు చెప్పఁగా, భరతుం డన్నయందు మిక్కిలియుమక్కువ గలవాఁడు గావున నుబ్బు పట్టలేక తటాలున నేలం బడెను. మఱి యాయుబ్బువలన మూర్ఛయు నొందెను. రాముఁడు వచ్చు నన్నవార్తకే యిట్లయినచో నింక రాముఁడే

---

* ఇందులకు 'నహి తే రాజపుత్రం తం చీరకృష్ణాజినాంబరమ్ । పరిభోక్తుం వ్యవస్యన్తి పౌరా వై ధర్మవత్సలాః' అని మూలము. ఇందులకు విశేషార్థము.—(పౌరాః) మంత్రులు మొదలయినపౌరులు, (పరి) భరతునిచుట్టు వర్తించుచున్నవారయినను, (భరతం) భరతుని, (భోక్తుం) అనుభవించుటకు—చూచుటకనుట,(నవ్యవస్యన్తి) వ్యవసాయమును జేయరు-అతనిచూచువిషయమున నిరాశులగుదు రనుట. ఏలనఁగా,(రాజపుత్రం) రామునిఁ బాసినయుత్తరక్షణమే మృతుఁ డయినవానికొడుకు గదా యితఁడు; ఇప్పుడు రాముఁడు రాకుండు నేని, ఇతనిని మనము దక్కింపఁగలమా యని చూడరయిరని భావము. అట్లు చూడకుండుటకు మఱియొకహేతువును జెప్పుచున్నాఁడు. (ధర్మవత్సలం) ధర్మార్థము, తనయాత్మను త్యజించుటయందు పితను బోలినవాఁడు పదునాలు గేండ్లు నిండియు రామాగమమును గానరాకుండుటచే ప్రాణములు త్యజింప నుద్యుక్తుం డగుభరతునిఁ జూచి పౌరులును దాపాతిశయము నొందుట యీశ్లోకమునఁ జెప్పఁబడినది—అని ఆచార్యులు.

† ఇట హనుమంతుఁడు భరతునితో పరిచయము లేనందున నతనికి వందనము సేయలే దని గ్రహించునది. లేక ముందు చేసినయంజలి వందనపూర్వకమైనది గా గ్రహింపవచ్చును. లేక భరతుఁ

గొబ్బున వచ్చునేని యేమవునో కదా! అంతఁ గొంతసేపటికి రఘుకులుఁడును శ్రీమంతుఁడు నగుభరతుఁడులేచి తెప్పిఱిలి సంభ్రమంబున ప్రియవార్తఁ జెప్పుచున్న హనుమంతునిఁ గౌఁగిలించికొని శోక మంతయు దిగవిడిచి యానందజనితము లయిన బాష్పములచే నతనిదేహ మంతయుఁ దడిపెను. అతఁడు హనుమంతునిఁ జూచి యతని తేజోవిశేషమునకు మనుష్యుఁ డగుటను సంశయించి యతనితో 'సౌమ్యా! నీవు నాయెడ దయ గలిగి యిచ్చటికి వచ్చిన దేవతవో మనుష్యుఁడవో తెలియరాదు. మిక్కిలియింపుగ మాట లాడుచున్నావు. ఇట్టినీప్రియవచనమునకుఁ బారితోషికముగా లక్షగోవులను నుత్తమము లయిననూఱుగ్రామములను, మేలయినకుండలములం దాల్చి మంచినడవడి గలిగి బంగారువంటిచాయయు సొగసయినముక్కును బెడం గయినతొడలును చందురునివంటితిన్ననినెమ్మొగమును గలిగి సమస్తాభరణములచే నెంతయునలంకృతలై మంచికులంబును జాతియును గలిగి పెండ్లియాడందగినట్టికన్యలు పదునార్వురను నొసంగుచున్నాను' అనెను. ఆరాజకుమారుఁడు కపివీరుఁ డగుహనుమంతునివలన నాశ్చర్యకర మయినరామునిరాకను విని రామునిఁ జూడ నువ్విళ్లూరుచు మిక్కిలియుబ్బు నొంది మఱల హర్షము పట్టక హనుమంతునితో ని ట్లనియె. ఇది నూటయిరువదియేనిమిదవసర్గము.

(భరతుఁ డడుగఁగా హనుమంతుఁడు చిత్రకూటమును విడిచి నది మొదలు మరల భరద్వాజాశ్రమమునకు వచ్చువఱకుఁ గలరామవృత్తాంతమును జెప్పి తేపు పుష్యయోగమున రాముఁడు సీతాలక్ష్మణాదిపరివారసహితముగా వచ్చుటను జూతువని చెప్పుట. భరతుఁడు పరిపూర్ణమనోరథుఁడై యానందపారవశ్యము నొందుట.)

"మహారణ్యమునకుఁ బెక్కుసంవత్సరములు పోయి యుండిననానాథుఁ డగురాముని గుఱించినయింపారుముచ్చట నిప్పటికి వినఁగంటినిగదా! దీనినిబట్టి 'మనుష్యుఁడు బ్రతికియుండినయెడ నూఱుసంవత్సరముల కయినను దప్పక యానందము నొందును' అని లోకు లాడికొనెడియీవార్త యథార్థ మనియే నాకుఁ దోఁచుచు

డున్నయవస్థను జూడఁగానే ప్రియవార్త వినిపించుటకు క్షణము జాగుచేసినచో నతఁడు ప్రాణములు విడుచునని శంకించి గోడ యుండినఁ జిత్తరువు వ్రాయవచ్చు నను న్యాయమున తనవందనమునకు నుద్దేశ్యమైనవస్తువు నశించుచుండఁగా వందనముచేఁ బస యేమి యని యతని నుజ్జీవింపఁజేయుప్రియవార్తయే ముందు చెప్పినాఁడని గ్రహించునది. లేక భరతుని చూడఁగానే తనస్వరూపమును మఱచినాఁడు గాన వందనము చేయలేదనియు గ్రహించునది—గోవిందరాజులు.

న్నది. *రామునకును వానరులకును సమాగమ మెట్లు గలిగినది? ఎందులకొఱకుఁ గలిగినది? ఎచటఁ గలిగినది? అడుగుచున్నాను గాన యున్నది యున్నట్లు చెప్పుము" అనెను. ఆరాజకుమారుఁ డిట్లడిగి తపస్వులకుఁ దగినయొకయాసనమున నతనిని గూర్చుండఁబెట్టఁగా, నంత నతఁ డరణ్యంబున జరిగినరామునిచరిత్ర మంతయు భరతునకుఁ జెప్పవాఁడై'. ప్రభూ! మహాబాహూ! నీతల్లి కైకకు దశరథుఁడు వర మొసంగుటయు, దానింబట్టి రాముఁ డడవికిఁ బంపఁబడుటయుఁ, బుత్రశోకమున రాజు దశరథుఁడు మృతుఁ డగుటయు, దూతలు నిన్ను రాజగృహమునుండి యయోధ్యకుఁ దోడ్కొనివచ్చుటయు, నీ వయోధ్యకు వచ్చి రాజ్యమును శత్రువులపీఁచ మడఁచి పాలింప సమర్థుండ వయ్యుఁ జేకొన నొల్లకుండుటయు, సత్పురుషులధర్మము ననుష్ఠించువాఁడై నీవు చిత్రకూటపర్వతమునకుఁ బోయి రాజ్యమును గయికొమ్మని రామునిఁ బ్రార్థించుటయు, రాముఁడు తండ్రియాజ్ఞయందే నిలిచి రాజ్యము నొల్లక దిగవిడుచుటయు, నీ వాపూజ్యుని పాదుకలు గ్రహించి మరలివచ్చుటయు, ననెడివృత్తాంతము నీకుఁ గలరూపునం దెలిసియున్నది. నీవు పాదుకలను దీసికొని మరలిపోయిన తరువాత నేమి జరిగినదో చెప్పెదను వినుము. నీవు మరలి పోవఁగా నపు డపూర్వపురుషులను జూచుటవలన నవ్వనమునందలిమృగములును పక్షులును నటు నిటు కలంగఁబాఱఁగా నావనము మిక్కిలియుఁ బరితాపము నొందిన ట్లుండెను. అంత రాముఁ డడవియేనుఁగుల త్రొక్కుళ్లచే నొప్పి, సింహములు పులులు మృగములు మిక్కిలియుఁ గలిగి భయంకర మై నిర్జన మై మిక్కిలివిస్తీర్ణము గా నుండు దండకారణ్యమునకుఁ బోయెను. రామలక్ష్మణులును సీతయు విజన మయినయరణ్యమునఁ బోవుచుండఁగా బలవంతుఁ డగువిరాధుఁడు బిగ్గఱగా నఱచుచు వారికడ్డముగాఁ బొడకట్టెను. అట్లు బిగ్గఱగా నఱచుచు వాఁడు రాఁగా వారలు చేతులు మీఁదుగను దల క్రిందు గను నుండునట్లు వానిని బట్టియెత్తి గర్జించుచున్న మదగజమునుంబోలె పల్లములోఁ †బడవైచి పూడ్చిరి. అంత నాయన్నదమ్ములు రామలక్ష్మణు లట్లు దేవతలకును జేయ నలవి గానియాకార్యమును జేసి నాఁటిసాయంకాలము రమణీయమైనశరభంగాశ్రమమునకుఁ బోయిరి. శరభంగుఁడు శరీరము వదలి దేవలోకమునకుఁ బోయినపిమ్మట, సత్యపరాక్రముఁ డగురాముఁడు, అచటిమునుల కందఱకును బ్రణమిల్లి జనస్థానమును జేరెను. అంతఁ గొంతకాలమునకు శూర్పణఖ యనునది రామునియొద్దకు వచ్చెను. అంత రామునియాజ్ఞచే మహాబలుఁ డగులక్ష్మణుఁడు తటా

* వానరులతోడిసమాగమమును భరతుఁ డిచట నడుగుటవలన నింతకుముందు హనుమంతుఁడు భరతునకు వానరసేనలను రాముఁడు సమకట్టికొని వచ్చుట సామాన్యముగా చెప్పియుండవలయునని తెలియుచున్నది.

† ఇందులకు 'ప్రక్షిపన్తిస్మ' అని మూలము. ఇది బహువచనముగా నుండుటచే రామలక్ష్మణులతో సీతకూడ వానిని బడవైచుటయందు తోడుగా నుండెనని తెలియుచున్నది.

లున లేచి ఖడ్గంబు గొని యారాక్షసి ముక్కుఁజెవులను గోసివైచెను. మహాత్ముం డగురాముఁ డాజనస్థానమున నుండునపుడు, భయంకరకర్ము లగురాక్షసులఁ బదునాలుగువేలమందిని వధించెను. ఆరాక్షసులు పదునాలుగువేవురును నొక్కటిగాఁ గూడి రామునిపయి నెత్తివచ్చిరి. కాని రాముఁ డొక్కరుఁడె వారి నెదుర్కొని పోరి మూఁడుగడియలలో నందఱ నిశ్శేషముగా నఱుమాడినవాఁ డయ్యె. దండకారణ్యమున వసించుచుఁ దపోవిఘ్నము గావించుచుండినమహాబలవంతులును మహావీర్యవంతులు నయినయారాక్షసుల నందఱను రాముఁడు యుద్ధమున వధించెను. ఆరాక్షసులు యుద్ధమున నజ్జుగు జ్జయిరి. వారినాయకుఁ డగుఖరుఁడును హతుఁ డయ్యెను. దూషణుఁడు మొదటనే నశించెను. త్రిశిరుఁడు వానికివెంటనే కూలెను. అట్లు రామునిచే విరూప గావింపఁబడిన మూర్ఖురా లాశూర్పణఖ ఖరాదులు హతులు కాఁగా నంత రావణునొద్దకుఁ బోయి తన మొఱ చెప్పుకొనెను. రావణునియనుచరుఁడును భయంకరుఁడు నయినమారీచుఁడనురాక్షసుఁడు రత్నమయమైనయొకమృగమురూపము దాల్చి సీతముందటఁ జెరలాడి యాబిడ కాశ పుట్టించెను. అంత సీత రామునిం జూచి 'ఈజింకను పట్టి తెమ్ము. ఇదియుండినయెడ మన యీయాశ్రమ మాహా! యెంతరమణీయ మై మనసు నాకర్షించుచుండును' అనెను. అంత రాముఁడు విలు గొని, యామృగము పరుగెత్తఁగా దానివెంటఁ దఱుముకొని పోయెను. అంత నది చిక్కక పరుగెత్తుటను జూచి యది మాయయని తలఁచి గణుపులు చదునుగాఁ జెక్కంబడియున్నయొకనున్నని బాణ మేసి దానిని రూపుమాపెను. సౌమ్యా! అంత రాముఁడు జింక వెంటఁ బోయియుండఁగా, లక్ష్మణుఁడు గూడ తరలిపోవఁగా, నపుడు రావణుఁ డది సమయమని రామునాశ్రమమును బ్రవేశించెను. వాఁ డాకాశమున నంగారకగ్రహము రోహిణిని బట్టునట్లు బలాత్కారమున సీతాదేవిని బట్టుకొని, యంత నాబిడను గాపాడఁ గోరి యడ్డపడినజటాయు వనుగృధ్రమును యుద్ధమునం జంపెను. ఆరావణుఁ డిట్లు బలాత్కారమున సీతం బట్టుకొని వేగం బోయెను. అంతఁ బర్వతములుంబోలె నద్భుతాకారు లయినవానరులు ఋశ్యమూకపర్వతముపయినుండి, సీత నపహరించుకొని పోవుచున్న రాక్షసనాథుం డగురావణుని నాశ్చర్యపడి చూచిరి. అంత మహాబలుం డగులోకరావణుఁ డారావణుఁడు (మఱింతవేగమునఁ బోయి మనోజవం బగుపుష్పకవిమానము నెక్కి)సీతతో లంకను బ్రవేశించెను. రావణుఁ డాసీతను బంగారుపూఁత పూసినదియు సొగసయినదియు నగునొక గొప్పమందిరమున నునిచి మంచిమాటల నాశ్వాసించెను. సీత యామాటలను నారాక్షసరాజును గడ్డిపరకలుగాఁగొని వానినెంతమాత్రమును సరకుసేయకుండుటయు రావణుం డాబిడ నశోకవనమునకుఁ బంపఁగా నామె యందే యుండెను. అట రాముఁ డమ్మహావనమున నామృగమును జంపి మరలి యాశ్రమమునకు వచ్చెను. అట్లతఁడు మరలివచ్చి సీతనును గృధ్ర మగుజటాయువును గానక మిక్కిలివ్యథ నొందెను. అంత

రాముఁడు లక్ష్మణునితో సీతను వెదకుచుం బోయి తనతండ్రికిఁ జెలికాఁడగు జటాయువు హతుండయి యుండుటను జూచి యతని కగ్నిసంస్కారము గావించి గోదావరీ తీరమందును, అందుఁ బూచియున్న వనప్రదేశములందును, సీత పువ్వులకై వచ్చియుండునేమో యని సంచరించెను. ఆ రామలక్ష్మణులు మహారణ్యమునఁ బోవుచుఁ గబంధుఁడను రాక్షసునిఁ దారసించిరి. అంత సత్యపరాక్రముఁ డగు రాముఁడు కబంధునివచనముంబట్టి ఋశ్యమూకపర్వతమునకుఁ బోయి యచట సుగ్రీవునితో సమాగమము నొందెను. ఆ రామసుగ్రీవు లిరువురకు నొకరి నొకరు చూచుటకు మును పే నొండొరులతో సఖ్యము చేసికొనవలయు నని మనస్సునఁ గోరిక పుట్టెను. మున్ను సుగ్రీవుని నతనియన్న యగు వాలి క్రుద్ధుఁడై రాజ్యమునుండి వెడలఁగొట్టియుండెను. ఆ రామసుగ్రీవు లొకరొకరి ప్రయోజనము లొండొరులతోఁ జెప్పికొనఁగా వారికి స్నేహము మిక్కిలి యతిశయించిన దయ్యె. రాముని భుజపరాక్రమమున సుగ్రీవుఁడు యుద్ధమున మహాకాయుండును మిక్కిలిబలవంతుఁడు నగు వాలిని జంపి తనకు రాజ్యమును సంపాదించుకొనెను. సుగ్రీవుఁడు రాజ్యమునఁ బట్టము కట్టుకొని సమస్తవానరులతోఁ గూడినవాఁ డయ్యెను. మఱియు నతఁడు రాజకుమారిని సీతను వెదకించునట్లు రామునితోఁ బ్రతిజ్ఞ గావించెను. మహాత్ముఁ డగు వానరేంద్రుఁడు సుగ్రీవుఁ డాజ్ఞ చేయఁగా సీతను వెదకుటకై పదికోట్లవానరవీరులు సమస్తదిక్కులకును బోయిరి. అట్లు సీతను వెదకుటకై పంపఁబడినవారిలో మేము పర్వతోత్తమ మయినవింధ్యమునందే బహుకాలము జాగు గలుగ బిలమునందు బహుదూరము పోయి దారి తెలియక మిక్కుటమయినశోకమునఁ దప్తులమయి యుండఁగా పెద్దయుగాలము గడచినది. జటాయువువన్నయుఁ బరాక్రమశాలియు నయినసంపాతి సీతాదేవి లంకయందు రావణుమందిరమున నున్నదని మాకుఁ జెప్పెను. అప్పుడు నేను బంధువులయిన వానరులందఱు నట్లు దుఃఖావేశము నొందియుండుటను జూచి వారిదుఃఖముపోఁగొట్టువాఁడనై నాదుబలము నవలంబించి నూఱుయోజనములు విఱివి గల సముద్రమును దాఁటితిని. ఆ రావణునిగృహమున నశోకవనమునందు సీత యొంటిమైనుండఁ గంటిని. ఆబిడ మున్ను కట్టినపట్టుపుట్టముతో నంగములు ముఱికి గ్రమ్మ నానందముదూలి పాతివ్రత్యమును మాత్రము దృఢముగా నవలంబించి యుండెను. నేను యథావిధి నాబిడను సందర్శించి యనిందితయైన యాసుందరివృత్తాంతము నంతయు నడిగి తెలిసికొని గుఱుతునకై రాముఁ డిచ్చిన యుత్తమ మయిన యంగుళీయకము నొసంగితిని. సీత నన్నుఁ జూచి మరలఁ బ్రతుకునం దాశగొన్న దయ్యె. సీత నాకు మిక్కిలియుఁ గాంతిదళ్కొత్తుచున్న దన చూడామణిని రామున కానవాలుగా నొసంగెను. (నే నపుడు రావణునిమనసునకు మిక్కిలియుఁ గూర్చు నశోకవనికను ధ్వంసముగావించి రాక్షసోత్తములను యుద్ధమున వధించి లంకను భస్మము సేసి మనం బుబ్బునఁ జెలంగ నానవాలుగాఁ జూడామణిని దీసికొని కృతార్థుఁడనై వచ్చితిని.) నేను మరల వచ్చి యెట్టి కార్యమును

జుల్కఁ జేయునట్టి రాముని సందర్శించి యతనికి నానవాలుగా సీత యొసంగినయు త్తమమణిని కాంతి మిక్కిలి దళుకొత్తుచున్నదానిని నిచ్చితిని. రోగము ముంచుకొని ప్రాణములు వెడలనుండునపుడు అమృతపానంబు చేసి రోగి మరల బ్రదుకునట్లు లింతకు ముందు జీవితముపై నిరాశ గలిగియుండిన రాముఁడు సీతక్షేమవృత్తాంతమును విని యెంతయు సంతుష్టుండై మరల జీవితముపయి నాశం బూనెను. రాముఁడంత లంకకుఁ బోవు ప్రయత్నము సేసి మనంబున రావణుని వధింప నెంతయుఁ దమకంబు మీఱ ప్రలయకాలమున ముల్లోకములను సంహరింపఁ గోరి చిమ్మి రేఁగిన కాలాగ్నివలె నయ్యెను. అంత రాముఁడు సముద్రమును జేరి నళునిచే సేతువును గట్టించెను. ఆ సేతువు మీఁదనే వానరసైన్యమంతయు సముద్రము దాఁటెను. నీలుఁడు ప్రహస్తునిఁ జంపెను. రాముఁడు కుంభకర్ణునివధించెను. ఇంద్రజిత్తును లక్ష్మణుఁడు పరిమార్చెను. రావణుని రాముఁడు తానే వధించెను. అంత నింద్రుఁడును యముఁడును వరుణుఁడును శివుఁడును బ్రహ్మయు స్వర్గమందున్న దశరథుండును శ్రీమంతుఁడైన పరంతపుఁడగు రామునొద్దకు వచ్చి యతనికి వరము లొసంగిరి. ఋషులును దేవర్షులును వచ్చి రామునకు వరము లిచ్చిరి. రాముఁడట్లు దేవతలవలన వరములొంది దానం జేసి మృతులయిన వానరులం బ్రతికించి వారలతో సంతోషమునఁ గూడి పుష్పకవిమానమారోహించి కిష్కింధకు వచ్చెను. అతఁ డిపుడు మరల గంగాతీరమునకు వచ్చి భరద్వాజాశ్రమంబున నమ్మునిసన్నిధానమున నున్నాఁడు. రేపు పుష్యనక్షత్రంబున నీ వతని నిర్విఘ్నముగాఁ జూడఁగలవు (పుష్యయోగము లభించుటకే యిపుడు గంగాతీరమున నున్నాఁడు)' అనెను. అంత భరతుండు సత్యమును నుహార్థంబు నగు హనుమంతునివచనమును విని హర్షించి యంజలి గీలించి 'చిరకాలమునకు నామనోరథ మీడేఱినది' యని మనస్సునకెంతయు సంతసము గూర్చు పలుకు పలికినవాఁడయ్యె. ఇది నూటయిరువదితొమ్మిదవసర్గము.

భరతుఁడు సమస్తపురవీథిగోపురాదుల నలంకరింప నాజ్ఞ సేయుట అంతఃపురజనపటవర్తక రాజపరివారాదులు మొదలుగా నగరజనులెల్ల రామునిఁ జూచుటకై శత్రుఘ్నుపంపున నందిగ్రామమును బ్రవేశించుట. అందఱితోడ భరతుఁడు రామునిఁ గూర్చి పోవుట. భరతుండు రామునిఁ గలియుట. అందఱును భరతాశ్రమమునకు వచ్చుట. రాముఁడు పుష్పకమును గుబేరున కిచ్చి భరతాశ్రమమున వసిష్ఠాదులతో నుచితాసనంబున గూర్చుండుట.

శత్రువీరుల నుఱుమాడు సత్యపరాక్రముండగు భరతుఁడు పరమానందకరమయిన హనుమంతునివచనమును విని సంతుష్టుఁ డగు శత్రుఘ్నునిఁ జూచి 'పుర

షులు శుచు లయి సమస్తదైవతములను పట్టణమందలి చతుష్పథమంటపములను మంచిగంధములచేతను పుష్పమాలికలచేతను వాద్యములచేతను బూజింతురుగాక. స్తోత్రములందును బురాణకథలందును బ్రౌఢు లయిన స్తుతిపాఠకులును, పట్టణంబునఁ గలవైతాళికు లందఱును, వాద్యములు వాయించుటయందు నేరుపు గలవారెల్లవారును వేశ్యాసమూహములును చందురునివంటి రాముని నెమ్మొగమును జూచుటకు బయలువెడలుదురు గాక' అని యాజ్ఞాపించెను. భరతుఁడు చెప్పినది విని శత్రువీరుల నుఱుమాడువీర్యశాలి యగుశత్రుఘ్నుఁడు కూలివాండ్రను పెక్కువేలమందిని రప్పించి వారితో 'నందిగ్రామమునుండి యయోధ్యవఱకుఁ బల్లములందు మట్టిద్రోసియు మిట్టపల్లములను సరిచేసియు మిట్టలను ద్రవ్వి యెత్తివైచియు భూమియంతయు సమముగాఁ జేయవలయును. మఱికొందఱు, భూమినంతటిని మంచువంటిచల్లనినీటిచేఁ దడిపి యంత నంతటను గలయఁ బేలాలును బూలును జల్లుదురు గాక. సూర్యుఁ డుదయించునంతకు, పట్టణంబులం దెల్ల మేటి యయినయయోధ్యయందలి, పెద్ద మార్గములందును ధ్వజము లెత్తుదురు గాక. పూదండలవరుసలను గట్టి దారముల గ్రువ్వంబడని తామరలు కలువలు మొదలగువిడిపువ్వులను జెరివి గృహముల నలంకరింతురు గాక. విశాల మగురాజమార్గమునందు వందలకొలఁది మనుష్యులు మంచివాసనలు గుబాళించు నయిదువన్నెల ముగ్గుఁబిండ్లచే ముగ్గులు పెట్టి యలంకారము సేయవలయును' అని యాజ్ఞాపించెను. రాజభార్యలును, మంత్రులును, సైనికులును, సైనికులభార్యలును, బ్రాహ్మణులును క్షత్రియులును సంఘములలో ముఖ్యు లయినవారును ఆసమూహములును రాముని దర్శింప వెడలిరి. ధృష్టియు జయంతుఁడును విజయుఁడును సిద్ధార్థుండును అర్థసాధకుఁడును అశోకుఁడును మంత్రపాలుఁడును సుమంత్రుఁడును సువర్ణాభరణాలంకృతము లయినమత్తగజములును నుత్తమాశ్వములును వేలకొలఁదిని ముందును వెనుక నలంకరింప బయలుదేఱిరి. రాజున కంతరంగు లయిన వేఱుకొందఱు నడుమునకు బంగారుమొలకు గట్టంబడి మగయేనుంగులతోఁ గూడి యున్నయాఁడుగజముల నారోహించి వెడలిరి. మఱికొందఱు మిక్కిలిమహారథు లగు వారు మంచిగుఱ్ఱములు పూన్చినరథముల నెక్కి వెడలిరి. శక్తులను అష్టులను ప్రాసములను దాల్చి రౌతులు ధ్వజములను బతాకలనుంగొని యెక్కియున్న వేలకొలఁది గుఱ్ఱపుదడములును, మేటి పురుషులతోఁ గూడియున్న మంచి పదాతులు వేలకొలఁదియుఁ, బరివేష్టించి రా వీరులు వెడలిరి. అంత దశరథుని భార్యలందఱును పల్లకీల నారోహించి కౌసల్యను సుమిత్రను ముందిడుకొని బయలువెడలిరి. *కైకేయీ సహితముగా దశరథునిభార్య లందఱును నపుడు నందిగ్రామమునకు వచ్చిరి. అయోధ్యానగరములోనివార లందఱు నపుడు నందిగ్రామమునకు వచ్చిరి. అంతఁ జతు

* ఇట భరతుఁడు కైక నుపేక్షించి పిలువకుండుటచే నాబిడ కౌసల్యాదులతో బయలువెడలక పిమ్మట బయలుదేఱి నందిగ్రామమున నందఱితోఁ గలసి చేరెనని తెలియునది.

రంగసైన్యములు నడచునపుడు గుఱ్ఱంబులగొరిజలచప్పుళ్లును రథనేమిధ్వనులును, శంఖభేరీనాదములును భూమిని నల్లలాడించునవియుంబోలెఁ జెలంగినవి. భరతుండు మహాత్ముండును బహుధార్మికుఁడును సమస్తధర్మంబులఁ బ్రాజ్ఞుండు నగుటవలన నన్నకై యుపవాసంబులఁ గృశించి కుందుచు నారచీరలును గృష్ణాజినమును ధరించియుండెను. మఱి యంతకు మునుపు రామునిరాక హనుమంతునివలన విని హర్షము నూనియుండెను. అట్టిభరతుఁ డపుడు బ్రాహ్మణోత్తములును వర్తకులును నమ్మైసంఘముల ముఖ్యు లగువారలును బరివేష్టించి నడువ, వసిష్ఠాదిమంత్రులు మాల్యములను గుడుములను జేకొని వెంబడింప, శంఖభేరీధ్వనులు ఘోరుకొన వందిజనులు కైవారములు సేయ, రామపాదుకలు శిరసున వహించి తెల్లని పూలదండలచే నలంకృత మయిన శ్వేతచ్ఛత్రమును బంగారుకాఁడలతో రాజార్హములై యొప్పుచున్న తెలిచామరములను దీసికొని సుమంత్రాదిసచివులతోడ రాము నెదుర్కొనఁ బోయెను. భరతుఁడు కొంతసేపు నిరీక్షించి యంత హనుమంతునిఁజూచి 'నీకు వానరులకు సహజ మయినచిత్తచాపల్యము కలుగదు గదా. ఆచాపల్యమున నూరకనే రాముఁడు వచ్చుచున్నాఁడని చెప్పవు గదా! ఏల యనఁగా కాకుత్స్థతిలకుండును బూజ్యుండును బరంతపుఁడు నగురాముఁ డింకను గనఁబడలేదే! అతఁడు దూరమున నున్నను నతనిసేన మొగమున వచ్చువానరులయినను గనఁబడవలయునే! వారును గనఁబడలేదుగదా! వారు కామరూపులు కావున స్వరూపముతోఁ గనఁబడకున్నను మఱి వేఱురూపమున నయినను గనఁబడలేదేమి?' అని యడిగెను. భరతుం డిట్లు చెప్పఁగా హనుమంతుఁడు సత్యపరాక్రముఁ డగునతనికి రాముఁడును వానరులును వచ్చుటకు జాగయినకారణమును విన్నవించువాఁడై 'భరద్వాజునియనుగ్రహమునం జేసి వృక్షము లన్నియు నెప్పుడును ఫలములు గలిగి పుష్పములు పూచుచు తుమ్మెదలు మత్తిల్లి ఝుంఝుమ్మని రవళిసేయం దేనియలు దొరఁగుచున్నవి. వానిని బొంది వానరు లుబ్బుచు నున్నవారు. పరంతపా! దేవేంద్రుఁ డారామునకు వానరు లున్నచోట్ల వృక్షము లెల్ల నకాలమున ఫలించి యుండునట్లు వర మొసంగెను. అట్లె భరద్వాజమహర్షియు రామునకును నతనివానరసైనికులకును వృక్షము లెల్లఁ దేనియలు దొరఁగుచుండునట్లు సర్వగుణసంపన్న మయినయట్టి యాతిథ్యము(విందు)నొసంగినవాఁడయ్యెను. కాఁబట్టి వనంబునందు వృక్షము లకాలమున ఫలించుటయు దేనియలు దొరఁగుటయు యుక్తమే. కావుననే యీలాగున వానరులు మిక్కిలియుబ్బునఁ గావించుభయంకర మగుకోలాహలధ్వని యదె వినఁబడుచున్నది. కాన యిప్పుడు వానరసేన గోమతీనదిని దాఁటుచుండు నని తలంచెదను. కనుకనే యీధ్వని యింత బెట్టిదముగా నున్నది. ఆనదిని దాఁటుటే కాదు. పయికిఁ జిమ్మి రేఁగి దొరఁగుచున్నదుమ్ము ముంపును జూఁడు. దీనినిబట్టి వానరులు వాలుకినీనదియందు పోవుచుందు రని తోఁచుచున్నది. వానరు లిపుడు రమణీయ మయినసాలవనంబున వృక్షములు గదలించు

చు విహరించు చుందురని తలంచెదను. కావున వారియీవిలంబము. అదిగో దూరమునఁ జంద్రునివలె నిర్మలమై పుష్పక మనుదివ్యవిమానము చూపట్టు చున్నది. దీనిని బ్రహ్మదేవుఁడు మనస్సుచేతనే నిర్మించినాఁడు. మహాత్ముం డగురాముఁడు రావణుని బంధుసహితముగాఁ జంపి దీనిని బడసినాఁడు. బాలసూర్యునివలె వెలుంగుచున్నదె రాముఁ డెక్కి వచ్చుచున్నయీదివ్యవిమానము బ్రహ్మదేవుని ప్రసాదముచేఁ గుబేరునికి లభించినది. మనోవేగమునం బోవునది. ఇందు వీరు లయినయన్నదమ్ములు రామలక్ష్మణులును సీతయు మహాతేజుం డయినసుగ్రీవుఁడును రాక్షసరాజగువిభీషణుఁడును గూర్చుండియున్నవారు' అనెను. అంత 'వీఁడుగో రాముఁడు వచ్చినాఁ' డన్నంతనే స్త్రీలు బాలురును వయసుకాండ్రును వృద్ధులును నుబ్బి చెలరేఁగి కావించుకోలాహలధ్వని నింగి ముట్టినదయ్యె. ఆమనుష్యులందఱును రథములు గజములు గుఱ్ఱములు మున్నగువాహనములనుండి డిగి నేలపయి నిలుచుండి యాకాశంబునఁ జంద్రునిం బోలె పుష్పకవిమానంబునఁ దేజరిల్లుచున్న రామచంద్రునిం గాంచిరి. భరతుఁ డంత మిక్కిలి సంతోషమున రామున కెదుర్కొని నిలిచి చేతులుమోడ్చి 'పదునాలుగేండ్లు నిండఁగా మరలఁ దప్పక వత్తునని యాడినమాటఁ దప్పక రాముఁడు విజయం చేసినాఁ' డని యతనిని గొనియాడెను. భరతాగ్రజుం డగురాముఁడు, విశాలము లయిననిడువాలు కన్నుంగవతో బ్రహ్మ మానసముచే సృజించిన యాదివ్యవిమానంబున నధివసించి రెండవ దేవేంద్రునివలె శోభిల్లెను. అంత నపుడు భరతుఁడు మేరుపర్వతముపయి నున్నసూర్యునికి నమస్కరించునట్లు పుష్పకవిమానపయి నున్నరామునకుఁ బరిశుద్ధహృదయమున నమస్కరించెను. అంత హంసాకారము లయినప్రతిమలతోఁ గూడి, మహావేగమును మిక్కిలియుత్తమంబు నయినయవ్విమానము రామునను మతిమీఁద నేలకు వ్రాలెను. రాముం డందఱకును జూపుటకై సత్యపరాక్రముం డగుభరతుని పుష్పకవిమానముపయి నెక్కించుకొనఁగా నతఁడు రామసాన్నిధ్యము నొంది ముదం బంది మరల రామునకు నమస్కారము గావించెను. రాముఁడు చిరకాలమునకుఁ గన్నులకు విందుగా నగపడినవాఁ డయినతమ్ముని భరతుని నెత్తి, తనతొడపైఁ గూర్చుండఁ బెట్టుకొని ముదం బెంతయుఁ బొదల బిగ్గఁ గౌఁగిలించుకొనెను. అంత భరతుఁడు తనకు మ్రొక్కిన లక్ష్మణునిని సంభావించి * సీతాదేవికిని నమస్కరించి సంతోషమునఁ దననామము గూడ వచించెను. భరతుఁడు సుగ్రీవునిని జాంబవంతుని, నంగదుని, మైందద్వివిదులను, నీలుని, ఋషభునిఁ, గౌఁగిలించుకొని సంభావించెను. భరతుఁడు మఱియునలుని, గవాక్షుని, గంధమాదనుని, శరభునిఁ, బనసునిఁ, గౌఁగిటం జేర్చి గారవించెను. ఆవానరు

* ఇట లక్ష్మణుండు చేయ నున్ననమస్కారమును భరతుఁడు రామసన్నిధియందు వలదని వారించినట్లును గొందఱు చెప్పెదరు. భరతుఁడు లక్ష్మణుని సంభావించినపిదప సీతాదేవికి మ్రొక్కుటను జెప్పుటచే, సీత రామునిసమీపముననే తారాదులతోఁగూడఁ గొంతయవ్వలగా నుండెనని తెలియుచున్నది. గోవిందరాజులు.

లందఱును గామరూపులు గావున మున్నే మనుష్యరూపము ధరించి యుండిరి. కాన వారలపుడు భరతుం జూచి మిక్కిలిసంతుష్టులై కుశలము నడిగిరి. అంత మహాతేజుండును ధార్మికోత్తముండు నయినయారాజకుమారుఁడు వానరేంద్రుని సుగ్రీవుని మరలఁ గౌఁగిలించుకొని, 'సుగ్రీవా! నీవు మాకు నలువురకును నయిదవతోఁడంబుట్టువయితివి. లోకమున మంచిమనస్సున నుపకారము సేయువాఁడు మిత్త్రుఁడగును. అపకారము చేసినవాఁడు శత్త్రుఁడగును. అపకారమే శత్త్రులక్షణము' అనెను. పిదప భరతుఁడు విభీషణునిఁ జూచి సామవచనములతో 'మాభాగ్యవశమున నీవు రామునకు సహాయుఁడవై యుండి మిక్కిలియుఁ జేయనలవి కానికార్యము చేసితివి' అనెను. అప్పుడు శత్రుఘ్నుఁడును రామునకును లక్ష్మణునకు నమస్కారము గావించి, పిదప సీతాదేవిచరణములకు వినయంబుతోడఁ బ్రణమిల్లెను. రాముఁడు శోకంబునఁ గృశించి యెంతయు దురపిల్లుచుండినతనతల్లి కౌసల్యయొద్దకుఁ బోయి, 'మనువు నీవు వలదన్నను వినకపోయినందులకు మనస్తాపము వల'దని యామెమనసు కలంకదేర్చుచు, నామెపాదంబులు పట్టికొని నమస్కారము గావించెను. రాముఁడు సుమిత్త్రకును * కీర్తిమతియగుకైకేయికిని దక్కినతల్లులకందఱకును నమస్కరించి యంతఁ బురోహితుండగువసిష్ఠుకడకు వచ్చి మ్రొక్కెను. పురజనులందఱును రామునిం జూచి 'మహాభాగా! కౌసల్యకానందము వర్ధిల్లఁజేయువాఁడా! నీకు స్వాగత మగుఁగాక' యనిరి. ఆపౌరు లట్లు తామరమొగ్గలవలెఁ గావించినపెక్కువేలచేమోడ్పులను రాముఁడు చూచి యాదరించెను. భరతుఁడు ధర్మవిదుండు గావునఁ దొల్లి తనయొద్ద రాముఁ డొసంగినయాపాదుకలను జేకొని నరనాథుం డగురామునిపాదములకుఁ దానే తొడిగెను. అప్పుడు భరతుఁ డంజలి గీలించి రామునితో 'రాజా! నే నిల్లడ గా రక్షించుచుండినయీనీదురాజ్యమును నిదిగో నీ కప్పగించివైచితిని. నీవు మరల నయోధ్యకు వచ్చి రాజుగా నుండుటను జూచుచున్నాఁడను గాన యిపుడు నాజన్మము కృతార్థమయినది. ఇప్పుడు నాకోర్కి యంతయుఁ బండినది. నీవు, బొక్కసమును ధాన్యశాలలను, పట్టణమును, సైన్యమును, జూచుకొనుము. నీప్రభావంబున సమస్తమును నీవు పోవునప్పటికన్న నిప్పటికిఁ బదిమడుంగులుగా వృద్ధిఁ బొందియున్నవి.' అనెను. అట్లు పలుకుచున్న భరతునికిఁ దనయన్నయందుఁ గలభక్తిపారతంత్ర్యమును జూచి తమకులమువారియం దిటువంటితోఁబుట్టువనము లేమికి వానరులందఱును రాక్షసుఁ డయినవిభీషణుఁడుగూడఁ గన్నీరు విడిచిరి. అంత రాముఁడు సంతోషమునఁ దనతోడఁబుట్టిని భరతునిఁ గూర్చుండఁబెట్టుకొని సైన్యసమేతముగా నాపుష్పకవిమానముతోనే భరతాశ్రమమగునందిగ్రామమునకుఁ బోయెను. రాముఁడు నందిగ్రామము చేరినపిదప నపుడు సైన్యములును దానును బుష్పకవిమానముపయినుండి భూమికి దిగెను. రాముఁడపుడు

* ఇట కైకను కీర్తిమతి యనుట రావణాదివధరూపమయిన దేవతాకార్యమును జరిపించుట కావిడ హేతువగుటంబట్టి యని తెలియునది.

మిక్కిలియుత్తమ మగునావిమానమును జూచి 'నీ విఁకఁ గుబేరునకు వాహనముగా నుండుము. అనుజ్ఞయొసంగితిని, పొమ్ము' అనెను. అంత నుత్తమం బగునావిమానము రామునియనుజ్ఞ నొంది యుత్తరదిక్కుగాఁ బోయి కుబేరునిభవనమును జేరెను. దేవేంద్రుఁడు బృహస్పతిచరణములకు మ్రొక్కినట్లు రాముఁడు తన కనురూపుఁ డగుపురోహితుని వసిష్ఠునిపాదములను బట్టికొని మ్రొక్కి యతఁడును దానును సాగ సయిన యాసనంబుల వేఱువే ఱయినవానియం దేకకాలంబునఁ గూర్చున్నవాఁ డయ్యె. ఇది నూటముప్పదియవసర్గము.

---

* భరతుఁ డంజలిబంధపూర్వకముగా రాముని రాజ్యముఁ గయికొనఁ బ్రార్థింపఁగా నతం డంగీకరించి లక్ష్మణాదిసహితముగా జటలు విడిచి మంగళస్నానముచేసి సుగ్రీవాదులతోఁ దివ్యరథమున నయోధ్యను బ్రవేశించుట. అందు మాణిక్యమంటపమున దివ్యసింహాసనమున జాంబవద్ధనుమదాదులు రత్నకాంచనకలశంబులం దెచ్చిన తీర్థోదకములచే వసిష్ఠాదులు శ్రీరామున కభిషేకముగావించుట. రాముఁడు విభీషణసుగ్రీవాదులందఱకును సన్మానములు సేయుట. సుగ్రీవాదులు తమతమనగరములకుఁ బోవుట. భరతునియావరాజ్యమునకుఁ బట్టముగట్టుట. రామరాజ్యపాలనవైభవము. శ్రీరామాయణపఠనశ్రవణాదిఫలశ్రుతి.

భరతుఁడు శిరమున నంజలి గీలించి కైకకానందము పెచ్చువెరుఁగుచుండ, సత్యపరాక్రముఁ డగుతనయన్నను రామునిఁ జూచి "నీవు రాజ్యమును దిగవిడిచి వనవాసము నంగీకరించుటచే నాతల్లిని సంతోషపెట్టితివి. పిదప నీరాజ్యమును జిత్రకూటమున నా కొసంగితివి. నీ వేవిధంబున నిల్లడగా నాయొద్దరాజ్యము నుంచితివో

* ఇట పుష్పకము కుబేరునొద్దకుఁ బంపి వసిష్ఠునితోఁ గూడికొని భరతునియనుజ్ఞ లేక యయోధ్యను బ్రవేశింపరాదని రాముఁడు నందిగ్రామమందే యాసనమునఁ గూర్చుండి యుండుటయు పౌరవర్గము నల్లై కూర్చుండుటయు తల్లులును సమీపమున నేయుండుటయును జూచి యప్పటిసూక్ష్మేంగితములను నిపుణుండు గాన భరతుఁడు గనుఁగొని రామునకుఁ దనహృదయమును నివేదించుచున్నాఁడు. ఇట 'శిరస్సనం దంజలి గీలించి' యనుట పూర్వకృత మయినప్రపత్తిని తలఁపించుచున్నది. అనన్యగతికత్వమును సూచించుముద్రయే కదా యంజలి. గోవిందరాజులు.

యావిధముననే యారాజ్యము మరల నీకొసంగి యాబరువు తీర్చుకొనుచున్నాను. ఈహేతువునుబట్టి నీవు మరల నంగీకరింపక తీఱదు. 'అయోధ్యయందు రాజ్యభోగముల నిచ్చకొలఁది ననుభవించెద. రాజ్యమును నీవే పాలింపు' మందువా? లేక 'నీవు మరల నడుగువఱకు నిల్లడను నేనుబెట్టుకొనియున్న దోషము లేదు. అడిగినపు డి' మ్మందువా? బలిష్ఠం బయినయొకగొప్పవృషభము తా నొక్కటి మోయుబరువును లేదూడపయిని వైచినయెడ నది యావెనుబరువును మోయఁజాలనట్లు మహాబలవంతుం డగునీ వెక్కుఁడు పూనఁదగినయీరాజ్యభారమును నాపయి నుంచినయెడ నా వెనుభారము నేను వహింపశక్తుఁడనుగాను. 'అయిన నింతవఱకు నెట్లువహించియుంటి' వందువా? గొప్ప దయినజలప్రవాహములచేఁ దెగి నీరు కాఱుచున్నయనకట్ట, గడ్డియాకుమండెలు మొదలగునవి వేసి కప్పిపుచ్చనిచో దాని నిలుపుట కష్ట మగునట్లు, పెక్కుఛిద్రములు గలరాజ్యమును మంత్రగోపనము మొద లయినరాజగుణములచే ఛిద్రములను గప్పిపుచ్చనిచో దాని నిలుపుట యశక్యము. అంతటిశక్తి నాకుఁ గల దా? 'నావలెనే, నీవు గుణములచే లోకమును వశీకరించుచున్నా' వందువా? అరిందమా! మంచియశ్వమువలె గర్ధభము పరుగెత్తంజాలనట్లు, హంసవలెఁ గాకి యెగురఁజాలనట్లు, నీవలె రాజ్యభారమును నడపుటకు నే నోపఁజాలను. 'అప్పటికి నాయుపోద్బలముక్రింద నీవేరాజ్యమును పాలించుచుండు' మందువా? మహాబాహూ! ఇంటిలోపల నొకవృక్షము నాటఁగా మిక్కిలిపెద్దదియై యెక్కుట కెంతమాత్ర మలవి గానట్లు గొప్పబోదెయును బెనుగొమ్మలును గలిగి పువ్వులును బూచి ఫలింపకయే నశించెనేని, అదియెందులకు నాటంబడినదో యాఫలము నాటినవానికిఁ గలుగకయే పోవునుగదా. *దశరథుఁడు, పుత్రకామేష్టి మొదలయినవి చేసి నిన్నుఁ బడయఁగా, నీవును బెద్దపెరిఁగి మహాపరాక్రమశాలివై బంధువులును మిత్రులును గొప్పవారునుగలిగి, కల్యాణగుణము లెల్లఁ బొంది వెలయుచున్నావు. అట్టినీవు నిన్నుఁ బడసినందులకు ఫలముగా రాజ్యమును బాలించి భక్తులును భృత్యులు నగు మమ్ము నేలుకొనవేని, మున్నుదాహరించినవృక్షముపోలిక యగును. ఈపోలిక నీకొఱకె చెప్పఁబడిన దని తెలియఁదగును. ఇప్పుడు నీవు పట్టాభిషిక్తుండవై పట్టపగలింట మిక్కిలి జ్వలించుచున్నసూర్యునివలె, తేజంబు నలుగడల వెలుంగుచుండఁగా నిన్ను లోక మంతయుఁ జూచునుగాక. రామా! నానావిధవాద్యధ్వనులు, మేలుకొలుప నర్తనము గావించువారలకాంచీనూపురధ్వనులును లలితనృత్తధ్వనులును, రమణీయములయినగీతికలధ్వనులును, వీనులఁ జెలంగ మేలుకొనుము. ఇట్లు సమస్తరాజభోగముల ననుభవింపుము. జ్యోతిశ్చక్ర మెంతకాలము తిరుగుచుండునో, భూమి యెంతవఱకు నుండునో, యంత

* విత్తునాటుటకును పుత్రకామేష్టి మొదలయినవి సేయుటకును, గొప్పబోదెకును తోఁబుట్టువులు కలిమికిని, కొమ్మలకును సుగ్రీవాది మిత్రగణమునకును, పువ్వులకును కల్యాణగుణములకును, ఫలింపక పోవుటకును రాజ్యము పాలింపకపోవుటకును, సామ్యము తెలియునది.

కాలము నీవిచట సమస్తరాజ్యమున కేలికవై యుండుము. నదుమఁగూడ నాకు రాజ్యముమీఁదియపేక్ష గలుగదు" అనెను. శత్రుపురములను జయించువీరుఁడు రాముఁడు, భరతుఁడు చెప్పినది విని, వల్లె యని యంగీకరించెను. అంత నిలుచుండినభరతుఁడును శుభ మయినయాసనమునఁ గూర్చుండెను. అంత శత్రుఘ్నుఁ డాజ్ఞాపింపఁగా, పట్టాభిషేకముహూర్త మతిక్రమింపకుండ నతిశీఘ్రముగాను హస్తలాఘవముచే సుఖముగాను బని చేయఁ గలనిపుణు లగుక్షౌరకులు, గడ్డమును మీసలను గత్తిరించునట్టివారు, రామునకు భరతునకును లక్ష్మణునకును మీసలను గత్తిరించిరి. *మొదట భరతుఁడు స్నానము చేసెను. అంత మహాబలుఁ డగులక్ష్మణుఁడు స్నానము గావించెను. అంత వానరరా జగుసుగ్రీవుఁడును, రాక్షసరా జగువిభీషణుఁడును స్నానము గావించిరి. పిదప రాముఁడు జటలువిడఁదీసి సున్నగాసవరింపఁబడినతలవెండ్రుకలతో స్నానము గావించి నానావిధము లయినపూవులు గ్రుచ్చంబడుటచే వింత లగుపూదండలచేతను మంచివాసనలు గుబాళించుచు కర్పూరకస్తూరీకుంకుమాదిమిళిత మయినచందనముచేతను నలంకృతుఁడై మేలయినపీతాంబరములు గట్టి మిక్కుట మయిన తేజస్సుచే జ్వలించుచు సింహాసనమునఁ గూర్చుండెను. వీర్యవంతుఁడును నిక్ష్వాకుకులవర్ధనుండు నగు శ్రీమంతుఁడు శత్రుఘ్నుఁడు, రామునకును లక్ష్మణునకును భరతునకును హారకేయూరాదులఁ దొడిగించి యలంకారము సేయించెను. అంతనపుడు దశరథభార్యలు, మంచియగుమనంబున, నందఱును జేరి సీతాదేవికి, తామే తమచేతులార మనస్సును హరించునట్టియలంకారము గావించిరి. అంతఁ గౌసల్యాదేవి పుత్రునియందు మిక్కిలిమక్కువ గలది గావున, మిక్కిలియు నుబ్బు నొంది, యతనిమిత్రము లయినవానరులభార్యల కందఱకును బ్రయత్నపడి మనోహర మయినయలంకారము గావించెను. అంత శత్రుఘ్ను నాజ్ఞవలన సుమంత్రుఁ డనుసారథి, యన్నియవయవములును సొగసు గులుకుచున్నయుత్తమ మయినరథమును, మే లయినయశ్వములం బూన్చి తెచ్చెను. మహాబాహుండును సత్యపరాక్రముండు నగురాముఁడు సూర్యమండలమువలె వెలుఁగుచు దివ్యం బగునమ్మేటిరథము వచ్చుటనుజూచి దాని నారోహించెను. సుగ్రీవుఁడును

* 'న మే స్నానం బహుమతం తం వినా కైకయీసుతం' 'కైకకొడుకు భరతుఁడు స్నానముసేయక నేను స్నానముచేయుట కొల్లను' అని రాముఁడుమున్న చెప్పియున్నచొప్పున, ప్రథమస్నానము భరతుఁడుచేసెను. సుగ్రీవుఁడును గిష్కింధనుండి వెడలివచ్చినదాదిగా స్నానములేనందున నతనికప్పుడు స్నానము. అట్లె లంకను విడిచివచ్చినది మొదలుగా స్నానములేనందున విభీషణునకును నప్పుడుస్నానము. శత్రుఘ్నుఁడు స్నానముచేసినట్లు చెప్పమిచే, నపు డతని కవసరము గాదు. మఱి పూర్వ మతఁడు వ్రతము పూనినట్లును జెప్పఁబడలేదు 'నన్దిగ్రామే జటాం హిత్వా భ్రాతృభి స్సహితోఽనఘః' అని నందిగ్రామమున తమ్ములతోఁగూడ జడలు విడఁదీసికొన్నట్టు సంక్షేపముగా చెప్పఁబడియుండుటంబట్టి, శత్రుఘ్నుఁడు స్నానముచేసెనని యర్థసిద్ధముగాఁ దెలుచున్నది.

హనుమంతుఁడును స్నానముఁ జేసి దేవలోకమందలివస్త్రములుం బోనివస్త్రములను గట్టి సొగ సయినకుండలములు దళుకొత్త, దేవేంద్రు నివలెఁ గాంతిఁ దేజరిలుచు నయోధ్యకుం బోయిరి. సుగ్రీవునిభార్యలును సీతాదేవియు, మే లయినయాభరణములం గయిసేసి, మంచికుండలములను దాల్చి యయోధ్యాపురమును జూడఁ దుకతుకపడుచుఁ బోయిరి. దశరథమహారాజుమంత్రు లగువారు ముందే యయోధ్యకుఁ బోయి, పురోహితుఁ డగువసిష్ఠుని ముస్నిడికొని రామునిపట్టాభిషేకమునకుఁ గావలసినమంగళద్రవ్యములను సమకట్టువిషయమై పసమీఱ నాలోచనము సేసిరి. అశోకుఁడును విజయుఁడును సుమంత్రుఁడును జేరి,పట్టాభిషేకము రామునకును నగరమునకును వృద్ధికరముగా నుండునట్లు జరుపుటకై వసిష్ఠునితో నాలోచనము సేసి యతనితో 'మహాత్ముం డగురామునికి జయార్హుం డగు వానికి నభిషేకము సేయుకొఱకు మంగళకరములయినవాని నన్నిటిని మీరు చక్కఁగా సమకట్టఁదగువారు' అనిరి. ఆమంత్రు లందఱు నిట్లు పురోహితుఁ డగువసిష్ఠునికిఁ జెప్పి, యంత రామునిఁ జూచుమనంబులతో మరల పురము వెలువడి రామున కెదురుగాఁ బోయిరి. వేయికన్నులు గలయింద్రుఁడు పచ్చనిగుఱ్ఱములు పూన్చినరథము నారోహించి పోవునట్లు, అనఘుఁడు రాముఁ డుత్తమ మయినరథము నధిరోహించి పట్టణమునకుఁ బోయెను. రామునకు భరతుఁడు పగ్గములు పట్టి సారథ్యము గావించెను. శత్రుఘ్నుఁడు ఛత్రము పట్టెను. లక్ష్మణుఁడు ముందట నిలుచుండి రామునిశిరస్సుపయి వీవనతో విసరుచుఁ దెల్లనివింజామరమును *గూడఁ బూనెను రాక్షసరా జగువిభీషణుఁడు చంద్రబింబ సమాన మయినమఱియొక తెల్లని వింజామరమును బట్టుకొనెను. ఆకాశమున నపుడు ఋషులును వాయుగణములును దేవతలును రాముఁడు గావించిన వీరకృత్యములను ముచ్చటించుచుండఁగా ఆధ్వని మధుర మై వినంబడెను. అంత మహాతేజుం డగువానరసింహుఁడు సుగ్రీవుఁడు పర్వతాకార మయినశత్రుంజయ మనుకుంజరమును నారోహించి పోయెను. వానరులు మనుష్యరూపములను దాల్చి సర్వాభరణభూషితు లయి, తొమ్మిదివేలయేనుంగుల నారోహించి పోయిరి. పురుషలలాముఁడు రాముఁడు శంఖధ్వనులును జనులుబ్బునఁ గావించుకోలాహలధ్వనులును భేరులభాంకృతులును బోరుకొన మేడల వరుసలచే మెరువు గులుకుచున్న యయోధ్యాపురమునకుఁ బోయెను. అంత నపుడయోధ్యకుఁ బోయియుండి రామాభిషేకమును గుఱించి యాలోచించుకొని మరలి యెదుర్కొన వచ్చినసుమంత్రాదిమంత్రులు, అతిరథుం డగురాముఁడు పరివారసహితుఁడై నిజదేహకాంతిచేఁ దేజరిల్లుచు రథమున వచ్చుచుండఁగాఁ జూచిరి. వారు రాముని జయ జయ యని యాశీర్వదించి యతఁడు బదులున కెంతయు నున్నింపఁ

* 'అహం సర్వం కరిష్యామి' రామునికన్నికైంకర్యములు నేనే చేయుదును. అని లక్ష్మణుఁడు ముస్నుఁ జెప్పినట్టివాఁడు గాన యందులకై త్వరపడి చామరంటిని గ్రహించె నని తెలియునది. గోవిందరాజులు.

దమ్ములు పరివేష్టించి వచ్చుచున్నయమ్మహాత్ముని వెంటఁ బోయిరి. మంత్రులును బ్రాహ్మణులును ప్రజలును బలసి కొలువ రాముఁడు నక్షత్రపరివృతుఁ డగుచంద్రునివలె నెంతయుఁ గాంతిసొంపున వెలింగినవాఁ డయ్యె. అతండు వాద్యముల వాయించువారును తాళికులును స్వస్తిక వాద్యములవారును మంగళపాఠకులును ముందుఁ బోవఁగాఁ, దాను బోయెను. మఱియు బంగారకుతలు దాల్చినవారును గోవులును, కన్యలును, బ్రాహ్మణులును, కుడుములు చేతఁ దాల్చిన మనుష్యులును రామునికి ముందుపోయిరి. రాముఁడు సుగ్రీవునకుఁ దనయందు గలస్నేహమును, వాయుపుత్రుం డయిన హనుమంతుని ప్రభావమును, యుద్ధమున వానరులు గావించిన వీరకర్మములను, రాక్షసుల బలవిశేషమును, విభీషణుఁడు తన్ను శరణొందుటయు, మంత్రులకుం జెప్పెను. అయోధ్యాపురవాసు లందఱు నా వృత్తాంతమును విని యాశ్చర్యము నొందిరి. మహాతేజుం డగురాముఁ డీవృత్తాంతమును జెప్పుచు,మనంబునఁ దుష్టియు ధనాదులచేఁ బుష్టియు గలజనులు నెరసి పెంసి యుండునయోధ్యాపురమును వానరసహితముగాఁ బ్రవేశించినవాఁ డయ్యె. అతఁడు ప్రవేశింపఁగానే పురజను లెల్లఁ బ్రతిగృహమునను బొడవుగా ధ్వజము లెత్తి నిలిపిరి. రాముఁ డిక్ష్వాకువంశపురాజులు వాసముసేయునట్టిదియు రమణీయ మయినదియు నగుతనతండ్రిగృహమును సమీపించెను. అంత రఘుకులానందకరుం డగురాజకుమారుఁ డారాముఁడు మహాత్ముఁ డయినతండ్రిగృహమును బ్రవేశించి కౌసల్యకును సుమిత్రకును గైకేయికిని నమస్కరించి ధార్మికుఁ డగుభరతునిఁ జూచి మహార్థవంతం బగుమాటల మధురముగా 'ముత్తెములచేతను వైడూర్యములచేతను బొదుఁగఁబడిన నా పెద్దమేడగృహమును దానియంతఃపురోద్యానముతోఁ గూడ సుగ్రీవునకు విడిపట్టుగా నిమ్ము' అనెను. అమోఘపరాక్రముఁ డగుభరతుఁడు రాముఁడు చెప్పినది విని, సుగ్రీవునిఁ జేయి పట్టుకొని యారామగృహమునకుఁ దీసికొనిపోయెను. అంత శత్రుఘ్నునియాజ్ఞ వలనఁ బరిచారకులు తైలదీపములును మంచములను పఱుపులను దీసికొని శీఘ్రమున నాగృహమును బ్రవేశించిరి. సుగ్రీవుఁడు వీడుఁ బట్టులో సుఖముగాఁ జొచ్చినపిదప మహాతేజుం డగుభరతుఁ డతనిని జూచి 'ప్రభూ! రామునిపట్టాభిషేకమునకై దూతలం బంపుము. అందులకు నీవు సమర్థుండవు' అనెను. అంత సుగ్రీవుఁడు శీఘ్రముగా సమస్తరత్నఖచితము లయిననాలుగుసువర్ణకలశములును నలుగురువానరోత్తముల చేతి కొసంగి వారితో 'వానరులారా! మీరు రేపు తెల్లవాఱునంతకు నాలుగుసముద్రములయుఁ బుణ్యనదులయు జలంబులు నించుకొని యీకలశములం గొని యిచటికి వచ్చి మమ్మెదురుచూచుచుండవలయును' అని యాజ్ఞాపించెను. సుగ్రీవుఁ డిట్లు చెప్పఁగా నేనుంగులం తేసియాకారములు గలమహాత్ములావానరులు గరుడునివలె మహావేగము గలవారలు గావున శీఘ్రముగా నాకా

శమున కేగసిపోయిరి. అంత *జాంబవంతుఁడును హనుమంతుఁడును వేగదర్శి యను వానరుఁడును ఋషభుఁడును జలములతో నిండినకలశములను దెచ్చిరి. జాంబవంతుఁడు మొదలుగాఁ గలయావానరులు నలువురును నయిదువందలనదులనుండి జలమును కలశములం బట్టి తెచ్చిరి. పిదప బలసంపన్నుఁ డగుసుషేణుఁడు తూర్పుసముద్రమునుండి సర్వరత్నములు దాపినసువర్ణకలశమున జలమును దెచ్చెను. ఋషభుఁడు దక్షిణసముద్రమునుండి బంగారుకలశమున జలంబు నించి యచ్చటి రక్తచందనపురెమ్మలచే దానిని గప్పి వేగమునఁ దెచ్చెను. గవయుఁడు వాయువేగుఁడు గావున పడమటిసముద్రమునుండి చల్లనిజలమును గొప్పరత్నకలశమునం దీసికొనివచ్చెను. సమస్తగుణసంపన్నుఁడును గరుడవాయువేగుఁడును నగుధర్మాత్ముఁ డానలుఁడు శీఘ్రముగా నుత్తరసముద్రమునుండి జలమును దెచ్చెను. అంత శత్రుఘ్నుఁడు తానును మంత్రులు నామేటివానరులు దెచ్చినజలమును జూచి రామునియభిషేకమునకై పురోహితశ్రేష్ఠుం డగువసిష్ఠమహర్షికిని బంధువులకును సముద్రాదిజలములు వచ్చి యుండుటను దెలిపెను. అంతఁ బరిశుద్ధుఁడును వృద్ధుండు నగువసిష్ఠుఁ

——శ్రీరామునిపట్టాభిషేకమహోత్సవము.——

డు బ్రాహ్మణులతోడం గూడి రాముని సీతాసమేతముగా రత్నమయపీఠంబునఁ గూర్చుండఁబెట్టెను. అంత నష్టవసువులు దేవేంద్రున కభిషేకము గావించునట్లు వసిష్ఠుఁడును వామదేవుఁడును జాబాలియుఁ గాశ్యపుఁడును గాత్యాయనుఁడును సుయజ్ఞుఁడును గౌతముఁడును విజయుఁడు ననెడియీయెనమండ్రును నిర్మలమును సుగంధియు నయినజలముచేఁ బుషరులలామఁ డగురామున కభిషేకము చేసిరి. అంత వసిష్ఠాదులు తామభిషేకము చేసినపిదప, మిక్కిలిహర్షమున తొలుత ఋత్విజులచేతను, పిమ్మట బ్రాహ్మణులచేతను నంతఁ గన్యలచేతను మంత్రులచేతను పురజనులచేతను యోధులచేతను రామున కభిషేకము చేయించిరి. వసిష్ఠాదులచే నాహూతు లయి లోకపాలుగు నలువురును, దక్కినదేవత లందఱును నొకటిగాఁ జేరి, యాకాశమునం దుండి, దివ్యము లయినసమస్తౌషధిరసములచే రాము నభిషేకించిరి. (తొల్లి బ్రహ్మచేత నేది నిర్మితమైనదో, మనువు తొల్లి దేనిచేత నభిషిక్తుఁ డయ్యెనో, అతనివంశపురాజులు క్రమమున దేనిచేత నభిషేకము గావింపఁబడిరో, రత్నములచే వెలయుచు తేజస్సు వెలుంగుచున్నయాకిరీటమును, బంగారువర్ణమై వెలపొడు గయినవస్త్రువులచే శోభితమై మిక్కిలిసుందరములైననానావిధరత్నములచే చిత్రింపఁబడి యున్నసభయందు, నానామణిమయమైనపీఠముపయి నుంచి విధ్యుక్తముగాఁ బూజించి పిదప మహాత్ముం డగువసిష్ఠుఁడును

* జాంబవంతుఁడు మొద లగునలువురు నదీజలములను సుషేణుఁడు మొద లయినలువురు సముద్రజలములను దెచ్చుటకు నియోగింపఁబడి రని తెలియునది. జాంబవదాదులలోఁ జేరినఋషభునకంటె సుషేణాదులలోఁ జేరినఋషభుఁడు వేఱని తెలియునది.

ఋత్విజులును ఋషులును నా కిరీటముతో రాము నభిషేకించిరి) అప్పుడు రామునకు శుభమయిన శ్వేతచ్ఛత్రమును శత్రుఘ్నుఁడు పట్టెను. వానరరాజయిన సుగ్రీవుఁడు తెల్లని వింజామర వీచెను. రాక్షసేంద్రుఁ డగు విభీషణుఁడు చంద్రునివలెఁ దెల్లనై మెఱయుచున్న మఱియొక వింజామరను బట్టి సంతుష్టి మీఱ వీచెను. వాయుదేవుఁడు దేవేంద్రుని పనుపున నిజకాంతిచే నెంతయు వెలుఁగుచున్నదై నూఱు దామరలతోఁ గొమరారుచున్న బంగారుహారమును దెచ్చి రాముని కొసంగెను. వాయుదేవుఁడు మరల నింద్రుఁడు ప్రేరింపఁగా, సర్వరత్నములతోఁ గూడినదియు నాయకమణిచే నడుమ నలంకృతము నయినదియు నగు ముక్తాహారమును రామున కొసంగెను. పట్టాభిషేకమున కర్హుం డయిన యా రాముని యభిషేకసమయమున సంతోషమున దేవగంధర్వులు పాడిరి. అప్సరోజను లాడిరి. ఆయభిషేకసమయమున భూమియందు *లెస్సగాఁ బైరులు పండెను. వృక్షములు మంచిఫలములతో నొప్పెను. పుష్పములు మేలయిన వాసనలు గుబాళించుచుండెను. పురుషలలాముఁ డగు రాముఁడు తొలుత లక్షగుఱ్ఱములను క్రొత్తగా నీనిన లక్షయావులను నూఱాఁబోతులను, బ్రాహ్మణుల కొసంగెను. రాముఁడు మరల, ముప్పదికోట్ల బంగారునాణెములను మఱియు నమూల్యము లయిన నానావిధవస్త్రాభరణములను బ్రాహ్మణుల కొసఁగెను. ఆపురుషతిలకుఁడు సూర్యకిరణములుంబోలె వెలుఁగుచు మణులు మెండుగాఁ బొదిఁగియున్న దివ్యమయిన బంగారుహారమును సుగ్రీవున కొసంగెను. రాముఁడు మిక్కిలి ప్రీతి గడలుకొన వాలికుమారుఁ డగు నంగదునకు వైడూర్యమణులును వజ్రములును బొదుగంబడి వింతపొలుపు గులుకుచున్న బాహుపురులను నొసంగెను. రాముఁడు సీతకు, మేలయిన రత్నములతోఁ గూడినదై చంద్రకిరణములవలె మెఱుంగులఁ దుఱఁగలించుచున్నదియు నీడుంజోడు లేనిదియు నగు నొకముక్తాహారమును (హనుమంతునకియ్యందగు ననుతలంపున) నొసంగెను. అంత, సీత, స్త్రీల కేదిచేయుటకును స్వాతంత్ర్యము లేనందున, భర్త యనుజ్ఞ నెదురుచూచుచు నతని యనుమతిఁ గనుఁగొని, నిర్మలములును దివ్యములు నయిన రెండువస్త్రములును, సుందరము లయిన యాభరణములును వాయుపుత్త్రుం డగు హనుమంతున కొసంగినదయ్యె. మఱియు నాబిడ రాముఁడు తన కొసంగిన †ముక్తాహారమును మెడనుండి తీసి వానరుల కెవ్వరికి నియ్యందగునో యని సమస్తవానరులఁ జూచుచు, నెవ్వని కియ్యందగు నని భర్తయభిప్రాయమోయుసి యతనిని

---

* పూర్వము 'విషయే తే మహారాజ రామవ్యసనకర్శితా॥ అపి వృక్షాః పరిమ్లానాః సపుష్పాంకురకోరకాః' అని వాఁడి దూలినట్లు చెప్పఁబడినవస్తువులన్నియు నిపుడు రామసంశ్లేషమువలన నప్పటివశను విడిచి మిక్కిలి సంతుష్టములయినవని యిందుఁ జెప్పఁబడియె.

† సీత, రాముఁడు తనకొసఁగిన ముక్తాహారమిచ్చుట తన చేతులార నెవ్వనికో యిప్పింపఁదలఁచియె యని యభిప్రాయమును గనుఁగొని పిదప నెవ్వరికది యియ్యఁదగునో యని యెల్లవానరులను, భర్త యభిప్రాయ మెవ్వనియందో యని భర్తను, మాటికిఁ జూచినదని తెలియునది.

మాటిమాటికిం జూచెను. రాముం డింగితజ్ఞుఁడు గాన సీతాదేవియభిప్రాయమును దెలిసి యాబిడతో 'సుందరీ! కాంతా!*ఎవ్వనియందు బలమును బరాక్రమమును బుద్ధియు మొదలుగా సమస్తకల్యాణగుణములు నున్నవో, మఱెవ్వఁడు, వాఁడెట్టివాఁడయినను నీకు సంతోషము గావించినాఁడో, యట్టివానికి నీహారము నొసంగుము' అనెను. అంత నల్లనివాలుంజూడ్కులు గలయాసీత ఆముక్తాహారమును హనుమంతున కిచ్చెను. తెల్లనిమేఘముతోఁ గూడి పర్వతము దేజరిల్లుచున్నట్లు, చంద్రకిరణసమూహమువలె మిక్కిలియుఁ దెల్లనయినయాహారమును దాల్చి హనుమంతుఁడు ప్రకాశించెను. అంతఁ బరంతపుఁడయిన యాభూవరుఁడు రాముఁడు, ద్వివిదునకును మైందునకును నీలునకును వారు వారు కోరినట్లు గుణములుగలవస్తువిశేషముల నన్నిటిని బహూకృతిగా నొసంగెను. సమస్తవానరులలోపల వృద్ధు లగువారలకును మఱియు నితరవానరోత్తములకును, రాముఁడు వారివారియంతరువులకుఁ దగినట్లు, వస్త్రములను భూషణముల నిచ్చి గౌరవించెను. అంత నెట్టికార్యము నేని చులుకం జేయు రాముఁడు †విభీషణునకును సుగ్రీవునకును హనుమంతునకును జాంబవంతునకును మఱియుం దక్కినసకలవానరముఖ్యులకును వారివారిపరువులకు దగినట్లు సమృద్ధములుగా రత్నములు మొదలయిన కామితపదార్థముల నొసంగఁగా, అందఱును మనంబుల మిక్కిలి సంతుష్టులయి తమతమపట్టులకుం బోయిరి. అంత వానరసింహులందఱును మహాత్ముం డగు రాముని పట్టాభిషేకమహోత్సవమును జూచి రాజేంద్రుఁ డగు రాముని యనుజ్ఞనొంది కిష్కింధాపురమునకుఁ బోయిరి. వానరశ్రేష్ఠుఁ డగు సుగ్రీవుఁడు రాముని యభిషేకమును జూచి(యతనివలనఁ బూజలంది కిష్కింధాపురమునకుఁ) బోయెను. (రాముఁడు కోరినపదార్థములనెల్లఁ బూజింపఁగా) రాక్షసరాజగు విభీషణుఁడు §ఇక్ష్వాకుకులధన మయిన శ్రీరంగవిమానమును గొని లంకకుఁ బోయెను. ఆరాముఁడు

---

* బలము సముద్రమును దాఁటుటచేతను, పరాక్రమము లంకనుదహించుటచేతను, బుద్ధి యశోకవనికను బ్రవేశించుటచేతను గలవాఁడు హనుమంతుఁడే యని రాముఁ డేటసూచించి మరల నితరులను తెక్కుపపఱిచినట్లు దానివలనఁ దోఁచుచున్నది గాన 'నీ కెవ్వనియందు సంతోషము గలదో వాని కిమ్ము' న్నాఁడని తెలియునది.

† ముందు విభీషణుని బహూకరించుట చెప్పఁబడకున్నను నపుడట్లు సంభావింపఁబడినవారిని మరల గణించునపుడు విభీషణుఁడు మొదటఁ జెప్పఁబడుటచే విభీషణుఁడును, సుగ్రీవాదులకుఁ బూర్వమే సంభావింపఁబడినాఁడని యర్థసిద్ధముగాఁ దెలియుచున్నది. గోవిందరాజులు.

§ ఇది గోవిందరాజమతము. ఇక్ష్వాకుకులధన మనఁగా వారికులదైవత మయినశ్రీరంగవిమానమని సంప్రదాయము. మహేశ్వరతీర్థు లిట్లు 'కులధన మనఁగా రాముఁడు పూర్వమిచ్చెదనని ప్రతిజ్ఞ చేసియున్న రాక్షసకులధన మగులంకారాజ్య మగు నేకాని శ్రీరంగవిమానము గాదు. ఏ లనఁగా రాముఁడు తనయవతారసమాప్తికాలమందు విభీషణునకు శ్రీరంగవిమానము నిచ్చినట్లు త్తరకాండమునఁ జెప్పఁబడెను; కాన పట్టాభిషేకసమయమందే విభీషణుఁడు రంగవిమానమును బొందుట కయితిలేదు. అట్లు త్తరకాండమున 'కించాన్యద్వక్తు మిచ్ఛామి రాక్షసేంద్ర మహాబల, ఆరాధయ జగన్నాథ మిక్ష్వాకుకు

శత్రువులనందఱిని వధించి మహాయశమునొంది సర్వోత్కృష్టుఁడయి దుష్టుల శిక్షించుచు సమస్తరాజ్యమును మిగుల సంతోషమునఁ బాలించెను. రాముఁడు ధర్మజ్ఞుండగులక్ష్మణునిఁ జూచి తాను *ధర్మపరాయణుఁడుగావున 'లక్ష్మణా! నీవు ధర్మజ్ఞుఁడవు. కావున నీకుఁ జెప్పనక్కఱలేదు. మనువు మొదలయినపూర్వరాజులు, బలసంపత్తిని బాలించుచుండినయీభూమండలమును నీవు నాతోడంగూడి పరిపాలింపుము మన తాతలు ముత్తాతలుమొదలగుపూర్వులు పూనియుండినయీరాజ్యభారమును నీవు యౌవరాజ్యము నవలంబించి నాతోఁ బాటిగా వహింపుము' అనెను. రాముఁడు యౌవరాజ్యమును గయికొను మని నియోగపూర్వకముగా నెంత చెప్పినను, అనునయవచనంబుల నెంత యడిగికొన్నను, లక్ష్మణుఁడు దానినెంతమాత్రము నంగీకరింపఁడయ్యె. అంత మహాత్ముఁడు రాముఁడు యౌవరాజ్యమునందు భరతు నభిషిక్తుఁగావించెను. రాజలలాముండగు రాముఁడు, పౌండరీకమును, అశ్వమేధమును వాజపేయమును, మఱియు నితరము లయిన నానావిధయజ్ఞములను బలుమాఱు గావించెను. రాముఁడు పదివేలసంవత్సరములు రాజ్యము గావించి యుత్తమాశ్వములతోను,

లదైవతమ్' 'మహాబలుండగురాక్షసరాజా! మఱియు నింకొకటి నీతోఁ జెప్పఁదలఁచుచున్నాను. ఇక్ష్వాకుకులదైవత మయినజగన్నాథు నారాధింపుము' అని రాముఁ డవతారము ముగియునపుడు విభీషణునితోఁ జెప్పెనఁట. అట్లె పద్మపురాణమందును 'యావచ్చన్ద్రశ్చ సూర్యశ్చ యావత్తిష్ఠతి మేదినీ। తావద్రమస్వ రాజ్యస్థః కాలే మమపదం వ్రజ। ఇత్యుక్త్వా ప్రదదౌ తస్మై స్వవిశ్లేషాసహిష్ణవే। శ్రీరఙ్గశాయినం స్వస్థమిక్ష్వాకుకులదైవతమ్। రఙ్గంవిమానమాదాయ లంకాం ప్రాయాద్విభీషణ' "చంద్రసూర్యు లుండువఱకును భూమియుండువఱకును నీవు రాజ్యమును బాలించుచు సుఖముగానుండుము. ఆపిమ్మట మహాప్రలయమపుడు నాపదమును బొందుము.' అని రాముఁడు చెప్పి తనవియోగమునకుఁ దాళఁజాలని విభీషణునకు నిక్ష్వాకుకులదైవత మై యొనకడనున్న శ్రీరంగశాయి నిచ్చెను. విభీషణుఁడు రంగవిమానమును దీసికొని లంకాపురికిఁ బోయెను" అని రామావతార సమాప్తికాలమునందు వచ్చిన విభీషణునకు రాముఁడు రంగవిమానము నిచ్చినట్లు చెప్పంబడియున్నది. కాఁబట్టి రాముఁడు పూర్వము చెప్పినలంకారాజ్యమును నిచ్చుటయే యిపుడు మరలఁ జెప్పఁబడినదిగాని వేఱుగాదు' అనుచున్నారు. ఇందులకు సమాధానమెట్లన —'కించాన్యద్వక్తుమిచ్ఛామి' అనెడిశ్లోకములు రెండును ప్రక్షిప్తములనికొందఱుచెప్పినట్లు మహేశ్వరతీర్థులే చెప్పియున్నారు. అవి ప్రక్షిప్తములుగాఁదలంచినచో, పాద్మపురాణవచనములను గల్పాంతరమును గూర్చినవిగా నెన్నినచో, పూర్వమే ప్రాప్తమయినలంకారాజ్యమును మరలఁబొందెననుట వ్యర్థమగుటను దెలిసినచో, ఈదోషమునకుఁ బరిహార మేర్పడుచున్నదని తెలియునది. కావున గోవిందరాజ మతానుసారముగా నులఘనమనఁగా శ్రీరంగవిమానమే యని తెలియునది.

* రాముఁడు, తనతండ్రి పూర్వము తనకు పట్టాభిషేకము నేయఁ బ్రయత్నించినపుడు, భరతుని యసన్నిధానమున లక్ష్మణునితో 'లక్ష్మణేమాం మయాసార్థం ప్రశాధిత్వం వసున్ధరామ్' 'లక్ష్మణా! నీవు నాతోఁగూడ నీభూమిని బాలింపుము' అని చెప్పెను. 'రామోద్విర్నాభిభాషతే' అన్నట్లు రాముఁడు మొదట నొకటిచెప్పి మఱల వేఱొకటి చెప్పఁడు గావున యామాటచెప్పిన లక్ష్మణునికంటె జ్యేష్ఠుఁడైభరతుఁడున్నను, లక్ష్మణునే యౌవరాజ్యమునఁ బట్టముగట్ట నియోగించెనని తెలియునది.

భూరిదక్షిణలతోనుం గూడినయశ్వమేధయాగములు నూఱు గావించెను. ఆజాను బాహువులును బలుమూఁపులును గలరాముఁడు లక్ష్మణుండు సహాయుండై యొప్ప, మిక్కిలియుఁ బరాక్రమము మెఱసి భూమిని బరిపాలించెను. ఆప్రజలభాగ్య మేమి చెప్ప ! ధర్మాత్ముఁ డగురాముఁడును మిక్కిలియుత్తమ మయినరాజ్యమును బొంది మిత్రులను జ్ఞాతులను బాంధవులనుం గూడి బహువిధయజ్ఞములను గావించెను. రాముఁడు రాజ్యము పాలించుచుండునపుడు, స్త్రీలు వైధవ్యదుఃఖమే తెలియ రయిరి. దుష్టమృగములవలనిభయముగాని రోగభయముగాని యెంతమాత్రముగలుగదయ్యె. లోకమునందు దొంగలే కలుగరయిరి. ఏయనర్థమును నెవ్వనినిగాని ముట్టనుగూడ ముట్టదయ్యె. వృద్ధులకు ముందు బాలుగు మృతిఁ బొందుటయు లేదు. కాన వృద్ధులు బాలురకు ప్రేతకార్యములు గావించుట గానరాదు. సమస్తమును నెప్పుడును సంతోషము నొందియుండెను. సమస్తజనులును ధర్మపరాయణులై యుండిరి. జను లొకరియెడ నొకరు వైరముపూనుటకు నయితికలిగియుండునపుడు రామునిఁ జూచి యతనిమొగమందులకు వాఁడునసియావాఁడుటకు సైఁపఁజాలమిచే నొండొరుల హింసించుకొనక వైరము మానుకొనియుండిరి. రాముఁడు రాజ్యము పరిపాలించునపుడు జనులు వేయిపుత్రులం బడసి, అరోగులయి, శోకదూరు లయి, పుష్టియుఁ దుష్టియుఁగలిగి, పెక్కువేలసంవత్సరములు జీవించియుండిరి. రాముఁడు దొరతనము సేయునపుడు, జనులు, 'రాముఁడురాముఁడు రాముఁడు'అని రాముని ముచ్చటలే చెప్పుకొనుచుందురు. జగమంతయు నెచ్చటను, నేన్యవహారమును రామమయము గానే యుండెను. వృక్షము లెప్పుడును బుష్పించుచు నెప్పుడును ఫలించుచు మిక్కిలి తనరుపు గలబోదెలు గలిగి వెలయుచుండెను. మేఘములు కాలముదప్పక వర్షించుచుండెను. వాయువు సుఖముగా వీచుచుండెను. బ్రాహ్మణులును క్షత్రియులును శూద్రులును నెంతమాత్రమును లోభము లేనివారలయి తమకు విహితములగుకర్మములందే తృప్తికలిగి వానిని దప్పక యనుష్ఠించుచుండిరి. రాముఁడు పాలించుచుండఁగా జనులందఱును, ధర్మరతులై ధర్మపరాయణులై, సత్యవాదులై యందఱును శుభలక్షణసంపన్నులయి యుండిరి. రాముఁడు తమ్ములంగూడి సిరి దొలఁకాడ పదునొకండువేల సంవత్సరములు రాజ్యము చేసెను. ఈరామాయణము మున్ను వాల్మీకిమహర్షిచే రచింపఁబడినది; కావ్యంబులందెల్ల మొదటిది. కాన ధనప్రదమును యశస్కరమును ఆయుర్వృద్ధికరము నయినది; రాజులకు జయప్రదమయినది; వేదార్థప్రకాశమయినది. కాన దీని నెవఁడు చదువునో వినునో యామనుష్యుఁడు సమస్తపాపములనుండి విడివడును శ్రీరాముని పట్టాభిషేకమును విన్నయెడఁ, బుత్రులుగోరువానికి సత్పుత్రులుగలుగుదురు; ధనముగోరువానికి ధనముగలుగును. రాజయినవాఁడు విను నేని, శత్రువులనుజయించి భూమిని గయికొనును. స్త్రీలు విందు రేని, రాముని కౌసల్యయు,లక్ష్మణుని సుమిత్రయు,భరతునిఁ గైకేయియుఁ గన్నవిధమున దీర్ఘాయువు లయినసుపుత్రులం బడయుదురు;

ఎవ్వరికిని గ్లేశము గలుగనట్టి కార్యములం జేయు రాముని విజయము నంతయుఁ బ్రతిపాదించెడి యీరామాయణమును విన్నవాఁడు దీర్ఘాయువును బొందును. వాల్మీకిమహర్షిచే రచితమయి వేదోపబృంహణమై యొప్పు నీయాదికావ్యము నెవ్వఁడు శ్రద్ధగలిగి కామక్రోధంబుల నిగ్రహించి వినునో యతఁడు, దారిద్ర్యాది సమస్తకష్టంబులను గడచిపోవును మఱియు దేశాంతరమునకుఁ బోయియున్నను నది ముగిసి మరలఁ దనబంధువులతోఁ గూడికొనును. ఈలోకముననే రాముని యనుగ్రహమువలన, కోరినవరముల నన్నింటిని బ్రాపించును. ఈరామాయణమును జక్కఁగా వినుచు లేని, దీనం జేసి సమస్తదేవతలును సంప్రీతినొందుదురు. మఱియు గృహమునందు విఘ్నకారులగు భూతములును శాంతములగును. ఈరామాయణమును విన్నయెడ, రాజు భూమండలమునంతయు జయించును. దేశాంతరమునకుఁ బోయినవాఁడు క్షేమముగా స్వస్థానముఁ జేరును. పుష్పవతు లగుస్త్రీలు మిక్కిలి యుత్తము లయినపుత్రులం బడయుదురు. పురాతన మయినయీయితిహాసమును మనుష్యులు పూజించినను జదివినను, వారి సమస్తపాపములును నశించును. దీర్ఘమయిన యాయువును గలుగును. ఈరామాయణమును క్షత్త్రియు లెప్పుడును శిరసు నేలసోఁక నమస్కరించి బ్రాహ్మణునివలన వినవలెను. వారలకైశ్వర్యమును, సుపుత్త్రలాభమును దప్పక కలుగును. సందేహములేదు. ఈరామాయణమును సంపూర్ణముగా నిత్యమును వినువానియందును జదువువానియందును రాముం డెప్పుడును బ్రీతుండై యుండును. ఏలన, నారాయణుఁడే సనాతనుండును ఆదిదేవుండును, మహాబాహుఁడును సర్వేశ్వరుఁడు నారాయణుండును నగువిష్ణుండు; కాన యాతఁడు ప్రీతుం డయినచోఁ గొఱంత యేమి? కనుక నతఁ డాయురారోగ్యములను అతిదుర్లభమయిన ముక్తినిగూఁడ నిచ్చును. మహార్థవంతమైన యీశుభకావ్యమును వినువాఁడు కుటుంబవృద్ధిని ధనధాన్యసమృద్ధినిఁ బడయును; మేటిపడంతులను జేపట్టును; ఉత్తమమయినసౌఖ్యమునొందును; కోరినకార్యము సిద్ధినొందును; భూమియందలి సమస్తములను బ్రాపించును. ఈపుణ్యచరిత్రము ఆయుష్కరమును ఆరోగ్యకరమును యశస్కరమును మంచితోఁబుట్టుఁదనము గలిగించునదియు బుద్ధివర్ధకమును సుఖప్రదమును తేజస్కరము నయినది గావున, నభ్యుదయము గోరునట్టి సత్పురుషులు నియమముతో దీని నవశ్యము వినవలయును. జనులారా! ఇట్లిది ముందుజరిగిన చరిత్రము. మీకు భద్రమగుఁగాక. దీనిని శ్రద్ధతోఁ బఠింపుఁడు. విష్ణుదేవుని మహత్త్వము పరిఢిల్లుఁగాక. రామాయణము విన్నను దానియర్థము గ్రహించినను సమస్తదేవతలును సంతోషింతురు. రామాయణమును వినుటవలనఁ బితృదేవతలును దృప్తిఁబొందుదురు. మఱియు భక్తి గలిగి యెవరు వాల్మీకిమహర్షికృత మగు శ్రీరామదివ్యచరిత్రప్రతిపాదకమైనయీసంహితను నితరులచే వ్రాయించుదురో తాము వ్రాయుదురో వార లీ

లోకమున సమస్తైశ్వర్యసంపన్ను లయి సకలపూజితులయి సర్వభోగముల ననుభవించి తుదను స్వర్గలోకమున శ్రీవైకుంఠమునఁ బునరావృత్తిరహితు లై వసించి యుందురు. ఇది నూటముప్పదియొకండవసర్గము.

యుద్ధకాండము సమాప్తము.

శ్లో. యదక్షరపదభ్రష్టం, మాత్రాహీనంచ యద్భవేత్,
తత్సర్వం క్షమ్యతాందేవ, నారాయణ నమోఽస్తు తే.

శ్లో. శ్రీరామచన్ద్రః శ్రితపారిజాతః సమస్తకల్యాణగుణాభిరామః,
సీతాముఖామ్భోరుహచఞ్చరీకో నిరన్తరం మఙ్గళ మాతనోతు.

ఓం శ్రీసీతాలక్ష్మణహనుమత్సమేతశ్రీరామచన్ద్రార్పణ మస్తు.

ఓం తత్సత్.